- దశాబ్ది తెలంగాణ కథ - రైతు జీవనం (2014 - 2023)
- 'బంగ్లా' మాతృభాషోద్యమం - పూర్వాపరాలు - ఒక పరిశీలన
- తెలంగాణ నీతి, సామాజిక శతకాలు - భాషా ప్రయోగాలు
- క్రియాత్మక చైతన్య కోశం
- తులనాత్మక సాహిత్య అధ్యయనం - చారిత్రక అవసర
- నీతిశాస్త్రము - తాళపత్ర గ్రంథము
- దాశరథి సాహిత్యం - పర్యావరణ స్పృహ
- తెలంగాణ కథ - వాస్తవికత

మూసీ

MUSI

• Samputi : 28 • Sanchika : 12 • Pages : 64 • Rs. 20

• October 2025

Scanned with OKEN Scanner



మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 12
అక్టోబర్ - 2025
'విశ్వావసు' ఆశ్వీజ, కార్తీక మాసాలు

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. MANOHARI

Type Setting at :
Kavyasree Graphics
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక'
(MUSI Telugu Monthly Magazine)
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com
website : musimagazine.org

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

ఈ సంచికలో ...

దశాబ్ది తెలంగాణ కథ - రైతు జీవనం (2014 - 2023)... ఆచార్య బన్న అయిలయ్య -7
'బంగ్లా' - మాతృభాషోద్యమం - పూర్వాపరాలు - ఒక పరిశీలన ... డా. కమ్ముల రవి గంగాధర శేషుకుమార్ - 13
తెలంగాణ నీతి, సామాజిక శతకాలు - భాషా ప్రయోగాలు (2001-2010) ... గడ్డం సత్యపాల్ రెడ్డి - 17
సంఘ చైతన్యపు సలహాదారులు-ఈ కథల పాత్రధారులు... పెద్దోళ్ళ శ్రావణ్ కుమార్ -22
సిద్ధాంత గ్రంథ రచనలో 'అధ్యాయాలు' : తాత్త్విక పునాదులు, నిర్మాణ వ్యూహాలు ... ఆచార్య గంపా వెంకటరామయ్య - 25
క్రియాత్మక చైతన్య కోశం ... బూర్ల వేంకటేశ్వర్లు - 29
తులనాత్మక సాహిత్య అధ్యయనం - చారిత్రక అవసరం...డా. కొడొాజు కృష్ణమూర్తి -32
మానస ఘట భోగ తత్త్వంబను - ఆత్మవిచారము ... సుప్పని సత్యనారాయణ - 35
తెలంగాణ సాహిత్య రుద్రమ - అనిశెట్టి రజిత ... గునుగుంట్ల శైలజ - 37
నీతిశాస్త్రము - తాళపత్ర గ్రంథము ... డా. గంద్ర లక్ష్మణ రావు - 41
దాశరథి సాహిత్యం - పర్యావరణ స్పృహ ... డా. వర్ధ వేణు - 43
తెలంగాణ కథ - వాస్తవికత ... డా. మట్టా సంపత్కుమార్ రెడ్డి - 45
మూస ఆలోచనల ధ్వంస కేంద్రం 'విముక్త' కథలు ... డా. జె. నీరజ - 49
సాహితీ గగనంలో వెలిగే ధ్రువతార-ఆచార్య ఎస్వీ రామారావు...ధూళిపాళ అరుణ -53

కవిత్వం

శాంభవీ! ... జి. లింగేశ్వర శర్మ - 5; తుకారాం అభంగం - డా. మంత్రి శ్రీనివాస్-6; కొంగు ... డా. ఎన్. గోపి- 21; సప్తపదులు ... డా. గన్నోజు శ్రీనివాసాచార్య - 31; అట్ బ్లూసీ ... డా. తిరునగరి శరత్ చంద్ర - 34; వాన వచ్చేస్తుందో ... కోటం చంద్రశేఖర్ - 58; వెతుక్కుంటున్న ... డా. అట్టెం దత్తయ్య - 62; సద్దుల బతుకమ్మ సంబురం ... పి. సువర్ణ -62.

సమీక్ష

చెన్నప్ప చూపు దేశం వైపు ... డా. చిటికెన కిరణ్ కుమార్ - 54; బహుజన ఐక్యత వస్తాదు - గౌడ కవితా 'ముస్తాదు' - 55; డా. కపిలవాయి లింగమూర్తి సాహిత్యానుశీలనం - ఘట్టమరాజు - 57; బహుళార్థ సాధక కాంతిరేఖ - కె.వి. రమణాచారి 'హరే శ్రీనివాసా' - విహారి - 59;

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

Printed, Published and Owned by :
B. MANOHARI, 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
Office : 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Editor : **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 హైదరాబాద్ అక్టోబర్ : 2025

సంపాదకీయం

వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

నీలో దీపం వెలిగించు
నీవే వెలుగై వ్యాపించు





వ్యాయామం

ఆయమ్యతే హస్తాదినా ఆయామ: – యమ ఉపరమే. హస్తాదుల చేత నియమింపబడునది.

యమయతీతి యమ: – యము ఉపరమే – దండించువాడు; యమ్యతే చిత్తమనేన యమ: – యమ ఉపరమే. దీని చేత మనస్సు నిలుపబడును. శరీర మాత్రమునే సాధనముగా నపేక్షించుచు యావజ్జీవము చేయదగిన సత్యాహింసా సంధ్యాదులు. యమనం యమో, యమశ్చ. యమ ఉపరమే. చాలించుట.

లోక వ్యవహారంలో వ్యాయామం, ప్రాణాయామం వంటి శబ్దాలు వింటూనే ఉంటాం. ఒకటి భౌతిక దేహ నియమానికి సంబంధించినదైతే, మరోటి ప్రాణశక్తి నియమానికి సంబంధించినది. విశిష్టమైన ఆయామమే వ్యాయామం. ప్రత్యేక నియమాల ఆధారంగా శరీరాన్ని ఈ లోకంలో సాధనంగా తయారు చేసుకునే విధానం వ్యాయామం. దానికి కొంత శిక్షణ, శిక్ష అవసరం. అందుకే వ్యాయామం అంటే కొంత ప్రత్యేక శ్రమ తప్పదు. శరీరానికి ఎంతగా శ్రమ పెడితే అంత జాగ్రత్తగా ఆ శరీరం తనతో చివరి వరకు ఆరోగ్యంగా ఉంటుంది. దానికి శ్రమ పెట్టకపోతే ఉన్నంతవరకు ఏవో అనారోగ్యాలకు గురి చేసి ఇబ్బందులు పెడుతూనే ఉంటుంది. అప్పుడు కనిపించేవాడు యముడే. యమమంటే ప్రయత్నమే. ఆ యమానికి సంబంధించిన వ్యవహారమే ఆయామం. విశిష్టంగా శరీరానికి సంబంధించిన దండన చేస్తూ ఉంటేనే అది వినియోగించు కోవడానికి సిద్ధం అవుతుంది. అదే వ్యాయామం.

శరీరానికి సంబంధించిన వ్యాయామం చేయడానికి చాలామంది సిద్ధపడుతున్నారు. కొందరు అదీ లేదు. కానీ శరీర వ్యాయామం చేసేవాళ్ళంతా మనస్సుకు సంబంధించిన వ్యాయామం చేస్తున్నారా.. అనేది ప్రశ్న. శరీరానికి వ్యాయామం అంటే అన్ని కీళ్ళను, కండరాలను కదిలించడం, ఆసనాలు వేయడం వంటివి చేస్తున్నారు కదా! దాని ద్వారా శరీరానికి సంబంధించిన లోప నివారణ, గుణ వర్ధనం జరుగుతూనే ఉన్నాయి కదా! మరి మనస్సు కూడా దాని ఇష్టం వచ్చినట్లు అది పెరగకుండా, ఇబ్బంది పెట్టకుండా నియమబద్ధం చేస్తున్నామా!

శరీరాన్ని నియమబద్ధం చేస్తే అది వ్యాయామం. ప్రాణశక్తిని నియమబద్ధం చేసే ప్రయత్నమే ప్రాణాయామం. అలాగే మనస్సును కూడా నియమబద్ధం చేయాల్సిన అవసరం చాలా ఉంది. అవే మనకున్న నియమాలు. ఆలోచనలు ఇష్టం వచ్చినట్లు వెళ్ళకుండా దానిని ఆపడమే ఈ ప్రయత్నంలో ముఖ్యమైనది. అప్పుడే మనస్సు చివరి వరకూ గొప్పగా వినియోగపడుతుంది. ఏ భావననైనా పూర్తి చేసుకోగలుగుతుంది. ఈ మార్గాలు అనేకంగా ఉండవచ్చు. భారతీయ ఆధ్యాత్మిక శాస్త్రాలు అనేక మార్గాలు చెప్పవచ్చు. ఎంతవరకు మనం అనుసరించామనేది ముఖ్యం. సాధారణ నిత్యజీవన నియమాలు, ప్రకృతి నియమాలు కూడా పాటించని వారికి, మనస్సుపై ఆధిపత్యం సంపాదించే అవకాశం లేదు. మనో వ్యాయామమే ముఖ్యమైనది. సాటివారిని చూసే విధానం, ప్రకృతిని, పశు పక్ష్యాదులను చూసే విధానం, అనవసరమైన ఆసక్తులు వదులుకోవడం, ఏదో లేదు అనే భావంతో నిరంతరం క్రుంగి పోవడం, లేనిపోని గొప్పతనాలకు పోవడం, జరుగుతున్న దానిని అంగీకరించలేకపోవడం, నిరంతరం చికాకు... మొదలైనవాని ద్వారా తమ శక్తిని కోల్పోతూ ఉండడం వల్ల మనస్సు బలహీనమౌతుంది. ఈ బలహీనతల నుండి బలానికి రావడానికి ఎంతో ప్రయత్నం అవసరం. ఆ శక్తి సాధనకోసమే ఈ లోకానికి మనం వచ్చిందనే విషయం గుర్తురావాలి. ఆ ప్రయత్నమే మనో వ్యాయామం. నియమబద్ధ ఆనందమయ, ప్రశాంత జీవనం.

శ్రీవిద్యానగజా శివాని గిరిజా శ్రీచక్రసంచారిణీ
దేవేశీ శివసత్తిభద్రహిమజా దీవించుభద్రాత్మికే
భావిన్ జీవితమంత సంతసముగా భాగ్యోదయంబవ్వగా
మావిద్యార్థులనందజేయుచదువుల్ మమ్మేలు సామ్రాజ్ఞివే!

మాతా!శాంకరి!భద్రకాళి!హిమజా! మమ్మేలుసామ్రాజ్ఞిణీ!
మాతా!ముగ్ధమనోహరీ!సురనుతా! మాతంగి!మాయాత్మికే!
మాతా!శ్రీభువనేశ్వరీ!స్మితముఖీ! మాయాంతరంగాత్మికే!
మాతాభక్తజనాశ్రయంచవరదే! మాంపాహి భద్రాత్మికే!

తల్లీ!నిన్ను దలంచివేడెదముమా తప్పుల్నిమన్నింపుమా!
యుల్లంబందుననిల్చిజృంభణముగా నుత్సాహమున్గూర్చుమా!
పిల్లాపాపలనెల్లవేళగనుమా ప్రీతిన్ ప్రసాదించుమీ!
ముల్లోకమ్ములనేలురాజ్ఞివిగదేజి ముగ్ధాంగసంశోభిణీ!

శ్రీచక్రోపరివేష్టితాంసురనుతాం శ్రీరాజరాజేశ్వరీమ్!
హేచిన్మంగళకారిణీంభగవతీం హేమాంబరాడంబరీమ్!
శ్రీచైతన్య సురూపిణీం స్మితముఖీం సేవాంగసంప్రార్థిదమ్!
శ్రీచక్రార్చనభక్తపోషణకరీం శ్రేయస్కరీంశాంభవీః!

సంచిత్పాపవినాశపావనకరీం సంపూజ్యమానాత్మికే!
చంచత్కాంచనభాసమానవదనీం చంద్రార్థమౌళీసతీం!
అంచద్భక్తమనోరమాం సురనుతా మానందసంధాయినీం!
పంచాస్యామధిరోహితాన త్రిపురాం ప్రార్థించెదన్ భక్తితోన్!

దుష్టాధమ్ములనంతమేర్చనిలలో దుర్గావతారమ్ముగా!
శిష్టాచారపరాయణాపరులకైలి శ్రీచక్రరాజార్చినై!
దృష్టిన్నిల్పుచునందనుండుసతమున్ దేదీప్యమానాత్మగా!
సృష్టిన్నేలెడుభక్తపోషణకరీ శ్రీరాజరాజేశ్వరీ!

వందేభక్తజనాశ్రయంచవరదేభద్రాత్మికేశాంకరీ
వందేపంచదశాక్షరీభగవతీభక్తార్థిశాంత్యాత్మికే !
వందేశంభునిరాణిశక్తిగిరిజాపాశాంకుశాధారిణీ
వందేశ్రీభువనేశ్వరీత్రిభువనీభక్తుండనన్ బ్రోవవే!

ఆరాధించెదరమ్మభక్తులిలలోయానందసంశోభినీ
శ్రీరాజేశ్వరి! భక్తపావనకరీ శ్రీచక్రసింహాసినీ!
నోరారన్ లలితాసహస్ర త్రిశతీ నొక్కక్కనామంబునన్
ధారాళమ్ముగనుచ్చరించకరుణన్ దాక్షాయనీ!బ్రోవవే!

ఆషాఢమ్మున భక్తిభావములతో నానందముప్పొంగగన్
భూషాలంకృత భద్రకాళి జననీ పూజింతు బోనాలతో

శాంభవీ !

ఈషణ్మాత్రమునైననీదుకృపతోనిష్టార్థకామ్యమ్ములన్
పోషింపన్మదిపూనుకొన్నతగునీపూర్ణత్వతాసిద్ధిగాన్ !

శ్రీదేవీనవరాత్రిపర్వములలో చిద్రూపిణీ శాంభవీ
దేదీప్యమ్మగుదివ్యకాంతి ప్రభతో దీవించ నేతించియున్ !
యాదేవీసకలాగమా దివినుతా యాచండ ముండాపహా
మోదంబున్ కలిగింపజేసెదవుగామోక్షర్థులైసాగగన్ !

సద్యస్ఫూర్తిని కల్గజేసి మిగులన్ సచ్ఛాత్రులై వెల్గగా
విద్యోద్యానమునందు వెల్లివిరియన్ విద్యాసుగంధంబులై
విద్యాసక్తిని బెంచి వారిమదిలో విజ్ఞానమార్జించగా
విద్యాబుద్ధులనందజేసి నగజా వీక్షించి రక్షింపవే!

జి. లింగేశ్వర శర్మ
సిద్ధిపేట, ఫోన్ : 96033 89441

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 (6) హైదరాబాద్ అక్టోబర్ : 2025

మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. గ్రంథం పేరు, ప్రచురణ సంవత్సరం, ప్రచురణ స్థలం, ప్రచురణసంస్థ) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. '**భారత ధ్వని దర్శనము**'. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

తుకారాం అభంగం

దేహంబు మీద మోహము
దూరమయ్యేనయ్యా దేవా
తెరువు జ్ఞాన ద్వారమీదే
నిలిచితినయ్యా సన్నిధానము

గుప్తము మనసు కోరికలు
గుప్పు గుప్పుమని పుట్టేను
గుడ్డిగుర్రాల్లారు చెంగున దుంకేను
పట్టు తప్పి పడిలేచాను తాడు
లాగి రథము చేపట్టు దేవా!

అజ్ఞాన వ్యాధిలోన బడితిని
సాధుజనుల సావాసము
వీడి మాయ జేరితిని
మాయపొరలు వీడిపోగ
వినతి వినుము దేవా!

తుకా తపము జేయుచుండెను
పాండురంగ పదము పాడెను
సర్వవ్యాపి చెంత చేరెను
మాయమోహమంతమాయెను

అనువాదం

డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 7 హైదరాబాద్ అక్టోబర్ : 2025

దశాబ్ది తెలంగాణ కథ – రైతు జీవనం (2014–2023)

✍ **ప్రొఫెసర్ బన్న అయిలయ్య**, విశ్రాంత తెలుగు ఆచార్యులు, కాకతీయ విశ్వవిద్యాలయం.
ఫోన్ : 9949106968

భారతదేశం ప్రధానంగా పూర్వకాలం నుండి వ్యవసాయిక దేశం. అనాది నుండి ఇక్కడి ప్రజలు వ్యవసాయమే జీవనాధారంగా చేసుకొని జీవించారు. పుణ్య జీవనదులు, సారవంతమైన భూములు వుండటం వల్ల నాటి నుండి నేటి వరకు వ్యవసాయమే ప్రజల ప్రధాన వృత్తి అయ్యింది. భారతదేశంలో అంతర్భాగమైన వివిధ రాష్ట్రాలు కూడా వ్యవసాయరంగానికే ప్రాధాన్యతనిస్తున్నాయి.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి తెలంగాణ ప్రాంతం నిజాం పాలనలో కొనసాగింది. ఇక్కడ భూస్వాములు వేల ఎకరాలు స్వాధీనం చేసుకొని పేద రైతులకు కౌలుకిచ్చేవారు. జమీందార్లుగా పిలవబడ్డ వీళ్ళు తెలంగాణ పల్లెల్లో అధికార దర్పం ప్రదర్శించేవారు. వారి వల్ల సామాన్య ప్రజానీకం దోపిడి, పీడనకు గురయ్యింది. తెలంగాణలో భూపరిమితి చట్టం వచ్చాక కొద్ది మంది పేద రైతులు స్వంత భూమి సంపాదించుకోగలిగారు.

తెలంగాణ ప్రాంతం మెట్ట ప్రాతం. గోదావరి, కృష్ణా తదితర నదులు తెలంగాణ ప్రాంతం గుండా ప్రవహిస్తూ, ఆంధ్రప్రదేశ్ చేరి బంగాళాఖాతంలో కలుస్తున్నాయి. తలాపునే నీళ్ళు ఉన్నా, ఆంధ్ర ప్రాంత భూములే సస్యశ్యామలంగా ఉండేవి. ఇక్కడి రైతులు వరికంటే ఎక్కువగా మొక్కజన్న, రాగి, జొన్న, సజ్జ వంటి పంటలే పండించేవారు. 80, 90 దశకంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీళ్ళు అందాక వరి పండించడం ఎక్కువయ్యింది. ప్రపంచీకరణ నేపథ్యంలో పత్తి, మిర్చి మొదలైన వ్యాపారపంటలు పండించి తెలంగాణ రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. గిట్టుబాటు ధరలేక, సాగునీరు అందక, కరెంట్ కోతల వల్ల ఇక్కడి రైతులు దినమొక గండంలా గడిపారు. పెట్టుబడులకు, ఎరువులకు, కుటుంబావసరాలకు రైతులు ప్రభుత్వ, ప్రైవేట్ అప్పులు చేయాల్సివచ్చేది. ఏ పల్లెకు వెళ్ళినా రైతు ఆత్మహత్యలు నాడు సర్వసాధారణంగా ఉండేవి. నీళ్ళ పంపకంలో నాటి ప్రభుత్వాలు, పాలకులు తెలంగాణ ప్రాంతంపై వివక్ష చూపేవారు. నీళ్ళు, నిధులు, నియామకాల్లో న్యాయం జరగాలని ప్రత్యేకరాష్ట్ర ఉద్యమంలో ఇక్కడి రైతులు భాగస్వాములయ్యారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే తమ పొలాల్లోకి గోదావరి కదలివస్తుందని, తమ బతుకులు పచ్చని బతుకులవుతాయని ఉద్యమించారు. సాకారమైన తెలంగాణలో రైతే రాజుగా బతకాలని కాంక్షించారు. స్వరాష్ట్రంలో అధికారం చేపట్టిన ప్రభుత్వం రైతును రాజుగా చేయడానికి రైతుబంధు, రుణమాఫీ, రైతుభీమా, తదితర పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ రైతు జీవనం ఇంకా సాఫీగా సాగక పోవడానికి అనేక కారణాలు వెంటాడుతున్నాయి.



ఈ విషయాలను తెలుగు సాహిత్యంలోని కొన్ని కథల ద్వారా మనం పరిశీలించవచ్చు.

కొట్టం రామకృష్ణారెడ్డి **"నూనెసుక్క"** (నమస్తే తెలంగాణ, బతుకమ్మ 2014) కథలో పేద రైతు రాత్రింబ వళ్ళు ఎంత కష్టపడినా ఒక సాధారణ ఉద్యోగి దరిదాపుల్లో సుఖంగా బతకలేడని తెలియ చెప్పడం జరిగింది.

కొడుకు కష్టపడి చదివి పట్టణంలో ఉద్యోగం సంపాదించు కుంటాడు. చిన్నప్పటి నుండి పంటల చేలంటే ఇష్టమున్న ఆ కొడుకు ఉద్యోగం వదలి పల్లెలోనే ఉంటూ వ్యవసాయం చేస్తానంటాడు. వృద్ధాప్యంలో తమకు చేదోడువాదోడుగా ఉంటాడని సంతోషించక ఆ తల్లి కొడుకును ఈసడించుకొని దూరం చేసుకుంటుంది. కొడుకు రొట్టె తింటూ తొక్కులోకి 'నూనె సుక్క' వేయమని అడిగితే **"కమ్మగ గూసొని తినేటందుకు మీ తాతగిట్ల సంపాయించి పెట్టి పోయిండా"**అని తల్లి నిష్టూరంగా పలుకుతుంది. మనసు గాయమై అప్పటి నుండి ఇంటివైపు రాకుండా పట్నంలో ఉద్యోగం చేస్తూ ఉండిపోతాడు. కొన్నాళ్ళకు అతని కొడుకు ఎదిగి పల్లెలో ఉన్న బాపమ్మ, తాతలను వెదుక్కుంటూ వస్తాడు. ఆ సందర్భంగా రైతు కుటుంబాలలో కనీస అవసరాలు నెరవేరని దౌర్భాగ్య స్థితి నెలకొన్నదని ఆ మనవడు తెలుసుకుంటాడు. ఆ బాపమ్మ మనవనితో **"మన తాతల నుంచి మన మందరం మట్టి పిసుక్కుని బతికనోళ్ళమే బిడ్డా. వున్నది జరంతా భూమి. నీళ్ళు లేవు. ఉన్నంత కాలం కాయకష్టం చేస్కు బత్కాలె. తిన్ననాడు తింటం. లేన్నాడు పంటం. గీ పని దప్ప ఇంకెం పని రాకపాయె. పిల్లల పెండ్లిళ్ళు చేసేటాల్లకే భూమి సగమైంది. ఒక కారు పంటలాయె. జానెడు పొట్టనిండనీకె శిన్నకష్టంగున్నది. అసొంటప్పుడు మీ బాపుకు సర్కారు కొలువచ్చిందని శానా కుశలపడ్డం. గాని గాడెప్పుడు బూమని, దుక్కని, షెల్కని, ఒకటే గున్డడు. ఇంటికొక్కడు. ఆడన్నా సుఖంగా బతకాలని కోడిపెట్ట పిల్లల్ని**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 హైదరాబాద్ అక్టోబర్ : 2025

ఎడబాపినట్లు ఎడబాపిన బిడ్డా నా కొడుకును" అని చెప్పి వెక్కి వెక్కి ఏడుస్తుంది. తాము అనుభవించే జీవితానికి దూరంగా కొడుకును ఉంచాలని కఠినంగా మాట్లాడినట్లు మనవడు గ్రహిస్తాడు.

ఇట్లాంటి చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాలు వర్తింపచేయడం సబబేకాని, వేల ఎకరాల ఆసాములకు కూడా వర్తింపచేయడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వాలు గ్రహించాలని ఈ కథ చదివితే స్పష్టమవుతుంది.

కొట్టం రామకృష్ణారెడ్డి రాసిన మరో కథ **'ఆకుపచ్చటి నెత్తుటి జాడ'** (అలుగు, తెలంగాణ కథ 2015 సం॥ సంగిశెట్టి శ్రీనివాస్) ఒక సన్నకారు రైతు దుర్భర స్థితిని, అగ్రవర్ణపు అహంకారాన్ని తెలియజేస్తుంది.

"ఎంతగా ఒదిగి పోతున్నారంటే కనీసం తల్లి సమాధికి కాస్త నీడనిచ్చే, పండ్లనిచ్చే తన పొలంగట్టు మీది మామిడి చెట్టును కూడా రక్షించుకోలేనంతగా, అగ్రవర్ణ దౌర్జన్యానికి జడుసుకొని అశక్తతతో, శాపనార్థాలు పెట్టుకుంటూ ఎవరూ సహాయం చేయలేని దుర్భర స్థితిలో తనలోతానే ముడుచుకుపోతున్నాడు. కాని ఈ దౌర్జన్యాన్ని ఎట్లా దెబ్బతీయాలో లేదా ఎట్లా ధిక్కరించాలో ఆ రైతుకు తెలుసు". (అలుగు, సంపాదకీయం, పదును, పుట:7)

ఈ కథలో శంకర్రెడ్డి పటేల్ ఇరవై ఎకరాల ఆసామి, ఊరుకు అనుకొని ఉన్న ఆ భూమిలో పన్నెండెకరాల మామిడి తోట, రెండెకరాల వరిపొలం, మిగిలిన ఆరెకరాల దుక్కిలో ఒక కారు పంట పండిస్తాడు. ఆ తోట మధ్యలో కట్టిన ఇంట్లో రెండో భార్య ఉంటుంది. ప్రతిరోజు సాయంకాలం కాగానే పాత ఇంటి నుండి బయలుదేరి, ఊరుదాటి, తన భూమిలో కట్టిన తండ్రి సమాధివద్ద కాసేపు కూర్చొని బిచ్చగౌడ్‌తో మాట్లాడుతూ ఓ రెండు సిగరెట్లు కాల్చి చీకటి పడగానే రెండో భార్య వద్దకు వెళ్తాడు. ప్రొద్దున్నే లేచి పాత ఇంటికి వెళ్ళడం అతని దినచర్య.

శంకర్రెడ్డి భూమినానుకొని కుమ్మరి మల్లయ్యకు పద్దెనిమిది గుంటల చేనుంది. అందులో ఒక మూల తల్లి సమాధి కట్టించి, ఆమె జ్ఞాపకార్థంగా మామిడి చెట్టు పెంచుతాడు. అది ఏపుగా పెరిగి కాయలుకాసి పండ్లు అవ్వడం చూసిన శంకర్రెడ్డి ఓర్వలేకపోతాడు. దాని నీడ పడటం వల్ల తన మడి పండటంలేదని, రెండు రోజుల్లో చెట్టును నరికేయ్యమని మల్లయ్యను శంకర్రెడ్డి ఆజ్ఞాపిస్తాడు. పచ్చని చెట్టుని ఎట్లా కొట్టివెయ్యాలని కనికరించమని కాళ్ళపై పడుతాడు మల్లయ్య. రెండు రోజులు గడిచాక శంకర్రెడ్డి కూలీలను రప్పించి దగ్గరుండి చెట్టు నరికిస్తాడు. కుమ్మరి మల్లయ్యకు విషయం తెలిసి పరుగెత్తుకుంటూ వచ్చి శంకర్రెడ్డి పాషాణ హృదయాన్ని గురించి శాపనార్థాలు పెడ్డాడు. కోపంతో రెచ్చిపోయిన శంకర్రెడ్డి మల్లయ్య దవడపై కొడ్తాడు. మల్లయ్య తల్లి సమాధిపై తూలి పడుతాడు. అతని నోట్లో నుండి రక్తం కారి సమాధి పైనున్న ఆకుపచ్చని మరకలపై పడుతుంది. అశక్తుడైన మల్లయ్య ఊరకుండిపోతాడు. ఆ సాయంత్రం శంకర్రెడ్డి ఎప్పటిలాగే తోటవైపు వస్తాడు. తండ్రి సమాధి వద్ద కూర్చుండకుండానే తిన్నగా తోటమధ్యలోని ఇంటికి వెళ్ళి భార్యను పిలుస్తాడు. బదులు రాకపోవడంతో ఇల్లు, తోట అంతా వెతుకుతాడు. ఊరంతా వెతుకుతాడు. ఆమె కనబడకుండా పోయి అయిదేండ్లు దాటినా ఒంటిమీద సోయి లేకుండా పిచ్చిపట్టినట్లు దేశాలు పట్టుకొని దొరసాని జాడ కోసం శంకర్రెడ్డి వెదుకుతూనే ఉంటాడు.

పచ్చని బతుకులను బుగ్గిపాలు చేస్తే పర్యావసానాలు ఇట్లానే ఉంటాయని ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది.

మేడి చైతన్య రాసిన **"ప్రయాణం ఆగింది"** (అలుగు, తెలంగాణ కథా 2015 సం॥ సంగిశెట్టి శ్రీనివాస్) రైతు జీవనంలో ఎదురయ్యే కడగండ్లు, కష్టాలు చివరకు ఆత్మహత్య చేసుకునే వరకు వదలడం లేదని ఈ కథ స్పష్టం చేస్తుంది.

"ప్రపంచమంతా మెతుకు చుట్టూ ప్రదక్షిణం చేస్తున్న ప్రయాణం మాత్రం ఆగిపోతోంది. అప్పులు, కరువు, సాగునీటి సమస్య, అగ్రవర్ణాల దౌర్జన్యం ముందు రైతు కుప్పకూలిపోతున్నాడు. ఉన్న భూమి అమ్మలేక, దాన్నుండి పంటతీయలేక, అడ్డామీది కూలీగా మారలేక చివరాఖరికి ఉరికొయ్యలకు వేలాడుతున్నాడు. కుటుంబ బరువును పిల్లలచేత భుజాలపై వదిలేసి తన దారి తాను చూసుకుంటున్నాడు. అతనితో వెళ్ళలేక ఇక్కడే మిగిలిపోయిన రైతు ఆనవాళ్లు దిక్కు దారి లేక భవిష్యత్తును తల్చుకుంటూ భయంభయంగానే బతుకు పోరుకు సిద్ధం అవుతున్నాడు." (అలుగు, సంపాదకీయం, పదును, పుట:7)

ఈ కథలోని రైతు, రైతుభార్య అరెకరం భూమిలో సేద్యం చేస్తూ, కూలీపనులు చేస్తూ జీవనం కొనసాగిస్తారు. పత్తిమీద వచ్చిన డబ్బు, కూలీకి వెళ్ళిన డబ్బు, పైసా పైసా కూడబెట్టి మరో ఎకరం కొని, ఎకరంన్నర ఆసామిగా కూలీ నుండి రైతుగా గుర్తింపు పొందుతారు. రెడ్డి పొలాన్ని మరో రెండెకరాలు కౌలుకు తీసుకుంటారు. పెట్టుబడులకు రైతు భార్య చెవి కమ్మలు తాకట్టు పెడుతుంది. ఆ యేడు వరిపంట ఏపుగా పండి, కోత సమయానికి అకాల వర్షంతో సర్వం నష్టం కలుగుతుంది. ప్రభుత్వం నష్టపోయిన పంటలకు డబ్బు చెల్లిస్తుందని తెలిసి, రెడ్డి అప్పుడే కౌలు డబ్బులు కట్టమని ఒత్తిడి చేస్తాడు. రైతు చెల్లించే స్థితిలో లేకపోవడంతో రెడ్డి కౌలు కాగితాన్ని

చింపి నష్టపరిహారాన్ని తానే తీసుకుంటాడు. రైతు రెక్కల కష్టం నీళ్ళతో కొట్టుకుపోయిందని బాధపడుతాడు. ఆ యేడు భార్య మెడలోని మంగళ సూత్రాలు అమ్మి తిండి గింజలు కొంటారు.

పొరుగు రాష్ట్రం నుండి నీళ్ళు వదిలితే రెడ్డి కాలువకు అడ్డు కట్టవేసి తన పొలానికే మళ్ళించుకుంటాడు. రెడ్డి దౌర్జన్యాన్ని ఎదుర్కోవడానికి రైతు కొడుకు ఆ అడ్డుకట్ట తొలగించబడితే, రెడ్డి జీతగాళ్ళు అతడిని స్పృహ కోల్పోయేలా కొడుతారు. రెడ్డిని నిలదీయబోతే, రైతే తనను కొట్టాడని రెడ్డి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తాడు. రైతును పోలీసులు పట్టుకెళ్తారు. మూడు రోజులు ప్రభుత్వం నీళ్ళు వదిలి బందుపెట్టాక అతను పోలీస్‌స్టేషన్ నుండి తిరిగి వస్తాడు. పెట్టుబడి కోసం, కూతురు పెళ్ళికోసం అప్పుతేవాలని ఎంతోమంది చుట్టూ తిరిగి వేసారిపోతాడు. ఈలోగా అప్పు కట్టాలంటూ బ్యాంకు నుండి నోటీసు వస్తుంది. మరునాడు కష్టాలన్ని తీరిపోయి తేలిక కావాలని, చెట్టుకి ఉరితాడు వేసుకొని ఆత్మహత్య చేసుకుంటాడు. ఇట్లా ఉరివేసుకొని చచ్చాడని తెలిస్తే ఊళ్ళో వాళ్ళు హేళన చేస్తారని, కొద్దిమంది రైతులు చెప్పడంతో అతనిది సహజ మరణంగా చిత్రిస్తాడు. ఆ తరువాత రైతు కూతురు యవ్వనమంతా గుప్పెడు గింజల సంపాదన కోసమే కూలీగా మారాల్సి వస్తుంది. రైతు భార్య చిరిగిన చీరలే మళ్ళీ మళ్ళీ కట్టుకుంటుంది. ఎకరంన్నర భూమిలో రైతుగా ఉనికిని చాటుకోలేక అతని కొడుకు పట్నంలో మురుగు కాల్వలు తవ్వే రోజూ వారి కూలీ పనులకు వెళుతుంటాడు.

ఇట్లా సామాన్య రైతులు జీవితంలో ఎదుగుదల లేక పోవడం ఈ కథలో కనిపిస్తుంది.

పెద్దింటి అశోక్ కుమార్ రాసిన **'గుండెలో వాన'** (కూరాడు, తెలంగాణ కథ 2016 సం॥ సంగిశెట్టి శ్రీనివాస్) కథ వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభాన్ని తెలియజేస్తుంది.

"వ్యవసాయం జూదంగా మారి జీవితాలను చిద్రం చేస్తున్న మనిషి మళ్ళీ మళ్ళీ వ్యవసాయం చేత చావుదెబ్బ తింటూనే ఉన్నాడు. ఈ పంట కాకపోతే మరో పంటైనా జీవితాల్లో వెలుగు నింపుతుందని అమాయకంగా నమ్ముతూ జారి పోతూనే ఉన్నాడు. పెద్దింటి అశోక్ కుమార్ కథ 'గుండెలో వాన' మన గుండెలపై రాళ్ళ వాన కురిపిస్తుంది. కథ చదువుతున్నంత సేపు మనల్ని మనం కంకర మిషన్‌లో వేసుకున్నట్లే ఉంటుంది. దశాబ్దాల వ్యవసాయ సంక్షోభ మంతా మన ముంగిట కనబడ్తుంది" (కూరాడు, సంపాదకీయం, శిబ్బి, పుట:10)

ఈ కథలో వేములవాడ దగ్గర్లో ఉన్న తిప్పాపురంలో పాతికేళ్ళు నిండని జ్యోతి వ్యవసాయం చేస్తూ జీవిస్తుంది. ఈ సద్దుల బతుకమ్మ నాడైనా మంచి బట్టలు కుట్టించుకోవాలన్న కోరికతో కొంత డబ్బు కూడబెట్టుకుంటుంది. పండుగ ముందు సిరిసిల్ల వెళ్ళి ఇమిటేషన్ పట్టుచీర, మ్యాచింగ్ బ్లౌజ్ తీసుకొని, మగ్గం వర్క్‌కోసం టైలర్ వద్దకు

వెళ్తుంది. బట్టలు కుట్టిపెడితే సద్దుల బతుకమ్మ ముందురోజువచ్చి తీసుకెళ్తానని చెప్పి వెళ్తుంది. ఆ రోజు పొద్దు గుంకే వరకు జ్యోతి రాకపోవడంతో, ముసురు పడుతుండటం వల్లనే రాకపోయి ఉంటుందని టైలరే స్వయంగా బట్టలిచ్చి డబ్బులు తెచ్చుకుందామని తిప్పాపురం వెళ్తాడు. అతను వెళ్ళేసరికి జ్యోతి ఎదురవుతుంది. ఆ సమయంలో బట్టలు తెచ్చినందుకు సంతోషించి వెళ్ళే తోవలో చంద్రంపేటలో దించగానే డబ్బులిస్తానని అతని బండి ఎక్కుతుంది. తోవలో తన అక్క చంద్రంపేటలో ఉంటుందని, ఆమెకు నాలుగెకరాల భూముంది. నీళ్ళకోసం నాలుగు బోర్లు వేయించి అప్పుల పాలయిందని, ఆ తర్వాత కష్టపడి అప్పులు తీర్చినా, పత్తి పంట వేసి పంట పండక మరింత అప్పుల పాలయిందని, ఆమె భర్త పాలేరుగా మారాడని, మరి కొద్ది రోజులకు నాలుగెకరాలు కౌలుకు తీసుకొని ఎరువులకు అప్పుచేసిందని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు తాను అంతో ఇంతో ఆదుకున్నానని, పత్తి పెట్టి చివరకు అప్పులకు తట్టుకోలేక పత్తిమందు తాగి చనిపోయిందని చెప్పుకుంటూ వస్తుంది. అక్క ఇల్లు చేరుకున్నాక తాను ఎంతో కోరికతో కుట్టించుకున్న బట్టలు తల్లిగారి తరుపున జ్యోతి అక్క శవంపై కప్పుతుంది. ఇదంతా చూసిన టైలర్‌కు తన చెల్లెలు జ్ఞాపకం వచ్చి కంపించిపోతాడు. తన చెల్లెలు కూడా పత్తి పెట్టి తీవ్రంగా నష్టపోవడంతో ఏ అఘాయిత్యం చేసుకుంటుందో నని భయపడిపోతాడు.

లక్కీ లాటరీలా మారిన పత్తి పంటను విడువలేక రైతులు చివరకు ఆత్మహత్యలు చేసుకోవడాన్ని ఈ కథ సూచించింది.

రావుల కిరణ్మయి రాసిన **"ఏరువాక"** (అలుగు, తెలంగాణ కథ: 2015 సం॥ సంగిశెట్టి శ్రీనివాస్) కథ వ్యవసాయానికి పల్లెల్లో చెరువుల మరమ్మత్తుకు పూనుకోవాలన్న విషయాన్ని స్పష్టం చేస్తుంది.

"స్వీయపాలనతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "మిషన్ భగీరథ" కాస్త సఫలమైనట్టుంది. ప్రజల ముఖాల్లో, జీవితాల్లో నీటి వెలుగు, తెలంగాణ నేలలో ఆకుపచ్చని వర్ణం కనిపిస్తోంది. అయితే రియల్ ఎస్టేట్ రంగం చెరువులను కూడా వదలకుండా అక్రమ భవనాలు నిర్మించి నీటి తల్లికి సమాధులు నిర్మిస్తోంది. అలాంటి కుట్ర మీదికి 'ఏరువాక' సాగాలని ఇప్పుడు తెలంగాణ ప్రజల ఆకాంక్ష" (అలుగు, సంపాదకీయం, పదును, పుట:8)

ఈ కథలో సీమంతిని పదవతరగతి చదువుతున్నప్పుడు ఊరి చెరువు నిండి మత్తడి దుముకుతుంది. ఆ తర్వాత ఆమెకు పెండ్లయిన ఏడు చెరువు నిండగా, ఆమెకు కొడుకు పుట్టి ఇరవై ఐదేళ్ళు గడిచి, ఇంజనీరింగ్ పూర్తి చేసి అమెరికాకు వెళ్ళగా, మళ్ళీ ఇన్నాళ్ళకు చెరువు నిండిందని తండ్రి సదాశివుడు రాసిన ఉత్తరం ద్వారా ఆమెకు తెలుస్తుంది. చెరువు గురించి చిన్ననాటి జ్ఞాపకాలు ఆమెను ముసురుకుంటాయి. చెరువు నిండితే ఊరిలోని బావుల్లో నీళ్ళు చెంబుల్తో ముంచుకునేలాగా పైకి వచ్చేవి. స్నేహితులతో కలిసి వెళ్ళి నిండిన చెరువును చూసి ఆనందంతో కేరింతలు కొట్టేది. చెరువుకట్ట మీద బొడ్డెమ్మలు, బతుకమ్మ ఆటలు, తూముల వద్ద ఆడుకున్న ఆటలు, చెరువులో ఈదులాడే పక్షులు, వలలో చేపలు పట్టే బెస్తలు, చిన్ననాడు ఊరితో, చెరువుతో పెనవేసుకున్న అనుబంధాన్ని ఒక్కసారిగా గుర్తు చేసుకుంటుంది. మరునాడే పుట్టినూరుకు వెళ్ళిన సీమంతిని ఊరి ఆడపడుచులతో పాటు ఇత్తడి తాంబాలంలో పసుపు, కుంకుమ, రవిక, కనుము, పూలు, పండ్లను పట్టుకెళ్ళి చెరువు నీళ్ళలో దిగి గంగామాతకు సమర్పించి దండం పెడ్తుంది. ఈ సందర్భంగా చెరువు మధ్యలో చిన్ననాడు తాను ఆడుకున్న చిన్న గుట్టలు తరలిపోవడం గుర్తిస్తుంది. తనకు పసుపు కుంకాల కింద ఇచ్చిన ఇరవై ఎకరాల భూమి చెరువలో మునిగిపోయిందన్న విషయం తెలుసుకుంటుంది. రోజురోజుకు చెరువు కబ్జాకు గురైపోవడం వల్లనే చెరువు ఇరుకుగా మారి చెరువు నీళ్ళు తన భూమిని ముంచెత్తాయని గ్రహిస్తుంది. ఇకనుంచి చెరువు శికం కబ్జాకు గురవ్వకుండా చూసుకునే బాధ్యత ఊరి వాళ్ళదేనని చెప్పి, చెరువును మరింత విశాలం చెయ్యడానికి తన ఇరవై ఎకరాల భూమిని దానం చేస్తున్నట్లు సీమంతిని ప్రకటిస్తుంది.

ఇట్లా చెరువులు నిండుకుండలా ఉండేలా ఊరి జనం త్యాగాలకు సిద్ధపడాలని ఈ కథ ద్వారా వ్యక్తం అవుతుంది.

మంగారు రమేష్ యాదవ్ రాసిన **'జొండ్ల పాతర'** (రూబిడి, తెలంగాణ కథ : 2019 సం॥ సంగిశెట్టి శ్రీనివాస్) కథ మానవాళి ఆకలి తీర్చే ఆహార పంటలు పండిస్తేనే మానవ సంబంధాలు బలపడుతాయని స్పష్టం చేస్తుంది.

ఈ కథ ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయరంగ సాగు పద్ధతులను, అనుకూల అంశాలను స్పష్టం చేస్తూ కొనసాగుతుంది. ఈ కథలో ఏనుగు రాజన్న తాత పాతతరం రైతు. అతని తండ్రి చిన్నయ్య వద్ద పనులు నేర్చుకొని భూమిని సాగుచేస్తూ వస్తాడు. తన తండ్రి, తన కాలంలో ఇంటిల్లి పాదికి జొన్నలే ప్రధాన ఆహారం. నాడు పుట్లకొద్ది జన్నలు నిలువ చేసుకోవడానికి భూమిలో పాతరలుండేవి. వ్యవసాయానికి సహకరించే కులవృత్తుల వాళ్ళకు, అవసరాలు తీర్చే వస్తు, సేవలకు ఇవ్వగా మిగిలిన ఐదు, పది పుట్లను పాతరలో పోసి నిలువ ఉంచేవారు. రాజన్న తాత తండ్రి ఏనుగు చిన్నయ్య పాతర తీసిన నాడు పేదలు గంపలు, గుల్లలు పట్టుకొని వస్తే తలో రెండు, మూడు అడ్డల జన్నలు దానం చేసేవాడు. రాజన్న తాతకున్న పదెకరాల భూమిలో తన వరకు వచ్చేనాటికి కూడ సగం భూమిలో బూరి, హెచ్ఫోరు పత్తి, అందులో తాగరి సాళ్లు ఇంకా మిగిలిన భూమిలో పచ్చజొన్నలు, సామలు, పెసర్లు, మినుములు, నువ్వులు సాగు చేస్తూ వచ్చారు. తినడానికి జొన్నలు, ఎడ్లు, బర్రెలు, గొడ్లు తినడానికి చొప్ప కరువుండేది కాదు. రాజన్న తాతకు వృద్ధాప్యం వచ్చి వ్యవసాయానికి దూరముండగా అతని కొడుకు వ్యవసాయం మొదలుపెట్టగా వ్యాపారపంటలైన పత్తిలాంటి పంటలకే ప్రాధాన్యత పెరిగింది. దీంతో ఎడ్లకు మేతకరువై చొప్పకొనే పరిస్థితి రావడంతో అతని కొడుకు ఎడ్లకు రోజుకు ఒక చొప్పకట్ట వేయడం అతడిని బాధిస్తుంది.

ఊర్లోని రైతులు మేతకు కరువు ఏర్పడటంతో ఆవుల మందను అమ్ముకోవలసి రావడాన్ని చూసి రాజన్న తాత బాధపడతాడు. రాజన్న తాత తినడానికి జొన్న రొట్టె చేయమని కోడల్ని అడిగితే, జొన్నల ధర పెరిగిందని, తేలేదని గోధుమ పిండి తెస్తే రొట్టెలు చేస్తానంటుంది. కరువు నేపథ్యంలో వ్యవసాయాధికార్లు ఊర్లోకి వచ్చి భూసార పరీక్షలు చేసి పత్తి విస్తీర్ణం తగ్గించి, జొన్న, మొక్కజొన్న, సోయా, సన్ఫ్లవర్, తృణ ధాన్యాలు, కూరగాయల సాగు చేయాలని చెప్తారు. చెరువులు, కుంటలు, ప్రాజెక్టు కాలువలు, చేన్లలోని బావులు, బోర్లు, సాగునీరు సమృద్ధిగా ఉన్న వాళ్ళు రెండు పంటలు తియ్యాలని ఉద్యాన పంటలు వెయ్యాలని, రైతులు పంటభీమా, ఫసల్ భీమా ప్రీమియం ఎప్పటికప్పుడు కట్టుకోవాలని చెప్తారు. రసాయనిక ఎరువులు తగ్గించి, సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చెయ్యాలన్న తలంపు రైతుల్లో పెరిగిపోగా, వర్షాకాలం రాగానే రాజన్న తాత కొడుకు పదెకరాలలో మూడెకరాలు జొన్న సాగు చేస్తాడు. ముత్యాల ఇంటి పేరుగా ఉండే నెయ్యోల భీమన్నగా పిలవబడుతూ తాత కాలంలో పాలు, పెరుగు, నెయ్యి, సల్ల సమృద్ధిగా ఉన్న నాటి పరిస్థితులను కండ్ల చూడటానికి ఆవుల మందనుకని తెచ్చి కౌలు తీసుకున్న రెండెకరాలలో జొన్న పండిస్తానని రాజన్న తాతకు మాట ఇస్తాడు.

"జొన్నలను పాతరెయ్యద్దు. జొండ్లు పాతరల నుండి తీద్దాం" అనే సందేశాన్ని రచయిత ఈ కథ ద్వారా వ్యక్తం చేయడం జరిగింది.

అక్కల చంద్రమౌళి **"కేడా కొడ్పా"** (బుగులు, తెలంగాణ కథ : 2020 సం॥ సంగిశెట్టి శ్రీనివాస్) కథ పుష్టికరమైన ఆహారాన్ని పండించి సామాన్య ప్రజల విటమిన్ లోపాన్ని ఎదుర్కోవాలని తెలియజేస్తుంది.

అటవి ప్రాంతమైన కెరిమెరి మండలం ధనోరా గ్రామవాసి కేంద్రె బాలాజీ. ముప్పై ఎనిమిదేళ్ళ బాలాజీ ధనోరా చుట్టు ప్రక్కల గ్రామాల నుండి ఆదివాసులు తెచ్చే ఇప్పపూలు కొని ప్రభుత్వానికి సరఫరా చేస్తుంటాడు. ఆదివాసియైన బాలాజి చిన్నప్పటి నుండి తండ్రి వెంట ఉండి సాగులోని మెలకువలు తెలుసుకుంటాడు. ఇంటర్ తరువాత డి.సి.యం. వ్యాన్కొని కొన్నాళ్ళపాటు డ్రైవర్గా పనిచేస్తాడు. వ్యాన్

బోల్తాపడి చావు నుండి తప్పించుకున్న బాలాజీ కెరిమెరిలో కాటన్ దుకాణం నిర్వహిస్తాడు. అమాయకులైన ఆదివాసులను పీడించి డబ్బులు వసూలు చేయడం ఇష్టంలేక అదీ మానేస్తాడు. ఒకరోజు జబ్బు పడి ఆసిఫాబాద్ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరితే అక్కడ అరవై ఏండ్ల కొలాయ్ తెగకు చెందిన ఆదివాసి మతల్ సోంబాయి కూడ అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. డాక్టర్ ఆమెను పరీక్షించి పౌష్టిక ఆహారం తినాలని, ప్రతిరోజు పండ్లు తెచ్చుకోవాలని ఆమెతో చెప్తాడు. సోంబాయి తన బొడ్లె సంచిలోంచి యాభై రూపాయలు తీసి ఒక పిల్లవానికిస్తే, ఆ డబ్బులకు ఒకటే ఆపిల్ పండు వస్తుంది. డాక్టర్ అది చూసి కిలో పండ్లు తెచ్చుకొని తినమన్నాను కానీ, ఒక్క పండుతింటే ఆరోగ్యం బాగుపడుతుందా? అని అంటాడు. కిలో పండ్లు కొనే స్థోమత తనకు లేదని సోంబాయి దీనంగా చెప్తుంది. అది విన్న బాలాజీ జబ్బు చేస్తే కిలో పండ్లు కొనలేని బీదరికంలో మగ్గుతున్నారని, పోషకాహార లోపంతో ఆదివాసులు బాధపడుతున్నారని గ్రహిస్తాడు బాలాజీ.

ఆదివాసులకు అందుబాటులో ఉండేటట్లు తాను పండ్ల తోటలను పెంచాలని నిర్ణయం తీసుకుంటాడు. కొద్దిపాటి భూమిని సాగుచేసి దానిమ్మ, పనస మొక్కలు నాటుతాడు. రసాయన ఎరువుల జోలికి వెళ్ళకుండ సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయటం మొదలు పెడుతాడు. మిలట్రీలో పనిచేసే మిత్రుడు బలరాంతో జమ్మూ కాశ్మీరు నుండి పది ఆపిల్ మొక్కలు తెప్పించి నాటుతాడు బాలాజీ. ఇంకా తన క్షేత్రంలో ఆకుకూరలు, కూరగాయలు కూడా సాగు చేస్తాడు. ఆవుపేడ, మూత్రంతో పంటకు ఎరువు తయారు చేసుకొని వాడుతాడు. ఐదు ఆవులు, మూడు ఎద్దులు, నాలుగు కుటుంబాలు అతని వ్యవసాయ క్షేత్రంలో ఉంటాయి. పత్తి, కందులు, మినుములు, కొర్రలు, సజ్జలు సాగు చేస్తున్న ఆదివాసి రైతులకు సేంద్రియ పద్ధతి పట్ల అవగాహన కల్పిస్తాడు. ఇంకా అరటి తోటలు సాగుచేస్తున్న రైతులకు కూడ సలహాలు ఇస్తాడు. 14 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న అతని వ్యవసాయ క్షేత్రానికి "స్వర్గీయ ఏక్నాత్ రావ్, కేంద్రే స్మారక ధామ్" అని పేరుపెట్టి పది మొక్కలతో మొదలైన ఆపిల్ తోట నాలుగు వందల మొక్కలకు చేరుకుంటుంది. ఆ క్షేత్రంలో చిన్న చిన్న మడుగుల్లో చేపలు కూడా పెంచుతాడు. రాత్రివేళల్లో అడవిపందుల బెడద నుండి పంటను కాపాడుతూ, ప్రతికూల వాతావరణంలో పిందె నుండి నూటయాభై గ్రాముల ఆపిల్ అయ్యే వరకు కంటికి రెప్పలా కాపాడుతాడు. ఐదేళ్ళ కృషి ఫలితంగా ధనోరా ఆపిల్ హెచ్.ఆర్.99 తెలంగాణలో పండటానికి బాలాజీ కారకుడవుతాడు. అతని పేరు ప్రగతి భవన్ వరకు చేరడంతో ముఖ్యమంత్రి ఆహ్వానం అందుతుంది. అధికారులు అతని క్షేత్రాన్ని సందర్శించి వెళ్తారు. అతని బాటలో తిర్యాణి, ఆసిఫాబాద్, మంచిర్యాల ప్రాంతాల రైతులు ఆపిల్ పంట పండించడానికి సిద్ధపడుతారు.

తెలంగాణలోని ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం ద్వారా రైతు రాజుగా నిలుస్తాడని రచయిత ఈ కథ ద్వారా వ్యక్తం చేయగలిగాడు.

చందు తులసి రాసిన **"బతుకమ్మ పుట్టింది"** (బుగులు, తెలంగాణ కథ : 2020 సం॥ సంగిశెట్టి శ్రీనివాస్) కథ వ్యవసాయంలోని సాధక బాధకాలు, అనునిత్యం తప్పని గుర్తించి తెలియజేస్తుంది.

"సంక్షోభంలో కూరుకుపోయిన ప్రపంచానికి ఎవర్‌గ్రీన్ ఎంప్లాయిమెంట్‌ను కల్పించేది, తిండి గింజలను ధారపోసేది వ్యవసాయమేనని తెలంగాణ సాంస్కృతిక జీవితాన్ని నేపథ్యంగా తీసుకొని చందు తులసి రాసిన 'బతుకమ్మ పుట్టింది' కథ అన్నదాతను, శ్రమ జీవన సౌందర్యాన్ని, మానవీయతను మరో మెట్టు మీద నిలబెట్టింది." (బుగులు, సంపాదకీయం, గాయి – గత్తర, పుట:11)

పుల్లమ్మ నిండుగర్భవతి. ప్రసవం ఇప్పుడో అప్పుడో అన్నట్లున్న పరిస్థితి ఆమెది. ఒకవైపు ఆకాశం మబ్బులు పట్టి ఫెళఫెళ మంటూ ఉరుముతుంటే ఏ క్షణాన వానవచ్చి పండిన పంట చేతికందకుండా పోతుందేమోనని తండ్లాతుంది. **"తల్లికి కడుపులున్న బిడ్డ ఎట్లనో రైతుకు చేనుమీదున్న పంట్ల అట్ల కద మామా కంటికి రెప్పలా కాపాడుకుంటే తప్ప బిడ్డకానీ, పంటకానీ చేతికి దక్కవు"** అంటూ భర్తతో కలిసి ఎండిన పెసరకాయలు తెంపుతుంది. ఆమె అవస్థను గమనించిన భర్త నాగయ్య ఇంటికి వెళ్ళి విశ్రాంతి తీసుకొమ్మంటాడు. ఆ రోజు పనిపూర్తి కావాలన్న ఆరాటంతో నొప్పిని భరిస్తూ చీకటి పడేదాక చేనులోనే పనిలో నిమగ్నమవుతుంది. ఇంటికి వచ్చాక ఆ రాత్రి వర్షం పడకూడదని దేవుళ్ళకు మొక్కుకుంటుంది. ఆ రాత్రి అయిదు నిముషాల పాటు జల్లు కురిసి ఆగిపోతుంది. తెల్లవారాక ఒళ్ళు నొప్పులు పెడుతున్నా ఇంత తిని తల్లి వద్దని చెప్తున్న చేనులోకి వెళ్ళి పెసరకాయ తెంపడం మొదలుపెడుతుంది. పొద్దుగుంకే వరకల్లా భర్తతో పోటిపడి చేనంతా ఏరడం పూర్తి చేస్తుంది. మూడు నెలల కష్టం చేతికి దక్కిందని సంబరపడుతూ పూలమ్మ ఇంటిదారి పడుతుంది. దారి వెంట తంగేడు పూలు కనిపిస్తే తెంపుకుంటుంది. తెల్లవారితే బతుకమ్మ పండుగ కావడంతో బతుకమ్మ పేర్చాలని

ISSN 2457-0796

ఆలోచిస్తూ అడుగులు వేస్తుంది. సగం దూరం వచ్చేసరికి పూలమ్మకు కడుపునొప్పి మొదలవ్వడంతో ఊపిరి బిగపట్టి ఇంటివరకు ఆయాసపడుతూ వస్తుంది. ఇంట్లో అడుగు పెడుతూ 'అమ్మా' అంటూ కడుపు పట్టుకొని మొత్తుకుంటుంది. వంట చేస్తున్న తల్లి బిడ్డకు నొప్పులు మొదలయ్యాయని గ్రహించి, చుట్టు ప్రక్కల ఆడవాళ్ళను పిలుచుకొని వస్తుంది. మంత్రసాని మారెమ్మ వచ్చి చుట్టు ప్రక్కల స్త్రీల సహాయంతో కాన్పు సులువుగానే చేస్తుంది. రోజు కాయకష్టం చేయడం వల్లనే కాన్పు ఆపరేషన్ అవసరం లేకుండా జరిగిందని తల్లి సంతోషిస్తుంది. తెల్లవారక దప్పు సప్పుళ్ళతో బతుకమ్మ తరలిపోతుంటే తన కూతురుకు 'బతుకమ్మ' పేరు పెట్టుకుంటానని పూలమ్మ మురిసిపోతుంది.

ఇట్లా రైతు జీవనంలో తప్పని పనిని, విరామమెరుగని శ్రమ జీవన సౌందర్యాన్ని రచయిత ఈ కథ ద్వారా వ్యక్తం చేయడం జరిగింది.

కోట్ల వనజాత రాసిన **'మైదాకు వసంతం',** (మైదాకు వసంతం, కోట్ల వనజాత కథా సంపుటి – 2021) మారుతున్న కాలానికి అనుగుణంగా సాగు పద్ధతులు మార్చుకోవాలని, వ్యవసాయంలోని కష్ట నష్టాల గురించి వివరిస్తుంది.

ఈ కథలో మురళి, శీనయ్య అనే అన్నదమ్ములది వ్యవసాయ కుటుంబం. వాళ్ళ తల్లిదండ్రులు రెక్కలు ముక్కలు చేసుకొని ఐదెకరాలను పదెకరాలు చేసి పోయారు. వారి తదనంతరం అన్నదమ్ములకు చెరో ఐదెకరాల భూమిరాగా, తమ్ముని భూమిని కూడా కౌలు తీసుకొని మురళి వ్యవసాయం చేస్తూ ఉండిపోతాడు. శీనయ్య ట్రెజరీ శాఖలో ఉద్యోగం చేస్తూ పట్టణంలో ఉండిపోతాడు. శీనయ్య భార్య వసంత క్యాన్సర్‌తో బాధపడుతూ మరణిస్తుంది. ఆమెకు తమ వాటాగా వచ్చిన భూమిలో కోరుకున్న మొక్కలు నాటి వసంతాన్ని సృష్టించుకోవాలనే కోరిక బలంగా ఉండేది. సిటీలో తాము కట్టుకున్న ఇంటి ఆవరణలో మైదాకు మొక్క నాటి దాని ఆకు ఎవరూ తెంపుకెళ్ళినా ఆనందపడేది. తాను చేయని పేరంటం తన మైదాకు చెట్టు చేస్తుందని సంబరపడేది.

శీనయ్య రిటైరయ్యాక ఒంటరిగా ఇంట్లో కాలక్షేపం చేయడం కష్టమనిపిస్తుంది. ఒక్కగానొక్క కొడుకు అమెరికాలో స్థిరపడటం చేత ఊరికి వెళ్ళి వ్యవసాయం చేస్తే కాలక్షేపంతో పాటు, తన భార్య కోరిక నెరవేర్చినట్లవుతుందని భావిస్తాడు. వ్యవసాయశాఖలో పనిచేసి రిటైరైన మిత్రుడు రామకృష్ణను వెంటతీసుకొని శీనయ్య ఊరికి వెళ్తాడు. తానే స్వయంగా వ్యవసాయం చేయాలని అనుకుంటున్నానని అన్న మురళితో అంటాడు శీనయ్య. అయితే వ్యవసాయం అంతా లాభసాటి కాదని, తన ఇద్దరాడపిల్లల పెళ్ళి చేయడానికి సగం భూమిని అమ్ముకోవలసి వచ్చిందని, పదవి విరమణ చేయగా వచ్చిన డబ్బులు, పెన్షన్ డబ్బులు వ్యవసాయానికే తగిలిస్తే భవిష్యత్తు ఏమిటని, బ్యాంకులో దాచుకున్న ఉపయోగపడుతాయని, కనీస మద్దతు ధర అటుంచి మార్కెట్ ధరల విపరీతాలను అంచనా వేయలేమని, ఒక్కోసారి నూరు రూపాయలకు కిలో ధర పలికే ఉల్లిగడ్డకు ఇంకోసారి నూరు పైసలు కూడా రావని అన్న మురళి తమ్ముని ఆలోచనను వ్యతిరేకిస్తాడు.

శీనయ్యలో కలిగిన అంతర్మథనాన్ని గ్రహించిన రామకృష్ణ మరునాడు పోశాలుకు చెందిన రెండెకరాల వ్యవసాయక్షేత్రంలోకి తీసుకెళ్తాడు. వ్యవసాయ శాఖలో పనిచేసి రిటైరైన పోశాలు తన పొలం మధ్యలోనే ఉండటానికి షెడ్ ఏర్పాటు చేసుకొని అందులో భార్యతో కలిసి వ్యవసాయం పనులు చేస్తుంటాడు. బోరువేయించి, ట్యాంక్ కట్టించి సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు పండించడం గమనిస్తారు. ఒక షెడ్‌లో కోళ్ళు పెంచుతూ, క్షేత్రం చుట్టూ రాతి స్తంభాలు పాతి ఇనుపకంచె నిర్మించి, కంచె ప్రక్కనే నీడనిచ్చే పెద్ద చెట్లను పెంచుతూ, రెండు మడులతో తమకోసం వరి పండిస్తూ, రసాయన ఎరువుల ఊసెత్తకుండా సేంద్రియ ఎరువులతో అన్ని రకాల పంటలు తీస్తూ, వారు తినగా మిగిలినవి మార్కెట్లో అమ్ముతున్నట్లు నిర్ధారించుకుంటారు. ఆ పూట వాళ్ళకు పోశాలు అక్కడే పండిన మక్క జన్న కంకులతో చేసిన గారెలు తినిపిస్తాడు. శీనయ్య కూడా పోశయ్య బాటలోనే వ్యవసాయం ఆరంభించాలని అనుకుంటాడు.

స్వరాష్ట్రంతో తెలంగాణ రైతులు ఆహార పంటలు, ఉద్యానవన ఫలాలు పండించే దిశగా ఆలోచిస్తున్నట్లు ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది.

ఆధార గ్రంథాలు

1. కథకు శతమానం, సం॥ గిరిజా మనోహరబాబు గన్నమరాజు, హన్మకొండ, ప్రథమ ముద్రణ, 2012
2. కథాంశం, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 2006
3. కాలువ మల్లయ్య కథలు, తెలంగాణ జన జీవితం : డా॥ బన్న అయిలయ్య, నానీ ప్రచురణలు, హన్మకొండ, 2010
4. తెలంగాణ కథకులు, బి.యస్.రాములు, సామాజిక తాత్విక విశ్వ విద్యాలయం, హైదరాబాద్. 2011
5. తెలంగాణ సాహిత్యం – ప్రాంతీయ చైతన్యం : కాత్యాయనీ విద్మహే, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్, 2005
6. తెలంగాణ కథ – పరామర్శ : డా॥ బన్న అయిలయ్య, నానీ ప్రచురణలు, హన్మకొండ., 2017

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 హైదరాబాద్ అక్టోబర్ : 2025

'బంగ్లా' – మాతృభాషోద్యమం – పూర్వాపరాలు – ఒక పరిశీలన

డా. కమ్ముల రవి గంగాధర శేషుకుమార్, తెలుగు అధ్యాపకులు, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, పామర్రు, కృష్ణా జిల్లా
ఫోన్ : 9494055776

సంక్షిప్త పరిచయం :

ఆధునిక ప్రపంచ చరిత్రలో 'బంగ్లా' (బెంగాలీ) మాతృభాషోద్యమం చాలా ప్రముఖమైనది. ఎన్నో ఇతర మాతృభాషా ఉద్యమాలకు ఊపిరులూదింది. మాతృభాష కోసం నిస్వార్థంగా, నిజాయితీగా పోరాడిన మాతృభాషాభిమానుల మాన, ప్రాణాల త్యాగఫలంగా చరిత్రలో నిలిచిపోయిన నిఖార్సయిన ఉద్యమం ఇది. అందుకే ఈ ఉద్యమంలో అత్యంత కీలకమైన ఫిబ్రవరి 21 (1952) ను UNESCO వారు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించారు. ప్రతీ ఏటా నిర్వహిస్తున్నారు. 2025 సిల్వర్ జూబ్లీ సంవత్సరం. మత ప్రాతిపదికన పాకిస్థాన్ విడిపోయేందుకు కారకుడైన మహమ్మద్ ఆలీ జిన్నా "Let me make it very clear that State Language of Pakistan is going to be Urdu and no other Language,.... any one who tries to mis-lead you is really the enemy of Pakistan"[1] అని ఢాకాలోని రేస్ కోర్టులో ది.21-03-1948న చేసిన నిరంకుశ ప్రకటన ఫలితంగా ఉవ్వెత్తున వ్యాపించిన మాతృభాషోద్యమంతో పాటు, పరోక్షంగా తాను కలలుకన్న పాకిస్థాన్ దేశం యొక్క పునర్విభజనకు కూడా కారకుడయ్యాడని చెప్పొచ్చు. 1952లో బంగ్లా భాషోద్యమం విజయంతోపాటు 1955 నుంచి పాకిస్థాన్‌లో భాగమైన బంగ్లాదేశ్ ప్రాంతం ఈస్ట్ పాకిస్థాన్‌గా పరిగణించబడింది. చివరికి 1971లో భారతదేశ సహకారంతో జరిగిన యుద్ధ ఫలితంగా బంగ్లాదేశ్ సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు కూడా ఈ ఉద్యమమే స్ఫూర్తి నింపింది.

కీలక పదాలు :

బంగ్లా మాతృభాషోద్యమం – 1948-1952 – యునెస్కో – అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం – మౌంట్ బాటన్ విభజన ప్రణాళిక – తూర్పు పాకిస్థాన్ – కరాచి జాతీయ విద్యాసదస్సు – ఢాకా యూనివర్సిటీ – విద్యార్థి సంఘాలు – పోలీసు బలగాలు విచక్షణారహితంగా కాల్పులు – భాషా ఉద్యమ సమ్మె – నిరసనలు – అధికారభాష – భాషోద్యమకారులు – స్వతంత్ర బంగ్లాదేశ్ – 1971 భారతదేశం.

ఉపోద్ఘాతం :

1947 జూన్ 3 తేదీన ప్రకటితమైన లార్డ్ లూయిస్ మౌంట్ బాటన్ విభజన ప్రణాళిక ప్రకారం 1947 ఆగస్టు 14, 15 తేదీలలో స్వతంత్ర భారతదేశం ఇండియా, పాకిస్తాన్‌లుగా విడిపోవక తప్పలేదు.

బ్రిటన్‌లో అప్పటి ప్రముఖ లాయర్ సర్ రాడ్‌క్లిఫ్ నిర్దేశకత్వంలో ఇండియా – పాకిస్థాన్‌లకు భౌగోళికమైన విభజన, సరిహద్దు రేఖలు నిర్ణయింపబడ్డాయి. పాకిస్థాన్ దేశం పశ్చిమ పాకిస్థాన్ (ప్రస్తుత పాకిస్థాన్) తూర్పు పాకిస్థాన్ (నేటి బంగ్లాదేశ్)ల సమ్మేళనంగా ఏర్పడింది. అయితే వీటి మధ్య దూరం సుమారు 1600 కి.మీ ఉండటం గమనార్హం. జూలై 18, 1947 తేదీన ఆమోదించబడిన స్వతంత్ర భారతదేశం విభజన చట్టం ప్రకారం నూతన రాజ్యాంగాలు రూపుదిద్దుకునే వరకూ 1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారమే పరిపాలన జరిగింది. విభజన నేపథ్యంలో చెలరేగిన మతఘర్షణలు, హిందూ, ముస్లింల వలసలు, స్థానభ్రంశాలతో పాటు, భాషాపరమైన రాష్ట్రాల ఏర్పాటుకు సంబంధించిన వాదనలు చాలా ప్రాంతాల్లో ఉద్యమ రూపాన్ని సంతరించుకోవడం ఆరంభమైంది. స్వతంత్ర పాకిస్థాన్‌లో 27-11-1947న అప్పటి పాకిస్థాన్ రాజధాని కరాచీలో జరిగిన జాతీయ విద్యాసదస్సు బంగ్లా భాషోద్యమంలో కీలకమైంది. ఆ సదస్సులో అప్పటి పాకిస్థాన్ విద్యాశాఖమంత్రి ఫజ్లూర్ రహమాన్ **"ఇకనుంచి ఉమ్మడి పాకిస్థాన్ దేశంలోని అన్ని అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలలోనూ, ప్రభుత్వ స్టేషనరీ పత్రాలలోనూ (మనీ ఆర్డర్లు, పోస్టుకార్డులు మొ॥వి) బంగ్లా భాషలో ముద్రణను రద్దుచేస్తున్నామని"**[2] ప్రకటించారు. అంతే కాకుండా **"తూర్పు పశ్చిమ పాకిస్థాన్ భూభాగాలు రెండింటికీ ప్రభుత్వ అధికారిక భాషగా ఇకపై ఉర్దూ భాష మాత్రమే కొనసాగుతుందని నియంతృత్వ ధోరణిలో ప్రకటించడం బంగ్లా భాషోద్యమానికి తొలి కారణంగా నిలిచింది. నూటికి 70% పైగా బంగ్లా భాషను మాతృభాషగా కల్గినవారే బంగ్లాదేశ్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉత్తర్వులతోపాటు, విద్యాబోధనలోనూ, ముద్రణ ప్రసార మాధ్యమాలలోనూ ఇంగ్లీషు**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 (14) హైదరాబాద్ అక్టోబర్ : 2025

భాష లేదా ఉర్దూ మాత్రమే వాడబడుతుం"దని నిర్దేశించడంతో బంగ్లా భాషోద్యమం పురుడుపోసుకుంది.

1947 నవంబరు 27 కరాచీ విద్యాసదస్సు ప్రకటన కారణంగా నాటి తూర్పు పాకిస్థాన్‌లో బంగ్లా (బెంగాలీ) భాషను తమ అధికారిక భాషగా ప్రకటించాలంటూ, పలు ఆందోళనలూ, స్థానిక ఉద్యమాలూ మొదలయ్యాయి. నాటి బంగ్లాదేశ్‌లోని 'బెంగాలీ ఇస్లామిక్ కల్చరల్ ఆర్గనైజేషన్ 'తామద్దున్ మజ్లిస్' అనే సంస్థ కార్యదర్శి 'అబ్దుల్ ఖాసిం' నాయకత్వంలో బంగ్లా (బెంగాలీ) భాషను తమ బోధనా భాషగా, అధికార భాషగా ప్రకటించి, అమలు చేయాలని నిరసనలు పెరిగాయి. అప్పటి పాకిస్థాన్ విద్యామంత్రి ఫజుల్ ఉర్ రహమాన్ మొండి వైఖరితో బంగ్లాలో ఇతర ప్రాంతాల్లో కూడా మాతృభాషా ఉద్యమాలు ఊపందుకున్నాయి. 1947, డిసెంబరు 8 తేదీన ఢాకా యూనివర్సిటీ లోని విద్యార్థులూ, విద్యార్థి సంఘాలు ర్యాలీలు, ధర్నాలూ నిర్వహించడంతోపాటు బెంగాలీ భాషను అధికారిక భాషగా, బోధనా భాషగా ప్రకటించాయి. క్రమంగా స్థానిక ఆందోళనలు, వ్యతిరేకతలు అన్నీ సంఘటితంగా ఏకరూపతను పొంది, దేశవ్యాప్త భాషోద్యమంగా కార్యరూపం దాల్చాయి. ఈ విధంగా బంగ్లా మాతృభాషోద్యమం, విద్యార్థులు, భాషా సాంస్కృతిక సంస్థల నుంచి ప్రజల ఉద్యమంగా మారింది.

ది. 21-03-1948న ఢాకాలో ఆలీజిన్నా "Urdu only the official language" అని ప్రకటించాడు. 1948, ఫిబ్రవరి 23న పాక్ ప్రభుత్వం అప్పటికే ప్రతిపాదించిన ఉర్దూ లేదా ఇంగ్లీషు ప్రతిపాదన కన్నా నిరంకుశమైన, దారుణమైన ఈ ప్రతిపాదనతో బంగ్లాలో నిరసనలు ఒక్కసారిగా వెలువెత్తాయి. 1948లో East Pakisthan Congress Committee మెంబర్ అయిన దేవేంద్రనాథ్ దత్తా నాటి అసెంబ్లీలో మాట్లాడుతూ **"ఉమ్మడి పాకిస్థాన్ మొత్తం జనాభా 6కోట్ల 90 లక్షలుంటే, అందులో సుమారు 4 కోట్ల 40 లక్షల మంది జనాభా తూర్పు పాకిస్థాన్ పౌరులేననీ, వెంటనే అధిక సంఖ్యాకులు వ్యవహరించే బంగ్లా (బెంగాలీ) భాషను రెండవ అధికార భాషగా ప్రకటించాలని సభాముఖంగా అసెంబ్లీలో తీర్మానం జరిగేలా చూడాలని"** కోరడం జరిగింది.[3] సుమారు 70% జనాభా గల బెంగాలీల భాష జాతీయభాష హోదాకు నోచుకోకపోవడం ఎంతటి దారుణమో ఈ సంఘటన ద్వారా ద్యోతక మౌతుంది. 11-09-1948న ఆలీజిన్నా మరణం తర్వాత 1951లో లియాకత్ ఆలీఖాన్ (ప్రధాని) కూడా చనిపోవడంతో, అనంతరం పాకిస్థాన్ ప్రధానమంత్రిగా పాలిస్తున్న క్వాజా నజీముద్దీన్ జనవరి 27, 1952న కరాచీ నుంచి ఢాకాకు పర్యటన నిమిత్తం రావడం, ఉర్దూ మాత్రమే ఉమ్మడి పాకిస్థాన్ అధికారిక భాషగా కొనసాగుతుందని, నిర్ద్వంద్వంగా ప్రకటించడంతో బంగ్లా మాతృభాషా ఉద్యమం ఒక్కసారిగా మళ్ళీ తీవ్రరూపం దాల్చింది. తూర్పు పాకిస్థానలోని పౌరులు, విద్యార్థులూ, భాషోద్యమకారులూ ఒక్కసారిగా నాటి ప్రధానమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా, **"రాష్ట్ర భాష బంగ్లా ఛాయ్"** (Chai) అంటూ దేశవ్యాప్తంగా నినాదాలివ్వడంతో ఉద్యమం ఉవ్వెత్తున లేచి, దేశమంతా దావానలంగా వ్యాపించింది.

ఢాకా యూనివర్సిటీలో భాషా ఉద్యమ సమ్మెను జనవరి 30, 1952న నిర్వహించిన అనంతరం ది.20-02-1952 **'సెంట్రల్ లాంగ్వేజెస్ యాక్షన్ కమిటీ'** సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 'అబుల్ హషీమ్' అధ్యక్షత వహించారు. అప్పటికే క్రూరంగా అమలు చేయబడుతున్న 144 సెక్షన్‌ను ఉల్లంఘించి, మాతృభాషోద్యమాన్ని కొనసాగించాలని విద్యార్థి నాయకులు, భాషోద్యమకారులు, మేధావులు నిర్ణయించి, తీర్మానించారు. 1952 జనవరి 30న ఢాకా యూనివర్సిటీలో బంగ్లా భాషోద్యమంలో భాగంగా భారీస్థాయిలో సమ్మె జరిగింది. జనవరి 31, 1952న మౌలానా బుసానీ అధ్యక్షతన జరిగిన పలు రాజకీయ, సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో జరిగిన కీలక సమావేశంలో **"ఆల్ పార్టీ సెంట్రల్ లాంగ్వేజి యాక్షన్ కమిటీ"** ఏర్పాటు జరిగింది. ఖాజీ మెహబూబ్ కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. తదుపరి కార్యాచరణను సభాముఖంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో నిరంకుశ పాక్ ప్రభుత్వం 'బంగ్లా'భాషను అరబిక్ స్క్రిప్ట్‌లో రాయాలనే ప్రతిపాదన తీసుకొచ్చింది.

ఢాకా మెడికల్ కాలేజి విద్యార్థులు, ఢాకా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ప్రతినిధులూ, సభ్యులూ అందరూ ఐక్యంగా సమీకృత మయ్యారు. రహస్య సమావేశాలు సైతం నిర్వహించుకున్నారు. ఈ నేపథ్యంలో పశ్చిమ పాకిస్థాన్ ప్రభుత్వం 1952 ఫిబ్రవరిలో 144 సెక్షన్‌ను అమలులో ఉండేలా ఉత్తర్వులు జారీచేసింది. ది. 21-08-1952న భారీగా పోలీసు బలగాలను మోహరించింది. మాతృభాష మీద ఎనలేని అభిమానం గల బంగ్లా విద్యార్థులు తమ ఉద్యమాన్ని ప్రాణప్రదంగా భావించి ముందుకు సాగారు. యూనివర్సిటీ గేట్లను దాటుకుంటూ, తూర్పు బంగ్లాదేశపు అసెంబ్లీ భవనం ప్రవేశ ద్వారాన్ని చుట్టుముట్టారు. భారీ నినాదాలతో దూసుకుపోతున్న భాషోద్యమకారులను అప్పటికే మోహరించిన పశ్చిమ పాకిస్థాన్ పోలీసు బలగాలు అత్యంత కర్కశంగా లాఠీచార్జితో అణచివేయాలని ప్రయత్నించాయి. దాంతో విచక్షణారహితంగా కాల్పులు జరిపాయి. ఆ కాల్పుల కారణంగా భాషోద్యమకారుల్లోని విద్యార్థినాయకులు అబ్దుల్ సలామ్, అబ్దుల్ జబ్బర్, రహమాన్ సలాఉద్దీన్, బర్కత్, రఫీకుద్దీన్ అహ్మద్ మొదలగు ఐదురుగురు, ఒహీయుల్లా అనే తొమ్మిదేళ్ళ బాలుడూ తుపాకీ గుండ్లకు బల్కై ప్రాణాలు కోల్పోయారు.[4] ప్రాణాలు విడిచే చివరిక్షణాల్లో కూడా తమ మాతృభాష కోసమే నినాదాలు ఇస్తూ తుదిశ్వాస విడిచారు. ఫలితంగా ఉద్యమం ఉప్పెనలా మారిపోయింది. వెంటనే ఢాకా నగరంలోని కళాశాలలు, దుకాణాలూ, విద్యాసంస్థలూ, కార్యాలయాలూ మూసివేయబడ్డాయి.

మరుసటి రోజైన 1952 ఫిబ్రవరి 22న మాతృభాషోద్యమ మృతవీరుల సంస్మరణార్థం 'జనాజా' పాటించారు. ఇలాంటి ఆందోళనలన్నీ పెరిగి, పెరిగి, చివరికి నాటి తూర్పు పాకిస్థాన్‌లో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు దారితీసింది. మాతృభాషోద్యమ తీవ్రత సంపూర్ణ ప్రజా ఉద్యమంగా పరిణమించింది.

ప్రపంచదేశాలు సైతం పశ్చిమ పాకిస్థాన్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఖండించాయి. మాతృభాషోద్యమకారులపై 1952 ఫిబ్రవరి 21న జరిపిన కాల్పుల దుశ్చర్యను తీవ్రంగా తప్పుబట్టాయి. బహుభాషావైవిధ్యాన్ని గౌరవించాలని, పాక్ ప్రభుత్వ దౌర్జన్యకాండని గర్హించాయి. వెంటనే దిగొచ్చిన పాక్ ప్రభుత్వం భాషోద్యమకారుల ఆశయాలనీ, పోరాటాన్నీ గౌరవిస్తూ, త్వరలోనే బంగ్లా భాష కూడా ఉర్దూ భాషతో సమానంగా జాతీయ అధికార భాషగా ప్రకటింపబడుతుందని ప్రకటించింది. 1954 మే 7 తేదీన జాతీయ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రతిపాదించింది. 29-2-1956 తేదీన పాకిస్థాన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 214 (1) ను సవరించి బెంగాలీ భాషను ఉమ్మడి పాకిస్థాన్ రెండవ జాతీయ అధికార భాషగా, ఉర్దూతోపాటు కొనసాగుతుందని అధికారికంగా ప్రకటించడంతో బెంగాలీల మాతృభాషోద్యమం పరిపూర్ణ విజయం సాధించడమే కాకుండా ప్రపంచంలో పలు మాతృభాషా ఉద్యమాలకు కారణభూతమయ్యింది. దీనికి సమాంతరంగా ఇదే 1956లో భారతదేశంలో కూడా భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడటం గమనార్హం.

యునెస్కో వారు నవంబరు 17, 1999న జరిగిన జనరల్ కాన్ఫరెన్సులో ప్రతి యేటా ఫిబ్రవరి 21 తేదీని **'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం'**గా జరుపుకోవాలని ప్రకటించడం జరిగింది.[5] తత్ఫలితంగా ది.21-02-2000 నుంచి ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడం జరుగుతోంది. 2024 ఫిబ్రవరి 21న జరిగిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో **'బహుభాషా విద్య - తరతరాల భాషాభ్యసనానికి పునాదిరాయి'** అనే నినాదంతో పలు కార్యక్రమాలు జరిగాయి. 2025 సంవత్సరం ఫిబ్రవరి 20, 21 తేదీల్లో యునెస్కో ఆధ్వర్యంలో పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం కార్యక్రమం ప్రత్యేకమైనది. ఇది సిల్వర్‌జూబ్లీ సంవత్సరం కావడంతో బలమైన సంకల్పంతో కూడిన తీర్మానాలను ప్రకటించింది. 'Languages matter' అంటూ భాషావైవిధ్యం మరియు బహుభాషావాదాల ఆవశ్యకతను నొక్కి వక్కాణించింది. యునెస్కో వారి నివేదిక ప్రకారం ప్రపంచంలో లిపి ఉన్నవీ, లేనివీ కలిపి 8,324 భాషలున్నాయని, అందులో సుమారు 7,000 భాషలే ఇంకా మనుగడలో ఉన్నాయనీ, 1000కి పైగా భాషలు గత కొద్ది దశాబ్దాలలో అంతరించిపోయాయని పేర్కొంది. వివిధ భాషలకు చెందిన ప్రజల మధ్య పరస్పర అవగాహన, పరస్పర భాషా గౌరవం ఉండాలని సూచించింది.

స్వతంత్ర బంగ్లాదేశ్ సాధన కోసం జరిగిన బంగ్లా విముక్తి యుద్ధ పోరాటానికి ఈ బంగ్లా మాతృభాషోద్యమమే స్ఫూర్తి నింపిందనటం అతిశయోక్తి కాదు. అలుపెరుగని బంగ్లా దేశపు వీరుల నిరంతర విముక్తి పోరాటం ఫలితంగా 1971 మార్చి 26న పాకిస్థాన్ ప్రభుత్వం, బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యాన్ని ఇవ్వనున్నామని ప్రకటించక తప్పలేదు. అయినప్పటికీ ఈ ప్రకటన సరిగా కార్యరూపం దాల్చకపోవడంతోపాటు పాకిస్థాన్, భారతదేశం పైన కూడా ఆకస్మిక దాడులు జరపడంతో ప్రతిచర్యగా 1971 డిసెంబరు 3న అధికారికంగా భారతదేశ సైన్యం పాకిస్థాన్‌తో యుద్ధానికి దిగింది. పాకిస్థాన్ అరాచక యుద్ధానికి చరమగీతం పాడేందుకు మన భారతదేశం తమవంతు సహకారం అందించింది. బంగ్లా స్వతంత్ర పోరాటం కాస్తా ఇండియా పాకిస్థాన్ యుద్ధంలా పరిణమించింది. ఈ సంఘటనను సోవియట్ రష్యా **"పాకిస్థాన్ ఐక్యతకు ఆత్మహత్యామార్గం"**[6]గా హెచ్చరించింది. 1971 డిసెంబరు 16 నాటికి, అంటే కేవలం రెండువారాల వ్యవధిలో పాకిస్థాన్ ఓటమి చెంది, ఇండియన్ ఆర్మీకి లొంగిపోవడంతో బంగ్లాదేశ్‌కు సంపూర్ణ స్వాతంత్ర్యం సాధ్యపడింది. అనంతరం స్వతంత్ర బంగ్లాదేశ్ దేశం కూడా బంగ్లా (బెంగాలీ) భాష ఆధారంగానే ఏర్పాటయ్యింది. అక్కడి ప్రసిద్ధ దేవాలయం లోని ఢాకేశ్వరి (దుర్గామాత) పేరుతో పేరొందిన ఢాకానగరమే రాజధాని గా కొనసాగింది. ఈ విధంగా బంగ్లా మాతృభాషోద్యమం తాలూకు విజయప్రస్థానం బాంగ్లాదేశ్ స్వాతంత్ర్య సాధనోద్యమానికి ప్రేరణగా నిలవడమే కాకుండా, ప్రపంచంలోని పలు మాతృభాషోద్యమాలకు దోహదపడింది. 'దేశభాషలందు తెలుగు లెస్స' గా శ్రీకృష్ణ దేవరాయల వారిచే కొనియాడబడిన తెలుగు భాష వాడుక క్రమంగా తగ్గిపోకూడదనే ఆశయంతో జరుగుతున్న తెలుగుభాషాపరిరక్షణ కోసం ఈ బంగ్లా మాతృ భాషోద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి.

ఆధారగ్రంథాలు :

1. హిస్టరీ ఆఫ్ బెంగాలీ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ - దినేష్ చంద్రసేన్
2. స్టేట్ లాంగ్వేజ్ మూవ్‌మెంట్ ఇన్ ఈస్ట్‌బెంగాల్, 1947-1956 - ఆమా ముహిత్
3. బెంగాలీ లాంగ్వేజ్ మూవ్‌మెంట్ అండ్ క్రియేషన్ ఆఫ్ బంగ్లాదేశ్ - అన్వర్ దిల్, ఆఫియా దిల్
4. 'భాషా ఆందోళన్' (బంగ్లాదేశ్ లాంగ్వేజెస్ మూవ్‌మెంట్ (1948-1952) - అహ్మద్.ఎ, ఈశ్వరన్.కె
5. బంగ్లాదేశ్ సిన్స్ 1952 లాంగ్వేజ్ మూవ్‌మెంట్ - అధికారి అబంతీ
6. Google Websites – concerned references sites
7. Old English Papers clippings, available in google.
8. రిమెంబరింగ్ ది మార్టర్స్ ఆఫ్ ది బెంగాలీ లాంగ్వేజ్ మూవ్‌మెంట్ - హసన్ హమీద్ (2022)

ISSN 2457-0796



సత్సంగం

ప్రేమ మార్గం



తమిళ యువకులొకరు భగవానుని సమీపించి “స్వామీ! దైవాన్ని ప్రేమించడం మంచిదే కదా! ప్రేమ మార్గంలో ఎందుకు పోకూడదు?” అని ప్రశ్నించారు.

భగవాన్ చకితులై “కూడదని ఎవరన్నారు? పోవచ్చును. అయితే ఒకటి. ప్రేమించటం అనేసరికి తానొకడు, దైవమొకడు రెండు కాలేదా? తాను వేరు, దైవం వేరు కాదే. అందువల్ల ప్రేమించటం అంటే, తనయందే తనకు ఎక్కువ ప్రేమన్నమాట. దీనికే వాసుదేవ మననంలో ఆత్మ ప్రియత్వం దృష్టాంతం అంతరాంతరాలుగ చెప్పబడి వున్నది. మనుష్యునికి ధనమే ఎక్కువ ప్రియం. ఆ ధనం కంటె పుత్రుడు, పుత్రుని కన్న శరీరం, శరీరం కంటే ఇంద్రియాలు, ఇంద్రియాలలో కన్ను, కన్ను కన్నా ప్రాణం, ఆ ప్రాణం కంటే ఆత్మ ప్రియమైనవి. అదీ ఎలాగంటే పుత్రుడైనవాడు ఏదైనా అకృత్యం చేస్తే, వాడిని రాచనగరివారు దండించేందుకు సిద్ధమైనప్పుడు వాని తల్లిదండ్రులది సహించలేక ఇంట్లో ఉన్న వస్తువులన్నీ లంచమిచ్చి విడిపించుకుంటారు. అందువల్ల విత్తము కన్న పుత్రుడు ప్రియం. ఆ అకృత్యం చేసిన పుత్రుడిని లంచాలతో వదలక వానికి బదులు నీవు లోబడితే వదులతామని అంటారనుకో, అప్పుడా తండ్రి దానికి ఒప్పక, ‘నాకూ ఈ చిన్నవానికీ సంబంధం లే’దని చెప్పి, తప్పించుకుని వస్తాడు. అందుచేత పుత్రుని కన్న శరీరం ప్రియం.

అకృత్యం చేసిన ఏ మానవుడైనా తన్ను రాజభటులు కన్నులు పొడవటానికి యత్నిస్తే, శరీర దండనకి ఒడంబడి, కన్నులు కాపాడుకోవాలని చూస్తాడు. కాబట్టి, శరీరం కన్నా ఇంద్రియాలు ప్రియం, ఆ రాచవా రొకవేళ ఇంద్రియాలతో వదలక తలగొట్ట తలపెట్టినట్లయితే ఇంద్రియాలివ్వడానికి ఒప్పుకుంటాడు. అందుచేత ఇంద్రియాల కన్న ప్రాణం ప్రియం. అదేవిధంగా ఆత్మానందంలో అపేక్షగలవాడు ప్రాణాన్ని విడువటానికి కూడా ఒప్పుకుంటాడు. వానికి ప్రాణం కన్న ఆత్మ ప్రియం. అందువల్ల తనను ప్రియరూపమైన ఆత్మగా నెఱుగుటయే దైవాన్ని ప్రేమించటం. తాను సుఖంగా ఉండాలని కదాన దైవాన్ని ప్రేమించదలచటం. తాను సుఖమాయె, సుఖమే దైవమాయె, ఇక ప్రేమించేదెవరిని? ప్రేమయే దైవం” అని సెలవిచ్చారు.

“అందుకే భగవంతుని ప్రేమమార్గంలో భజింపవచ్చునా? అని అడుగుతున్నాను స్వామీ” అన్నారా పృచ్ఛకులు. ‘ఆహా! అదేకదా చెపుతున్నాను. ప్రేమయే భగవత్ స్వరూపం. “నాకిది ప్రియం కాదు. నాకది ప్రేమకరంగా లేదు” అంటూ మంచీ, చెడ్డా అన్నీ తోసివేస్తే, మిగిలేదేదో అదే తన స్వరూపం. అదే స్వచ్ఛమైన ప్రేమ. ఆ యథార్థ ప్రేమనే భగవంతుడనుకో, ఆత్మ అనుకో, ఏమన్నా అనుకో, అదే భక్తి. అదే జ్ఞానం. అదే అన్నీను” అన్నారు భగవాన్.

“బాహ్యాంభ్యంతరము లందు తోచే దుర్విషయాల మీదా, సద్విషయాల మీదా ప్రేమను తోనివేసి ఈశ్వరుడినే ప్రేమించాలని కదా తామిప్పుడు సెలవిచ్చిన దానికి అర్థం. ఇది ప్రియం కాదు. అది ప్రియం కాదు అని తోసివేయటానికి ముందే బుద్ధి పుడుతుందా? అన్నీ అనుభవిస్తే కదా తోసివేయడానికి?” అన్నారు ఇంకొకరు. “అది నిజమే. అందుకే చెడ్డను తోసివేసేందుకు మంచిని ప్రేమించాలి. కడకు అదీ అడ్డుగానే తోస్తుంది కనుక, ఆ మంచినీ తోసివేయాల్సిందే. అయితే ముందు మంచిని ప్రేమించాలి. ప్రేమించి నిరసించాలన్న మాట. అలా అన్నిటినీ తోసివేస్తే, ఉండేది తానే. అదే నిజమైన ప్రేమ. ఆ ప్రేమరహస్య మెరిగినవారికి, లోకమంతా ప్రేమమయం గానే తోస్తుంది” అని చెప్పి మౌనం వహించారు భగవాన్.

\+ + +

“మౌనమెప్పుడూ పలుకుతూనే ఉంటుంది. మౌనం నిరంతర స్రవంతి. దానికి ఆటంకంగా ఏర్పడేదే వాక్కు. నేననే ఈ మాటలు ఆ మౌన భాషకు ఆటంకాలవుతున్నాయి. ఉదాహరణకి – తీగెలో విద్యుత్తు ప్రవహిస్తోంది. ఆ ప్రవాహానికి అవరోధ మేర్పడితే అది దీపంగా వెలగవచ్చు. పంకాగా తిరగవచ్చు. తీగెలో మాత్రం విద్యుచ్ఛక్తిగానే ఉంటుంది. ఈ విధంగానే మౌనం నిర్విరామంగా ప్రవహించే భాష. దానికి అవరోధం కలిగించేవే మాటలు.”

“సంవత్సరాల తరబడి జరిగిన సంభాషణల వల్ల తెలియనిది మౌనంలోనో, మౌనసాన్నిధ్యంలోనో ఒక్క క్షణంలో తెలుస్తుంది. దీనికి దక్షిణామూర్తీ, వారి నలుగురు శిష్యులూ పరమోదాహరణ. ఈ భాషే అన్నింటికంటె ఉత్తమము, శక్తివంతము”

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 (17) హైదరాబాద్ అక్టోబర్ : 2025

తెలంగాణ నీతి, సామాజిక శతకాలు - భాషా ప్రయోగాలు (2001-2010)

గడ్డం సత్యపాల్ రెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలంగాణ విశ్వవిద్యాలయం. ఫోన్ : 99636 68822

సర్వజనాదరణను పొంది ఒక శక్తివంతమైన సాహిత్య ప్రక్రియగా తెలుగు సాహిత్యంలో వెలుగొందుతున్నది శతక ప్రక్రియ. శత అనగా వంద. వందకు పైచిలుకు పద్యాలతో రాయబడి, మకుట నియమం కలిగి, ముక్తకమైనటువంటిది తెలుగులో శతకం అని పిలువబడుతున్నది. తెలుగు సాహిత్యంలో శాఖోపశాఖలుగా వికాసం పొందిన కావ్య ప్రక్రియ శతకం. తెలుగులో పన్నెండవ శతాబ్దంలో శతకం ఆవిర్భవించింది. ఈ ఎనిమిది వందల సంవత్సరాలలో శాఖోపశాఖలుగా విస్తరించి, స్వరూప స్వభావాలలో నిత్యనూతనత్వాన్ని సంతరించుకుంది. పద్యసాహిత్యంలో అడుగిడిన ప్రతి కవిని మొదట ఆదరించేది శతక ప్రక్రియనే. చాలామంది కవులు నిత్యం శతకాలు రాస్తూనే ఉన్నారు. తెలంగాణ ప్రాంతం నుండి కూడా విశేషమైన శతకసాహిత్యం వచ్చింది. శతకసాహిత్య రచన లేని గ్రామం లేదన్నంతగా ఈ ప్రాంతం నుండి శతకసాహిత్యం వెలువడింది.

శతక సాహిత్యాన్ని వస్తువును బట్టి పలురకాలుగా వర్గీకరించవచ్చు. నీతిశతకాలు, భక్తిశతకాలు, హాస్యశతకాలు, శృంగారశతకాలు మొదలగునవి శతక సాహిత్యంలో నీతి శతకాలది ప్రత్యేకస్థానం. మనిషి వ్యక్తిత్వ నిర్మాణంలోను, సమాజంలో విలువల ప్రమాణాలు పెంపొందించుటలోను నీతిశతకాలు ఎంతగానో తోడ్పడుతాయి. తెలుగువారందరికీ సుపరిచితమైన వేమన, సుమతీ శతకాలు సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. శతక కవులు సమాజాన్ని లోతుగా అధ్యయనం చేసి లోకరీతిని, లోకానికి నీతిని నీతిశతకాల రూపంలో ఆవిష్కరించడం జరుగుతుంది. ఆధునిక కాలంలో కవులు సామాజిక అంశాలను వస్తువుగా స్వీకరించి ఎక్కువగా నీతిశతకాలు రాయడం కనిపిస్తుంది. ఈవిధంగా సామాజిక పరివర్తనకు కృషి చేస్తున్న నీతిశతకాలను పరిశోధన విద్యార్థిగా నా పరిశోధన కాలపరిమితి అయిన 2001 నుండి2010 వరకు తెలంగాణ ప్రాంతంలో వచ్చిన నీతి, సామాజిక శతకాలను పరిచయం చేయడం, భాషా ప్రయోగాలను తెలియ జేయడం ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

తెలంగాణ ప్రాంతమందు 21వ శతాబ్ది ప్రారంభంలో లోకరీతిని, లోకానికి నీతిని బోధించాలని అనేక సామాజిక, నీతి శతకాలు వచ్చాయి. 2001 సంవత్సరంలో కరీంనగర్‌కు చెందిన డా॥ బొద్దుల లక్ష్మయ్య **"శ్రద్ధతోడ వినుము శంకరప్ప"** అనే నీతి పంచశతిని రచించారు. ఇందులో సమాజంలో గల పాపపు పరిస్థితులు, శ్రీమంతుల షికారులు, అన్నార్తులు, శరణార్థుల దీనస్థితిని వివరించారు. నేటి దేశ పరిస్థితిని తన ఆటవెలది పద్యాలలో

వ్యంగ్యంగా వివరిస్తూ **"పల్లెపల్లె యందు కల్లుసార తప్పకుండ దొరుకు తిప్పలు లేకుండా"** అంటాడు. తన పద్యాలలోని **"నోరు పెద్దదైన ఊరంత జంకురా", "ధనము కలుగువాని దాసులీ జనులంత"** వంటి సూక్తులు నేటి సమాజానికి అద్దం పడ్తాయి. **"తొందరపడువాడు బొందలో పడునురా", "సాహసంబు లేక సంపద వచ్చునా"** వంటి మాటలతో సమాజానికి మార్గనిర్దేశనం చేశారు. ఇదే సంవత్సరం ఖమ్మం జిల్లాకు చెందిన ఎర్రాప్రగడ రామమూర్తి **'సంఘీశతకం'** రాశారు. నిరుద్యోగులు, రైతులు, విద్యార్థులు, పాఠశాలలు, స్వయం ఉపాధి మొదలగు అంశాలపై చక్కని కందపద్యాలు రాశారు. 2001లోనే **"శ్రీశ్రీ శతకం"** పేర భద్రాచలానికి చెందిన డా॥ కావూరి పాపయ్యశాస్త్రి ఈ సమాజపు తీరుతెన్నులను వ్యంగ్యం, హాస్యం కలగలపి శ్రీశ్రీకి చెప్తున్నట్లుగా కందపద్యాలలో రాశాడు. సికింద్రాబాద్‌కి చెందిన సిహెచ్. దయానంద్ 2001లో **"పోతుకూచి శతకం"** రాశాడు. ఆధునిక సామాజిక స్థితిగతులను ఆలోచనాత్మకంగా, వ్యంగ్యంగా వ్యక్తపరిచారు. కాసులిస్తే ఎన్నో ఘనమైన బిరుదులు వస్తాయని **"అయిదు వేలు ఇవ్వ అరయంగ యువరత్న", "పాదలేనివాడు పద్యగంధర్వుడు"** అంటూ చక్కని పాదాలు రాశాడు. 2002 సం॥లో గంజి నరసింహ **"తెలుగుతల్లి శతకము"** రాశాడు. ఇందులో సమాజములో నైతిక వర్తనము యొక్క అవసరాన్ని చెబుతూ **"నీతిలేని మనిషి కోతితో సమమురా"** అని అంటాడు.

2003 సంవత్సరములో వనపర్తికి చెందిన ఆకుల శివరాజ లింగం **'బాలనీతిశతకం'** ద్వారా భావిభారత పౌరులకు వలసిన నైతిక సుధలను అందించారు. ఎర్రోజు బాలనర్సయాచార్యులు **'ఎర్రోజు నీతిశతకం'**ను రాశాడు. భువనగిరికి చెందిన ఈయన మకుట నియమం లేని కందపద్యాలను, చక్కని సూక్తులను రాశాడు. 'విశ్వహృదయ తోష వేంకటేశ' శతకమును వేదాటి రఘుపతి

రాశాడు. వీరు సమాజాన్ని సూక్ష్మంగా గమనిస్తూ, టీవీల వల్ల జనుల జీవితాలు తెల్లవారిపోతున్నాయని –

'టి.వి తోడ జనులు జీవించుచుండగ
బ్రతుకులెల్ల తెల్లవారుచుండె' అంటాడు.

హైదరాబాద్‌కు చెందిన డా॥ మాముదాల వేంకటేశ్వరరావు **'అభినవ త్రిశతి'** పేర సమాజంలో నైతిక విలువల స్థాపనకు కృషి చేశాడు. రంగారెడ్డికి చెందిన దుబ్బాకుల కృష్ణస్వామి **'తెలుగుబాల శాకాహార శతకము'**ను రాసి శాకాహారము మనిషికి ఎంతో మంచిదని, వివిధ కూరగాయలలో ఉండే విటమిన్లు, పోషకాల గురించి వివరించారు.

2004 సం॥లో కరీంనగర్‌కి చెందిన జనపాల శంకరయ్య ఆటవెలదులలో **'ఆచార్య దేవోభవ శతకం'** రాయగా, నిర్మల్‌కు చెందిన అమరవేణి వెంకటరమణాగౌడ్ **'శ్రీరమణాశతకము'** కంద పద్యాలలో రాశాడు. ఇందులో విజయము సాధించు మార్గము, విద్యవల్ల కలుగు లాభాలు, ఆత్మవిశ్వాసము, స్నేహము, తల్లిదండ్రులు, గురుభక్తి మొదలగు అంశాల గురించి పద్యాలు రాశాడు. ఆదిలాబాద్‌కు చెందిన దప్పూరి శ్రీధరాచార్యులు **'మనిషి'** శతకమును రాసి, **'మనిషి దైవం అయినా కాకపోయినా దానవుడు మాత్రం కాకూడదని'** ప్రయత్నించాలంటాడు. 2005 సం॥లో నారోజు రాజమౌళి **'యోగి వేమన శతకం'**ను కందాలలో రాయగా, హైదరాబాద్‌లో స్థిరపడ్డ డా॥ రాధశ్రీ **'రాధశ్రీ రత్నశతకం'**ను రాశాడు. నల్లగొండకు చెందిన సిరిగద్దె జంగాచారి **'పౌత్ర శతకం'**ను పౌత్రులకు తాతగారు పలు నీతులు చెప్తున్నట్లుగా పద్యాలు రాశాడు. రంగారెడ్డి ప్రాంతానికి చెందిన దుబ్బాకుల కృష్ణస్వామి **'కృష్ణసందేశం'** పేర సప్తశతిని రాశాడు. ఇందులో భగవద్గీత యందలి జ్ఞాన, భక్తి, కర్మ యోగాల గురించి చక్కని పద్యాలు రాశాడు. బోయి భీమన్న పేరు మీద **'భీమన్నా'** మకుటంతో ద్విశతిని డా॥ అక్కిరాజు సుందర రామకృష్ణ రాశాడు. హన్మకొండకు చెందిన డా॥ డి.భిక్షపతి **'సినారె శతకము'**ను తేటగీతులలో రాశాడు.

2006 సం॥లో 5 శతకాలు వెలువడ్డాయి. కామారెడ్డి ప్రాంతానికి చెందిన శెట్టి వీరశెట్టి ఆటవెలది పద్యాలలో వీరశెట్టి శతకమును రాశాడు. ఇందులో మానవసంబంధాలు, తరిగిపోతున్న విలువలను చక్కగా వ్యక్తం చేశారు.

'రాజకీయమంత రాక్షసంబైపోయె
భరతఖండమెట్లు బాగుపడును
తెల్లవాడు దోచె నల్లవాడును దోచె'

అంటూ నేటి కాలపు రాజకీయ రాక్షసత్వాన్ని వ్యక్తం చేశాడు. మంచిర్యాలకు చెందిన తోకల రాజేశం ఇంటర్మీడియట్ విద్యార్థిగా ఉన్నప్పుడే సమకాలీన సమస్యలపై **'తెలుగుబాల శతకం'** రాశాడు. వరంగల్ ప్రాంతానికి చెందిన కొలిపాక బాలయ్య **'సత్యదర్శిని'** పేరుతో ఛందస్సు లేకుండా శతకం రాశాడు. పెద్దల నోటిమాటలను ఉపమానాలుగా గైకొని గ్రామీణ ప్రాంతపు పదాలతో కవితల రూపంలో రాశాడు ఈ శతకం. శతక లక్షణాలు పూర్తిగా లేకపోయినా శతకంగా చెప్పుకొన్నాడు. భువనగిరికి చెందిన గొబ్బూరి గోపాల్‌రావ్ **'కూరెళ్ళాన్వయా! విఠలా!'** శతకంను సామాజిక స్పృహ కలిగిన వృత్త పద్యాలలో రాశాడు. హైదరాబాద్‌కి చెందిన కాసోజు లక్ష్మీనారాయణాచార్య 'అమె' పేరుతో శతకం రాశాడు. ఒక తల్లిగా, చెల్లిగా, ఆలిగా, ప్రియురాలిగా, పనిమనిషిగా, పొలం మనిషిగా ఆమె వ్యక్తిత్వాన్ని సంక్షిప్తంగా చెప్తాడు.

భువనగిరి చెందిన నాగపురి శ్రీనివాసులు 2007 సం॥లో **'నాగపురి శతకం'** ద్వారా సమాజంలో నీతి, న్యాయం, నిస్వార్థం, సదాచారాలు, ఆత్మీయ అనురాగాలు పెరగాలని ఆశిస్తూ పద్యాలు రాశాడు. హైదరాబాద్‌కు చెందిన కృష్ణపాళి 2007 సం॥లో **అభినవ కృష్ణశతకం**ను కంద పద్యాలలో రాయగా, నల్లగొండకు చెందిన అద్దంకి లక్ష్మయ్య 2007లోనే **ఆణిముత్యాలు** పేరుతో ధారాశుద్ధి కలిగిన పద్యాలను రాశాడు.

'జనుల బాట కల్తి జగమెల్ల కల్తిరా
బాలలార భావిపౌరులార'

అంటూ సామాజిక స్పృహతో చక్కని పద్యాలు రాశాడు. ఇదే సంవత్సరం భువనగిరికి చెందిన వేంకటదాసు **'మెఱుగు పద్య త్రిశతి'** పేర కందపద్యాలు రాశాడు. ఇందులో మూడు భాగాలుగా విభజించి **'హృదయ నివేదన'**లో భగవద్గీత ఆధ్యాత్మిక తత్త్వము, మెఱుగు మాటలో సామాజిక స్పృహ, **'పరమార్థ సూక్తులు'**లో నీతి సందీప్తములుగా రాశాడు. నిజామాబాద్‌కు చెందిన మేడిచర్ల ప్రభాకరరావు **'వాసరమ్మ వాణి'** పేర భక్తి, జ్ఞాన, వైరాగ్య, కర్మ యోగాత్మకములైన, ఉపదేశాత్మకములైన పద్యాలతో పంచశతిని రాశాడు. మిర్యాలగూడకు చెందిన వసంతరాయ్ **'శ్రీసత్యకుమార శతకము'**ను కందపద్యాలలో రాయగా, ఇదే సంవత్సరం పరిమి రామనరసింహం **'ద్వానాశతcome'**ను రాశాడు.

2008 సం॥లో చాలా శతకాలు వచ్చాయి. నల్లగొండకు చెందిన యానాల ఇంద్రసేనారెడ్డి **'లచ్చీ శతకం'**ను రాశారు.

'జాతిని నడిపించగలను
నీతిని బతికించగలను నిజమే లచ్చీ'

అంటూ మానవీయతతో కూడి సందేశాత్మకంగా ఆలోచింపజేసే పద్యాలు రాశాడు. రాజీవ్ మిషన్ ఆధ్వర్యంలో వడిచర్ల సత్యం **'విప్పిచెప్పుబాల'** పేరుతో 'పొడుపు కథలతో' శతకాన్ని రాశాడు. హైదరాబాద్‌కి చెందిన ఏనుగు నరసింహారెడ్డి **'మట్టిపాట'** పేరుతో పల్లెజీవన దృశ్యాల్ని పద్యాలలో హృద్యంగా రాయగ, దేశపతి

శ్రీనివాస్ స్వరకల్పనతో క్యాసెట్స్‌గా చేశారు. నల్లగొండకు చెందిన సమ్మెట గోపాలకృష్ణ 'కృష్ణశతకం' పేర సూక్తులలాంటి మాటలతో పద్యాలు రాశాడు.

'చేతకానివాడు నీతులెన్నో చెప్పు'
'మందు చేదె కాని మంచినే చేయును'
'మనసు శుద్ధమైతే మనిషియే దైవంబు' వంటి సూక్తులు ఆయన పద్యాలలో కనిపిస్తాయి. హనుమకొండకు చెందిన మహమ్మద్ హసన్ **'శ్రీ శిర్డిసాయి శతకం'**ను రాయగ, డా॥ చింతోజు మల్లికార్జునాచారి ఉత్పలమాల పద్యాలలో **'మల్లికార్జున శతకం'**ను రాశాడు. దేవరకొండకు చెందిన ఇతను తన జీవితానుభవాలను పద్యాలుగా మలిచాడు. నల్లగొండకు చెందిన యెలుగూరి వెంకట్‌రెడ్డి **'చిట్టికన్న శతకం'**ను రాయగ, వేములవాడకు చెందిన మునుగొటి కృష్ణమూర్తి **తెలంగాణ తెలుగువారు నేల వెలుగువారు'** పేరుతో గొప్పవారి గురించి ఆటవెలదులలో పద్యాలు రాశాడు. సికింద్రాబాద్‌కు చెందిన దండిభొట్ల **'స్వాతిముత్యాలు'** పేరుతో సామాజికాంశాలు స్పృశిస్తూ సమాజాన్ని జాగృతపరిచే ప్రయత్నం చేశాడు.

2009 సం॥లో కరీంనగర్‌కు చెందిన డా॥ మలయశ్రీ రెండు శతకాలు రాశాడు. **'తెలుగు తమ్మీ'** శతకం లోకానికి హితోపదేశం లాగా సాగగా, **'చెల్లెలా!'** శతకం స్త్రీలపై నిశిత పరిశీలన, ఆర్ద్రతా భావంతో పద్యాలు రాశాడు. నల్లగొండకు చెందిన సూరోజు బాలనరసింహాచారి 2009లో **'భరతసింహ శతకం'** రాశాడు. ఇందులో నీతిని వ్యవస్థాపితం చేయాలన్న లక్ష్యం గల పద్యాలు కన్పిస్తాయి. ఇదే సంవత్సరం సన్నిధి జనార్దనస్వామి **'మరువబోకు మీవు మంచిమాట'** ద్విశతిని రాశాడు. హైదరాబాద్‌కి చెందిన డా॥ అక్కిరాజు సుందరరామకృష్ణ **'అమెరికాలో కవి సుందర్ – శ్యామ్‌సుందర్'** పేర వ్యంగ్య అధిక్షేప, చమత్కార ద్విశతిని వృత్తపద్యాలలో రాశాడు. హైదరాబాద్‌కి చెందిన మరొక కవి డా॥ రాధశ్రీ **'చెన్నప్ప ద్విశతి'** రాశాడు. 2010 సంవత్సరంలో కూడా ఈ ప్రాంతంలో శతకాలు విరివిగా వచ్చాయి. హన్మకొండకు చెందిన డా॥ మార్క శంకర్ నారాయణ **'శంకరన్న శతకం'** పేర భౌతికశాస్త్ర ముఖ్య సూత్రాలను ఆటవెలది పద్యాలలో రాశాడు. **'మనోబోధ శతకం'**ను గురువయ కవి రాయగా, కపిలవాయి లింగమూర్తి **'కృష్ణవేణి'** నీతిశతకమును ఆటవెలదులలో రాశాడు. ఆచార్య భీమశంకరం **'భీమశతకం'** అనే నీతిశతకం రాశాడు. జగిత్యాలకు చెందిన కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం **'తేనె తెలుగు శతకం'** రాశాడు. వివిధ ఉపమానాలతో తెలుగు భాషా తియ్యదనాన్ని పాఠక లోకానికి చక్కగా చూపించాడు. సిరిసిల్లకు చెందిన వెంగళ లక్ష్మణ్ **'మా తెలంగాణ శతకం'**ను రాశాడు. ఇందులో తెలంగాణ మట్టిబతుకులను చక్కగా వివరించాడు. సూర్యాపేటకు చెందిన డా॥ వనం సావిత్రీనాథ్ **'నాథశతకం'**ను రాయగా, హైదరాబాద్‌కి చెందిన

బుసిరెడ్డి లింగారెడ్డి **'లింగన త్రిశతి'**ని రాశాడు. ఇందులో యువతకు జాతి సమైక్యతా పద్యాలు రాశాడు. తన పద్యాలలో నేటి కాలంలో విద్యార్థులలో నీతి నాటుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తాడు.

'విద్యయెడల శ్రద్ధ విద్యార్థులకు లేదు
నీతి నభ్యసించు నియతి లేదు
పాఠశాల లెట్లు ప్రగతిని సాధించు'

అని ఆవేదన వ్యక్తం చేశాడు. నల్లగొండకు చెందిన సమ్మెట గోపాలకృష్ణ 'కాలధర్మాలు' పేరుతో శతకం రాశాడు. కవి అనుభవాలను చక్కటి మాటలలో వ్యక్తం చేశాడు.

'కాలు – నోరు జార కష్టాల కడలియే'
'కొంగ జపము జేసి కొంపలు కూల్చేరు'
'అసలు మిత్రులెవరొ ఆపదలో తెలియు' వంటి సూక్తుల వంటి మాటలు కన్పిస్తాయి.

భాషాప్రయోగాలు

పూర్వకాలంలో సాహిత్యరచనలో ఉద్దండులైన పండితులు ఉండి తమ రచనలను గ్రాంథిక భాషలో సంస్కృతభూయిష్ఠమైన పదాలతో తమ రచనలను సాగించేవారు. ఇట్టి రచనలను కేవలం కవిపండితులైన పాఠకులు మాత్రమే చదివి అర్థంచేసుకోగలిగేవారు. 20వ శతాబ్దం ప్రారంభంలో వచ్చిన వ్యవహారిక భాషోద్యమం తరువాత సాహిత్యరచనలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. నేటి ఆధునిక కాలంలో మారుతున్న కాలానుగుణంగా భాషను సరళీకృతం చేస్తూ, కవులు రచయితలు సాహిత్యాన్ని పాఠకులకు చేరువ చేస్తున్నారు. పద్యసాహిత్యంలో కూడా సంస్కృతభూయిష్ఠమైన పదాలు కాకుండా సాధారణ వ్యవహారిక పదాలను, మాండలిక పదాలను తమ రచనలలో విరివిగా వాడుతున్నారు. శతక సాహిత్యంలో సరళ పదాలను ఉపయోగించి ఆటవెలది పద్యాలలో వందల పద్యాలు రాసి విశేషమైన ఖ్యాతిని గడించిన వేమన నేటి కాలపు శతక కవులకు ఆదర్శప్రాయులైనారు.

21వ శతాబ్దం ప్రారంభంలో వచ్చిన శతక సాహిత్యాన్ని పరిశీలించగా వ్యవహారిక భాషాపదాలు, మాండలిక పదాలు మనకు బాగానే కన్పిస్తున్నాయి. ఖమ్మంకు చెందిన ఎర్రాప్రగడ రామమూర్తి రాసిన సంఘీశతకంలో **సంత, కోడె** వంటి ప్రాంతీయ పదాలు కన్పిస్తాయి. కరీంనగర్‌కి చెందిన డా॥ జనపాల శంకరయ్య రాసిన ఆచార్య దేవోభవ శతకంలో **బడితెపూజ, బడవ, దుమ్మా, రాకిరాకి** వంటి పదాలను వాడాడు. హైదరాబాదు ప్రాంతానికి చెందిన కాసోజు లక్ష్మీనారాయణాచార్య రాసిన 'ఆమె' శతకంలో **అవ్వ, బువ్వ, బాసాన్లు, కైకిలు** వంటి పదాలను తన శతకంలో ప్రయోగించారు. నల్లగొండకు చెందిన యానాల ఇంద్రసేనారెడ్డి రాసిన 'లచ్చీశతకం'లో ఈ **లచ్చీ**పదం అచ్చతెనుగు పదం. లక్ష్మికి వికృతరూపం లచ్చీ ఇది పూర్తిగా వ్యవహారికం. డా॥ మార్క శంకర్ నారాయణ రాసిన శంకరన్న శతకం ఆటవెలది పద్యాలలో భౌతికశాస్త్రంను బంధించిన శతకం. **ప్రమాణం, తరంగం** వంటి పదాలను ప్రయోగించి భౌతికశాస్త్ర విషయాలను వివరిస్తూ పద్యసాహిత్యంలో నూతన ఒరవడిని సృష్టించారు. తెలుగుబాల శతకంలో తోకల రాజేశం తల్లిదండ్రులు అనే మాటను తలిదండ్రిగా, ఆమె శతకంలో కాళ్లుచేతులు అనే పదాన్ని **కాళ్జేతులుగా** ప్రాంతీయ రూపంగా మార్చి ప్రయోగించారు. మట్టిపాట శతకంలో ఏనుగు నరసింహారెడ్డి తెలంగాణ మాండలిక పదాలైన **బద్మాషు, బువ్వ, శిర్రగోనె, కోతికొమ్మ, సీసపు గోలి** వంటి పదాలను ప్రయోగించారు. దుబ్బాకుల కృష్ణస్వామి రాసిన కృష్ణసందేశం శతకంలో **ముండ, కల్లు, సార** వంటి పదాలు ప్రయోగించారు. శతకసాహిత్యాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఇలాంటి పదాలు మరిన్ని కన్పిస్తాయి.

నేటి ఆధునిక కాలంలో పాశ్చాత్య ప్రభావం చేత ప్రజలు తమ వ్యవహారంలో అనేక ఆంగ్ల పదాలను వాడుతున్నారు. ఈ ప్రభావం సాహిత్యంపై కూడా కలిగి కవులు తమ రచనలలో ఆంగ్ల పదాలను విరివిగా వాడుతున్నారు. సిహెచ్. దయానంద్ రచించిన పోతుకూచి శతకంలో **లాడ్జి, అపార్ట్‌మెంట్, ఎల్కేజి, మమ్మీ, డాడీ, అల్ఫాన్స** వంటి ఆంగ్లపదాలను ప్రయోగించాడు. ఏనుగు నరసింహారెడ్డి రచించిన 'మట్టిపాట' శతకంలో బ్రోకర్లు కాన్వెంటు వంటి ఆంగ్లపదాలను వాడారు. పరిమి రామనరసింహం తన శతకానికి "ద్యానాశతcome" అని పేరులోనే come అనే ఆంగ్లపదం వాడారు. **కాలేజి, ఈజి** వంటి పదాలు శతకంలోనూ కన్పిస్తాయి. ఒక్క ఆంగ్లపదంలేని ఆధునిక శతకం లేదన్న ఆశ్చర్యం లేదు అన్నంతగా కవులు తమ శతకాలలో ఆంగ్లపదాలను వాడుతున్నారు.

శతక సాహిత్యం అంటేనే సూక్తులకు, సామెతలకు నిలయమై నటువంటివి. ముఖ్యంగా ఆటవెలదులతో వచ్చే శతకాలలో ఎక్కువగా ఏకపాద మకుటం కలిగి, మొదటి రెండు పాదాలలో విషయ వివరణ, మూడవ పాదంలో విషయానికి సమర్థింపు ఉంటుంది. ఈ సమర్థింపు సూక్తిగానో, సామెతగానో ప్రయోగించడం అనేది ప్రధానమైనటువంటిది. వేమన తన శతకంలో ఆరువందలకు పైగా పద్యాలలో సూక్తులు, సామెతలు ప్రయోగించారు. ఇవి జన సామాన్యంలో పలుకుబడులుగా స్థిరపడ్డాయి. ఆధునిక శతకకవులు వేమన మార్గాన్ని అనుసరిస్తూ ఆటవెలదులలో శతకాలు రాస్తూ సూక్తులు, సామెతలు ప్రయోగిస్తున్నారు. డా॥ బొద్దుల లక్ష్మయ్య రాసిన **"శ్రద్ధతోడ వినుము శంకరప్ప"** శతకంలో –

"అందకున్న కాళ్ళు అందినాసిగబట్టు"
"నోరు పెద్దదైనా ఊరంత జంకురా"
"ధనము గలుగువాని దాసులీజనులంత" వంటి సామెతలు, సూక్తులు మనకు కన్పిస్తాయి. సిరిగద్దె జంగాచారి రాసిన పౌత్ర శతకంలో **పులిని చూసిన నక్క వాతపెట్టుకొనుట, ఏ యెండకాగొడుగు పట్టుట** వంటి సూక్తులను ఛందోమార్పులతో తన పద్యాలలో కూర్చాడు. దుబ్బాకుల కృష్ణస్వామి రాసిన కృష్ణసందేశం సప్తశతిలో **"తన్ను తాను గెలువ తరముగాదు", "మానవత్వరహిత మతము సున్న"** వంటి సామెతలు మనకు కన్పిస్తాయి. నాగపురి శ్రీనివాసులు రాసిన నాగపురి శతకంలో **"తప్పు తప్పెగాని ముప్పు రాకుండాలి"** వంటి సామెతలు మనకు కన్పిస్తాయి. మల్లికార్జున శతకంలో డా॥ చింతోజు మల్లికార్జునాచారి **పోయిన కాలమును తిరిగి పొందెడిదెవ్వరు** అంటూ చక్కని సూక్తిని తెలియజేస్తాడు. సూరోజు బాలనరసింహాచారి తన భరతసింహ శతకంలో–

"శిల్పిదెబ్బకాగు శిలయె విగ్రహమౌను"
"కంచె చేను మేయ కాపేమి చేయురా"
"నీతిలేని మాట రాతలా చేటురా" వంటి సామెతలు మనకు అందించారు. సమ్మెట గోపాలకృష్ణ రాసిన కాలధర్మాలు శతకంలో తన అనుభవాలను సామెతల రూపంలో మనకు అందించారు.

'కాలు నోరు జార కష్టాల కడలియే'
'కొంగజపము జేసి కొంపలు కూల్చేరు'
'అసలు మిత్రులెవరో ఆపదలో తెలియు' వంటి సామెతలు సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తాయి.

వడిచర్ల సత్యం "విప్పిచెప్పుబాల" పేరుతో పొడుపుకథలతో శతకం రాసి శతకప్రక్రియలో కొత్తప్రయోగం చేశారు.

కత్తిబలము కన్న సుత్తిబలము కన్న
పదును గలదు దాని పాదమందు
జ్ఞానిచేతయున్న ఘనకీర్తినిచ్చును
విప్పిచెప్పుబాల! వినయశీల! జ. కలము వంటి పొడుపు కథలు విద్యార్థులను ఆలోచింపజేస్తూ, జ్ఞానార్జనకు తోడ్పాటునందిస్తున్నాయి.

శతక పద్యాలలో ముఖ్యంగా ఆటవెలది పద్యాలలో ఎక్కువగా ఉపమాలంకారం, అర్థాంతరాన్యాస అలంకారాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. 3వ పాదంలో సామెతకాని, దృష్టాంతంకాని ఉండి అర్థాంతరాన్యాస అలంకారాన్ని వ్యక్తపరుస్తున్నాయి. ఛందస్సు పరంగా శతకానికి ఛందోనియమం ఉన్నప్పటికినీ ఆధునిక కవులు పాటించని సందర్భాలు ఉన్నాయి. **"కొంగుబంగారం నవయుగ"** శతకంలో కొండూరి కాశీవిశ్వేశ్వరరావు మకుట నియమం పాటించినప్పటికీ ఛందస్సు లేకుండా గేయశతకం రాశాడు. అలాగే కొలిపాక బాలయ్య సత్యదర్శిని శతకంలోను ఛందోనియమం పాటించలేదు. ఎర్రోజు బాలనర్సయాచార్యులు రాసిన ఎర్రోజు నీతిశతకంలో కందపద్యాలతో మకుటం లేకుండా శతకం రాశాడు. ఈ విధంగా శతకనియమాలలో కూడ వెసులుబాటును తీసుకుంటున్నారు ఆధునిక కవులు.

ఈ కాలంలో వచ్చిన నీతి, సామాజిక, శతకాలన్నీ వ్యక్తులలో పరివర్తన కొరకు, సామాజిక మార్పు కొరకు, మనుషులలో క్రమశిక్షణ పెంపొందించుట కొరకు, దయా, జాలి, కరుణ మొదలగు లక్షణాలను పెంపొందించుటకు ఎంతగానో తోడ్పడ్డాయి. ఛందస్సు పరంగా ఎక్కువగా ఆటవెలది, కంద పద్యాలు వచ్చాయి. అక్కడక్కడ వృత్తపద్య శతకాలు, తేటగీతి పద్యశతకాలు కనిపించాయి. ఛందస్సు నియమం పాటించని శతకాలు కూడా కనిపించాయి. పద్యాలలో ఫిజిక్స్, శాకాహార శతకం మొదలగునవి వచ్చి సమాజంలో శాస్త్రీయ దృక్పథం, పౌష్టికాహార ప్రాధాన్యతను తెలిపాయి. ఈ శతకాలలో ఎక్కువగా హృదయానికి హత్తుకునే చక్కని సామెతలు, సూక్తులు కలిగి భాషా సౌందర్యాన్ని ప్రదర్శించాయి. తెలంగాణ నలుమూలల శతక రచన చేసిన కవులు మనకు పుష్కలంగా కన్పిస్తారు. వాటి గురించి స్థాలీపులాక న్యాయంగా వివరించాను. తెలంగాణ వ్యాప్తంగా వచ్చిన శతక సాహిత్యంపై లోతైన పరిశోధన జరుపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధారగ్రంథాలు :

1. గౌరీశంకర్, జూలూరు (సం.) 2022, తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర, తెలంగాణ సాహిత్య అకాడమీ, హైదరాబాద్.
2. సుజాతారెడ్డి, ముదిగంటి, 2015, తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర, తెలంగాణ సాహిత్య పరిషత్తు, హైదరాబాద్.
3. నాగయ్య, జి., 2009, తెలుగు సాహిత్య సమీక్ష, నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి.
4. తెలంగాణాలో 2001–2010 మధ్యలో వచ్చిన నీతి, సామాజిక శతకాల పరిశీలన.

❖ ❖ ❖ ❖ ❖

కొంగు

డా. ఎన్. గోపి
ఫోన్ : 939 102 8496

అమ్మాయి !
చీరను వెక్కిరించకు
చిన్నతనంలో
దాని కొంగు పట్టుకునే తిరిగే దానివి.

వర్షంలో
ఎండల్లో
అదే నీకు గొడుగయ్యేది.
చెమటను తుడిచే
చెయ్యి అయ్యేది.
వేడి వేడి చాయను తాపించే
గ్లాసు కు అడుగయ్యేది
కన్నీళ్లు కారితే
తుడిచే ఓదార్పు హస్తమయ్యేది.

పట్టుచీరను కట్టుకొని
బతుకమ్మను మోసే
మా అమ్మ
జలదేవతలా ఉండేది
ఆ చీరె అంచున మెరిసే
పసిడి డిజైన్లు
నా కవిత్వానికి కాంతులు ప్రసాదించేవి.
మా అమ్మ చీరెలను
మా అక్క కూడా కట్టుకునేది.

చీర చెంగులు
ఇంద్ర ధను:తరంగాల్లా కదిలేవి
ఛాతి పై కప్పుకునే పైట
మమకార మాధుర్యాన్ని గుర్తుచేసేది.

అమ్మాయి!
చీరెను తీసిపారేయ్యకు
మీ ఆధునిక దుస్తుల్లో
సౌకర్యముండొచ్చు
కానీ సాంస్కృతిక సౌందర్య మేదీ!
మా ఇంటికి ఓసారి రా!
మా రేకు పెట్టెలో దాచిన
మా అమ్మ చీరెను చూపిస్తాను.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 (22) హైదరాబాద్ అక్టోబర్ : 2025

సంఘ చైతన్యపు సలహాదారులు – ఈ కథల పాత్రధారులు

పెద్దోళ్ళ శ్రావణ్ కుమార్, పరిశోధక విద్యార్థి, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9666400147

డాక్టర్ చిల్లర భవానీదేవి తెలుగు సాహిత్యంలో ఐదు దశాబ్దాలుగా సాహితీ సృజన చేస్తున్న అవిశ్రాంత రచయిత్రి. కథ, నవల, కవిత ఇలా ఏదైనా మానవతా పరిమళంతో రచనలు చేయడం ఈ రచయిత్రికి వెన్నతో పెట్టిన విద్య. భవానీదేవి కలంనుండి అనేక ప్రసిద్ధ రచనలు వెలువడ్డాయి.

అనుభవాల నుంచి, జీవితాల నుంచి, సమాజమూలాల నుంచి వచ్చే సాహిత్యమే గొప్పసాహిత్యం అవుతుంది. భవానీదేవి చూసిన ప్రపంచం, అనుభవించిన జీవితం, తనకు తారసపడ్డ వ్యక్తులు, వ్యక్తుల కష్టాలు, బాధలు ఇలా అన్నింటిని తను కథల రూపంలో రాసిందని అనిపిస్తుంది. ఈమె కథలు చదువుతుంటే కుటుంబాల తాలూకు కష్టాలు, కన్నీళ్లు కనిపిస్తాయి. భవానీదేవి తన కథలను సామాజిక ప్రయోజనానికి దూరం కాకుండా, సామాజిక ప్రయోజన కరంగా రాసింది.

రాతిలో తేమ ప్రేమ, దయ, జాలి లేని సవతి తల్లి. విపరీత ప్రేమ, దయ, కరుణ కలిగిన తండ్రి. కన్న తల్లి ప్రేమకు, మమకారానికి నోచుకోని బిడ్డ, భార్య కళ్ళలో ఆనందం కోసం ఏ సాహసమైనా చేసే భర్త వంటి కుటుంబ సభ్యులు వివిధ అంతరంగాల ఆలోచనను చిత్రించిన కథ ఇది. రామ్మూర్తి తన నుదుటి రాత బాగా లేక భార్య కళ్ళు మూస్తుంది. ఉన్న ఒక్కగానొక్క కూతురు పోషణ ఎవరికీ భారం కాకూడదని తన అమ్మమ్మ దగ్గర ఉంచి తాను తప్పని పరిస్థితుల్లో మరో పెళ్ళి చేసుకోవాల్సిన అనివార్యత ఏర్పడుతుంది.

రెండో భార్య సుభద్ర అత్తింట్లో కాలు పెట్టగానే భర్త తరపు వాళ్ళందరినీ దూరం చేస్తుంది. సహజమైన సవతి ప్రేమను ఒలకబోస్తూ ఉంది. ఆమె చేస్తున్న ఆలోచనలు, పోతున్న వింత పోకడలు రామ్మూర్తి అన్నీ మౌనంగా గమనిస్తూనే ఉన్నాడు. కానీ నిస్సహాయ స్థితిలో ఉండి ప్రశ్నించలేక పోతాడు. రామ్మూర్తి కూతురు మాధవి పెరిగి పెద్దదై తల్లి ప్రేమ కోసం వస్తే సవతి తల్లి చీవాట్లు పెట్టి పంపిస్తుంది. చిన్నప్పటి నుండి రెండు పదుల వయసు వరకు తండ్రి ఆలనా పాలనకు దూరమైనని బాధపడుతుంది. ఈ బాధను చూస్తూ భరించలేని తండ్రి తన మేనల్లుడిని తన అల్లుడిగా చేసుకోవాలని ఆరాటపడి కూతురుకి దూరంగా పెళ్లి చేయిస్తాడు. సుభద్ర మాత్రం కపట నాటకంతో తన కూతురిని కార్తీక్కి ఇచ్చి పెళ్లి చేయాలని పన్నాగం పన్నుతుంది. ఎలాగోలా రామ్మూర్తి వేసిన వ్యూహాన్ని పటా పంచలు చేసి కార్తీక్కి ఆస్తి కోసం అల్లున్ని చేసుకోవాలని విఫల ప్రయత్నం చేస్తుంది. కార్తీక్ ఎవరి వలలో పడకుండా తాను ఇష్టపడ్డ మాధవిని అంటే తన మేన మరదలు మాధవిని పెళ్లాడి విజయవాడలో కాపురం పెడతాడు.

చిన్నతనం నుంచే స్వయంగా ఎదగడం నేర్చుకున్న మాధవి బడిలో టీచరుగా చేరి నిరాడంబరంగా జీవించడం నేర్చుకుంది.

ఎన్ని కాలాలు మారినా, ఎన్ని యుగాల పుటలు తిప్పేసినా సవతి తల్లి తన సహజమైన లక్షణాన్ని మాత్రం మార్చుకోలేక పోతున్నది. రామాయణ కాలంలో కైకేయి ప్రవర్తించిన తీరు నేటి సవతి తల్లులకు పాకినట్టు ఈ కాలపు సవతి తల్లులు ప్రవర్తిస్తున్నారు. ఇది తిరోగమన సమాజానికి పురోగమనమే తప్ప అవరోధం కాదు.

అపుత్రికస్య

భారతీయ హిందూ సంప్రదాయంలో లింగ వివక్షకు కుటుంబమే కేంద్రం. దానికి తాత, నానమ్మలు, తల్లిదండ్రులే కారణం. గర్భధారణ నుండి ప్రసవం, పెంపకం, పుష్పవతి కాకముందు వరకు మగ, ఆడపిల్లలని ఒకే రకంగా పెంచినా ఆ తర్వాత పెంపకంలో ఎందుకు తేడాలు వస్తాయి? అని మహా ప్రశ్న. సమాధానం ఆడపిల్ల బలహీనురాలు అని పెద్దలు చెప్తారు. ఇది ఒక మూర్ఖత్వం, అనాగరికం. కన్నతల్లి మగ, ఆడపిల్లల విషయంలో భేదాలు పాటిస్తుంది. నలుగురు ఆడపిల్లలను కన్న తర్వాత, మగ పిల్లవాడు పుడితే ఏ తండ్రికి, తల్లికి అయినా పట్టరాని సంతోషం ఉంటుంది. ఇది సహజం. కానీ వాడు పెరిగి పెద్దయ్యాక ఆశ్చర్య పరుస్తాడని మాత్రం ఎవరూ ఊహించరు. ఆ ఆశ్చర్యానికి తల్లే కారణం అవుతుందని అసలే ఊహించరు. ఈ కథలో శివ అనే వ్యక్తికి నలుగురు అక్కలు ఉంటారు. శివ చిన్నప్పుడు అతన్ని అక్కలందరు అల్లారుముద్దుగా చూసేవారు. తల్లి కూడా ఒక గొప్ప వ్యక్తిగా చూసేది. కానీ కాలంలో మార్పులు వచ్చినట్టు అతని పెంపకంలో మార్పులు రావడం జరిగాయి. క్రమంగా ఆ మార్పులు కుటుంబంలో మనస్పర్థలకు దారి వేశాయి. కొడుకు చిన్నప్పుడు అతనికి కాపలా కాసిన అక్కలే తరవాత అతని కాపలాకు తల దాచుకోవాల్సి వచ్చింది. అతను కేవలం మగ పిల్లవాడు అని మాత్రమేనని, పురుషాహంకారం అనేది ఉండాలని తల్లి అతనినే సమర్థించడం అక్కలకు నచ్చలేదు. అంతవరకూ బాగానే ఉన్న తల్లి, కొడుకు పెద్దవాడు అవగానే కూతుర్లని బలహీనురాళ్ళుగా చేసి కొడుకును బలవంతున్ని చేసింది. చివరి దశలో ఆప్యాయంగా ఉండాల్సిన తల్లి బాగోగులు చూడలేక బాధ పడ్డది. ఏ కొడుకైతే తనను పున్నామ నరకం నుండి తప్పిస్తాడనీ భావించిందో ఆ కొడుకే అంతిమ సంస్కారాలకు దూరమయ్యాడు. ఏ కూతుర్లు అయితే బలహీనురాళ్ళు అని తపించిందో ఆ కూతురులే తన చితికి నిప్పంటించారు. తల్లి పిల్లల పెంపకంలో సమానత్వాన్ని

పాటించాలని, ఆడ, మగ పిల్లలు ఇద్దరూ సమానమేనని, భేదాలు లేకుండా, రాకుండా తల్లిదండ్రులు పెంచాలని ఈ కథ ద్వారా తెలిపారు.

మరణ గౌరవం

హనుమంతయ్య – భాగ్యమ్మ దంపతుల జీవితం ఎలా సాగింది. హనుమంతయ్య చనిపోయాక భార్య బ్రతుకు ఎలా కొనసాగింది. తల్లి పట్ల పిల్లలు ఎటువంటి ఆదరణ చూపించారు అనే కోణంలో కథ సాగింది. మనిషి వేసుకున్న ఆభరణాలకు, మనిషికున్న ఆత్మీయతకు విలువ లేదని ఈ కథ నిరూపించింది. కన్న తల్లిలా చూసుకోవాల్సిన కోడలు పరాయి మనిషిని చూసినట్టు చూసింది. కని పెంచి పెద్ద చేసి ఒక అమ్మాయిని కోడలిగా, తనకు భార్యగా తెస్తే ఆ భార్య పెత్తనం తన తల్లిగా ఉండడం కొడుకుగా నరసింహం సహించలేకపోయాడు. సున్నిత జీవితమైన మగవాని బ్రతుకుకు నేడు విలువనేది లేకుండా పోయింది. భర్త నరసింహం రాత్రి పగలు కష్టపడి పని చేసి డబ్బు సంపాదిస్తే ఆ డబ్బుతో భార్య దివ్య జల్సాలకు తిరుగుతూ అత్త ముందే పొగరుగా నడుచుకుంటుంది. భాగ్యమ్మ ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రిలో చేరితే ఆమె కుమారులు, కూతుర్లు ఆమెను ఎలా చూసుకున్నారు. వారు చూసుకునే విధానానికి ఆమె మనసు ఎంత చిన్నబుచ్చుకున్నదో వంటి కుటుంబ స్వార్థ పూరిత ప్రేమను తెలిపింది. లాలించి, ఆడించి పెంచిన పిల్లలు డబ్బు మాయలో పడి అమ్మను మరిస్తే ఏ బంధం లేకపోయినా ఒక అనాథను చేరదీసి పోషిస్తే ఆ అనాథనే నయం ఎంతో కొంత ప్రేమ పంచిందని సంతోషంతో ఆత్మ రూపంలో వెళ్ళిపోతుంది.

అత్తారింటికి దారేది

ఈ కథ సంసారిక బాధలను, వేధింపులను ఎదుర్కొంటున్న స్త్రీలకు, జీవితంలో అనేక చోట్ల అవమాన పడిన స్త్రీలకు, జీవితం ఇంతే, నాతో ఏమి కాదు అని నిరుత్సాహంగా ఉండే వాళ్ళకు, ఈ కథ చక్కటి చైతన్యాన్ని ఇస్తుంది. ప్రతీ స్త్రీ తప్పక చదవాల్సిన కథల్లో ఇది ఒకటి.

వరలక్ష్మి, కాదంబిని ఇద్దరు ప్రవచనం వినే వేదిక దగ్గిర స్నేహితులుగా పరిచయం అవుతారు. తరచూ ప్రవచనం వినడానికి వెళ్లడంతో పరిచయం బలంగా మారుతోంది. వరలక్ష్మి సామాజిక, నైతిక విలువలు కలిగిన ఒక ఆదర్శ గృహిణి. కాదంబిని మోసం, వంచన, ద్రోహం వంటి విద్రోహ లక్షణాలు గల స్త్రీ. ఒకనాడు కాదంబిని ప్రవచన కర్తకు లంచం ఇచ్చి, తన ఇంటికి వరలక్ష్మి కూతురు కోడలిగా వస్తె తన జీవితం మెరుగ్గా ఉంటుందని ప్రవచన కర్త ద్వారా వరలక్ష్మికి చెప్పిస్తుంది. వెంటనే ఇద్దరు వియ్యపురాళ్ళు అవుతారు. వరలక్ష్మి కూతురు దివ్య అందగత్తె. ఆదర్శ భావాలు గల అమ్మాయి. గొప్ప స్థాయికి ఎదగాలన్న ఆశ ఉన్న స్త్రీ. ఇటువంటి అమ్మాయికి కాదంబిని కొడుకు మొగుడిగా రావడం తన జీవితానికి అవరోధంగా మారుతుంది. అతని పేరు ఉత్తేజ్. అమెరికాలో



చదువుకోవడానికి వెళ్లి చెడు సావాసాలు చేసి అక్రమ సంబంధం పెట్టుకుంటాడు. ఇక్కడ ఉత్తేజ్ తండ్రి భానుమూర్తి కూడా ఆడపిల్లల జీవితాలతో చెలగాటం ఆడుతుంటాడు. అలా కొడుకు అమెరికాలో ఉన్నాడని, కోడలికి తోడుగా ఎవరు లేరని తనని లైంగికంగా వేధిస్తాడు. ఈ వేధింపుల గురించి దివ్య ఎప్పటికప్పుడు తన తల్లి వరలక్ష్మికి చెబుతుంది. ఈ విషయం తెలుసుకున్న వరలక్ష్మి, కాదంబినీ తనను మోసం చేసిందని గ్రహించి తన కూతురుని విడిపించుకొని మరో పెళ్లి చేస్తుంది. దివ్య అభిరుచి తెలుసుకొని తనని చదివించి తను కలెక్టర్ కావడానికి తన రెండో భర్త కారణమవుతాడు.

ఒకనాడు వరలక్ష్మి, దివ్య, ఆమె భర్త కలిసి గుడికి వెళ్ళగా అక్కడ బిచ్చగాళ్ల మధ్యలో దివ్య మొదటి అత్త, మామ దీన స్థితిలో అడుక్కుంటారు. ఈ కథ స్త్రీకి ఒక చైతన్యవంతమైనది. జీవితంలో సమస్య రాగానే ఆగిపోతే జీవితం అక్కడితో ముగుస్తుంది. సమస్యను ఎదుర్కొని ముందుకు వెళితే జీవితం సంతోషంగా ఉన్నతంగా ఉంటుందని ఈ కథ నిరూపితం చేసింది.

చివరి వలస

భవానీదేవి కథల శీర్షికలు ఇతివృత్తంలోని సారాన్ని ప్రతిబింబింప చేస్తాయి. ఏ కథ చదివినా ఇతివృత్తానికి తగినట్టు శీర్షిక ఉండడం





ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 హైదరాబాద్ అక్టోబర్ : 2025

ఆ శీర్షిక భావం కథలో కనపడడం ఒక ప్రత్యేకత. ఈ చివరి వలస కథలో కొడుకు ఉన్న అమెరికా దేశానికి రమ్మని కబురు పెడితే తప్పకుండా వస్తాం అని తల్లిదండ్రులు సిద్ధపడతారు. కానీ మధ్యలోనే కరోనా వైరస్ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడం అది మనుషుల్ని దూరం వంటి వార్తలు వారిలో భయానక వాతావరణాన్ని సృష్టించాయి. ఈ కరోనా వైరస్ వస్తుందనే విషయం వీరికి తెలియనంతవరకు వీళ్ళు అమెరికా ప్రయాణమే మా జీవితంలో చివరిది. ఇక మేం నీతోనే ఉంటాం అని కొడుకుకు చెప్పడం వెనకాల వారి చివరి ప్రయాణం ఇదే కనుక దానినే రచయిత్రి చివరి వలస అనే అర్థంలో చిత్రించారు. సంతానం లేకపోతే దత్తత తెచ్చుకొని ఆ బాలుడ్ని చదివించి ప్రయోజకుడ్ని చేస్తారు. అతను అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడి అమ్మా నాన్నను కూడా అక్కడికి రమ్మని కబురు చెప్పడంతో వారు స్వదేశాన్ని వీడి వెళ్ళలేక, కొడుకు మీద ప్రేమతో అతని దగ్గరకు రాము అని చెప్పలేక లోలో మదన పడుతుంటారు. అంతలోనే ఈ కొవిడ్ అనే వ్యాధి మనుషుల్ని దూరం చేస్తుందట అని తెలుసుకోగానే తన భార్యకు, కొడుకుకు శంకరం శాశ్వతంగా

దూరం అవుతాడు. మనస్తాపం మనిషిని దహిస్తుంది అనేది వాస్తవమని ఈ కథ ఆధారంగా తెలుసుకోవచ్చు.

అవర్ణం

అధిక సంపద, ఆస్తి, పలుకుబడి కలిగిన ఒక ధనిక కుటుంబంలోకి సుమతి కోడలిగా వెళ్ళింది. ఈ కుటుంబంలోని వారికి నైతిక విలువలు, సామాజిక కట్టుబాట్లు, సంస్కారాలు తప్ప అన్నీ ఉన్నాయి. సుమతి ఒక మానవతా వాది. సంస్కారాలతో పెరిగిన కూతురు. ఆమెకు రాఘవరావుతో పెళ్లి అవుతుంది. వారికి ఒక బాలుడు దివ్యాంగుడిగా పుడతాడు. దానికి కారణం తల్లేనని అత్త, భర్త కలిసి సుమతిని వేధిస్తారు. రాఘవులు మాత్రం బజారులో ఉండే వేరే స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకొని ఆమెతోనే ఉంటాడు. సుమతి తన బిడ్డ కోసం శ్రమించి యోగ క్షేమాల కోసం ఆరాట పడుతుంది. కొంతకాలానికి సుమతి కొడుకుకు పెళ్లి అవుతుంది. అప్పటికే అక్రమ సంబంధాలతో కుటుంబాలను కూలగొడుతున్న రాఘవరావు తన కోడలితోనే వివాహేతర సంబంధం పెట్టుకుంటాడు. అది తెలిసిన సుమతి ఇల్లు విడిచి కష్టపడి పని చేసి డబ్బు సంపాదించి, దావా వేయగా వచ్చిన డబ్బుతో ఒక అనాథ శరణాలయం నిర్వహిస్తుంది.

ముగింపు : సంఘపు బింబానికి ఈ రచయిత్రి కథలు ప్రతిబింబాలు. నవ్య పోకడలకు సమీపిస్తున్న సమాజం నిత్యం తన ఆకారాన్ని, వ్యక్తిత్వాన్ని మారుస్తూ ఉంది. కొంతమంది వ్యక్తుల సమూహమే సంఘమైతే, ఆ కొంతమంది చేసిన కొన్ని విరుద్ధ పనుల వలన యావత్ సమాజానికే చెడిన పేరు వస్తుంది. ఇలా చెడిన సమాజాన్ని పరివర్తనం చెందించే దిశగా సాగుతున్న రచనలే ఈ కథలు. ఒక్కో రచయితకు ఒక్కో లక్ష్యం ఉంటుంది. దాని సాధన దిశగా వారు అవిరళ కృషితో, సంఘాన్ని నైతికంగా మార్చాలనే సంకల్పంతో తమ మేధస్సుని అక్షర రూపంలోకి మారుస్తున్నారు. ఒక విధంగా ఇటువంటి రచయితలు అనధికార నైతిక శాసన కర్తలు. వీటి అమలుకు రూపం మాత్రం పాఠకులే. ఆ పాఠకులే పీఠాలుగా మారి వారు మరో నూతన సమాజాన్ని నిర్మించనాడు ఇలాంటి కథలకి సార్థకత ఏర్పడుతుందని, ఏర్పడాలని ప్రతి ఒక్కరు ఆశించాలి.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. అంతరంగ చిత్రాలు కథలు 2. చివరి వలస కథలు

❖ ❖ ❖ ❖ ❖

మాస పత్రిక పాఠకులకు ప్రత్యేక విజ్ఞప్తి

మూసీ మాస పత్రిక వ్యవహారంలో కొత్త నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఈ విషయంలో పాఠకుల అభిప్రాయాలు కూడా స్వీకరించాలనే భావంతో ఈ విజ్ఞప్తిని చేస్తున్నాం. దాదాపు మూడు దశాబ్దాలుగా వేరు వేరు దశల్లో మార్పులు పొందుతున్న మూసీ సాహిత్య మాస పత్రికను ఆదరిస్తున్న పాఠకులకు ధన్యవాదాలు.

చాలా సంవత్సరాలుగా మేము చందాల కోసం అభ్యర్థించడం వదిలిపెట్టాం. అదేవిధంగా ప్రభుత్వం నుండి ఎప్పుడో ఒకసారి తప్ప ప్రత్యేకంగా ఏమీ ప్రకటనలు రావడం లేదు. ఇన్నీ చేసినా ప్రతినెలా ప్రింటింగ్ కు సరిపడా ధనం రావడం లేదని అందరికీ తెలుసు. ఆ ఇబ్బందులను ఎప్పుడో మేము అధిగమించి, పత్రికా ప్రచురణ ఒక యజ్ఞంగానే కొనసాగిస్తున్నామని కూడా మీకు తెలుసు.

రాను రాను భారత ప్రభుత్వం తక్కువ రేట్‌లో పోస్ట్ చేసే విధానానికి సంబంధించిన సమస్యలు బాగా పెరిగినాయి. ప్రతి మాసం ఏదో మార్పులు చేర్పులు చెపుతూ ఉంటూనే ఉన్నారు. రాబోయే జనవరి నుండి పూర్తిగా ఈ అవకాశం కూడా తీసివేయబోతున్నారు. కాపీ బరువును బట్టి పోస్ట్ చేసుకోవచ్చునని చెప్పున్నారు. దీనివల్ల పోస్టింగ్ రేట్లు బాగా పెరుగుతున్నాయి. అంతేగాక మనం పోస్ట్ చేసిన వారందరికీ ... అందడం లేదు, ఎందుకో తెలియదు. ఎవరినీ అడిగినా సమాధానం ఉండదు. పాఠకుల నుండి మాకు తీవ్రమైన ఒత్తిడులు వస్తూనే ఉన్నాయి.

పాఠకులకు బుక్ రీడింగ్ కల్చర్ నుండి లుక్ కల్చర్ అలవాటు అయిన సందర్భాల్లో ... మూసీ మాస పత్రిక కూడా ఆఫ్ లైన్ నుండి ఆన్‌లైన్ పత్రికగా కొనసాగించమని చాలామంది మిత్రుల సలహాలు ఇస్తున్నారు. జనవరి మాసం తర్వాత నుండి క్రమంగా మనం ఆన్‌లైన్ పత్రికగా మారిపోవాలని ఆలోచన కలుగుతుంది. ఈ విషయంలో మీ సలహా, సూచనలు అభ్యర్థిస్తున్నాం. అవి ఏ రూపంలోనైనా పంపవచ్చు.

ఫోన్స్ : 9347971177, 9494715445

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 (25) హైదరాబాద్ అక్టోబర్ : 2025

సిద్ధాంత గ్రంథ రచనలో 'అధ్యాయాలు' : తాత్విక పునాదులు, నిర్మాణ వ్యూహాలు

ఆచార్య వెంకటరామయ్య గంపా, భారతీయ భాషలు మరియు అధ్యయన శాఖ, ఢిల్లీవిశ్వవిద్యాలయం.
ఫోన్ : 9958607789

తెలుగు సాహిత్యంలో పరిశోధనల సంఖ్య ఎంత విస్తృతంగా పెరుగుతుందో, ప్రామాణికత అంతే స్థాయిలో తగ్గుతుంది. ఇందుకు కారణాలు చాలా ఉన్నాయి. అన్ని విశ్వవిద్యాలయాల వారికి అంగీకారయోగ్యమైన, కాలానుగుణమైన మార్పులతో కూడిన ఆమోద యోగ్యమైన 'తెలుగు పరిశోధన పద్ధతులు' పై పుస్తకాలు కొన్ని ఉన్నప్పటికీ, వాటిని విశ్వవిద్యాలయాల వారు పూర్తిస్థాయిలో అనుసరించడం లేదు. దానితో తెలుగు పరిశోధనల మధ్య అనేక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ఇతర భాషలలో మాత్రం ఎప్పటికప్పుడు పరిశోధన పద్ధతులలో మార్పులు జరుగుతున్నాయి. కొన్ని సంస్థల వారు చేస్తున్న చేర్పులను చాలావరకు ఇతర భాషలవారు అంగీకరిస్తున్నారు కాని తెలుగులో అది జరగడం లేదు. ఇదివరకు తెలుగులో వచ్చిన పుస్తకాలలో ఉన్న సమాచారంతో పాటు ఆంగ్లంలో వస్తున్న మార్పులను గమనిస్తూ మనం ఇప్పుడు కొత్తగా పరిశోధన పద్ధతులను నిర్మించుకోవాల్సిన అవసరం ఉన్నది. దానికోసం మూసీ మాసపత్రిక తనవంతు బాధ్యతగా ఒక ప్రయత్నాన్ని మొదలుపెట్టింది. ప్రతి వ్యాసాన్ని పాఠకులు చదివిన వెంటనే ఇంకేమైనా మార్పులు, చేర్పులు అవసరం అనుకుంటే మాకు తెలియజేయ మనవి. **చర్చను కూడా స్వాగతిస్తున్నాం.** – సంపాదకులు.

పరిచయం

పరిశోధన ప్రపంచంలోకి అడుగుపెట్టిన ప్రతి విద్యార్థికి 'సిద్ధాంత గ్రంథం' (Thesis) అనేది అత్యంత ఉత్తేజాన్ని, అదే సమయంలో తీవ్రమైన భయాన్ని కలిగించే ఒక పదం. సంవత్సరాల తరబడి చేసిన కృషిని, మేధోమథనాన్ని కొన్ని వందల పేజీలలో బంధించడం ఒక మహాయజ్ఞం లాంటిది. ఈ యజ్ఞంలో అత్యంత కీలకమైన ఘట్టం – 'అధ్యాయాల'ను రచించడం. చాలామంది విద్యార్థులు తమ పరిశోధనలో మంచి పరిజ్ఞానాన్ని సంపాదించినప్పటికీ, దానిని ఒక పద్ధతి ప్రకారం, తార్కికంగా, ఆకట్టుకునే రీతిలో అధ్యాయాలుగా విభజించి రాయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది పరి

శోధక విద్యార్థులు అధ్యాయాలను కేవలం సమాచారాన్ని నింపే డబ్బాలుగా భావిస్తారు. ఈ రకమైన (పరిశోధన) అవగాహన ప్రాథమికంగా సరైనది కాదు.

ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం సిద్ధాంత గ్రంథ రచనలో అధ్యాయాల ప్రాముఖ్యతను, వాటి తాత్విక పునాదులను, నిర్మాణ వ్యూహాలను విశ్లేషించడం. 'అధ్యాయం' అనేది కేవలం కొన్ని పేజీల సమాహారం కాదు, అది ఒక స్వతంత్ర వాదనని, సాహిత్య పరిభాషలో చెప్పాలంటే 'అధ్యాయం' అనేది మొత్తం సిద్ధాంత గ్రంథం అనే భవనానికి భారాన్ని మోసే ఒక మూలస్తంభం అని చెప్పవచ్చు. ఈ ప్రాథమిక సూత్రాన్ని అర్థం చేసుకోనంత కాలం, పరిశోధన గ్రంథం బలహీనంగా, అసంబద్ధంగా ప్రభావహీనంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. క్లుప్తంగా చెప్పాలంటే **'ఒక సిద్ధాంత గ్రంథం విజయం దాని అధ్యాయాల నిర్మాణ పటిష్టతపై, వాటి మధ్య ఉన్న తార్కిక అనుసంధానంపై ఆధారపడి ఉంటుంది. ప్రతి అధ్యాయాన్ని ఒక స్వతంత్ర వాదనగా, మొత్తం గ్రంథానికి భారాన్ని మోసే స్తంభంగా భావించినప్పుడు, ఒక సమగ్రమైన ప్రభావవంతమైన పరిశోధన సాధ్యమవుతుంది.'**

తెలుగులో పరిశోధన పద్ధతికి సంబంధించి పలు గ్రంథాలు ఉన్నప్పటికీ అధ్యాయాల రూపకల్పనకు సంబంధించిన వివరణ చాలా తక్కువగా ఉంది. పులికొండ సుబ్బాచారి 'పరిశోధన విధానం' గ్రంథంలో అధ్యాయాల నిర్మాణం గురించి పరిచయం చేశారు. అలాగే కాకునూరి సూర్యనారాయణ మూర్తి 'పరిశోధన' అనే గ్రంథంలో చాలా క్లుప్తంగా తెలిపారు. అయితే సిద్ధాంత గ్రంథ రచనపై ఆంగ్లంలో విస్తృతమైన సమాచారం ఉంది. **కేట్ టూరాబియన్ (ఏ స్టూడెంట్స్ గైడ్ టు రైటింగ్ కాలేజ్ పేపర్స్, 2010). సి. బూత్, గ్రెగరీ జి. కొలంబో, జోసెఫ్ ఎం. విలియమ్స్** వంటి రచయితలు సిద్ధాంత గ్రంథంలో అధ్యాయాల ప్రాముఖ్యత గురించి వివరించారు. **'ది క్రాఫ్ట్ ఆఫ్ రీసెర్చ్'** అనే గ్రంథంలో, వారు పరిశోధన అనేది కేవలం వాస్తవాలను సేకరించడం కాదని, ఆ వాస్తవాల ఆధారంగా ఒక నిర్దిష్ట వాదనను నిర్మించడం అని స్పష్టంగా పేర్కొన్నారు. (బూత్ ఇతరులు. ది క్రాఫ్ట్ ఆఫ్ రీసెర్చ్. 112. 2008). ఈ దృక్కోణం ప్రకారం, ఒక అధ్యాయం అనేది కేవలం ఒక అంశంపై సమాచారాన్ని అందించే విభాగం కాదు, అది మొత్తం సిద్ధాంత గ్రంథం ప్రధాన వాదనలో ఒక ఉప-వాదనను (sub-argument) నిరూపించే ఒక సాధనం. ఈ ఆలోచనా సరళి అధ్యాయ రచనపై ఉన్న అవగాహనను ప్రాథమికంగా మార్చివేసింది.

ఇదే కోవలో, **ఉంబర్టో ఎకో** తన **'హౌ టు రైట్ ఏ థీసిస్'** అనే గ్రంథంలో, సిద్ధాంత గ్రంథాన్ని ఒక డిటెక్టివ్ నవలని పరిష్కరించడంతో పోల్చారు. ప్రతి అధ్యాయం ఆ మిస్టరీని ఛేదించడానికి అవసరమైన ఒక క్లూని అందిస్తుందని, వాటి మధ్య తార్కిక సంబంధం అత్యంత కీలకమని ఆయన వాదించారు (ఎకో,ఉంబర్టో. హౌ టు రైట్ ఏ థీసిస్. పుట. 134). ఈ విధానం అధ్యాయాల మధ్య ఉండాల్సిన అనుసంధానం కథనాత్మక ప్రవాహం (narrative flow)

ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. **పాల్ సిల్వియా** వంటి పరిశోధకులు తమ రచన **'హౌ టు రైట్ ఎ లాట్'**లో, **'రచనా ప్రక్రియలోని ఆచరణాత్మక అంశాలపై, ముఖ్యంగా సమయ నిర్వహణ క్రమశిక్షణపై దృష్టి సారించారు, అయితే వారి విశ్లేషణ కూడా ఒక అధ్యాయాన్ని ఒక పూర్తి, స్వతంత్ర యూనిట్‌గా భావించి రాయాలనే ప్రాథమిక సూత్రం చెబుతుంది'** (సిల్వియా. హౌ టు రైట్ ఎ లాట్. 59. 2007).

ఆంగ్ల గ్రంథాలలో **'అధ్యాయాని'**కి సంబంధించిన చర్చలు స్పష్టంగా కనిపిస్తాయి. మొదటిది, అధ్యాయాన్ని ఒక వాదనగా చూడాలనే ఏకాభిప్రాయం. రెండవది, అధ్యాయాల మధ్య తార్కిక అనుసంధానం, ఆవశ్యకత. మూడవది, ప్రతి అధ్యాయానికి ఒక స్పష్టమైన అంతర్గత నిర్మాణం (పరిచయం, ప్రధాన భాగం, ముగింపు) ఉండాలనే సూచన.

అయితే, ఈ రచనలు సిద్ధాంతపరంగా ఎంతో విలువైనవి అయినప్పటికీ తెలుగు పరిశోధకులు వీటిని అనుసరించేది చాలా తక్కువ. తెలుగు పరిశోధకులకు, ఆంగ్ల పుస్తకాలకు మధ్య కొంత అంతరం (gap) కనిపిస్తుంది. తెలుగులో పరిశోధన గ్రంథాలను పరిశీలిస్తే ఎక్కువ శాతం గ్రంథాలు అధ్యాయాల విడివిడి భాగాలను విశ్లేషిస్తాయి, కానీ వాటిని ఒక సమగ్రమైన, ఏకీకృతమైన తాత్విక చట్రంలో (philosophical framework) పొందుపరచడంలో విఫలమయ్యాయి. ఈ కారణంగా తెలుగు పరిశోధక విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే, గుర్తుంచుకోగలిగే విధంగా ఒక నమూనా అవసరం ఉంది. ప్రస్తుత వ్యాసం ఈ అంతరాన్ని పూరించడానికి ప్రయత్నిస్తుంది. ఇది కేవలం **'ఎలా రాయాలి?'** అనే సాంకేతిక ప్రశ్నలకు సమాధానం ఇవ్వడమే కాకుండా, **'ఒక అధ్యాయం అంటే ఏమిటి? దాని ప్రయోజనం ఏమిటి?'** అనే తాత్విక ప్రశ్నలను కూడా సంధిస్తుంది. అధ్యాయ రచన వెనుక ఉన్న వ్యూహాన్ని, తత్వాన్ని ఏకీకృతం చేసి, పరిశోధకులకు ఒక స్పష్టమైన, ఆచరణాత్మక మార్గదర్శిని అందించడమే ఈ వ్యాస ప్రాథమిక లక్ష్యం.

1. అధ్యాయం-తత్వం: ఏమిటి? & ఎందుకు?

ఒక సిద్ధాంత గ్రంథాన్ని నిర్మించడంలో, పరిశోధకులు తరచుగా 'అధ్యాయం' అనే పదాన్ని ఉపయోగిస్తారు, కానీ దాని అసలు తత్వాన్ని అరుదుగా గ్రహిస్తారు. ఒక 'అధ్యాయం' అంటే కేవలం ఒక నిర్దిష్ట అంశంపై సేకరించిన సమాచారాన్ని నింపే ఖాళీ పాత్ర కాదు. అది అంతకంటే చాలా విలువైనది. ఒక **'అధ్యాయం' అనేది 'ఒక స్వయం-సంపూర్ణమైన, సమర్థించుకోగల వాదన'** (a self-contained, defensible argument). ఇది మొత్తం సిద్ధాంత గ్రంథంలో అత్యంత ఆవశ్యకమైన భాగాన్ని అందిస్తుంది. ప్రతి అధ్యాయం ప్రధాన పరిశోధన ప్రశ్నకు సంబంధించిన ఒక నిర్దిష్ట ఉప-ప్రశ్నకు సమాధానం ఇవ్వాలి. దానిని ఒక పెద్ద సంకలనంలో భాగంగా ప్రచురించగల ఒక పీర్-రివ్యూడ్ జర్నల్ ఆర్టికల్‌గా భావించడం సరైన దృక్పథం.

పరిశోధన గ్రంథం నిర్మాణాత్మక సమగ్రతను, దానిలోని వివిధ భాగాల మధ్య ఉన్న అంతఃసంబంధాన్ని అర్థం చేసుకోవడానికి ఉదాహరణతో వివరించవచ్చు. పరిశోధకుని ప్రధాన సిద్ధాంత ప్రతిపాదన (Thesis Statement), అంటే పరిశోధన మూల వాదన, ఒక అందమైన 'ముత్యాల హారాన్ని' ఏకసూత్రతతో బంధించి ఉంచే పైకి కనిపించని అత్యంత కీలకమైన దారం వంటిది. ఈ దారమే గ్రంథ తార్కిక అస్థిపంజరంగా పనిచేస్తూ, అన్ని అధ్యాయాలకు ఒక నిర్దిష్టమైన దిశానిర్దేశం చేస్తుంది. ఇక గ్రంథంలోని ప్రతి అధ్యాయం, ఆ దారానికి ఒక నిర్దిష్టమైన క్రమంలో గుచ్చబడిన ఒక్కో విలువైన ముత్యం లాంటిది. ప్రతి ముత్యం తనదైన ప్రత్యేక ఆకృతి, మెరుపు, సౌందర్యాన్ని కలిగి ఉన్నట్లే, ప్రతి అధ్యాయం తనదైన నిర్దిష్ట అంశం, పటిష్టమైన వాదనలు, బలమైన సాక్ష్యాధారాలు, స్వతంత్ర విశ్లేషణతో పరిపుష్టంగా ఉండాలి. అయితే, ఈ ముత్యాలు విడివిడిగా ఉన్నప్పుడు వాటికి లభించని సంపూర్ణత, ఒక దృఢమైన దారానికి పొందికగా గుచ్చినప్పుడు మాత్రమే లభిస్తుంది. అదేవిధంగా, ప్రతి అధ్యాయం స్వతంత్రంగా ఎంత పటిష్టంగా ఉన్నప్పటికీ, అవన్నీ ప్రధాన సిద్ధాంత ప్రతిపాదన అనే సూత్రంతో తార్కికంగా బంధించబడినప్పుడే పరిశోధన గ్రంథానికి ఒక సంపూర్ణమైన, సమగ్రమైన రూపం సిద్ధిస్తుంది. ఒకవేళ ఈ సంధాన సూత్రం (దారం) బలహీనంగా లేదా అస్పష్టంగా ఉంటే, ఎంతటి విలువైన అధ్యాయాలైనా (ముత్యాలైనా) సంబంధం లేని వ్యాసాల సముదాయంగా మిగిలిపోతాయి తప్ప, ఒక సమగ్ర గ్రంథంగా రూపుదిద్దుకోలేవు. అలాగే, హారంలోని ఒక్క ముత్యం నాణ్యత లేకపోయినా అది మొత్తం హారం సౌందర్యాన్ని ఎలా దెబ్బతీస్తుందో, ఒక బలహీనమైన అధ్యాయం కూడా మొత్తం పరిశోధన విశ్వసనీయతను, పటిష్టతను ప్రశ్నార్థకం చేస్తుంది. ఉత్తమ పరిశోధన గ్రంథం అంటే, అత్యున్నత నాణ్యత కలిగిన అధ్యాయాలు అనే ముత్యాలు, ఒక స్పష్టమైన, పటిష్టమైన సిద్ధాంత ప్రతిపాదన అనే దారం చేత క్రమబద్ధంగా అనుసంధానించబడిన ఒక సమగ్ర కళారూపం.

2. అధ్యాయం- ప్రధాన అంశాలు

పరిశోధన గ్రంథంలోని ప్రతి 'అధ్యాయం' ఒకే సమయంలో రెండు కీలకమైన బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. ఒకవైపు అది స్వతంత్రంగా, సంపూర్ణంగా ఉండాలి, మరోవైపు బృహత్తరమైన గ్రంథం మొత్తం వాదనలో అంతర్భాగంగా ఒదిగిపోవాలి. ఈ రెండు పాత్రల మధ్య సమతుల్యతను సాధించడమే ఉత్తమ పరిశోధనకు పునాది.

'అధ్యాయం' ఒక చిన్న పరిశోధనా పత్రంలాగా స్వతంత్ర ప్రతిపత్తి కలిగివుండటం :

ఒక అధ్యాయం ఒక చిన్న, స్వయం-సంపూర్ణ పరిశోధనా పత్రం (Mini-Research Paper) లా ఉండాలి. దీని అర్థం, ఆ అధ్యాయానికి దాని స్వంత స్పష్టమైన నిర్మాణం ఉండాలి.

స్పష్టమైన ప్రారంభం (పరిచయం) : ప్రతి అధ్యాయం ఒక చిన్న పరిచయంతో ప్రారంభం కావాలి. ఈ పరిచయం, **'ఈ నిర్దిష్ట అధ్యాయంలో నేను ఏమి చర్చించబోతున్నాను? దీని ముఖ్య ఉద్దేశం ఏమిటి? నేను ఏ ప్రశ్నలకు సమాధానం ఇవ్వబోతున్నాను?'** అనే విషయాలను పాఠకులకు పరిశోధకుడు స్పష్టంగా తెలియజేయాలి.

సమగ్ర విశ్లేషణ : అధ్యాయం మధ్య భాగంలో, పరిశోధకుడు లేవనెత్తిన అంశానికి సంబంధించిన వాదనలు, సాక్ష్యాధారాలు, విశ్లేషణ ఒక తార్కిక క్రమంలో ఉండాలి. ప్రతి వాదనకు తగిన ఆధారాన్ని చూపుతూ, పరిశోధకుడు విశ్లేషణను క్రమంగా అభివృద్ధి చేయాలి.

నిర్దిష్టమైన ముగింపు (ఫలితం) : అధ్యాయం చివరలో ఒక ముగింపు ఉండాలి. ఇది ఆ అధ్యాయంలో పరిశోధకుడు చర్చించిన అంశాలను సంగ్రహించి, **'ఈ చర్చ ద్వారా నేను ఏమి నిరూపించాను? ఈ అధ్యాయం నుండి మనం నేర్చుకున్నది ఏమిటి?'** అనే దానికి పరిశోధకుడు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి.

క్లుప్తంగా చెప్పాలంటే, పాఠకులు కేవలం ఆ ఒక్క అధ్యాయాన్ని మాత్రమే చదివినా, వారికి దానిలోని ముఖ్య ఉద్దేశం, వాదన, అది సాధించిన ఫలితం పూర్తిగా అర్థం కావాలి. దాని కోసం పాఠకులు ముందున్న లేదా వెనకవున్న అధ్యాయాలను చదవాల్సిన అవసరం రాకూడదు. ఇదే అధ్యాయం యొక్క స్వతంత్ర పాత్ర.

బృహత్తర నిర్మాణంలో భాగంగా (గొలుసులోని ఒక లింకులాగా) ఉండటం : అధ్యాయం ఒక గొలుసులోని బలమైన లంకె (link) లాంటిది. ఒక లింకు దానంతట అది బలంగా ఉండాలి, కానీ దాని అసలైన ప్రయోజనం ముందున్న లంకెతో కలవడం, తర్వాతి లంకెకు ఆధారాన్నివ్వడంలోనే ఉంటుంది.

గత అధ్యాయంతో అనుసంధానం కలిగివుండటం : పరిశోధనలో 'అధ్యాయాలు' కచ్చితంగా అంతకు ముందున్న అధ్యాయంలో చర్చించిన విషయంపై ఆధారపడి లేదా దాని కొనసాగింపుగా ఉండాలి. ఉదాహరణకు, **'గత అధ్యాయంలో చర్చించినట్లుగా..'** లేదా **'ఈ సిద్ధాంతాన్ని పునాదిగా చేసుకుని...'** వంటి వాక్యాలతో సంబంధాన్ని ఏర్పరచాలి.

ప్రధాన వాదనకు బలం చేకూర్చడం : ఇది అత్యంత కీలకమైన అంశం. ఈ అధ్యాయం మొత్తం పరిశోధన గ్రంథం ప్రధాన వాదనకు (Thesis Statement) ఎలా దోహదపడుతుందో స్పష్టంగా చూపాలి. **'ఈ అధ్యాయంలోని వాదన, మొత్తం సిద్ధాంతంలో ఈ భాగాన్ని నిరూపిస్తుంది'** అని పాఠకులకు అర్థమయ్యేలా చేయాలి.

తర్వాతి అధ్యాయానికి వారధి : ఒక మంచి అధ్యాయం, దాని ముగింపులో తర్వాతి అధ్యాయానికి ఒక మార్గాన్ని నిర్దేశిస్తుంది. అంటే, **'ఈ అధ్యాయంలో ఈ విషయాన్ని నిరూపించడం జరిగింది, కానీ ఇది మరో కొత్త ప్రశ్నకు దారితీస్తుంది, దానిని తర్వాతి అధ్యాయంలో చర్చించడం జరిగింది'** అని చెప్పడం ద్వారా, గ్రంథ పఠనాన్ని ఒక ప్రవాహంలా కొనసాగేలా చేస్తుంది.

అధ్యాయాలు స్వతంత్రంగా చదివినా అర్థవంతంగా ఉండాలి, అదే సమయంలో అవన్నీ కలిసికట్టుగా పరిశోధకుడి ప్రధాన వాదన అనే పెద్ద చిత్రాన్ని ఆవిష్కరించాలి. పరిశోధన లక్ష్యం విడివిడిగా చూస్తే బలంగా నిలబడే స్తంభాలను నిర్మించడం, కానీ అవన్నీ కలిసి ఒక దృఢమైన, అందమైన భవనాన్ని నిలబెట్టేలా చూడటం.

ఏకసూత్రత : పరిశోధకుడి ప్రధాన సిద్ధాంత వాదనలో ఏకసూత్రత ఉండాలి. ఈ ఏకసూత్రత పరిశోధనా గ్రంథంలోని ప్రతి అధ్యాయంలో పుష్పగుచ్ఛంలోని దారంలా ఉండాలి. ఇది పరిచయాన్ని, సాహిత్య సమీక్షను, విశ్లేషణను, ముగింపును కలుపుతుంది. ప్రతి అధ్యాయం మొత్తం వాదనకు ఎలా దోహదపడుతుందో పాఠకుడికి నిరంతరం గుర్తు చేస్తుంది. ప్రతి అధ్యాయం రాసేటప్పుడు, **'ఈ అధ్యాయం ప్రధాన సిద్ధాంత వాదనను ముందుకు తీసుకెళ్లడానికి ఎలా సహాయ పడుతుంది?'** అని పరిశోధకుడు తనను తాను ప్రశ్నించుకోవాలి. ఈ ఏకసూత్రత లేనప్పుడు, అధ్యాయాలు విడివిడి ద్వీపాల్లా మిగిలిపోతాయి, వాటి మధ్య సంబంధం కొరవడి గ్రంథం బలహీనపడుతుంది.

అధ్యాయాల సమతుల్యత

సిద్ధాంత గ్రంథంలో అన్ని అధ్యాయాలు కచ్చితంగా ఒకే సంఖ్యలో పుటలు ఉండాలనే నియమం లేదు. ఉపోద్ఘాతం, ముగింపు వంటి అధ్యాయాలు విశ్లేషణకు సంబంధించిన ప్రధాన అధ్యాయాల కంటే కొంచెం చిన్నవిగా ఉండవచ్చు. అయితే, వాటి మధ్య మరీ అంతరం ఉండకూడదు.

ఒకవేళ పరిశోధన గ్రంథంలోని ప్రధాన విశ్లేషణాత్మక అధ్యాయాలు సగటున 40–50 పుటల నిడివిని కలిగి ఉంటే, ఇతర అధ్యాయాలు సుమారుగా 30 నుండి 60 పుటల మధ్య ఉండటం సమతుల్యంగా కనిపిస్తుంది. 20 పుటల అధ్యాయం, 100 పుటల అధ్యాయం ఈ పరిధిలోకి రావు.

పరిష్కార మార్గాలు :

పరిశోధకుడు తన పరిశోధన గ్రంథం రాసేటప్పుడు లేదా పునఃసమీక్షించేటప్పుడు ఈ వ్యత్యాసాలను సరిదిద్దవచ్చు. చాలా పెద్ద అధ్యాయం ఉంటే, ఆ అధ్యాయంలో రెండు లేదా మూడు వేర్వేరు ప్రధాన ఆలోచనలు లేదా ఉప-అంశాలు ఉన్నాయేమో పరిశీలించాలి. అలా ఉంటే, ఆ అధ్యాయాన్ని తార్కికంగా రెండు వేర్వేరు అధ్యాయాలుగా విభజించడం ఉత్తమం. ఉదాహరణకు, **'ఒక కవి సామాజిక, రాజకీయ దృక్పథాలు'** అనే 100 పుటల అధ్యాయాన్ని, **'సామాజిక దృక్పథం', 'రాజకీయ దృక్పథం'** అనే రెండు వేర్వేరు అధ్యాయాలుగా విభజించవచ్చు. లేదంటే, అనవసరమైన ఉదాహరణలను, పునరావృత వాక్యాలను, చాలా పొడవైన ఉల్లేఖనాలను తగ్గించాలి. అదనపు సమాచారాన్ని, పట్టికలను అనుబంధంలో చేర్చవచ్చు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 హైదరాబాద్ అక్టోబర్ : 2025

చాలా చిన్న అధ్యాయం ఉంటే, ఆ అధ్యాయంలోని అంశంపై మరింత లోతైన విశ్లేషణ అవసరమేమో ఆలోచించాలి. మరిన్ని ఉదాహరణలు, ఆధారాలు లేదా వాదనలను జోడించడం ద్వారా అధ్యాయాన్ని విస్తరించవచ్చు. అధ్యాయంలోని అంశం చాలా పరిమితమైనది అయితే, దానిని తార్కికంగా సరిపోయే మరొక అధ్యాయంలో ఒక ఉప-విభాగంగా (sub-section) కలపడం మంచిది. ఉదాహరణకు, ఇద్దరు కవుల గురించి రాసేటప్పుడు, ఒక్కొక్కరిపై 20 పుటల అధ్యాయాలు రాయడానికి బదులు, ఇద్దరినీ పోలుస్తూ **'తులనాత్మక విశ్లేషణ'** అనే ఒకే అధ్యాయంగా రూపొందించవచ్చు.

పుటల సంఖ్య కంటే **'విషయ సమతుల్యత'** (Thematic Balance) ముఖ్యం. ప్రతి అధ్యాయం ఒక ప్రధానమైన, స్పష్టమైన అంశాన్ని పూర్తిగా వివరించి, దాని తర్వాతి అధ్యాయానికి మార్గాన్ని సుగమం చేయాలి. అధ్యాయాల నిడివిలో సమతుల్యత పాటించడం అనేది పరిశోధన గ్రంథ నాణ్యతను, స్పష్టతను, చదవడానికి అనుకూలతను పెంచుతుంది. ఇది పరిశోధకుడి ప్రణాళికాబద్ధమైన, వ్యవస్థీకృత విధానాన్ని ప్రతిబింబిస్తుంది.

3. 'అధ్యాయం'- లోతైన విశ్లేషణ

సిద్ధాంత గ్రంథంలో ప్రతి అధ్యాయానికి ఒక నిర్దిష్ట ప్రయోజనం ఉంటుంది. వాటి నిర్మాణాన్ని, లక్ష్యాలను అర్థం చేసుకోవడం అత్యంత ముఖ్యం.

పరిచయం (అధ్యాయం) : ఇది పరిశోధకుడి సిద్ధాంత గ్రంథానికి సూక్ష్మరూపం. ఇది పరిశోధన గ్రంథంలో అత్యంత ముఖ్యమైన అధ్యాయం పరిశోధకుడి మొదటి అభిప్రాయం దీనిపైనే ఆధారపడి ఉంటుంది. ఇది మొత్తం పరిశోధన గ్రంథానికి వేదికను నిర్మించి, నేపథ్యాన్ని స్థాపిస్తుంది. ఇది పరిశోధకుడి అధ్యయనం 'ఏమిటి', 'ఎందుకు', 'ఎలా' అనే ప్రశ్నలకు స్పష్టంగా సమాధానం ఇవ్వాలి. ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే పరిచయం అధ్యాయమే అయినప్పటికీ మొదటి అధ్యాయం కాదు. పరిచయం, ముగింపు అనేవి అధ్యాయాలే అయినప్పటికీ అవి అధ్యాయాల సంఖ్యలో పరిగణించబడవు.

ప్రధాన భాగాలు :

ఆకర్షణీయమైన ప్రారంభం : పాఠకుడి దృష్టిని ఆకర్షించే ఒక ఆసక్తికరమైన ప్రారంభం (ఉదా: ఒక ఆశ్చర్యకరమైన గణాంకం, ఒక శక్తివంతమైన ఉల్లేఖన, లేదా ఒక చిన్న కథ మొదలైనవి) ఉండాలి

సందర్భం : పరిశోధన రంగాన్ని స్థూలంగా పరిచయం చేసి, దాని ప్రాముఖ్యతను వివరించడం.

సమస్య : దృష్టిని ఒక నిర్దిష్ట సమస్య లేదా జ్ఞానంలో ఉన్న అంతరం వైపుకు మళ్లించడం.

సిద్ధాంత ప్రతిపాదన: పరిశోధన గ్రంథంలో అత్యంత ముఖ్యమైన అంశం. ఇది పరిశోధకుడి కేంద్ర వాదన. ఇది స్పష్టంగా, సంక్షిప్తంగా, చర్చనీయాంశంగా ఉండాలి.

పరిశోధన ప్రశ్నలు, లక్ష్యాలు : పరిశోధన ప్రధాన వాదనకు సమాధానం ఇవ్వగల ప్రశ్నలుగా విభజించడం.

అధ్యయనం- ప్రాముఖ్యత : ఈ పరిశోధన ఎందుకు ముఖ్యమో వివరించడం. రంగానికి పరిశోధకుడి పరిశోధన అసలు సహకారం ఏమిటో వివరించడం

పరిధి పరిమితులు : పరిశోధన సరిహద్దులను నిర్వచించడం.

కార్యాచరణ ప్రణాళిక : మిగిలిన అధ్యాయాల నిర్మాణాన్ని క్లుప్తంగా వివరించాలి.

సాహిత్య సమీక్ష : ఈ అధ్యాయం ఆయా అంశాలు / ప్రక్రియ / రంగంలో పరిశోధకుడి నైపుణ్యాన్ని తెలియజేస్తుంది. ఇది పరిశోధకుడు చదివిన ప్రతి అంశానికి సారాంశం కాదు. ఇది ఇప్పటికే ఉన్న వివిధ రచనలపై విమర్శనాత్మక సంశ్లేషణ (critical synthesis).

సారాంశం నుండి సంశ్లేషణ:

సారాంశం: 'A' అనే రచయిత/విమర్శకుడు/పరిశోధకుడు ఇలా అన్నారు లేదా 'B' అనే రచయిత/విమర్శకుడు/పరిశోధకుడు అలా అన్నారని ఒక జాబితా తయారుచేయడం.

సంశ్లేషణ (Synthesis) : **'రచయిత/విమర్శకుడు/పరిశోధకుడు ~, దీ ఒక విషయంలో ఏకీభవించినప్పటికీ, వారు మరొక ముఖ్యమైన అంశాన్ని విస్మరించారు...'** సంశ్లేషణలో రచయితలను సమూహాలుగా చేయడం, వారి ఆలోచనలను పోల్చడం, వైరుధ్యాలను గుర్తించడం ఉంటాయి.

పరిశోధన అంతరాన్ని (Research Gap) **గుర్తించడం : 'ఇంత వరకు ఏమి చెప్పలేదు?'** లేదా **'ఏది లోపించింది?'** అనేదే పరిశోధన అంతరం. ఇది సిద్ధాంతపరమైన (theoretical), పద్ధతిపరమైన (methodological), లేదా అనుభవపూర్వకమైన (empirical) అంతరం కావచ్చు. పరిశోధకుడి పరిశోధన ఈ అంతరాన్ని పూరించే వారధిగా ఉండాలి.

నిర్మాణం : సాధారణంగా ఇతివృత్తాల ఆధారంగా దీనిని నిర్మిస్తారు. స్పష్టమైన ఉప-శీర్షికలను ఉపయోగించి, అధ్యాయం చివరలో పరిశోధన అంతరాన్ని స్పష్టంగా పేర్కొని, పరిశోధన అధ్యయనాన్ని దానికి పరిష్కారంగా పరిచయం చేయాలి.

పరిశోధన పద్ధతిని వివరించడం : ఇది పరిశోధకుడి సిద్ధాంత గ్రంథానికి సాంకేతిక వెన్నెముక. పరిశోధకుడు పరిశోధనను ఎలా నిర్వహించారో వివరంగా వివరిస్తుంది. పారదర్శకత, పునరుత్పాదకత దీని లక్ష్యం.

పరిశోధన పద్ధతిలోని ప్రధాన అంశాలు (సశేషం)

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 హైదరాబాద్ అక్టోబర్ : 2025

క్రియాత్మక చైతన్య కోశం

✍ **బూర్ల వేంకటేశ్వర్లు,** తెలుగు సహాయాచార్యులు, ఫోన్ : 9491 598



భాష లేకుండా మనిషి మనుగడ మూగబోతుంది. క్రియలేని జీవితం జడమై ఆగిపోతుంది. జ్ఞాన ప్రసారం నిలిచిపోతుంది. అన్ని కాలాల్లోనూ, అన్ని పురుషల్లోనూ క్రియ ఒక చైతన్య రూపం. అకర్మకమైనా, సకర్మకమైనా క్రియనే మనిషి పురోగతికి ఊతం. క్రియా చైతన్యమే సమాజ సాహిత్య సర్వతోముఖ అభివృద్ధికి సోపానం.

తెలుగు క్రియాంత భాష అంటారు ప్రముఖ భాషా పరిశోధకులు చేకూరి రామారావు. తెలుగు భాష వేల ఏండ్లుగా వాడుకలో ఉన్నది. తెలుగులోని పదజాలాన్ని స్థూలంగా నామములు (విశేష్యములు, విశేషణాలు), క్రియలు (ఆఖ్యాతములు, ధాతువులు), అవ్యయాలు అని, మూడు విధాలుగా విభజించారు ప్రౌఢ వ్యాకరణ కర్త బహుజనపల్లి సీతారామాచార్యులు. భాషా పదజాలపు వాడుక పెరిగే కొద్దీ నుడికారంలో మార్పులు చేర్పులు పెరుగుతూ ఉంటాయి. పదజాలం పరుచుకున్న చోట్లు పెరిగేకొద్దీ, దాని మీద పడే ప్రభావాలు కూడా పెరుగుతాయి. సజీవ నదిలా కాలావధులను దాటి భాష ప్రవహించే కొద్దీ దాని శబ్ద వేగమూ, రూపాంతరతా, ఎన్నెన్నో మలుపులు తిరుగుతుంది. ఏ కాలపు భాషకైనా ఆనాటి అవసరాలను తీర్చవలసిన బాధ్యత ఉంటుంది. తన్మూలంగా అది కొత్త పుంతలు తొక్కుతుంది. గతంలో తెలుగు భాషకు వ్యాకరణాలు, నిఘంటువులు, పర్యాయ, నానార్థ, వృత్తి పదకోశాలు ఎన్నో వెలువడ్డాయి. తెలుగు భాషా గరిమను చాటడానికి దేశీయులు, పాశ్చాత్యులు ఎందరో కృషి చేశారు. ఈ దిశగా మరో ముందడుగు **డా.నలిమెల భాస్కర్ తెలుగు క్రియా పదకోశం.**

భారతీయ భాషల్లో నుంచి తెలుగులోకి అనువాదాలు చేయడం, తెలుగు నుంచి ఇతర భారతీయ భాషల్లోకి అనువాదాలు చేయడం, అనువాద ప్రక్రియలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును సాధించడం నలిమెల భాస్కర్ పట్టుదలకు ప్రతిభా సంపత్తులకు నిదర్శనం. తెలంగాణ ఉద్యమ సందర్భంలో **'తెలంగాణ పదకోశం'** అందించారు. తెలంగాణ భాషా వైశిష్ట్యాన్ని, లక్షణాలను తెలుపుతూ 'బాణం' వ్యాసాల పుస్తకం వేశారు. అనంతరం **"తెలంగాణ భాష దేశ్య పదాలు, తెలంగాణ భాష సంస్కృత పదాలు, తెలంగాణ భాష తమిళ పదాలు, తెలంగాణ భాష క్రియా పదాలు"** పుస్తకాలుగా వేశారు. భాషకు సంబంధించి ఆయన రాసిన అన్ని పుస్తకాలు విలక్షణమైనవి. ఇంతకు పూర్వం ఎవరూ రాయనివి. సిద్ధాంతాల జోలికి వెళ్లకుండా, పరిభాషతో గందరగోళం చేయకుండా ప్రజా వ్యవహారాన్ని, పలుకుల పొందికను, క్షేత్ర స్థాయి పదజాలంతో పరిచయం చేశారు నలిమెల భాస్కర్.

ప్రస్తుత తెలుగు క్రియాపదకోశానికి నేపథ్యంగా కొన్ని విషయాలు మాట్లాడుకుందాం.

"తెలుగులో క్రియ చాలా ప్రధానమైన పాత్ర నిర్వహిస్తుంది. వాక్యాలను అనుసంధించే శబ్దాలు చాలావరకు క్రియల నుంచే నిష్పన్నమయినై. అనుకృతిలో వచ్చే 'అని','అను' ధాతు నిష్పన్నం. అయితే, అయినా, కాని, కాకపోతే, కాదు, కదా వంటి మాటలు 'అగు' ధాతు నిష్పన్నాలు. ఆత్మార్థం, పారస్పర్యార్థం (కొను), పరార్థం (పెట్టు), పూరణార్థం (పోవు,వేయు) వంటి చాలా అర్థాలు 'ధాతు' విస్తరణ ద్వారా సాధించబడతై. క్త్వా, శతృ, అపి, చేదాది వివిధోపవాక్యాలు క్రియల్లో మార్పుల వల్లనే ఏర్పడతై" అన్నారు చేకూరి రామారావు.

తెలుగు క్రియలలో సింహభాగము ఉకారాంతాలుగా ఉంటాయి, ఉదా: వచ్చు, పోవు, తిను, కొను మొ.వి. అట్లాగే, క్రియాపదాల మూలరూపంగా తెలుగులో మధ్యమ పురుష ఏకవచన రూపాన్ని చూపించడం కద్దు. ఉదా : రాయు, వేయు, వీచు, చదువు మొ.వి. ఏ ప్రత్యయాలు చేరని ఈ పదాలను తెలుగు ధాతువులు (మూల రూపాలు) అంటారు. ప్రత్యయాలు చేరిన పదాలను క్రియలు అంటారు. తెలుగు ధాతువులు నామాలుగాను క్రియలుగా కూడాను ఉండడం గమనించవచ్చు, ఉదా: పలుకు, తొక్కు, చెప్పు, తోలు మొ.వి. తెలుగు ధాతు మూలాలు ఒకటి, రెండు, మూడు అక్షరాలకు పరిమితం. నూటికి తొంబై పాళ్ళు రెండక్షరాల ధాతువులే అయి ఉంటాయి. అట్లాగే, క్రియా పదాలను



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 (30) హైదరాబాద్ అక్టోబర్ : 2025

సంస్కృతంలో ధాతువులని పిలుస్తారు. సంస్కృతంలో ధాతు మూలంలేని శబ్దాలు లేవు. సుమారు రెండు వేల ధాతువు లున్నాయి. తెలుగులో సుమారు 4700 ధాతువులున్నాయని వాటిలో 700 సంస్కృత సమ క్రియలు, 1000 వైకృత, మిశ్ర క్రియలు, 3000 దేశ్యక్రియలని కొమఱ్ఱాజు లక్ష్మణరావు గణించారు.

తెలుగులో గతంలో **'ఆంధ్ర ధాతుమాల'**ను ఆంధ్ర సాహిత్య పరిషత్తు కాకినాడ వారు 1930వ సంవత్సరంలో 100 పేజీలతో ముద్రించారు. ఇది చిన్నయసూరి రచనగా పేర్కొన్నారు. తర్వాత కాలంలో ఇది వేదం పట్టాభి రామశాస్త్రి రచనగా గుర్తించారు. దీనిలో తెలుగు ధాతువు – సంస్కృతార్థము – తెనుగర్థమును తెలుపుతూ అకర్మక, సకర్మక వివరణతో కేవలం అచ్చ తెలుగు ధాతువులను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు.

ఆ తర్వాత, విశ్వనాథ సత్యనారాయణ సంపాదకులుగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ **"ఆంధ్ర క్రియా స్వరూప మణి దీపిక (1962)"**ను ప్రకటించింది. దీనిలో ధాతురూపాలు, ఆచ్ఛిక, తత్సమ, తద్భవ నామాల మీద ధాతువు చేరి ఏర్పడిన క్రియా రూపాలు, ధాతువు మీద ధాతువు చేరి ఏర్పడిన శబ్ద పల్లవ రూపాలు, అన్యదేశ్యాల మీద ధాతువులు చేరి ఏర్పడిన క్రియా రూపాలు, ఆరోపాలతో పాటు సకర్మక, అకర్మక వివక్షతో విపులంగా 908 పేజీల నిఘంటువు వెలువరించారు.

ఈ మధ్య కాలంలో నలిమెల భాస్కర్ రచన **'తెలంగాణ భాష క్రియా పదాలు'** (2021) వచ్చింది. దీనిలో శబ్ద రత్నాకరం ఆధారంగా తెలంగాణ ప్రాంతంలో వాడుకలో ఉన్న సుమారు 400 క్రియలను విశ్లేషిస్తూ ప్రజా వ్యవహారంలో ఉన్న ఉదాహరణలతో వ్యాసాల రూపంలో రాశారు. 114 పేజీల ఈ పుస్తకంలో తెలంగాణ క్రియల వైవిధ్యాన్ని, ప్రాచీనతను, ఇతర భాషలతో ఉన్న సామ్యాన్ని సరళ సుందరంగా వివరించారు. భాషను బ్రహ్మ పదార్థంగా కాక అరటిపండులా ఒలిచి చెప్పే నలిమెల శైలి, రమణీయత దీనిలో కనిపిస్తుంది. సంభాషణలతో, కాకువుతో, హాస్య స్ఫురణ కలిగిస్తూ తెలంగాణ భాష నైశిత్యాన్ని, వైశిష్ట్యాన్ని క్రియా బాహుళ్యతను పరిచయం చేశారు.

బహుశా, ఈ సందర్భంలో అరవై ఏళ్లుగా తెలుగు క్రియల మీద జరగని నిఘంటు కృషి నలిమెల దృష్టికి వచ్చి ఉంటుంది. ఏడు పదుల వయసు దాటినా పదహారేళ్ళ వయసు పిల్లాడిలా అంకితమై ఈనాటి అవసరాన్ని గుర్తించి ఈ క్రియా పదకోశపు పనిని మొదలుపెట్టారు. భాషను కాపాడడమంటే కేవలం మాటలే కాదు ఆచరణ కూడా ముఖ్యమని చుట్టూ చీకటి ముసిరి ఉన్నప్పుడు ఒక చిరుదీపాన్నైనా వెలిగించాలనేది, వారి జీవితాన్ని దగ్గరగా చూస్తున్న వారందరికీ తెలిసిందే.

ఈ తెలుగు క్రియా పదకోశం ఇప్పటి వరకు వచ్చిన వాటన్నిటికన్నా సమగ్రమైంది. దీనిలో 'అ'కారం నుంచి 'ఐ' కారం వరకు ఉన్న ఆచ్ఛిక, తత్సమ, తద్భవ, అన్యదేశ్య ధాతువులతో ఏర్పడిన క్రియా స్వరూపాలున్నాయి. ఈ రూపాలను తీసుకోవడంలో భాస్కర్ సార్ తీసుకున్న శ్రమ అనన్య సామాన్యం. ఇప్పటివరకు వెలువడ్డ ఆంధ్ర దీపిక, సి.పి బ్రౌన్, శబ్దరత్నాకర, సూర్యరాయాంధ్ర, ఆంధ్ర పదనిదానము, శ్రీహరి, పామర సంస్కృత, తెలంగాణ పదకోశాదులు మొ.వి లెక్కకు మించిన నిఘంటువుల క్రియా పద సారము ఈ కోశము. ఆంధ్ర క్రియా స్వరూప మణి దీపికను ఊతగా తీసుకొని మిగతా నిఘంటువులన్నిటిలో ఉన్న క్రియా స్వరూపాలను ఒక్క చోట చేర్చిన అమూల్య నిధి ఈ పుస్తకము.

తెలుగు ప్రజల వ్యవహారంలో ఉన్న నిఘంటువులకెక్కని అనేక క్రియా స్వరూపాలను చేర్చడం వలన దీనికి ఒక సమగ్రత వచ్చింది. ఆరోపాలను పక్కన పెట్టి, వివిధ అర్థ ఛాయలను గ్రహించి ఒక్కో పదానికి ఆంధ్ర క్రియా స్వరూప మణి దీపికలో ఉన్న అర్థాలకు అదనంగా వీలైనన్ని అర్థాలు చేర్చడం దీని ప్రత్యేకత. అంతేకాక, ఆంధ్ర క్రియా స్వరూప మణి దీపికలో **'గీతగోవిందము పాడుచున్నాడు (ఏడ్పు లంకించుకున్నాడు), పరకాయించి చూచుట'** వంటి వాటిని క్రియా స్వరూపాలుగా గుర్తించి గ్రహించారు. అట్లాగే, నలిమెల భాస్కర్ కూడా వీలున్నన్ని క్రియా స్వరూపాలను నిఘంటువులకెక్కించే సదుద్దేశ్యంతో దీనిలో చేర్చారు. అన్యదేశ్యాలతో కూడుకొని వ్యవహారంలో ఉన్న అనేక క్రియా రూపాలను స్వీకరించారు. వీటితో పాటు క్రియా స్వరూపాలతో నిర్మాణమైన జాతీయాలు, క్రియా రూపాలతో అంతమయ్యే సామెతలు, పలుకుబడిగా మారిన వ్యవహార క్రియలను ఔచితీమంతంగా పేర్కొని అర్థాలను చూపించారు.

మచ్చుకు కొన్ని ఉదాహరణలు చూపుతాను :

అంగిర్తెకె పెట్టు (దేశ్య), అంజాన్ కొట్టు (అన్య), అసెస్ చేయు (అన్య), అక్షింతలు వేయు (తత్సమ), అగ్గిమింగు (జాతీయం), అచ్చమ్మ పెండ్లిల బుచ్చమ్మ కాలి గోర్లు తీయు (సామెత), అస్త్రకార్ చేయు (వ్యవహార) వంటివి మరే నిఘంటువులోనూ దొరకనివి. ఇటువంటివి కోకొల్లలుగా ఈ కోశంలో దొరుకుతాయి.

అట్లాగే, ఒక పదానికి ఒక కాలంలో ఒక అర్థం ఉండి మరో కాలానికి అది బహుళ వ్యవహారంలో ఉండవచ్చు, దాని వలన అర్థ వ్యాకోచం జరుగుతుంది. ఎన్నెన్నో సందర్భాలలో అది వ్యవహరించ బడుతుంది. అటువంటప్పుడు దాని అర్థచ్ఛాయలను అప్డేట్ చెయ్యాలి కదా! ఆ పనిని ఎంతో ఓపికతో చేసిన కృషి ఈ కోశంలో కనిపిస్తుంది.

ఉదాహరణకు : 'ఆగు' అనే తెలుగు ధాతువుకు **'ఆంధ్ర క్రియా స్వరూప మణి దీపిక'**లో పన్నెండు అర్థాలు చూపించారు : 1. నిరుద్ధమగు, అణగు 2. తాళు, ఓపు, 3. సమర్థుడగు. 4. నిలబడు.

5. అడ్డగించు, ఆపు 6. నిషేధించు 7. రాజ పురుషాజ్ఞ చేత నిలువజేయు 8. మోచు, వహించు 9. కాపాడు 10. ముట్టడి వేయు 11. ఆక్రమించు 12. నివారించు.

దీనికి నలిమెల చేర్చిన అదనపు అర్థ ఛాయలు 13. నిరోధించు 14. ఆసేధించు 15. సైచు 16. నిలుపు 17. ఆటంకపరచు 18. అరికట్టు 19. పట్టణాదుల నిరోధించు, ముట్టడించు 20. నిగ్రహించు 21.విరమించు 22. ఆగిపోవు 23. మన్ను (ఈ గుడ్డ ఆగుతుందా?)

'ఆవర్తించు' అనే సంస్కృత ధాతువుకు **'ఆంధ్ర క్రియా స్వరూప మణి దీపిక'**లో నాలుగు అర్థాలు చూపించారు : 1.వల్లించు, వల్లె వేయు 2.పలుమార్లు చెప్పు 3.మరల్చు 4.వర్తించు, ఉండు, కలుగు. కాగా, దీనికి భాస్కర్ సార్ చేర్చిన అదనపు అర్థ ఛాయలు 5. త్రిప్పు 6. మరలి వచ్చు 7.జరుపు 8. చేయు 9. ఆక్రమించు 10.క్రమ్ము.

ఈ పదకోశాన్ని పరిశీలించినప్పుడు మనకు తెలియని అనేక క్రియా పదబంధాలు, వాటి స్వస్వరూపాలు స్ఫురణకు వస్తాయి. **'అనుముదప్పు, అనుము చెడిపోవు'** అన్నవి చదవగానే చిన్ననాడు తాళం చెడిపోయినప్పుడు పెద్దలు అన్నమాటలు జ్ఞాపకానికి వచ్చినవి. వీడు ఆసుతలేడు, ఆసడు అనే మాటల్లో ఉన్నది **'ఆచు'** అనే ధాతువు అని తెలిసింది. అరిసెలు చేసినప్పుడల్లా **'అనుకం పట్టుడు'** అనే మాట వినబడుతుంది. దీనికి మూలధాతువు **'అనుకు'** గరిటెజారుగా పలుచనగు అనే అర్థంలో ఉన్నది. చెరువు **'అలుగు పడుతుంది'** అన్నదానికి **'అలుగులు వారు'** అనే క్రియాస్వరూపం కనిపిస్తున్నది. తెలంగాణలో **'ఆగం'** అనేమాట తరచుగా వినిపిస్తుంది. దీనికి నిదర్శనంగా **'ఆగడము చేయు, ఆగడించు, ఆగము చేయు, ఆగ్రహపడు, ఆగ్రహము చేయు'** వంటి క్రియా స్వరూపాలను చూసినప్పుడు **'ఆగం'** కు మూలం **'ఆగ్రహం, ఆగడం'** వంటి మాటలని తేటతెల్లమవుతున్నది. **'ఆచికొట్టు, ఆటివచ్చు'** వంటివి నేడు **'చాచి కొట్టు, సాటివచ్చు'**గా మార్పు చెందినట్టు కనిపిస్తున్నది. ఎవరైనా ఆటపట్టించడానికి మాట్లాడుతన్నారనుకున్నప్పుడు **'పరాష్కం చెయ్యకు, పరిగాశం చేయకు'** అని అనడం కద్దు. ఇది **'అష్కం చేయు'** అని పరిహాసం, పరియాచకం వంటి వాటి నుండి రూపొందిందని తెలుస్తుంది. **'ఎగ్గెలు'** అనే క్రియకు దెప్పు అనే అర్థం చూస్తే **'పెగ్గెలు'** అనే మాటకు మూలం ఇదేననిపిస్తుంది. **'ఇందెపడు, ఈటువోవు, ఈచుకపోవు, ఈగిలబడు, ఉగ్గము కట్టు, ఎచ్చం పచ్చం చేయు, ఎదురుకచ్చు, ఎత్తుకట్టు'** వంటి ఎన్నెన్నో క్రియా స్వరూపాలు మన మనస్సులో మెదిలి మన పూర్వ జ్ఞానాన్ని పునఃస్థాపితం చేస్తాయి. భాషా అధ్యయనాభిలాషులకు ఇది ఒక పెన్నిధి.

ఐతే, ఇప్పుడు దీని అవసరం ఏమిటి? ఈ పాత ధాతు మూలాలు, క్రియా స్వరూపాలు ఎందుకు?

ప్రపంచీకరణ సుడిగాలిలో భాషా సంస్కృతులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కుంటున్నాయి. ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళ భాషీయులు, భాషా రక్షణకు ప్రణాళికలు, కార్యాచరణలు సిద్ధం చేసి కేంద్రం నుండి నిధులు రాబట్టుకుంటున్నారు. నూతన పదకల్పనలు చేస్తున్నారు. ఇంజనీరింగ్, కంప్యూటర్, వైద్య విద్య వంటి వాటిని సొంత భాషల్లో బోధించడానికి కొత్త విద్యా విధానం అనుమతిస్తుంది. ఇటువంటి సందర్భంలో విజ్ఞులైన భాషాభిమానులు, విద్యావేత్తలు, పాఠ్య ప్రణాళిక రచయితల ముందు తెలుగు మూలాలను, దాని క్రియాశక్తిని, వైవిధ్యాన్ని అందుబాటులోకి తేవడం ద్వారా ఒక వనరును సృష్టించినట్టయింది. తాను తీసిన బాటలో ఏ ఒకరైనా నడిచి తెలుగు అస్తిత్వాన్ని ఎంతో కొంత కాపాడే ప్రయత్నం చేస్తారని భావించి చేసిన పని ఇది. వ్యవస్థలు చేయవలసిన పనిని ఒక వ్యక్తి చేపట్టి భాషా చైతన్యాన్ని రగుల్కొల్పిన మేలిమి ఉదాహరణ ఇది. తెలుగు రాష్ట్రాలలో ఉన్న అధికార భాషా సాహిత్య సంస్థలు మేల్కొని ముందుకు కదలడానికి ఒక ప్రేరణ ఇస్తుంది.

ఈ క్రియా పదకోశాన్ని చదివినప్పుడు ప్రాచీనం నుంచి ఆధునికం దాకా తెలుగు భాష ధాతుపుష్టి తెలిసివస్తుంది. ప్రజల వ్యవహారంలో ఉన్న అచ్చ తెనుగు క్రియా రూపాలను సరిగా అర్థం చేసుకునే చూపు కలుగుతుంది. మరుగునపడిపోతున్న భాష ఒకచోట చేరి మరింత ముందుతరాలకు చేరుతుంది అనడంలో సందేహం లేదు.

సప్త పదులు...!

డా. గన్నోజు శ్రీనివాసాచార్య
ఫోన్ : 8555899493

మితం
హితం
ఆచితూచి
మాట్లాడటం
అందరికి మేలే
సతతం!

పదములు
ముదములు
రసరమ్యవాక్యాలు
తెలుగుభాషామతల్లికి
కంఠాభరణములై
వెలుగులీను
విధములు!

తీవ్రవాదం
ఉగ్రవాదం
మానవాళి
మనుగడకు
కారాదు
ప్రాణాంతకమైన
అగ్రవాదం!

అమలం
విమలం
భానూదయవేళ
వెల్లివిరియు
సదా
కమలం!

అడ్డదారి
చెడ్డదారి
చదువుండి
ఉద్యోగముండి
లంచానికి
ఆశపడడమే
దొడ్డిదారి!

చిక్కులు
పెక్కులు
ఇతరులను
బాధపెట్టి
ఏ మెరుగనట్టుం
నొక్కుతారు
సన్నాయినొక్కులు!

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 (32) హైదరాబాద్ అక్టోబర్ : 2025

తులనాత్మక సాహిత్య అధ్యయనం – చారిత్రక అవసరం

డా. కొడోజు కృష్ణమూర్తి, తెలుగు అధ్యాపకులు, ఫోన్ : 8500165845

ఉపోద్ఘాతం :

ప్రపంచవ్యాప్తంగా ఈనాడు తులనాత్మక సాహిత్య అధ్యయనానికి అధిక ప్రాముఖ్యం ఉంది. స్థూలంగా రెండు లేదా అంతకంటే ఎక్కువ భాషలలోని సాహిత్యాలను తులనాత్మకంగా పరిశీలించి తేల్చిన నూతన అంశాలను తులనాత్మక సాహిత్యం అనవచ్చు. ఈనాడు ప్రపంచవ్యాప్తంగా అధిక ప్రాముఖ్యత ఉన్న సాహిత్యాలలో తులనాత్మక సాహిత్య అధ్యయనం ఒకటి. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాహిత్యంలో కొత్తదనం కనిపిస్తుంది. దాదాపు అన్ని భాషా సాహిత్యాలలో వివిధ కాలాలలో పరిణామాలు కనిపిస్తూనే ఉంటాయి. భాషాసాహిత్యాలలో పరస్పర ప్రభావం ఉంటుంది. అట్లాంటి ప్రభావాన్ని పరిశీలించి సామ్యభేదాలు చూపడం తులనాత్మక పరిశీలనలో ఒక భాగంగా ఉంటుంది.

తులనాత్మక పరిశీలన వలననే ప్రాచీన సాహిత్యకాలం నుండి ఆధునిక సాహిత్యకాలం వరకు పరస్పరం ఎన్నో సాహిత్య ప్రక్రియలు ప్రపంచ సాహిత్య చరిత్రలో చోటు చేసుకుంటున్నాయి. ప్రపంచంలో ఉన్నటువంటి వివిధ సాహిత్యాల అభివృద్ధి, వికాసం వివిధ సాహిత్యాల పరస్పర ప్రభావంవల్లనే సాధ్యమవుతుంది. సాహిత్య వికాసంకాని, అభివృద్ధికాని భిన్న భాషాసాహిత్యాల తులనాత్మక పరిశీలనవలనే సాధ్యమవుతుంది. భాషలు వేరైనా ఆ భాషాసమాజం లోని వ్యక్తులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలు వాటికి ప్రతిస్పందించిన తీరులో పోలికలు ఉండవచ్చును. కాబట్టి ప్రపంచ భాషలలో ఏవైనా రెండు భాషాసాహిత్యాలను తులనాత్మకంగా వివిధ కోణాలనుండి పరిశీలించవచ్చును.

మౌలిక పదాలు :

సాహిత్యం, చరిత్ర, ఇతర భాషా పదాలు, తులనాత్మక అధ్యయనం – ప్రభావం, నూతన అంశాలు, ప్రపంచ సాహిత్యం, సాహిత్యాల అభివృద్ధి, సాహిత్యాల వికాసం, పరస్పర ప్రభావం, పోలికలు, వివిధ కోణాలు.

సాధారణంగా తులనాత్మక అధ్యయనం ఒకేభాషకు చెందిన రెండు గ్రంథాలనుకాని లేక రెండు వేరు వేరు భాషలకు చెందిన గ్రంథాలను కాని గ్రహించి తులనాత్మక అధ్యయనం చేయవచ్చు. అప్పుడు ఆ గ్రంథాలు ఏకకాలానికికాని, భిన్నకాలాలకుకాని చెంది ఉండవచ్చు. సాధారణంగా ఆ రచనలలో భేద–సాదృశ్యాలను పోలుస్తూ ప్రత్యేక అంశాలను ఎత్తిచూపడం జరుగుతుంది. ముఖ్యంగా తులనాత్మక అధ్యయనంలో రెండు రచనలలో వస్తుగతంగానూ, రచనానేపథ్య పరంగానూ లేదా ఏదో ఒక విలువను, ఒక సిద్ధాంతాన్ని దృష్టిలో పెట్టుకొని తులనాత్మక పరిశీలన సాగుతుంది.

ఒక సాహిత్యం ఆ సంస్కృతితో సంబంధం కలిగి ఉంటుంది. తులనాత్మక సాహిత్యపరిశీలనలో సాహిత్యాలతోపాటు సంస్కృతుల అధ్యయనం అవసరముంటుంది. తులనాత్మకఅధ్యయనం చేసే సాహిత్య పిపాసకులకు ఆయా సాహిత్యాల పూర్వాపరాలతో పాటు సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలలో పరిచయం అవసరం.

తులనాత్మక సాహిత్యం – నిర్వచనం

ఒక వస్తువును మరొక వస్తువుతోకాని ఒక విషయాన్ని మరొక విషయంతోకాని పోల్చి పరిశీలించటాన్ని తులనాత్మక పరిశీలన అనవచ్చు. దీనిని సాహిత్యానికి అన్వయిస్తే రెండు లేక అంతకంటే ఎక్కువ భాషలలోని సాహిత్యాలను పోల్చి పరిశీలించి చేసే అధ్యయనాన్ని తులనాత్మక సాహిత్యం అనవచ్చు. స్థూలంగా చెప్పాలంటే రెండు భాషలలోని సాహిత్యాలలో ఉన్నటువంటి విశిష్టాంశాల గుర్తింపే తులనాత్మక సాహిత్యం.

తులనాత్మక సాహిత్యం అంటే పోల్చిచూడటం, విశ్లేషణ అనేవి విమర్శకునికి ముఖ్యమైన సాధనాలు. పోల్చిచూడటంలోని మెళు కువలు సాహిత్య విమర్శకుని విశ్లేషణ మూల్యాంకన ప్రక్రియలో భాగమవుతాయి. అంటే ఒక రచనను అనుశీలించేటప్పుడు విమర్శకులు తరుచుగా అదేభాషలోని లేదా ఇతరభాష లోని అట్లాంటి రచనలను దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగడం.

వివరణ :

రవీంద్రనాథ్ ఠాగూర్ అభిప్రాయంలో తులనాత్మక సాహిత్యం అంటే **"విశ్వసాహిత్యం"**. అసలు సాహిత్యం అనేది ఏ ఒక్కరి సొత్తు కాదని చెప్పే ఠాగూర్ అభిప్రాయాన్ని ఆర్.ఎస్.పథక్ ఇట్లా వివరించాడు. **'మానవులు నివసించే స్థలాలమొత్తం అనటం ఎట్లా సరికాదో సాహిత్యం అనేది కూడా కేవలం ఏ కొందరు వ్యక్తుల రచనల మొత్తం కాదు. కాని చాలామంది సాహిత్యాన్ని ఈ దృష్టితోనే చూస్తారు. ఇటువంటి సంకుచితమైన ప్రాంతీయ భావనను వదిలిపెట్టి సాహిత్యంపట్ల ఒక సమగ్రమైన దృష్టిని అలవరుచుకోవాలి. ఏ ఒక్కరి రచన అయినా విశ్వజనీనమైన మానవ మేధ యొక్క సృజనలోని భాగమే అని, ఆ విశ్వజనీనమైన సృజన ఆయా వ్యక్తులద్వారా విశ్వసాహిత్యంగా అభివ్యక్తమవుతుం"**దని గ్రహించాలంటారు.

ఇంగ్లీషులో తులనాత్మక విమర్శకుడిగా మాథ్యూ అర్నాల్డ్‌ని చెప్పుకోవచ్చు. ఈయన ప్రతి విమర్శకుడు ఒక గొప్ప సాహిత్యానికి వారసుడై ఉండాలి. దాన్ని అతడు చక్కగా అధ్యయనం చెయ్యాలి.

దానితోపాటుగా మరొక సాహిత్యాన్ని గురించి కూడా తెలుసుకొని ఉండటం మంచిదని అంటారు.

ఒక సాహిత్య గ్రంథాన్ని ఇంకొక సాహిత్య గ్రంథంతో పోల్చటం. అందుకు ఒకే ప్రక్రియకు చెందిన రెండు గ్రంథాలను గ్రహించి వాటిలోని నిర్మాణాన్నికాని, శైలినికాని తాత్విక దృష్టినికాని పోల్చి చూడవచ్చు. ప్రపంచంలోని ఏ రెండు భాషలలోని సాహిత్యాలనైనా గ్రహించవచ్చు.

తులనాత్మక సాహిత్యం ఏదో ఒక దేశానికి మాత్రమే పరిమిత మైనది కాదు. ఇది రెండు సమాజాలమధ్య సాహిత్యాల పరమైన సంబంధాన్ని మాత్రమే కాక విశ్వాసాలు, కళలు, తాత్విక చింతన, చరిత్ర, సామాజికాంశాలు, మతం మొదలైన రంగాలలో ఆ సమాజాల విజ్ఞానాన్ని కూడా తెలియచేసేది తులనాత్మక సాహిత్యం.

భాషలు వేరైనా ఆ భాషాసమాజంలోని వ్యక్తులు ఎదుర్కొంటు న్నటువంటి సమస్యలు వాటికి ప్రతిస్పందించిన తీరులలో పోలిక లుండవచ్చును. కాబట్టి ప్రపంచభాషలలో ఏవేని రెండు భాషాసాహిత్యాలను తులనాత్మక అధ్యయనంలో వివిధ కోణాలనుండి పరిశీలించవచ్చును. తులనాత్మక సాహిత్యం అనేది భిన్న జాతులకు సంబంధించిన విభిన్న సాహిత్యాల అధ్యయనం. సిద్ధాంతపరంగా చెప్పేది తులనాత్మక సాహిత్యం. తులనాత్మక సాహిత్యం యొక్క పూర్తి స్వరూపం జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ పరిశీలించి తేల్చుకోవచ్చు. ఒక రచయిత యొక్క రచనలోని వినూత్న అంశాలను వెలికితీసి ఆ రచయితను ఆశ్చర్యపరిచే అంశమే తులనాత్మక సాహిత్యంలోని ప్రధానాంశం.

తులనాత్మక సాహిత్య పరిధి ఆయా సాహిత్యాలలోని వివిధ అంశాలను పరిశీలించటంపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా ఒక సాహిత్య సృష్టికి లేక రూపకల్పనకు ఆ సాహిత్యం అనేక విషయాల సమ్మేళనంగా ఉంటుంది. తులనాత్మక సాహిత్యానికి ఒక నిర్దిష్టమైన సిద్ధాంతం లేకపోయినా నిర్దిష్ట అధ్యయన పద్ధతులున్నాయి.

తులనాత్మక సాహిత్యాన్ని నిర్వచించటం కొంత కష్టసాధ్యమైనపనే! ఎందుచేతనంటే తులనాత్మకత ఎక్కడ, ఎప్పుడు, ఎందుకు, ఎలా అన్న విషయపరిజ్ఞాన సముపార్జన అంత తేలికకాదు. Shakespear అర్థం కావాలంటే మనకు గ్రీకు రచయితలు Sophocles, Euripides లాంటి మహానుభావుల గ్రీకు సాహిత్యాన్ని అధ్యయనం చేయవలసి ఉంటుంది.

అనేక విధాలుగా తులనాత్మక సాహిత్యం గురించి ప్రాచ్య, పాశ్చాత్య పండితులు దీనిని ఒక అధ్యయనంగా రూపొందించటానికి అనేక కోణాలనుండి పరిశోధనలు చేస్తున్నారు.

తులనాత్మక సాహిత్య చారిత్రక నేపథ్యం పరిశీలిస్తే ప్రపంచ సాహిత్యంలో తులనాత్మక పరిశీలన మొట్టమొదట 1816 లో ప్రారంభమైనది. నేడు విశ్వవ్యాప్తంగా వివిధ దేశాలలో తులనాత్మక



సాహిత్య అధ్యయనం ప్రపంచ సాహిత్యంలో ప్రముఖపాత్ర పోషిస్తుంది. భారతదేశంలో ఇప్పుడిప్పుడే ఒక ప్రత్యేక అధ్యయన క్షేత్రంగా ప్రాధాన్యత పొందుతున్నది.

ఎస్.ఎస్. ప్రవార్ 1973 లో లండన్‌లో ప్రచురించిన తన Comparative literary Studies: An Introduction అన్న పుస్తకంలో **"1816 లో ప్రపంచ సాహిత్యంలో తులనాత్మక సాహిత్య పరిశీలన ప్రారంభమైనది. ఇది ఒక ప్రత్యేక అధ్యయన క్షేత్రంగా రాణించగలదు"** అన్న అభిప్రాయం వ్యక్తంచేసాడు.

1821 లో అంపేర్ అనే జర్మన్ సాహిత్య విమర్శకుడు హిస్టారిక్ ఆఫ్ కంపేరి (Historic of comparee) అనే మాటను మొదటిసారిగా వాడటం జరిగింది. తరువాత 1829 లో ఫ్రెంచిలో వాలెమన్ అనే రచయిత "లిటరేచర్ కంపేరి" అనే మాటను సాహిత్య రంగంలో ప్రయోగించిన మొదటివాడు. ఈ పదాన్ని మొదటగా ఫ్రెంచివారు ఎక్కువగా ఆదరించారు. ఫ్రెంచి రచయిత ఫ్రెజర్ తన 'గోల్డెన్ బో' అనే గ్రంథంలో ప్రపంచ పురాణగాథలను సమీక్షించాడు. ఇందులో భాగంగానే 'రివ్యూ డి లిటరేచర్ కంపేరి' అనే ఫ్రెంచి పత్రికను ప్యారిస్ విశ్వవిద్యాలయంలో ప్రారంభించాడు. ఆ తరువాత వచ్చినటువంటి 'హర్వార్డ్', 'యాలే', 'ప్రిన్సిటన్', 'చికాగో', 'బోస్టక్', 'ఫిలడెల్ఫియా' లాంటి విశ్వవిద్యాలయాలు తులనాత్మక సాహిత్యాన్ని ఒక అధ్యయన క్షేత్రంగా ప్రారంభించాయి.

1848 లో ఇంగ్లీషులో మాథ్యూ ఆర్నాల్డ్ తులనాత్మక సాహిత్యం అనేపదాన్ని ప్రయోగించటం జరిగింది. సాహిత్య బోధనలో శాస్త్రీయతకోసం అన్వేషిస్తూ అర్నాల్డ్ ఆ స్ఫూర్తి తోనే 'కంపేరెటివ్ లిటరేచర్' (comparative literature) అనే మాటను ఉపయోగించాడు. అంటే సాహిత్యానికి సంబంధించిన శాస్త్రీయతకు మరో పేరుగానే Comparative Literature అనే అర్నాల్డ్ ఉద్దేశం. అదే విధంగానే అతని పదప్రయోగం జరిగింది.

19 వ శతాబ్దంలో అర్నాల్డ్ వాడిన Comparative Literature అనే పదం ఆంగ్లసాహిత్యంలో పెద్ద దుమారం రేపింది. Com-

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 హైదరాబాద్ అక్టోబర్ : 2025

parative Literature ను వ్యతిరేకించినవారు ఆనాడు ఉన్నారు. అదొక పెద్ద చర్చనీయాంశము :

ముగింపు :

1848 లో మొట్టమొదటిసారిగా ఆంగ్లసాహిత్యలోకంలో comparative literature అన్న మాటను అర్నాల్డ్ ఉపయోగిస్తే దీన్ని ఒక అధ్యయన క్షేత్రంగా గుర్తింపు తీసుకురావటానికి కృషి చేసినవాడు హెచ్.ఎం.పొస్నెట్. 1886 లో ఈయన తన పుస్తకానికి comparative literature అనే పేరు పెట్టి ఆ మాటను బహుళ ప్రచారం లోకి తెచ్చాడు. తరువాత హెచ్.ఎం.పొస్నెట్ 1901 లో కంటెంపరరీ రివ్యూ (contemporary Review) అనే పత్రిక 79 వ సంచికలో 'ది సైన్స్ ఆఫ్ కంపారేటివ్' (The Science of Comparative) అనే వ్యాసాన్ని ప్రచురించి ఈ కొత్త అధ్యయనానికి శాస్త్రీయతను, స్పష్టతను సమకూర్చిపెట్టాడు.

మధ్యయుగాన ఇంగ్లీషులో మొట్టమొదటి సారిగా Comparative literature అన్న పదం లాటిన్ Comparative పదం నుండి నిష్పన్నమైనది. ఈ విధంగా Comparative literature అనేది విశ్వ వ్యాప్తంగా వివిధ రూపాలలో వికాసం పొందుతూ స్థిరరూపం సంతరించుకున్నది.

ఆధార గ్రంథాలు :

1) NIRMAL JAIN: Comparative Literature, The Indian Context, New Delhi, 1989. Pub: Allied publication.
2) MAJUNDAR, SWAPAN: Comparative literature Indian Dimensions Pub: Calcutta, Sibnath- Paul at PRINT ECH, 1987
3) DHAWAN R.K.: Comparative Literature, Pub: Bhavani (ed) 1987, New Delhi.
4) PATHAK R.S.: Comparative literature and Aesthetics. The Search for a Significant order in Dhawan, 1987. P.P. 17-42.
5) SISIR KUMAR DAS: Literature A Historical perspective, New Delhi Indiom pub. 1972.

@bluesee

డా. తిరునగరి శరత్ చంద్ర

ఫోన్ : 63098 73682

సాయంత్రం ఐదయ్యిందంటే చాలు
నా అడుగుల పక్షులకు
అలసట తీర్చే చెట్టవుతుందది.
ఎన్నెన్నో టెన్షలన్ లను పోగొట్టి
మనసును అటెన్షన్ గా
నిలబెట్టే తేనీటిశాల అది..
అక్కడికొచ్చే వాళ్ళందరికి
అది ఉపశమనాన్నిస్తుంది.
ప్రేయసితో ఒకరు..
మనసు బాలేక ఒకరు..
ఊరి కబుర్లు నెమరేసుకుంటూ
కూర్చున్న స్నేహితులొకవైపు..
ఒంటరితనంతో కాగిపోయి
మనసును చల్లబరుచుకోవడానికి
వచ్చినవాళ్ళొకవైపు..
ఒక్కొక్కరిది ఒక్కో గోడు..
కప్ కాఫీ ఆర్డరిచ్చి కూచుంటే చాలు
కాఫీ వచ్చే దాకా మనసు
గింగిర్లు తిరుగుతుంది..
నోరు ఊరి ఊరి
కాఫీని ఆస్వాదించడానికి
తహతహలాడుతుంది.
కాఫీ తాగుతుంటే
సిప్ సిప్ లో స్విన్ బర్న్ పోయేమ్
నాకు లయబద్ధంగా వినిపిస్తుంది.
కాళిదాసు ఇక్కడే కాసేపు
ఊహలతో మంతనాలాడి
వెళ్ళాడేమోననిపిస్తుంటుంది.
కబుర్లతో, కాఫీలతో
కాలక్షేపం చేస్తూ ఉంటే
కళ్ళముందు
నిజంగానే నీలిసముద్రం
ప్రత్యక్షమవుతున్నట్టుంది.
బ్లూసీ కి వెళ్ళని రోజున
చిరాకుకు బలాన్నిచ్చి
పోషించినట్టనిపిస్తుంటుంది.
పదికాలాల ప్రశాంతతకి
వేయికాలాల మనశ్శాంతికి
లక్షకాలాలు నిలబడే కవిత్వానికి
కేరాఫ్ అడ్రస్ బ్లూసీ..
కనిపించని కొత్త లోకాలను
ఇంకా కొత్తగా మనముందుంచుతుంది
బ్లూసీ..బ్లూసీ..

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 హైదరాబాద్ అక్టోబర్ : 2025

ఆధ్యాత్మిక తత్త్వ దర్శిని శ్రీమాన్ చిట్యాల నారాయణ గారి

"మానస ఘట భోగ తత్త్వంబను - ఆత్మ విచారము"

సుప్పని సత్యనారాయణ, తెలుగు అధ్యాపకులు ఫోన్ : 9492626910

తత్త్వ సాహిత్యానికి, సంకీర్తన ప్రవంతికి తెలంగాణ పుట్టినిల్లు. ఈ ప్రాంతంలో అడుగడుగునా గుడి ఉంది అనే మాట ఎంత సత్యమో, ప్రతి గ్రామగ్రామాన ఒక సంకీర్తనకారుడో, లేక వాగ్గేయకారుడో లేకపోలేదు అనే మాట జగమెరిగిన సత్యం. ఇందులో జనాదరణకు ఎంత నోచుకున్నప్పటికీ, దుర్భర ఆర్థిక పరిస్థితుల వల్ల, కడు పేదరికం కారణంగా, చాలామంది కవుల రచనలు, వెలుగులోకి రాకుండా కనుమరుగైపోయాయి. అంతేకాకుండా ఎందరో గొప్ప గొప్ప సాహితీ వేత్తలు విస్మృతికి గురికావడం అనేది బాధాకరం.

అలా...అదృష్టం కొద్దీ తన రచనలను పుస్తక రూపంలో వెలువరించినప్పటికీ, కనుమరుగైన రచయితల జాబితాలోకి చేరిన మహనీయుడే **"శ్రీమాన్ చిట్యాల నారాయణ కవి"** (పద్మశాలి). వీరు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, నాగిరెడ్డిపేట మండలం, తాండూరు కిచ్చన్నపేట గ్రామ వాస్తవ్యులు. నిరుపేద జీవితాన్ని గడుపుతూ, చేనేత వృత్తిని కొనసాగిస్తూ, తన జీవన అనుభవంలో నుంచి రచించిన గొప్ప రచనయే ఈ **"మానసఘటభోగ తత్వంబను - ఆత్మ విచారము."** రచయిత తాను ఏ విధమైన భజన సంకీర్తనలను ఈ రచనలు చెప్పాలనుకున్నాడు అనే విషయం, మనం ఈ పుస్తకానికి పెట్టిన పేరును బట్టి అర్థం చేసుకోవచ్చు

1958 సంవత్సరంలో తొలిసారి ముద్రితమైన ఈ పుస్తకం, శ్రీమాన్ శ్రీ తార్కిక చక్రవర్తి సిద్ధాంతి శ్రీ రంగనాథ ఆచార్యులు గారిచే పరిష్కరింపబడింది. తాండూరు పరిసర ప్రాంతాలే కాకుండా, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ భజన మండల్లలో, ఔత్సాహికులైన వాగ్గేయకారుల గొంతులో ఇప్పటికీ ఈ పాటలు మారుమ్రోగుతూనే ఉన్నాయి. సాధువులు, గురు పరంపరలో ఉన్న భక్తులు, సంకీర్తన కారులు, వాగ్గేయకారులు, పలు రకాల యాచకులు, శారదకాండ్లు ఇప్పటికీ ఇందులో ఉన్న తత్త్వ కీర్తనలను స్తుతిస్తూ (ఆలపిస్తూ) గ్రామ గ్రామాన భిక్షాటన చేయడం గమనిస్తాం. అలాగే పలు రకాల భజన బృందాలలో కూడా ఈ తత్త్వ గీతాలను ఎంతో హృద్యంగా భక్తులు ఆలపించి పరవశిస్తారు.

నిజంగా "మానస గత భోగ తత్త్వంబను - ఆత్మవిచారం" అంటే తత్త్వ విచారమే. అంత గొప్పగా ఈ రచనను చేశారు రచయిత శ్రీ చిట్యాల నారాయణ గారు. కావ్యారంభంలో -

కందం : శ్రీకరముగ మూషికమును
ప్రాకటముగ నెక్కినట్టి ఫాలాక్షసుతా!



చేకొని ప్రస్తుతి చేసెద
నా కోర్కెలు తీర్చుమయ్య! నాగ ముఖేశా!!

అంటూ శ్రీ విఘ్ననాయకుని స్తుతి, ఈశ్వర స్తుతి, శారదాంబ స్తుతి, పూర్వ కవుల స్తుతి మొదలగు స్తుతులను మరియు ఇష్టదేవతా స్తుతిని చేసిన తర్వాత, సంకీర్తన ఆరంభంలో శ్రీ గణపతి స్తుతి "దరువు" లో గొప్ప సంకీర్తనతో మొదలుపెట్టారు.

శ్రీ గణనాయక! శ్రీ శుభదాయక - యోగి వినుత దేవా! మమ్మేలు
సద్భోగ మహానుభావా! మమ్మేలు!
భాగవతోత్తమ! భవ్య గుణాకర!
భక్త వరద! మిమ్ము స్మరించెద! బాగుగ మదిలోను!!....
॥శ్రీ గణనాయక॥

అని రస రమ్యమైన గణనాథుని స్తుతితో ఈ భజన కీర్తనలను ప్రారంభించారు రచయిత. మనిషి తన దైనందిన జీవితంలో చేసే పొరపాట్లను గురించి, మానవ జీవన మనుగడ గురించి, తాను పడిన తపన ఈ రచనలో అడుగడుగునా కనిపిస్తుంది. అందుకే కాబోలు **"మానస ఘట భోగం"** అన్నారు. అంటే ఈ శరీరం కుండ వంటిది. ఏ క్షణంలోనైనా పగిలిపోవచ్చు. ఉన్నన్నినాళ్లు మాత్రం దీనిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉన్నది. అందువలన ఈ భోగం అంటే అనుభవించే ప్రతి సుఖంలో తత్త్వ విచారాన్ని కనుమని, ధార్మిక, ఆధ్యాత్మిక, తాత్త్విక ధోరణి మనిషికి నిత్యం అలవడాలని రచయిత పడిన సంవేదన అంతా యింతా కాదు.

అందుకే తన ప్రతి పదంలో లోకంలోని సంగతులు పట్ల విరుచుకుపడ్డాడు. ఈ సంసార జీవన బంధంలో మనిషి ఎట్లా కొట్టుమిట్టాడుతున్నాడో ఈ క్రింది సంకీర్తనను తప్పనిసరిగా వినవలసిందే.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 (36) హైదరాబాద్ అక్టోబర్ : 2025

దరువు: ఎంత జేసిన ఇంతె సంసారం – ఎన్నాళ్లు చేసిన
బొంత పేగుల పొట్ట వ్యవహారం!
రంతు మాటలచేత మోహ – భ్రాంతి లోబడి మాయ నెరుగక
కొంతమనె ఇల్లాలినంటి – చింతలో దినమంత గడుపుటె!!.....
॥ ఎంతజేసిన ॥

అంటూ... భార్యాపిల్లలు, వ్యవహారాలు అనే భ్రాంతిలో పడి తిరగడమే తప్ప, అర్థమే లేని సంసారిక జీవనం పనికిరాదు అంటారు రచయిత. అలాగే వ్యర్థ ప్రేలాపనతో, పనికిరాని కబుర్లతో, కాలాన్ని వ్యర్థం చేయడమే తప్ప, ఉపయోగకరమైన కార్యం ఒకటి కూడా మనుజుడు చేయలేకపోతున్నాడు అంటారు రచయిత. ఇందులో సమయాన్ని దుర్వినియోగం చేయడం అనే అర్థం కూడా వ్యక్తమవుతోంది.

అంతేకాకుండా.. కుటుంబ జీవన విధానంలో ఆలుమగల అన్యోన్యత ఎట్లా ఉండాలో చెబుతూ,

"సంసారము కొరకు సర్వంబు గావలె –
పనికి రానిదొకటె పంచి చూడు!
సుతి ఒక్కటుంటెచాల్ గతిలేక పోతేమి
తవుడు రొట్టె దిన్న తనకు మెప్పు!! ..

అంటూ సుతి లేని వైవాహిక జీవన విధానం వ్యర్థమే అంటారు. ఈ దేహం యొక్క గొప్పతనాన్ని, దీనికి ఉన్న విలువను చెప్పే, కొన్ని పద్యాలను గమనించినట్లయితే, శ్రీకాళహస్తీశ్వర శతక కర్త ధూర్జటి మహాకవి స్ఫురణకు రాకమానుదు. అలాంటి పద్యం ఒకటి..

చంపకం :

నిలువని మాయభోగమిది నీరును వాయువు పంచభూతముల్
చలనము జేయుచున్ ఘటము చాల విచిత్రపు నాటలాడుచున్
తొలగని కామక్రోధములతో జతగూడి ప్రయాసపెట్టుచున్
బలమని భ్రాంతిజెందెదిక బ్రహ్మమెరుంగని బొమ్మ వట్టిదే!!

అనే పద్యాన్ని చదివినట్లయితే, ధూర్జటి...అంతామిథ్య తలంచి చూచిన..." అనే పద్యం గుర్తుకొస్తుంది. ఏ పద్యాన్ని పలకరించిన, ఏ సంకీర్తనను చవిచూసిన, కావలసినంత తత్వ విచారం దొరకక మానదు. అందువల్ల తత్వసారానికి పర్యాయపదంగా ఈ రచనను కొనియాడవచ్చు.

(దేహానికి – జీవుడికి మధ్య సంవాదం)
దేహం: ఈ దేహము నీ ఇల్లని
శోధించియు ఇంతవరకు సోపతి చేస్తే
స్వాధీనం దప్పి పోయితి
నీ దయ నేనేమిజేతు నిజమనుకొంటీ!!
జీవుడు: నీకును నాకును భ్రాంతియు
లోకములో దీరిపాయె లొల్లియు మానే!
ఆకారమంత కృంగెను
శ్రీకారము దెలిపినట్టి శ్రీహరి కెరుకా!!

అంటూ దేహం, ఇటు జీవుడు పడే భ్రమలను, మాయను కళ్ళకు కట్టినట్లు చూపెడతారు. చివరకు ఈ దేహం (జీవాత్మ) పరమాత్ములు ఐక్యం అయిన స్థితిని తలుచుకొని, బాల్యం, యవ్వనం, వార్ధక్యాలకు సంబంధించిన స్థితిగతులను కళ్ళ ముందు ఉంచుతారు. ఇలా "మానస ఘటభోగ తత్వసారము" ను ఎంత గ్రోలితే అంత ఒక తాత్విక సిద్ధాంతం చదువరులకు సొంతమవుతుంది. ఇంకా **"రామా నీ దయ నాపై రానీ – ప్రాప్త మేమున్నాదయ్యేదో కానీ!!"** అంటూ శ్రీరాముని స్తుతి కీర్తన, **"ఆడి వారిదే అంత సంసారం– వవ్వారె ఈ మొగ గాడిది గుర్తెరుగడు జ్ఞానం!"** అనే లోక సంబంధిత గీతాలు ఎన్నో ఎన్నెన్నో గోచరిస్తాయి.

రచయిత పూర్వ కవుల పట్ల, సాహిత్యం పట్ల మరియు సంకీర్తన విధానం పట్ల గల అనుభవం అపారం అని తేటతెల్లమవుతుంది. ఎందుకంటే ఇందులో రచించిన సంకీర్తనలన్నీ "ఆది తాళం, ఆటతాళం, జంపె తాళం, జులువ తాళం, ఏకతాళం" వంటి తాల ప్రమాణాలు కలిగి ఉన్నాయి. తెలంగాణ నుంచి వచ్చిన సంకీర్తన గ్రంథాలలో దీనిని మించిన మరొక పుస్తకం ఇప్పటివరకు రాలేదు అంటే అతిశయోక్తి కానేరదు. ఇంకా చెప్పాలంటే రచయిత కీర్తనలలో సందర్భానుసారంగా తెలంగాణ మాండలికలు, నుడికారాలు, పదబంధాలు, సామెతలు, జాతీయాలు ఎన్నో ఉపయోగించి సంకీర్తనలకు మరింత సొబగులు అద్దినారు.

తాండూరు, కిచ్చన్నపేట పురాంకితంగా వ్రాయబడిన ఈ సంకీర్తనలలో, ప్రతి కీర్తన చివరన రచయిత తన నామముద్రను, ఊరి పేరును స్తుతించడం మనం గమనిస్తాం. (ఇది భజన సంకీర్తన సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన శైలి) మచ్చుకు ఒకచోట అంకిత చరణాన్ని గమనిస్తే..,

చరణం: అందముగ నివసించియు – కిచ్చన్నపేట
మందిరమున వెలసియు!
పొందుగను చిట్యాల రామయ – నందనుడు నారాయణా, దా
సందు కృపచెన్నొంది బ్రోచిన – సుందరా శతనందు దుర్విలో!!
॥ ఏమి బొమ్మల ॥

ఈ విధంగా తాను రచించిన ప్రతి భజన కీర్తనలు తాండూరు కిచ్చన్నపేట ప్రస్తావన వస్తుంది.

ఇంతటి పాండితీప్రకర్ష కలిగిన రచయిత శ్రీమాన్ చిట్యాల నారాయణ గారు కారణజన్ములు అనేది అక్షర సత్యం. ఇలాంటి మహనీయుల సారస్వత వైభవాన్ని వేనోళ్ల పొగడవలసిన ఆవశ్యకత నేటి సాహితీవేత్తలపైన, యువ రచయితల పైన ఎంతైనా ఉంది. అలా అయినప్పుడే మన కవులు, సాహిత్యం బ్రతికేది. మన అస్తిత్వాన్ని మనం నిలబెట్టుకునేది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 (37) హైదరాబాద్ అక్టోబర్ : 2025

తెలంగాణ సాహిత్య రుద్రమ – అనిశెట్టి రజిత

గునుగుంట్ల శైలజ, తెలుగు అధ్యాపకురాలు, మాతృశ్రీ డిగ్రీ కళాశాల, హన్మకొండ. ఫోన్ : 9705222397

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు ప్రముఖ స్త్రీవాద రచయిత్రి, తెలంగాణ సాహితీవేత్త అనిశెట్టి రజిత ఆగస్టు 11న హనుమకొండలో మరణించారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొని పీడిత వర్గాల పట్ల సామాజిక బాధ్యత కూడిన సాహిత్యాన్ని అందించిన వరంగల్ బిడ్డ అనిశెట్టి రజిత. సమాజంలోని వాస్తవ సమస్యలను, మహిళా హక్కులను, సమానత్వం కోసం సాగిన పోరాటాన్ని తన కలం ద్వారా అద్భుతంగా ప్రతిబింబించారు. ఆమె రచనలు కేవలం కవిత్వమే కాదు–అవి ఒక సామాజిక ఉద్యమానికి ప్రతినిధ్యం వహించే శక్తివంతమైన గళం. ఆమె మరణం తెలంగాణకు తీరని లోటు. తెలంగాణ గొప్ప ప్రజాస్వామిక సాహితీవేత్తను కోల్పోయింది.

ఏప్రిల్ 14, 1958న అనిశెట్టి రజిత హనుమకొండ లోని కుమార్పల్లెలో జన్మించారు. వీరి తండ్రి అనిశెట్టి బాలరాజు, తల్లి జయలక్ష్మి. వీరి విద్యాభ్యాసం అనుమకొండ మరియు హైదరాబాదులో జరిగింది. ఎంఏ తెలుగు పూర్తి చేసి 1992లో కాకతీయ విశ్వవిద్యాలయంలో బోధనేతర ఉద్యోగంలో చేరారు. వీరు చిన్నప్పటి నుండి పత్రికలు చదవడం, నవలలు పురాణేతిహాసాలు చదవడం... సాహిత్యం పట్ల ఇష్టం పెరిగింది. 1977లో వరంగల్లో **"చైతన్య సాహితి"** వ్యవస్థాపన నుండి ఎన్నో సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆనాటి సుప్రసిద్ధ కవులు రచయితల పరిచయం, వారి ప్రసంగాలు వినడం, సాహిత్య సదస్సులు, ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా సాహిత్యంపై అభిరుచి పెరుగుతూపోయింది. వీరికి పుస్తకాలే మంచి నేస్తాలు. నిజానికి శ్రామిక కులం, వర్గంలో పుట్టిన రజితకు సాహిత్యానికి సంబంధించి ఎలాంటి శిక్షణ మార్గదర్శకత్వం కానీ వారసత్వం కానీ లేదు. నాటి వామపక్ష పార్టీల నుండి, ప్రజాతంత్ర వేదికలు, ఉద్యమాలన్నింటి నుండి పిలుపందుకొని వారితో చేరి ఉద్యమాల్లో రజిత చురుకుగా పాల్గొన్నారు. 1984లో వీరు **"గులాబీలు జ్వలిస్తున్నాయి"** అనే చిన్న పుస్తకాన్ని ప్రచురించారు. 1997లో **"నేనొక నల్లమొప్పునవుతా"** అనే కవితా సంపుటిని ప్రచురించారు. మధ్యలో రచనా వ్యాసంగం కొనసాగింది కానీ వీరు ప్రచురణ జోలికి వెళ్లలేదు. ప్రజా కవి కాళోజి నారాయణరావు ఇచ్చిన సూచనలు సలహాలు మేరకు 20 ఏళ్లు పుస్తక ప్రచురణ చేయకుండా ఉన్నారు. రజిత గురువుగారైన ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు గారి కఠిన మాటలకు, పౌరుషం– పట్టుదల వచ్చి 1997లో **"నేనొక నల్లమబ్బునవతా"** కవిత్వం ప్రచురించి పెద్ద సభ పెట్టారు. ఆనాటి నుండి వీరికి ప్రచురణాసక్తి పెరిగింది.

రజిత స్నేహ ప్రపంచం చాలా పెద్దది. ఎక్కడికిపోయినా తనకు తెలిసినవాళ్ళు కలవడం వారిని అక్క, అన్న అని పిలుస్తూ ఆత్మీయ బంధువులాగా పలకరించేవారు. కేవలం సాహిత్యం రాయడమే కాకుండా, రజిత గారు సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై బహిరంగ వేదికలలో ప్రసంగించారు. మహిళా సంఘాలతో, కార్మిక సంఘాలతో కలిసి సమానత్వం కోసం పోరాటం చేశారు. మహిళల సమస్యలు, రైతాంగ కష్టాలు, పేదరికం, అన్యాయం వంటి అంశాలు ఆమె కవితల్లో ప్రతిఫలించాయి. ఆమె కవిత్వంలో ఉన్న ఆవేశం, నిరసన, పోరాటగలం వలన సాహిత్యపరులు ఆమెను **"తెలంగాణ రుద్రమ"** అని పిలిచేవారు. రజిత పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లో ఎం.ఎ., చేసి రావిశాస్త్రి రచనలలో పాలన యంత్రాంగం గురించి, పరిశోధన చేయాలని మొదలు పెట్టింది కానీ పూర్తి చేయలేదు. అయినా సాహిత్య అధ్యయనం కొనసాగింది. కాకతీయ విశ్వవిద్యాలయ తెలుగు విభాగ రిటైర్డ్ ఆచార్యులు కాత్యాయ విద్మహే వీరి గురించి ప్రస్తావిస్తూ రజిత ఒక పుస్తకం చదివింది అంటే దానిని పరిచయం చేస్తూ వ్యాసం రాసి ప్రచురించవలసిందే అంటారు. రచయితల జయంతులకు వర్ధంతులకు వ్యాసాలు రాసి పత్రికలలో ప్రచురించడం ఉద్యమంగా చేసింది. అనిశెట్టి రజిత వంటి ఉత్సాహవంతుల సేవలు సొసైటీకి అవసరమని వరంగల్ మొగిలయ్య హాల్లో 1995లో జరిగిన దరకమే ఐక్యవేదిక రెండవ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రజితను ఎన్నుకొన్నారు. ఈ ఐక్యవేదిక తరపున గబ్బిలం సాహిత్య పత్రిక తీసినప్పుడు రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు సభలు నిర్వహించడంలో చురుకుగా పనిచేశారు..

బీసీల్లోని ఉప్పరి సామాజిక వర్గం నుండి రాతినేలను చీల్చుకొని మహావృక్షంలో ఎదిగారు అనిశెట్టి రజిత. అనిశెట్టి రజిత గొప్ప యోధ, పౌర హక్కుల ఉద్యమం, మహిళలపై అత్యాచార వ్యతిరేక ఉద్యమం, విప్లవ ఉద్యమాలు... ఒక్కటేమిటి ఉద్యమం ఎక్కడ ఉంటే అనిశెట్టి

ISSN 2457-0796

రజిత అక్కడ ఉండేది. ఉద్యమాల వెంట నడుస్తుంది. ఉద్యమాలను నిర్మించింది. ఉద్యమాలు కవిత్వం, సాహిత్యం, రకరకాల సంకలనాలు, ఒంటరి మహిళ గాథల సంకలనాల ప్రచురణ, సభలు సమావేశాలు, మహిళా సాధికారిక, బీసీ ఉద్యమం నిర్మాణం తప్ప అనిశెట్టి రజితకు వ్యక్తిగత జీవితం అంటూ వేరే లేదు. వివాహము చేసుకోకుండా తన జీతాన్ని జీవితాన్ని సామాజిక సాహిత్య ఉద్యమాలకు అంకితం చేసింది. ఏ మీటింగుకు వెళ్లిన వెంట కెమెరా తెచ్చుకొని ఆ వార్తలను అందరికీ స్ఫూర్తిదాయకంగా అందించేది. అనిశెట్టి రజిత విప్లవోద్యమాలకు పేరుగాంచిన కాకతీయ యూనివర్సిటీలో బోధనేతర ఉద్యోగ పనిచేసి రిటైర్ అయ్యారు. కాకతీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు కాత్యాయనీ విద్మహే, జ్యోతి వంటి సాహితీవేత్తలతో సహవాసం ఆమె చైతన్యాన్ని నిత్యం ప్రభావితం చేసింది. చివరికి క్రమంగా తానే స్ఫూర్తినిచ్చి కదిలించే శక్తిగా ఎదిగి ఎందరికో ఆదర్శమయ్యారు. తనకంటూ ఒక సొంత గృహాన్ని ఏర్పాటు చేసుకోకుండా, తన జీవితాన్ని, తన జీతాన్ని మొత్తం సమాజంలోని సాహిత్యం కోసం ఖర్చు చేసింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రతి వ్యక్తి తన సంపదను తదుపరి తరాలకు అందించాలి అని భావిస్తున్న కాలంలో, ఆమె మాత్రం సొంత గృహాన్ని కూడా ఏర్పాటు చేసుకోకుండా, తన జీవితం మొత్తాన్ని సమాజ సేవకే అంకితం చేసింది. సమాజంలోని పేదలకు, ఇబ్బందులు పడుతున్న వారికి తన వనరులను కేటాయించింది. ప్రతి వ్యక్తి తన కుటుంబానికే పరిమితమవుతుంటే, సమాజమే తన కుటుంబమని భావించి, మరణానంతరం కూడా **"నేను సమాజానికి ఉపయోగపడాలి"** అనే సంకల్పంతో తన భౌతిక కాయాన్ని కాకతీయ వైద్య కళాశాలకు దానం చేసింది. ఇది ఆమె గొప్పతనానికి నిదర్శనం. ఇలాంటి వ్యక్తులు సమాజంలో చాలా అరుదుగా ఉంటారు, అందులో అనిశెట్టి రజిత గారు ఒకరు కావడం నిజంగా గొప్ప విషయం.

1973లో **"చైతన్యం పడగెత్తింది"** తో అనిశెట్టి రజిత రచనా జీవితం మొదలైంది. 500కు పైగా కవితలు 100కు పైగా వ్యాసాలు, 30 కి పైగా పాటలు రాశారు. **గులాబీ జల్లిస్తున్నాయి, నల్ల మబ్బునవుతా, చెమట చెట్టు, ఓ లచ్చవ్వ ఉసురు, గోరింత దీపాలు** వంటి కవితా సంపుటాలతో పాటు **మట్టి బంధం** కథల సంపుటి వెలువరించారు. రజిత ఒక కవయిత్రి మాత్రమే కాదు, ఒక సామాజిక స్ఫూర్తి, ఒక పోరాట స్వరం. ఆమె కలం ద్వారా వెలువడిన ప్రతి పదం సమాజాన్ని ఆలోచింపజేసే శక్తి కలిగినది. ఆమె రచనలు తరతరాల సాహిత్యప్రియులకు మార్గదర్శకంగా నిలుస్తూ, ప్రేరణను అందిస్తూనే ఉంటాయి. అనిశెట్టి రజిత ప్రజాస్వామిక మహిళా రచయితల సంస్థను నిర్మించి, కార్యదర్శిగా ఉంటూ సంస్థను ముందుకు నడిపారు. అనిశెట్టి రజిత గారు 2014లో **"తెలుగు విశ్వవిద్యాలయం నుండి ప్రతిభా పురస్కారం"**, 2016లో తెలుగు రచయితల వేదిక నుండి **"అలిశెట్టి ప్రభాకర్ పురస్కారం"** అందుకున్నారు. నిరంతరం సాహిత్య జీవిగా జీవించిన అనిశెట్టి రజిత ధన్యజీవి, వీరి జీవితం యువతరానికి ఆదర్శం. బహుజన బీసీ మహిళా ఉద్యమాలలో సావిత్రిబాయి పూలే వారసత్వాన్ని కొనసాగించిన అనిశెట్టి రజితకు జోహార్లు. రజిత అకాల మరణంతో శోకతప్తరులైన బంధుమిత్రులకు తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రజిత గారు సాహిత్య సృజన వైపు ఏ విధంగా వచ్చారు :

చిన్నతనం నుంచే పెద్దవారు చెప్పే కథలు, పుస్తకాలు చదవడం, పురాణ ఇతిహాసాలు అధ్యయనం చేయడం వలన రజిత గారికి సాహిత్యంపై ఆసక్తి పెరిగింది. రేడియో కార్యక్రమాలను తప్పకుండా వినడం, సందర్భానుసారంగా కవి సమ్మేళనాలు వినడం ఆమెపై గాఢమైన ప్రభావం చూపాయి. జిల్లా గ్రంథాలయాల నుండి పుస్తకాలు తెచ్చుకొని చదవడం ఒక అలవాటుగా మారింది. 1973లో వరంగల్‌లో **'చైతన్య సాహితీ'** స్థాపనతో మొదలైన సాహిత్య కార్యక్రమాల్లో రజిత గారు చురుకుగా పాల్గొన్నారు. ఆ కాలంలో సుప్రసిద్ధ కవులు, రచయితల పరిచయం, వారి ప్రసంగాలు వినడం ద్వారా సాహిత్య రసాస్వాదన మరింత పెరిగింది. అనంతరం సాంస్కృతిక సంఘం శ్రీలేఖ సాహితీ ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో జరిగిన సాహిత్య సమ్మేళనాల్లో కూడా ఆమె చురుకైన పాత్ర వహించారు. ఒకవైపు చైనా, రష్యా, అమెరికా అనువాద సాహిత్యం, మరోవైపు అభ్యుదయ, విప్లవ, హేతువాద, స్త్రీవాద కవిత్వం చదవడం – వీటితో పాటు మన తెలుగు కవుల కవితా సంపుటాలు చదవడం ద్వారా రజిత గారి కవితా పిపాస మరింత పెరిగింది. నిజానికి పుస్తకాలే ఆమెకు మంచి నేస్తాలుగా మారాయి. సాహిత్యంలో సృజనాత్మక శక్తి విలువ అర్థమైంది. సామాజిక ఉద్యమాల సాంగత్యం

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 హైదరాబాద్ అక్టోబర్ : 2025

ఆమెను సాహిత్యానికి మరింత చేరువ చేసింది. ఈ క్రమంలోనే ఆమె కలం అగ్నికలంగా మారింది. ఆ సమయానికే వారి కుటుంబంలో ఒక చిన్నారికి **"సృజన"** అని పేరు పెట్టారు. మన సమాజంలో ఆస్తులకు, వ్యాపారాలకు, జ్ఞానానికి వారసులు ఉన్నట్లే కలలకు కూడా వారసత్వం ఉంటుందని ఆమె భావించేది. నిజానికి శ్రామిక కుల వర్గంలో పుట్టిన రజిత గారికి సాహిత్యంలో ఎలాంటి శిక్షణా, మార్గదర్శకత్వమూ, వారసత్వమూ లేకపోయినా – ఆమె ప్రతిభ, ఆసక్తి, స్వీయపఠనమే ఆమెకు దారి చూపాయి. రజిత గారి ఇంట్లో "ఏం రాయాలి?", "ఏం రాయకూడదు?" అని ఎటువంటి ఆంక్షలు లేకపోవడం ఆమెకు స్వేచ్ఛనిచ్చింది. ఆమె బాపు, మేనత్త చదువుకున్నవారు కావడం వలన చదువు విలువ చిన్నప్పుడే అర్థమైంది. ముఖ్యంగా ఆమె కుటుంబం వ్యవసాయ కుటుంబం. చేను, చెల్క, పొలాల పనుల్లో పాలుపంచుకోవడం సాధారణం. చిన్ననాటి నుంచే నాయనమ్మతో కలిసి చేను కాడికి వెళ్ళడం వలన, మనం తినే ప్రతి గింజ వెనుక ఎన్నో చేతుల శ్రమ ఉందని ఆమె లోతుగా గ్రహించే అవకాశం లభించింది.

రజిత గారిని ప్రభావితం చేసిన రచనలు :

మన దేశంలో అమృత ప్రీతం, ఇందిరా గోస్వామి, మహాశ్వేతా దేవి, నీలకంఠన్, పెరుమాళ్ మురుగన్, బెంగాలీ సాహిత్యం వంటి అనేక రచనలు ప్రభావితం చేశాయి. తెలుగులో అయితే రావిశాస్త్రి, రంగనాయకమ్మ, వోల్గా ఇంకా ఎందరో చెప్పుకుంటూ పోతే పేజీలు నిండిపోతాయి. ఒక రచయిత మొత్తం రచనలు ప్రభావితం చేయకపోవచ్చు. ఒకే ఒక్క కథ, నవల, కవిత లేదా సంకలనం మనసును కదిలించగలదు. కొన్నింటి పట్ల ఆకర్షణ, మరికొన్నింటి పట్ల లోతైన ప్రభావం ఏర్పడుతుంది. ఉదాహరణకు, రావిశాస్త్రి గానీ, దాశరథి రంగాచార్య గానీవారి రచనలు మొత్తం ఒక చైతన్యాన్ని కలిగిస్తాయి అంటారు రజిత. రజిత గారు విప్లవాల కోటగా పేరు గాంచిన వరంగల్ నగరం మధ్యలో జన్మించడం వల్ల విప్లవోద్యమాల భావజాలం పరోక్షంగానైనా ఆమెను ప్రభావితం చేసింది. చదువుకునే కాలంలో పరిచయమైన విప్లవ సాహిత్య ఉద్యమాలు మరింత ఆకర్షించాయి. సమాజంలోని అవకతవకలు, అసమానతలు, దోపిడీ– పీడనలు, ఆధిపత్యాలు, పెత్తనాల పట్ల తిరుగుబాటు స్వభావం ఉన్నవారు తప్పనిసరిగా విప్లవోద్యమాలు, ప్రజాతంత్ర ఉద్యమాలవైపు ఆకర్షితులవుతారు. రజిత గారు కూడా అలాంటి వారిలో ఒకరు. ఆమె మానసికంగా మాత్రమే కాకుండా ప్రత్యక్షంగాను ఆ ఉద్యమాలలో మమేకమయ్యానని గర్వంగా చెబుతుంటారు.

తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమంలో రజిత పాత్ర :

ఆనాడు మెజారిటీ కవులు, రచయితలు, కళాకారులు ఉద్యమ కారులుగా మారిన సందర్భం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం తపిస్తున్న సందర్భంలో ఉధృతంగా తలెత్తిన తెలంగాణ సోయితో

రజిత కూడా తెలంగాణ రచనలు, సభలు, సదస్సుల్లో పాల్గొన్నారు. 'ఉసురు' అనే కవితా సంపటి ఆ సమయంలో వచ్చింది. తెలంగాణ సోయి ప్రధానంగా తెలంగాణ భాషా సంస్కృతుల మీద జరిగిన దాడికి వ్యతిరేకంగా మొదలయ్యిందే. వీరు మాతృభాష అయినా తెలుగులోనే ఎక్కువ రచనలు చేశారు. వివిధ సాహిత్య వేదికల ఏర్పాటుల్లో పాల్గొన్నారు. **'తెలంగాణ రచయితల వేదిక'** వ్యవస్థాపనలో ఉండి అన్ని తెలంగాణ జిల్లాలలో మహాసభలూ, సదస్సులూ జరుగుతున్న క్రమంలో పాల్గొన్నారు. **'వరంగల్ రచయితల వేదిక'**ను నిర్మించిన కవులు, రచయితలతో కలిసి నిత్యం ఉద్యమంలో పాల్గొన్నారు. వివిధ సాహిత్య సంకలనాల ప్రచురణ చేయడం వరకూ అన్నిట్లో చురుకుగా ఉండి పూర్తిస్థాయిలో పనిచేశారు.

'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక' ఏర్పాటులో రజిత కృషి:

తెలుగు రాష్ట్రం ఒక్కటిగా ఉన్నప్పుడు సాహిత్య, సాంస్కృతిక రంగాలు అగ్రకుల ఆంధ్రా ప్రాంతం వారి ఆధిపత్యంలో ఉండేవి. సాహిత్య కూటములు, పీఠాలు, పీఠాధిపత్యాలు అన్నీ వీళ్ళ పలుకుబడిలో విలసిల్లుతూ ఉండేవి. తెలంగాణ సాహిత్యకారులు అనామకులుగా వాయిస్ లేకుండా ఉండేవాళ్ళు. కవులకు ర్యాంకులు ఉండేవి అవన్నీ కూడా ఆంధ్రవాళ్లకి ఎక్కువగా ఉండేవి. అన్ని వేదికలూ, పురస్కారాలూ వాళ్ళవిగా ఉండేవి. గాయపడిన మనిషిని చితకబాదినట్లు ఈ క్రూరమైన బానిసత్వంతో పాటు ఇందులో అగ్రకులాలకు (పాలకవర్గ కులాలు) తప్ప ఇతర వెనుకబడిన, బహుజన కులాల రచయితలు, కళాకారుల పట్ల చిన్నచూపు ఉండేది. కులం చెప్పుకోవడానికి భయపడేవాళ్లు. ఎక్కడా వీరికి ఒక స్థానం, స్థాయి ఉండేది కాదు. కొంచెం ప్రవేశం ఉన్నచోట అంచులకు నెట్టబడి ఉండేవాళ్ళు. దామాషా పద్ధతిన అన్ని కులాల మహిళా రచయితలకు వేదిక నిర్మాణంలో స్థానం కల్పించి వారి గొంతుక వినిపించేలా చేసేవారు. పెద్ద చిన్నా, ఎక్కువ తక్కువ కులం, స్థాయి అని లేకుండా అందరు కలిసి వేదిక 'మ్యానిఫెస్టో'ను అనుసరించి ప్రజాస్వామికంగా పని చేయాలన్నదే లక్ష్యం. ప్రధానంగా ఇది మహిళల అంశాలు, విషయాలు, సమస్యలపై పనిచేసే రచయిత్రుల

వేదిక. ప్రజాస్వామికత అనేది అలంకారంలా వాడుకునే ఆభరణం లాంటి పదం కాదనేది రజిత అభిప్రాయం. ప్రజాస్వామికంగా ఉండటం అంత సులభమైన పనీ కాదు. ఏదైనా ఆచరణలో, ఆత్మపరిశీలన, సమీక్ష, విశ్లేషణ ద్వారా సాధ్యమవుతుంది. రజిత గారు భావజాల పరంగా కలిసివచ్చే సోదర సంఘాలు, వేదికలతో కలిసి పనిచేయడం, ప్రజా సమస్యలపై గళమెత్తడం, కార్యాచరణల్లో పాల్గొనడం, రచనలు చేసేవారు. సమస్యాత్మకంగా ఉన్న క్షేత్ర పర్యటనలు, రిపోర్టులు, ప్రచురణలు చేయడం వీరి యొక్క ముఖ్య కార్యక్రమంలోని అంశాలు.

కాళోజీతో రజిత గారికి ఉన్న అనుబంధం :

కాళోజీతో రజిత గారికి ఉన్న అనుబంధం ప్రత్యేకమైనది. ఆమె డిగ్రీ చదువుతున్న సమయంలో, సుమారు 1977లో, వారి నాన్నగారితో కలిసి కాళోజీ గారి ఇంటికి వెళ్లే అవకాశం వచ్చింది. తన నోట్బుక్‌లో ఆలోచన వచ్చినప్పుడు రాసుకున్న కొన్ని కవితలను ధైర్యం చేసి కాళోజీ గారికి చూపించింది. ఆ కవితలు చదివిన కాళోజీ గారు సంతోషపడి, లకోట(పెద్దగా) ఉన్నాయని చెప్పి, **"ఇలాగే రాస్తూ ఉండాలి"** అని ఆశీర్వదించారు. 1979లో కాళోజీ ఆధ్వర్యంలో వరంగల్‌లో 'చైతన్య సాహితీ' స్థాపించబడింది. ఈ వేదిక ద్వారా ప్రతి రెండు నెలలకు ఒకసారి ప్రముఖ కవులు, రచయితలను ఆహ్వానించి సాహిత్య కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ సంస్థలో రజిత గారు కార్యవర్గ సభ్యురాలిగా పనిచేసి, ప్రతి కార్యక్రమానికి హాజరవుతూ ఉండేవారు. అంతేకాదు, మిత్రమండలి ద్వారా కూడా ప్రతినెలా సాహిత్య సమావేశాలు జరుగుతుండేవి. ఈ విధంగా రజిత గారి సాహిత్య అనుబంధం మరింత బలపడింది. అయితే 1979లోనే ఆమె నాన్నగారు మరణించడంతో కుటుంబ బాధ్యతలు ఆమెపై పడ్డాయి. అప్పుడే రజిత గారు కాకతీయ విశ్వవిద్యాలయంలోని పరిపాలనా విభాగంలో ఉద్యోగం ప్రారంభించారు. అయినప్పటికీ, సాహిత్యంతో తన అనుబంధాన్ని ఎప్పుడూ కొనసాగించారు. వీలైనప్పుడల్లా కాళోజీ గారి ఇంటికి వెళ్లి కలిసేవారు. ఆయన రజిత గారిని "మనవరాలు" అని పిలుస్తూ ఆప్యాయంగా చూసేవారు. వారి కుటుంబ సభ్యులు కూడా ఎంతో ఆత్మీయతతో ఆదరించేవారు. 2023లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ అవార్డును ప్రకటించిన సందర్భంలో, ఆ జ్ఞాపకాలు రజిత గారి కళ్లను చెమ్మగిల్చాయి.

అనిశెట్టి రజిత గారి సందేశం – ఈనాటి యువ రచయితలకు:

అనిశెట్టి రజిత గారు రచయితలకు, కవులకు, కళాకారులకు ఇచ్చిన సందేశం ఎంతో విలువైనది. ఆమె అన్నారు : వేదికలకూ, శాలువాలకూ ఎగబడకండి. అన్నీ ఇన్‌స్టాంట్‌గా రావాలని తొందరపడకండి. పురస్కారాల కోసం పైరవీలు మానుకోండి. కవిత్వ సాధన చేస్తూ, సాహిత్య అధ్యయనం కొనసాగిస్తూ రచనలు చేయాలి. కవులు తమ ఆత్మను అమ్ముకుంటే, సమాజం తన ఆత్మను కోల్పోతుంది. రచయితలు సామాజిక బాధ్యతను గుర్తించి రచనలు చేయాలి. నూతన సమాజ ఆవిష్కరణకు దోహదపడేలా రచనలు ఉండాలి. ప్రతి రచనలో కొత్తదనం కోసం తపించాలి. పేరుకీర్తులు, పొగడ్తలు, సన్మానాలు, పురస్కారాలు అన్నీ తాత్కాలికమైనవే. కానీ బాధ్యతాయుతంగా చేసిన రచనలే శాశ్వతంగా నిలుస్తాయి. కవులు, రచయితలు, కళాకారులు తమ సృజన ద్వారానే మృత్యుంజయులు అవుతారన్నారు.

❖ ❖ ❖ ❖ ❖

'కదంబం'

(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)

మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం

ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-

శిలాక్షరం

(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.



సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-

సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

నీతి శాస్త్రము – తాళపత్ర గ్రంథము

డా. గంద్ర లక్ష్మణ రావు, విశ్రాంతాచార్యులు ఫోన్ : 98493 28036

అశ్వరూపం తతో గావః పుత్ర జామాతరస్తథా
కావ్యరూపస్తథా వేదాః పణ్యస్త్రీ కులాంగనా – 151

పద్యానువాదం :

అశ్వమునుపొంద కానలేడావువైపు
అల్లుడేతెంచ కొడుకుల నవలబెట్టు
కావ్యముల జూసి కనడు వేదమ్ము వైపు
వేశ్య గనినంత భార్యపై ప్రేమ వదలు

అర్థం : గుర్రాల పుట్టిన బట్టి గోవుల మీద ప్రేమలేదు, అల్లుండ్లు పుట్టబట్టి కొడుకుల మీద ప్రేమ లేదు, కావ్యాలు పుట్టబట్టి వేదములయందు ప్రియము లేదు, వేశ్యలు పుట్టుట బట్టి పెండ్లాము మీద ప్రేమలేదనిన రీతి.

శతేషు జాయతే శూర్ణ సహస్రేషు చ పండిత్ణ
వక్తా దశసహస్రేషుచ ప్రజ్ఞామేక నియోజయేత్ – 152
(శతేషు జాయతే శూర్ణ సహస్రేషుచ పండిత్ణ
వక్తా దశసహస్రేషుచ దాతా భవతి వా న వా – వ్యాసస్మృతి)

పద్యానువాదం :

వందలో నొక్క శూరుండు వాసిగాంచు
వరలు వేయిలో నొక్కడే పండితుండు
పదియు వేలలో నొక్కడే వక్త యుండు
ప్రజ్ఞగలవాడు కనరాడు ప్రజలయందు
(దాత యనువాడు కరువు భూతలమునందు)

అర్థం : నూర్గురలో వొక్కడే పరమశూరుడు, వేయిమందిలో వొక్కడే పండితుడు, పదివేల మందిలో వొక్కడే మాటలాడ నేర్చును, యిందరిలో వుత్తముడు కలడో లేడో? యెరుగరాదనిన రీతి.

గతస్త్రీ గణిగా ద్వేషి గతాయుష్య చికిత్సకః
గత స్త్రీ గతాయుష్యం బ్రాహ్మణద్వేషితా గతాః – 153

పద్యానువాదం :

ఊరి కరణముతో పగయున్న ఉడుగు పొలము
వైద్యుడనువానితో పగ ప్రాణ హాని
బ్రాహ్మణునితోడ వైరము భాగ్యమున్ను
యశము ఆయుష్యమును కూడ నంతమగును.

అర్థం : కరణంతో పగబెట్టుకుంటే భాగ్యం చెడును, వైద్యునితో రోగం కుదరక ఆయుష్యం చెడును, బ్రాహ్మణునితో పగబెట్టుకుంటే ఐశ్వర్యం, ఆయుష్యం, కీర్తి చెడుననిన రీతి.

గంధర్వ గంధ సంయుక్తం తాంబూలం భారతం తథా
యిష్టభార్య ప్రియత్పుత్రాయ పూర్వాణి దినే దినే – 154

పద్యానువాదం :

కమ్మనైనట్టి గానము, గంధసుమము
తమలము,యిష్టమగునట్టి తనదు భార్య
ప్రియసుతులు,వ్రాయు కలము, వీని జూడ
నిత్య నూతనమై యొప్పు నిజము సుమ్ము

అర్థం : గానమును గంధపుష్పములున్ను (చేయు తమలము, యిష్టభార్య,) వ్రాశేఘంటమున్ను యివ్వి నిత్యం క్రొత్తగా వుండుననిన రీతి. (17 వ ఆకు కొంత చిరిగిపోయిఉంది....)

రాజా రాక్షస రూపేణ ప్రధాని వ్యాఘ్ర రూపేణ
కాల్బలం శ్వాన రూపేణ ఆక్రోశం కిం కరిష్యతి – 155

పద్యానువాదం :

ప్రజల పాలించు రాజేమొ రాక్షసుడుగ
మంత్రి భయపెట్టు పులివోలె మసలు చుండ
భటులు శునకాల వలెమారి బాధపెట్ట
ప్రజలు రాజ్యము సర్వము భ్రష్టమగును

అర్థం : రాజు రాక్షసుని వలె, మంత్రి పులివలె, పరివారం కుక్కల వలె ఐతే ప్రజలు, ఆరాజ్యం చెడుననిన రీతి.

ఏకమృద్భాండ మనేక రూపం గోక్షీరమేకం
బహుధేను క్షీరం ఏకం బహుభూషణాని శరీ..... – 156
(మృత్పిండ ఏకో బహుభాండరూపం
సువర్ణమేకం బహుభూషణాని
గోక్షీర మేకం బహుధేను జాతం
ఏకః పరాత్మా బహుదేహవర్తీ – పాఠాంతరం)

పద్యానువాదం :

మట్టి యొక్కటే కుండలు మారునెన్నొ
పాల వన్నెయు నొక్కటే పసులు వేరు
అగును బంగారమొక్కటే నగలు వేరు
అన్నిదేహములను పరమాత్మ యొకటె

అర్థం : మన్ను వొక్క చోట తెచ్చి అనేక విధాల కుండలు చేయును, పాలు వన్నె వొక్కటే కాని అనేక విధ వన్నెల గోవులు కలవు, బంగారం వొక్కవన్నె కాని బహువిధ భూషణాలు చేయును.....మైన కొద్దీ మళ్ళీ వొక శరీరమెత్తి పరమాత్ముని గనుక వొక్కడే దైవమనిన రీతి.

ప్రాతఃస్నానమశేష పాపహరణం దుఃఖాది విధ్వంసనం
శౌచస్నాయతనం మలాపహరణం కాయాగ్ని సందీపనం

స్త్రీణాం మన్మథమోహనం శ్రమహరం
స్నానానాంచ శతైర్గుణం (ఆకు కొంతభాగం చిరిగిపోయింది) 157

పద్యానువాదం :

ప్రొద్దున చేయు స్నానమున పోవును పాపములున్విషాదముల్
శుద్ధిగమార్చు దేహమును చూడగ వేసట పారిపోయెడున్
ముద్దుగ చేరవచ్చెదరు మోహముతోడుత కాంతలెందరో
శ్రద్ధగ స్నానమొక్కటియె చాలును మేలగు వందలీతులన్

అర్థం : ప్రాతఃకాలమందు స్నానం చేసితే పాపహరం, దుఃఖహరం, ఆచారం, మూత్రపురీషా......(సగం ఆకు చిరిగిపోయి ఉంది) .... దేదీప్య రూపం, ప్రాణసుఖం, అంతరగ్ని ఆకలి, స్త్రీలు జూచిన మోహం, శ్రమలేదు మొదలైన గుణాలు కలవు.

అశక్తం దుర్జనం సాధు, అభార్యా బ్రహ్మచారిణః
వ్యాధిపీడితా దైవభక్తః వృద్ధనారీ పతివ్రతా
(అశక్తస్తు భవేత్సాధుర్బ్రహ్మచారీచ నిర్ధనః
వ్యాధితో దేవభక్తశ్చ వృద్ధ నారీ పతివ్రతా -పాఠాంతరము)-158

పద్యానువాదం :

శక్తి లేనట్టి దుష్టుడు సాధువగును
భార్య లేనట్టి వాడేమొ బ్రహ్మచారి
వ్యాధి పీడితుడగు దైవభక్తిపరుడు
వృద్ధ వనితయు నగు పతివ్రతయనంగ

అర్థం : ఏమీచేయలేనివాడు సాధువు, భార్యలేనివాడు (ధనం లేనివాడు) బ్రహ్మచారి, రోగంతో బాధపడేవాడు దేవతాభక్తుడు, వృద్ధస్త్రీ పతివ్రత అనిపించుకుంటారు.

యేకభుక్తం సదారోగ్యం ద్విభుక్తంచ బలవర్ధనం
త్రిభుక్తం ఆయుక్షీణాస్యాత్ చతుర్భుక్తే మృతిర్ ధ్రువమ్
(త్రిభుక్తే వ్యాధిపీడా -పాఠాంతరము) - 159

పద్యానువాదం :

అన్నమొకపూట తినినంత నాయువగును
రెండు పూటలు తినినంత రేగు బలము
మూడు పూటలు నాయువు మూడుచుండు
నాల్గు పూటలు మృత్యువు గల్గు నిజము

అర్థం : ఒకమాటు భోజనం సదారోగ్యం రెండు మాట్లు భోజనం బలవర్ధనం మూడు మాట్లు ఆయుక్షీణం నాలుగు మాట్లు తిన్నవానికి మరణం అనిన రీతి.

సిద్ధమన్నం వానప్రస్థం తాంబూలం బ్రహ్మచారిణం
యతీనాం కాంచనం దానం.....(కొంత చిరిగిపోయింది)-160

పద్యానువాదం :

తినగ మిగిలిన అన్నము తిన్నగాని
కనగ విద్యార్థి తమలము తినినగాని
కనక దానము సన్యాసి కరము బట్ట
వీరు నరకబాధ ననుభవింత్రు నిజము

అర్థం : మిగిలిన అన్నం తిన్నను, బ్రహ్మచారి తాంబూలం వేసుకున్నను, యతి కాంచనదానం బట్టినను మహానరకాలలో పడునని రీతి.

రాజాన్ దృష్ట్వా గ్రామమేకం దదాతు
విద్వాన్ శ్లోకమేకం........శిష్య దదాతు
వైశ్యాన్ దృష్ట్వా యూత్రపాత్రం దదాతు - 161

పద్యానువాదం :

ప్రభువుతోనున్న ఒకవూరు వచ్చు నేమొ
పండితునితోడ వచ్చును పద్యమొకటి
వట్టి పిసినారి యైనట్టి వైశ్యునడుగ
పిడికెడన్నము దొరకదు వీని గనుడు

అర్థం : రాజుననుసరిస్తే వొక వూరు యిచ్చును, పండితుడిని అనుకరిస్తే వొక శ్లోకం చెప్పును, కోమటిననుసరిస్తే పిడికెడు ముద్ద పెట్టదనిన రీతి.

స్వదత్తా పుత్రికా ధాత్రీ పితృదత్తాచ సోదరీ
అన్యదత్తాచ మాతాని అపహారే త్రీణి సంగమం -162

పద్యానువాదం :

పృథివి పతియిచ్చు భూములు బిడ్డలట్లు
తండ్రి యిచ్చిన అక్కచెల్లెండ్ర యట్లు
దాతలెవరైన యిచ్చిన తల్లి సమము
వాని పట్టించుకోనట్టి వాడు పాపి

అర్థం : రాజులు తాము యిచ్చిన క్షేత్రములు బిడ్డల వంటివి. తన తండ్రి యిచ్చినవి అక్క చెల్లెండ్లు, వొకరు యిచ్చినవి తల్లి వలెను యిట్లా గనుక తీసుకోనైనచో నాశనం చేసిన రవరవాది నరకం పడెదరనినరీతి.

స్వదత్తా ద్విగుణం పుణ్యం పరదత్తాను పాలనం
పరదత్తాపహారేణ స్వదత్తా నిష్ఫలం భవేత్ - 163

పద్యానువాదం :

పొలము తానివ్వ రెట్టింపు పుణ్యమగును
ప్రభువొసంగినదిచ్చిన ఫలములేదు
పరులదానము దొంగిలింపంగ బూన
తనదు దానఫలముకూడ తరిగిపోవు

అర్థం : తాను సంపాదించిన క్షేత్రాలను దానం చేయగా కలిగే పుణ్య ఫలితం రెట్టింపు అవుతుంది. రాజులిచ్చిన క్షేత్రములు దానపూర్వకంగా యిచ్చిన ఫలం లేదు. వొకడు యిచ్చినవి తాను యిచ్చినవాడైనా తన దానఫలితం కూడా తగ్గిపోతుంది.

(తాళపత్ర గ్రంథము పూర్తియైనది)

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 (43) హైదరాబాద్ అక్టోబర్ : 2025

దాశరథి సాహిత్యం – పర్యావరణ స్పృహ

డా. వర్ధ వేణు, తెలుగు అధ్యాపకులు(అతిథి), బిజెఆర్ ప్రభుత్వ కళాశాల, హైదరాబాద్. ఫోన్ : 9963814584

తెలంగాణా వైతాళికుడు, తెలంగాణా సాహిత్యం అనగానే గుర్తుకు వచ్చే మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు. వీరు దాదాపు 40 కవితా సంపుటాలు వెలువరించారు. బహుముఖ ప్రజ్ఞశాలి, ఉర్దూ, తెలుగు, సంస్కృతం, ఆంగ్లం వంటి భాషల్లో ప్రావీణ్యులు. వీరిమీద ఉర్దూభాష సాహిత్యం ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. వీరు ఎన్నో సినిమాలకు పాటలు రచించారు. వీరి కవిత్వంలో మొదట తెలంగాణా ఉద్యమం ఆతరువాత ప్రకృతి, పచ్చదనాన్ని, వసంత ఋతువు, ఉగాది, దీపావళి, ఎండలు, వానలు, వనాలు, భూమి, చీకటి, వెలుతురు వంటివి కవితా వస్తువులుగా తీసుకున్నారు. వీరు తమ తల్లికి అంకితమిచ్చిన కావ్యం "తిమిరంతో సమరం" కవితాసంపుటి కనిపిస్తుంది. ఈ పద్య పాదం చూస్తే **"తెలగాణమ్మున గడ్డిపోచయును సంధించేన్ కృపాణమ్మురా"** అంటే తెలంగాణాలో మనుషులకే కాదు, ప్రకృతికి కూడా పౌరుషం ఉంది. ప్రకృతి మనుషులు చేసే వికృత చేష్టలను సహిస్తూ వస్తుంది. ఓపిక నశించిన తరువాత ప్రకృతి విలయ తాండవం ఎలా ఉంటుందో చూపిస్తుంది. మనిషి ఊహకు అందని ప్రళయం చూపిస్తుంది. భూకంపాలు, సునామీలు , వరదలు మనం చూడొచ్చు. తెలంగాణాలో మనుషులకు ప్రకృతికి ఉన్నంత ఓపిక ఉంటుంది. ఆ ఓపిక నశిస్తే ఎలా ఉంటుందో ఉద్యమం ఎలా ఉవ్వెత్తున లేచిందో మనం చూసాం. ఇక్కడ కవి తెలంగాణాను ప్రకృతితో అన్వయించడం కనిపిస్తుంది. తెలంగాణా అంటే గుర్తుకు వచ్చేవి రెండు పువ్వులు. ఒకటి మోదుగు పువ్వు, రెండు తంగేడు పువ్వు. ఇతర ప్రాంతాలలో మోదుగు పువ్వుకు అంత ప్రాధాన్యత ఉందో లేదో తెలియదు. తెలంగాణాలో మోదుగుపువ్వుకు మాత్రం చాల ప్రాధాన్యత ఉంది.

ప్రజాకవి దాశరథి సాహిత్యం రెండవ సంపుటిలో బాలల గేయాలులో జాజితీగ గేయంలో –

"జాజి తీగ జాతి తీగ పూయవేమే పూయవేమే
వసంతుడే వచ్చినాడే వనంలో చొచ్చినాడే
చెట్లన్ని చిగుళ్ళతో సింగారం చేసినాయే"

ఇక్కడ వసంతం రాగానే చెట్లన్నీ అకులురాల్చి ఆ కొత్త చిగుళ్ళు చిగురిస్తాయి. ఆ చెట్లు గత స్మృతులు మరచి కొత్త ఆశయాలతో ముందుకు సాగుతుంది. పుడమి ప్రకృతిని ఆస్వాదిస్తుంది. వసంతంలో అడవి పచ్చని చీర కటినట్లు అందంగా కనిపిస్తుంది. ఇలా దాశరథి కవిత్వంలో ప్రకృతి స్పృహ కనిపిస్తుంది.

"మోదుగులే పువ్వులతో మురిసిపోయే అడవిలో
ఇప్పపువ్వుల వాసనలు గుప్పుమనేను అడవిలో"



ఎరుపు చైతన్యానికి గుర్తుగా చూస్తాం. మోదుగుపూలు వసంతానికి స్వాగతం పలుకుతున్నాయి. హోలీ పండుగ రాగానే మోలతో రంగు చేసి చల్లుకుంటాం. అలాగే వసంతంలో అడవంతా మోదుగుపూల రంగు చల్లినట్లుగా కనిపిస్తుంది. ఇదే సమయంలో ఇప్పపూల వాసన అడవంతా గుబాళిస్తుందట. ఈ కవితను మనం ఊహిస్తే ప్రకృతి రమణీయత మన కళ్ళముందు కనిపిస్తుంది.

నిజంగా దాశరథి కవిత్వంలో ప్రకృతి, చేనేత చీరకు రంగులు అద్దినట్లుగా కనిపిస్తుంది. వీరి కవిత్వంలో చెట్లు, పూలే కాదు. రకరకాల పక్షుల రాగాలు సహితం కనిపిస్తాయి.

"వసంతుడే బ్రాహ్మణుడై వస్తాడు. పెండ్లి చేయ
మన్మధుడే పెండ్లి పెద్ద మాదిరి వ్యవహరిస్తాడు.
అదిగో కోకిల కూసేను కుకూ అదిగో పిచ్చుక లాడెను దూడూ
అదిగో గువ్వలు పలికెను గుగూ అదిగో పావురమన్నది బూబూ"

దాశరథి సాహిత్యం రెండవ సంపుటిలో బాలగేయాలు కనిపిస్తాయి. మనుషుల పెళ్ళికి బంధు మిత్రులు పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తారు. ఇక్కడ చిలుకమ్మ పెళ్ళికూతురు అయితే గోరువంక పెళ్ళికొడుకు. ఈ ఇరువురి పెళ్ళికి ప్రకృతి పంచభూతాలు పెళ్ళిపెద్దలైనాయి. దాశరథి బాలగేయాలు పంచభూతాలతో పెనవేసుకున్నాయి. చిలుకమ్మ పెళ్ళికి జామతోట పెళ్లి పందిరి అయితే చెట్టు కొమ్మలు విడిదిగా ఏర్పడ్డాయి. కొమ్మలపై గూళ్ళు కట్టి కూర్చుండ బెట్టాయి. కోకిల కాకులు సన్నాయి వాయించాయి. ఇక అడవిలోని పిట్టలన్నీ ఊరిలోని జనాలుగా కూర్చున్నాయి. మేఘాలు చిలుకమ్మ పెళ్ళికి నీళ్ళు చిలికాయి. ఈ విధంగా చిలుకమ్మ పెళ్ళికి ప్రకృతి పంచభూతాలు తోడై నీడై నిలిచాయి. దాశరథి గేయంలో ప్రకృతి, పంచభూతాలు, పక్షులు వీటి మధ్య బంధాలు ఎలా పెనవేసుకున్నాయో ఈ గేయంలో మన చూడొచ్చు.

మరో కవిత **తిమిరంతో సమరం** లో సబలైన అబల–

"మృత్యువు నృత్యం చేసే చోట అమృతం పంచె మోహిని ఆమె
బొల్లి గద్దవలె యుద్ధవిమానాలు పల్లటిలు కొడుతుంటే
అవి వర్షించే బాంబులకు అవని గుండెలు గుబెలు మంటుంటే
తొణకదు బెణకదు జంకదు గొంకదు"

రెండవ ప్రపంచ యుద్ధంలో అమెరికా జపాన్ లోని నాగసాకి, హిరోషిమా, ప్రాంతాలలో బాంబు దాడి చేసినప్పుడు ప్రాణ నష్టం, ఆస్తి నష్టంతో పాటు కొన్ని సంవత్సరాల పాటు భూమి మీద గడ్డి మొలవలేదు. అక్కడ జరిగిన ప్రకృతి విధ్వంసం అంత ఇంత కాదు. ఇప్పటికి కూడా పంటలు పండించు కోవడానికి అవకాశం లేదు. చుట్టూ ఉన్న ప్రాంతాలు జలకాలుష్యం, వాయుకాలుష్యం, భూకాలుష్యం, రేడియేషన్ వంటి కాలుష్య సమస్యలతో బాధపడు తున్నారు. పహల్గాం దాడిలో హిందువులను కాల్చి చంపిన పాకిస్తానీయులకు సింధు నది జలాలు అడ్డుకోవడం వలన పాకిస్తాన్ లో నదులు, చెరువులు ఎండిపోతున్నాయి. ఆకలి సమస్యలు కనపడుతున్నాయి. భారత్ చేసిన మిస్సైల్స్ దాడిలో పాకిస్తాన్ లోని కరాచీ ప్రాంతం అంత కూడా ధ్వంసం అయింది. చాలా ప్రాంతాలు జలకాలుష్యం, వాయుకాలుష్యం, భుకాలుష్యం, జరిగింది. ఈ మిసైల్స్ దాడిలో పాకిస్తాన్‌లో అణు రియాక్టర్లు పేలి ప్రజలకు రేడియేషన్ వలన చర్మ వ్యాధులు వస్తున్నాయి. నిజంగా దాశరథి చెప్పినట్లు బొల్లిగద్దల వలే యుద్ధవిమానాలు పల్టీలు కొడుతూ మిసైల్స్ తో ప్రాంతాలను ధ్వంసం చేసాయి. ఈ అవని గుండెలపై ఎన్నో బాంబుల వర్షాలు కురిపించారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటన వంటి... మానవుడు చేసిన ప్రకృతి విధ్వంసాలు ఇన్నీ అన్నీ కాదు.

దాశరథి తిమిరంతో సమరం కవిత సంపుటిలో క్రాంతి ప్రాకారాలు కవితలో –

"గాలిలో తేలింది బాంబు
నేలపై రాలింది బాంబు గుండెలో పేలింది బాంబు
విశ్వంభరా వాయు మండలం విషకలుషితమైంది.
తనను తాను చంపుకోవడానికి తాపత్రయపడుతున్నాడు మనిషి
ఎవడికి వాడు ఘనుడు అవనిని ఉద్ధరిస్తానంటాడు."

ఈ యుద్ధాలలో ప్రాణనష్టం ఆస్తి నష్టం జరిగినా తట్టుకోవచ్చు. కాని ప్రకృతి విధ్వంసం జరిగితే తరతరాలుగా ఆ నష్టాన్ని అనుభవించాల్సి వస్తుంది. ఏన్నో దేశాలు అహంకారానికి ప్రతీకారానికి పోయి ఈ భూమిని బద్దలయ్యేలా యుద్ధం చేస్తూ బాంబులు విసురుతున్నారు. ఎన్ని గాయాలు చేసిన భూమి మనల్ని భరిస్తుంది. యుద్ధం వలన ప్రకృతి ఎంత విధ్వంసం జరుగుతుంది. అనే ఆలోచన లేకుండా మనిషి ప్రవర్తిస్తున్నాడు.

దాశరథి మరో కవిత **"నది నాతో మాట్లాడినది"** కవిత్వంలో పల్లెటూరికి పట్టణానికి తేడా చెపుతూ నది పట్నంలో ఉండడానికి ఇష్టపడదట.

"నది నాతో మాట్లాడి నది చేపలు అంతరార్థాలు ఇసుక ధ్వని
ఇంతకి నది చెప్పిందేమీటని భూత భవిష్యత్తు వర్తమాలు నాకు తెలుసు
పట్నంలో నది మాట బలే వింతగా వుంటుంది.
పట్నం నదితో పోట్లాడుతుంది. నది డొక్కలో కత్తి గుచ్చుతుంది.
నది పట్నాన్ని నరుకుతుంది. దొరక్కుండా ఉరుకుతుంది
నది లేని ఊరు గది లేని ఇళ్ళు పొద లేని అడవి
ఎదలేని మనిషి ఎవడిక్కావాలి"

ఊరు బాగుండాలంటే ఊరి చెరువు బాగుండాలి. వెనుకటి రోజుల్లో ఊరి చెరువును చూసి పిల్లను ఇచ్చే వాళ్ళు. నది తీర ప్రాంతంలో వాళ్ళు అభివృద్ధి ఎక్కువగా ఉంటుంది. ప్రపంచంలో ఎక్కడ చూసిన పెద్ద పెద్ద పట్టణాలు నది తీర ప్రాంతాలలో ఉంటాయి. నది ఉన్న ప్రాంతం అన్ని సౌకర్యాలకు అనుగుణంగా ఉంటుంది. కానీ ప్రస్తుతం ఉన్న కాలాన్ని దాశరథి ఎప్పుడో ఉహించారు. దాశరథి చెప్పినట్లు పట్నం నదితో పోట్లాడుతుంది. నది డొక్కలో కత్తి గుచ్చుతుంది. భాగ్యనగరంలో మూసీ నదిలో ఒకప్పుడు స్వచ్ఛమైన నీరు ప్రవహించేది. కానీ ఇప్పుడు పరిస్థితి విరుద్ధంగా ఉంది. నిండుగా ప్రవహించే నది ఇప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలతో బక్కచిక్కి పోయింది. ఫ్యాక్టరీల్లో నుంచి వచ్చే విష, వ్యర్థపదార్థాలు నదులల్లో కలవడం. డ్రైనేజి నీళ్ళతో కలుషితం అవడం. ఇలా నది కాలుష్యబారిన పడి విలవిలలాడుతుంది. నది దగ్గర కూర్చొని హాయిగా ముచ్చటించే జనాలు ఇప్పుడు మూసీని చూసి ముక్కు ముసుకుంటున్నారు. ఈ ఒక్క మూసీ నది పరిస్థితే కాదు. దేశంలో అన్ని నదుల పరిస్థితి ఇలానే ఉంది. ఆగ్రాలో తాజ్ మాహల్ పక్కన ఉన్న యమునా నది పరిస్థితి అంతే పర్యాటకుల తాకిడికి ప్లాస్టిక్‌తో కాలుష్య బారినపడుతునే ఉంది. పరిశ్రమల, నగరాల అభివృద్ధి పేరుతో నదులను కాలుష్యభరితం చేస్తున్నారు. అందుకే నది ఇప్పుడు పట్నాన్ని కాదు పల్లెటూరును ఇష్టపడుతుంది. అందుకే కవి నది లేని ఊరు పొదలేని అడవి ఎవడిక్కావాలి, అంటాడు. దాశరథి పర్యావరణ స్పృహతో నది పరిస్థితిని భూత భవిష్యత్ కాలాల్లో చక్కగా వర్ణించాడు. ఇప్పటికైనా మనిషి తప్పిదాలను తెలుసుకొని నదులను కాపాడుకోవాలి.

దాశరథి కవిత్వం చదువుతుంటే రోమాలన్నీ నిక్కపొడుచుకొని యువకుల నరాల్లో రక్తం ఉత్సహంతో పొంగుతుంది. తన కవిత్వంతో నిజాం గుండెలలో గుబులు పుట్టించాడు. నిజాంకు కంటి మీద కునుకు లేకుండా చేశాడు. వీరు అభ్యుదయకవి మాత్రమే కాదు. వీరి కవిత్వం పర్యావరణ –ప్రకృతి స్పృహతో కూడి ఉంటుంది. వీరి కవిత్వంలో గాలి, నీరు, చెట్లు, నదులు భూమి, ఆకాశం వంటివి కవిత వస్తువు కనిపిస్తుంది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 హైదరాబాద్ అక్టోబర్ : 2025

తెలంగాణ కథ – వాస్తవికత

డా. మట్టా సంపత్కుమార్ రెడ్డి, సహ ఆచార్యులు, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధిపేట. ఫోన్ : 9849470792

ప్రాయికంగా మనిషి తన ఆనందంకోసం సృష్టించుకున్న సాహిత్యం ఆత్మవిమర్శ కోసం కూడా అంతే సమర్థంగా పాటుపడుతదనేది అనుభవపూర్వకమైన విషయం. ఇది ఈనాటిదేమీ కాదు, రామాయణ రచనాకాలానికే స్థిరపడిన ముచ్చట. ఒక్కో వ్యక్తికి ఒక్కో తరహా వ్యక్తిత్వం ఉన్నట్టే ఒక్కో ప్రాంతపు సాహిత్యానికీ తనదైన ఒక ప్రాంతీయ అస్తిత్వ నిర్మాణం సహజంగానే ఉంటది. సమస్త తెలుగుసాహిత్యంలో తెలంగాణ సాహిత్యానికి, అందులోని కథాసాహిత్య ప్రక్రియకూ ఇటువంటి తనదైన వ్యక్తిత్వముద్ర ఉన్నది. తన గమనపు చరిత్రే ఇందుకు నిదర్శనం. చరిత్ర నుండి సాహిత్యం, తిరిగి సాహిత్యం నుండి చరిత్ర ఎట్లా లిఖించబడుతాయో ఇక్కడి కథాక్రమాన్ని అనుశీలించి విశ్లేషించుకోవచ్చు. ఆ దిశగా ఒక స్థూల అవగాహన నిర్మితికోసమే ఈ వ్యాసం.



తెలంగాణాలో తెలుగుకథ ఆవిర్భవించి శతాబ్దకాలం దాటిపోయింది. కథాప్రక్రియ అనతికాలంలోనే తిరుగులేని విస్తృతిని, పరిణతిని సాధించింది. తొలినాళ్ళ తెలంగాణా కథలు సంఘసంస్కరణ, అభ్యుదయ దృక్పథాలతో వ్రాయబడ్డాయి. ఉర్దూసాహిత్యంలోని అభ్యుదయధోరణి ఆనాటి విద్యాధికులకు మార్గదర్శకమైంది, అంటరానితనం, స్త్రీవిద్య, బాల్యవివాహాలు, వేశ్యజనోద్ధరణ, భిక్షువులపట్ల ఆదరణ, మతమార్పిడులు, ఆర్యసమాజ ప్రబోధాలు, బడుగుల కష్టాలు, కులీనుల విలాసాలు తొలితరంకథల్లో సమకాలినతతో నమోదయ్యాయి, సాంఘిక వాతావరణం, భాష, కథాకథనం మూడింటిలో కూడా స్థానికత్వముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. భూస్వాముల దోపిడి, వెట్టిచాకిరి, ప్రభుత్వ అధికారుల దుర్నీతి, రజాకార్ల ఆగడాలు, తిరుగుబాట్లు, కమ్యూనిష్టు మరియు కాంగ్రెసు దళాల నాయకత్వం, పోలీసుచర్య అనంతర పరిస్థితులు తొలితరం కథల్లో స్థలకాలాలతో సహా నమోదయ్యాయి. 1940 మొదలు 1956 వరకు తెలంగాణా సామాజిక, రాజకీయ చరిత్రనంతా ఆనాటి రచయితలు తమకథల్లో పొందుపరిచారు. కథకులే స్వయంగా ఉద్యమకారులు, సంపాదకులు, పత్రికా నిర్వహకులు, పాఠకులు, ప్రచారకులు, సేవకులు కావటం వలన వారి అనుభవాలే కథలుగా రూపొంది స్థానికజీవితాన్ని చిత్రించటంలో సఫలమయ్యాయి. 1956 నాటికి తెలంగాణా కథారంగం అన్ని విధాలా పరిపుష్టిని సాధించింది.



ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావంతర్వాత తెలంగాణాకథాగమనం పుష్కరకాలంపాటు కుదుపులకు లోనయ్యింది. తనకంటే భిన్నమైన రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సాహిత్య నేపథ్యాలుకలిగిన బ్రిటిషాంధ్ర ఆధిక్యతను తట్టుకోలేక నిరాదరణకు గురైంది. ప్రచారం చేసుకోవటంపట్ల తగినంత అవగాహన, అపేక్షలేని కారణంగా గత, వర్తమాన సాహిత్యసంపద మరుగునపడింది. అయినప్పటికీ ఖమ్మం, పాలమూరు ప్రాంతాలనుండి, హైదరాబాదునుండి కథలు, కథాసంపుటాలు పుష్కలంగా వెలువడ్డాయి. అయితే ఈ కాలపు కథలపై బ్రిటిషాంధ్ర కథాప్రభావం ఎక్కువయి భాషలో, ఇతివృత్తంలో పరాయీకరణచోటు చేసుకుంది. తమ రచన ప్రస్థానంలో 1956కు ముందు, తర్వాత వ్రాసినకథల్లో ఈమార్పు సుస్పష్టంగా కన్పిస్తుంది. తెలంగాణాకథ తన ఉనికిని తిరిగి నిలబట్టుకోవడానికి చేసిన ప్రయత్నమే 1964లో వచ్చిన గడ్డిపూలు కథాసంకలనంగా చెప్పుకోవచ్చు. తెలంగాణాలో రెండు ప్రముఖ ప్రజాపోరాటాల మధ్య సంధికాలపు పరిణామాలను ఈ కథలు ప్రాంతీయదృక్పథంతో రికార్డు చేశాయి. ఇక్కడినుండి తెలంగాణాకథ మలిదశ ప్రస్థానం మొదలైంది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినా మారనిబతుకులు, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులోని అసంబద్ధత, ప్రభుత్వ ఉద్యోగాల్లో పక్షపాతం, భాషాసంస్కృతులపట్ల వివక్ష, అమలుకాని ఒప్పందాలు, గ్రామాల్లో దొరల దురహంకారం మలితరం విద్యాధికుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమై కండ్లముందరి వాస్తవాలు









కథలుగా రూపొందాయి. ఈ కాలపు కథలుకూడా అనివార్యమైన ఒత్తిడిలోంచే పుట్టుకొచ్చాయి. తెలంగాణాలో ప్రజ్వరిల్లిన ప్రజాపోరాటాలన్నీ భూమికోసం, భుక్తికోసం, విముక్తికోసం జరిగినవే. ఉత్తర తెలంగాణా గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగిన దొరల దురాగతాలకు 1968–70ల మధ్య వచ్చిన ప్రజల తిరుగుబాటు కళ్లెంవేసింది. పంటభూమి, పశువులు, శ్రమ, లైంగిక దోపిడీలను ఎదిరించి నిలిచిన శ్రామికజన సాహస ఘట్టాలు తెలంగాణాకథల్లో చిత్రితమయ్యాయి. 1970లో బద్లా కథాసంకలనం నిషేధానికి గురైంది. ఈ కాలంలో పంటభూమి వస్తువుగా పెద్దమొత్తంలో కథలు వ్రాయబడ్డాయి. నిజానికి ఇందులో సింహభాగం యథార్థ సంఘటనలు. ఈ సంఘటనల ఆనవాళ్ళు నేటికీ గ్రామాల్లో వృద్ధతరం దగ్గర పదిలంగా ఉన్నాయి. ఈ పోరాటాల ఒరిపిడినుండి బైటపడేందుకు చాలామంది యువకులు బొగ్గుగనులకు కార్మికులుగా తరలిపోయారు. కానీ అక్కడా అవినీతి, ఆధిపత్యం, దోపిడీ, పక్షపాతం కార్మికులను వివక్షకు గురిచేసాయి. శ్రమకు తగిన ఫలితం, ఆవాసకల్పన, ఉద్యోగ భద్రత దొరకని కార్మికులు అస్తిత్వ పోరాటాలకుదిగి సుదీర్ఘమైన సమ్మెలు చేశారు. సింగరేణికార్మికసమితి సాయుధ పోరాటానికి సిద్ధపడింది. కార్మికులజీవితాల్లో నెలకొన్న సంఘర్షణను, అనిశ్చితిని, అభద్రతను సింగరేణికథాసాహిత్యం ఆద్యంతం చిత్రించింది. భర్తల్ని, కొడుకుల్ని ఉద్యమాలకు బలిదానమిచ్చిన స్త్రీల బ్రతుకుతెరువు పోరాటాన్నికూడా ఈ కథలు వాస్తవికంగా ఎత్తి చూపించాయి.

ఆదిలాబాదు – కరీంనగర్ రైతాంగపోరాటం కార్మికులతోబాటు గిరిజనులనూ ప్రభావితం చేసింది. ప్రాణహిత–గోదావరి లోయ అడవుల్లోని గోండుల అమాయకత్వాన్ని ఆసరాచేసుకుని భూస్వాములు, షావుకార్లు, అటవీశాఖసిబ్బందివంటి మైదాన ప్రాంతీయులు జరిపినదోపిడిని, దౌర్జన్యాన్ని తెలంగాణకథలు ఉద్యమస్ఫూర్తితో చిత్రించాయి. ఉద్యమకారులే రచయితలై గోండుల జీవితంతో సహానుభూతి చెంది గోండువల్లెల్లో సమకాలీన స్థితిగతుల్ని కథలుగా వ్రాశారు. ఫలితంగా గోండులజీవితం, హక్కులపోరాటం మొదటిసారి తెలుగుసాహిత్యంలో అంతర్భాగమయ్యాయి. తెలంగాణా సగటుమహిళ తనుచూసిన గోండుస్త్రీల సమస్యల్ని జంగుబాయి కథగా మలిచింది. అప్పటికి ఇది చాలా గొప్పప్రయత్నం. ఆ తర్వాత దేవరకొండ – నల్లగొండ కరువు ప్రాంతాల్లో లంబాడాలు పసికందుల్ని అమ్ముకొన్న దుస్థితి, పాలమూరు గిరిజనుల వలసలు, పోలవరం ప్రాజెక్టునిర్మాణంతోజరిగే, గిరిజన జీవనవిధ్వంసం పైన కూడా తెలంగాణాకథ నిజాయితిగా, ఆర్తితో స్పందించడం మొదలైంది కనుక ఈరకమైన స్పృహకు ఇక్కడి కథలే నాంది పలికాయి.

1990తర్వాత ప్రపంచ, దేశ ఆర్థికరంగాల్లో చోటుచేసుకున్న మార్పులు తెలంగాణా ప్రజాజీవితంపై తద్వారా కథారంగంపై స్పష్టమైన ప్రభావాన్ని చూపించాయి. జాతీయ ఆర్థిక సరళీకరణలో భాగంగానే తెలంగాణాలోని పరిశ్రమలు ఖాయిలాపడ్డాయి. పరిశ్రమల్లో యంత్రీకరణపెరిగి కరువైన ఉద్యోగభద్రత, డబ్బును పెట్టుబడిగా మార్చిన ఫైనాన్సు వ్యవస్థ, వ్యాపారవస్తువుగా మార్చబడిన భూమి, కరువుకోరల్లో చిక్కిన వ్యవసాయం, కులవృత్తుల విధ్వంసం తెలంగాణాపల్లెలను నిర్వీర్యం చేశాయి. అప్పుడప్పుడే చిన్నాచితకా ప్రభుత్వఉద్యోగాలు సాధించిన గ్రామీణ యువతరం పట్టణాలకు తరలిపోవటంతో తలెత్తిన అస్తిత్వసమస్య, గ్రామాల్లో ప్రపంచీకరణ పరిణామాలు తెస్తున్న మార్పులు కొత్తతరం కథకులకు తగిననేపథ్యాన్ని అందించాయి. ఎండిపోయినబోర్లు, బావులు, కబేళాకు తరులుతున్న పశువులు, కూలీలుగా మారినరైతులు, పంటభూముల వ్యాపారం, విద్యుత్తుకోత, మార్కెట్ మోసాలు, బ్యాంకుఅప్పులు కథలుగా మారాయి. ప్రపంచీకరణ చేదుఫలాలతో చేనేతరంగంలో ఆకలిచావులు, వడ్లకమ్మరి పనులు, కుమ్మరం, గౌడవంటి కులవృత్తులు సంక్షోభంలో పడినతీరు, సీసకమ్మరి, కాటికాపరి,

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 (47) హైదరాబాద్ అక్టోబర్ : 2025

పశువులకాపరి మొదలైన చిన్నవృత్తులు, పైడిబాపనోళ్ళు, గంగిరెద్దులు, భిక్షుక, ఆశ్రితకులాల పతనం వంటివీ కూడా సూక్ష్మపరిశీలనతో సాహిత్యీ కరించబడ్డాయి. ఈ బహుముఖ దృక్పథంవల్లనే తెలంగాణాకథ సమస్త తెలుగుకథకు దశను, దిశను నిర్దేశించేస్థాయికి ఎదిగింది.

దుర్భరమైనకరువు వ్యవసాయాన్ని కృంగదీయటం, మరోవైపు ఉద్యమాల అణచివేతకు పోలీసులు యువతరాన్ని లక్ష్యంగా చేసుకోవడంవల్ల దిక్కుతోచని పరిస్థితుల్లో తెలంగాణాయువకులు బొంబాయి, గల్ఫ్ వలసలకు సిద్ధపడ్డారు. పాలమూరుకూలీలు పొట్టచేతబట్టుకుని దేశంనలుమూలలకు చెల్లాచెదురయ్యారు. ఈ వలసలు ఎంతటి బాధాకరపరిణామలో, వాటి పర్యవసానాలెట్లా ఉంటాయో తెలంగాణాకథలు చదివితే తెలుస్తుంది. వలసలకు సంబంధించిన వాస్తవఘటనలెన్నో కథలుగా మలుచబడ్డాయి, సింగరేణిలో ఓపెన్కాస్టు విధానం, భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాలు, ఆర్థికమండళ్ళ ఏర్పాటు, నగరాలవిస్తరణ, పారిశ్రామికీకరణ, గ్రానైటుకొరకు గుట్టల త్రవ్వకాలు నేడు తెలంగాణా గ్రామాలను పెకలిస్తున్న సందర్భాన్ని స్వానుభవంగా ఇక్కడి రచయితల కథలుగా సాహిత్యీకరించారు.



హైదరాబాదు సంస్థానంగా ఉన్నప్పటినుంచే తెలంగాణాలో దళిత- స్త్రీ చైతన్యదృక్పథం ఒక ధోరణిగా రూపుదిద్దుకున్నది. తెలంగాణాదళితుల ప్రత్యేకసమస్యలపై వందలకథలు వచ్చాయి. దళితులపై జరిగిన వివిధరకాలదోపిడి, బాణామతి, జోగిని వంటి సాంఘికాచారాలవెనుక రూపుదిద్దుకున్న దురుద్దేశాలను, భూపోరాటాల్ని ఈకథలు తేటతెల్లం చేశాయి. ప్రజాపోరాటాలు, విద్యావకాశాలు తెచ్చిన మార్పులతో అందిపుచ్చుకున్న ఆత్మస్థైర్యాన్ని చిత్రించాయి. స్థానికంగా పనిపాటల్లో, కుటుంబపోషణలో, ప్రజాపోరాటాల్లో స్త్రీలపాత్ర పురుషులతో సరిసమానమైంది. తెలంగాణాలో బీడీపరిశ్రమ కేవలం స్త్రీ శ్రమశక్తితోనే ముడిపడి ఉంది. బొంబాయి, దుబాయి, బొగ్గుబాయి వలసలవల్ల ఇంటిదగ్గర స్త్రీలు ఎదుర్కొన్న కష్టాలు, చేనేత, గౌడ కులవృత్తుల్లోని స్త్రీల ప్రత్యేక సమస్యలు, దురాచారాల పీడన, వలసల్లో, ప్రజాపోరాటల్లో భర్తల్ని, కన్నకొడుకుల్ని కోల్పోయిన వెతలు ఇక్కడి స్త్రీలకు నిరంతరగాయాలు, ఈ సమస్యలన్నీ చిత్రించటం, పరిష్కారం కొరకు తండ్లాడటం తెలంగాణా కథలు ఒక బాధ్యతగా స్వీకరించాయి. మైనారిటీ స్త్రీల జీవితాల్లోని సమస్యలూ కథావస్తువులయి సమర్తవతమైన కథలుగా మలుచబడ్డాయి. ఈ రకంగా తెలంగాణా స్త్రీల జీవితాలు వందేళ్ళపొడవునా తెలంగాణాకథకు ముడిపదార్థాన్నిచ్చాయి. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమకాలంలో స్వాభిమానం పౌరుషాలతో ఎందరో కొత్త సృజనకారులు తమ అనుభవాలను వైవిధ్యభరితమైన కథలుకథలుగా చిత్రించారు.



తెలంగాణా కథ కాలంవెంట కలిసినడిసింది. కాలగమనంలోని వివిధసందర్భాల్ని, సంఘటనలన్ని ఎప్పటికప్పుడు నమోదుచేసింది. స్థానికజన జీవనంలోని వివిధపార్శ్వాల్ని, అందలి పరిణామాల్ని ప్రత్యేకంగా ఎత్తిచూపించింది. తెలంగాణాసాయుధ పోరాటం, అత్యవసర పరిస్థితి కల్లోలం, రైతాంగ విప్లవపోరాటం, సింగరేణి కార్మికోద్యమం, తెలంగాణా అస్తిత్వఉద్యమంమొదలైన పోరాటాలపై సమకాలీనంగా ప్రత్యేకకథాసంకలనాలు వచ్చాయి. దళితులు, బహుజనులు, స్త్రీలు, ముస్లింలు, కులవృత్తులు, గిరిజనులు, సంచారజాతులు, మాదిగ ఉపకులాలు, నగర కార్మికులు, భూనిర్వాసితులు, గల్ఫ్ వలసలు, ప్రపంచీకరణ ప్రతిఫలనాలు మొదలగు విషయాలపై ఏకవిషయక కథాసంకలనాలు వచ్చాయి. రజాకర్ల దురాగతాలు, దొడ్డికొమురయ్య శవయాత్ర, యథాతథ ఒడంబడిక, పోలీసుచర్య, విశాలాంధ్ర ఏర్పాటు, అత్యవసర పరిస్థితి, సైలాబు పతనం, రైతాంగ పోరాటంలో తిమ్మాపురం, ఉప్పుమడిగె, చిన్నమెట్టుపల్లి సంఘటనలు, జగిత్యాలజైత్రయాత్ర, సికాసనాయకుడు రమాకాంత్ శవయాత్ర, గల్ఫ్ చావులు, చేనేత ఆత్మహత్యలు, పోలవరం, పోలేపల్లి ఆందోళనలు-సంఘటనలను ఆధారంచేసుకుని ఎప్పటికప్పుడు కథలువచ్చాయి. స్థలకాలాలను పరిగణలోకితీసుకుని వీటిని సమగ్రంగా అధ్యయనం చేసినట్లయితే



తెలంగాణాచరిత్ర, సమాజశాస్త్రాలు మరింతనిండుదనాన్ని సంతరించు కుంటాయి.

పుష్కలమైన శ్రమశక్తికి తెలంగాణా పట్టుగొమ్మ. మెట్ట వ్యవసాయం, కులవృత్తినిపుణత వీటి తాత్త్వికప్రచారానికి మానసికోల్లాసానికి రూపుదాల్చిన ఉపకులాలు వాటి కళాత్మకజీవనం– సంగీతసాహిత్యాలు, ప్రకృతితో ముడిపడిన పండుగలు, వృత్తుల ఆధారంగా ఏర్పడ్డ ఆచారవిశ్వాసాలు, ఉమ్మడి మతవిధానం తెలంగాణా సంస్కృతికి మూలకారకాలు, ఇక్కడ వైయక్తికమైన, కౌటుంబికమైన వేడుకలకంటే సమూహపరమైన వేడుకలకే ప్రాధాన్యత ఎక్కువ.

అనాదిగా తెలంగాణాది బ్రతుకుతెరువు పోరాటం మరియు అస్తిత్వ పోరాటంతో ముడిపడిన జీవితం. ఈ కారణంగా, సుసంపన్నమయిన జీవన విలువలు ఉన్నప్పటికీ ఇక్కడ సంస్కృతిని ప్రత్యక్షంగా చిత్రించిన కథలు చాలా తక్కువ. కానీ తెలంగాణా కథల్లో పాక్షిక, పరోక్ష సంస్కృతిచిత్రణలకు లోటు లేదు. ఈ చిత్రణలన్నీ ఒక బిందువు దగ్గర తిరిగి బ్రతుకుపోరాటంతో కలసి జమిలిగా రికార్డవుతాయి. యుగాలుగా సామ్యవాద జీవన తాత్త్వికతలో విలసిల్లిన తెలంగాణ నుండి వచ్చిన్న కథల్లో సాంఘికజీవనంలో ఉన్నంత విస్తృతి సాంస్కృతికజీవనంలో కన్పించదు. తొలితరం కథకులంతా భవిష్యత్తు మీద దృష్టికేంద్రీకరించి కథలువ్రాస్తే అనంతరకాలాల్లో ఎదిగిన మధ్యతరగతి రచయితలు గత వైభవాన్ని తలచుకుని కథలు వ్రాయటంలో నిమగ్నమయ్యారు. ఫలితంగా గెలుచుకున్న జీవితాల్లోని మధురానుభూతులు కనిష్టంగాకూడా చిత్రించబడలేదు. తెలంగాణాలో ముఖ్యమైన పండుగ బతుకమ్మ, ఉన్నతమైన మానవసంబంధాలకు పేరెన్నికగన్న పండుగ. ఈ పండుగ సంస్కృతిని చిత్రిస్తూ వచ్చిన కథలు పదిలోపే. బోనాలు, శక్తిపూజ, శివపూజలకు స్థానికంగా అధికమైన ప్రాధాన్యత ఉంది. మేడారం–కేస్లాపూర్ అతిపెద్ద గిరిజన జాతరలు, ఒగ్గుకథ ప్రశస్తమైన కళారూపం, వీటిని చిత్రిస్తూ కథలు పెద్దగా రాకపోవటం సంస్కృతిపరంగా గుర్తించదగినలోటు. అస్తిత్వపోరాటాలమధ్య కేవలం సంస్కృతిని చిత్రించి మెప్పించటం కష్టమైనపని అనేది ఇక్కడి రచయితల ఆలోచన. అయినప్పటికీ సాంఘికసంస్కృతి తెలంగాణా కథల్లో విస్తారంగానే నమోదయింది. దిగువకులాల ఆచారవ్యవహారాలు, విశ్వాసాలు, ఆహారనియమాలు, వస్తుజాలం, ఆటపాటలు, పూజాదికాలు బహుళంగా రికార్డు చేయబడ్డాయి. సంస్కృతి–భాషల పరిరక్షణకొరకే కథలు వ్రాసిన యశోదారెడ్డి తన కథల్లో స్థానికసంస్కృతిని సహజసుందరంగా తీర్చిదిద్దింది. స్థానికజీవితంలోని మధురఘట్టాలెన్నో ఈ కథల్లో భద్రితమయ్యాయి. ప్రపంచీకరణ పరిణామాలనేపథ్యంలో ఈ శతాబ్దంలో సంస్కృతిచిత్రణకు ప్రాధాన్యత అనివార్యమైంది. వృత్తినిపుణతలపట్ల, విశ్వాసాలపట్ల, కళాత్మకజీవనంపట్ల ఇక్కడి రచయితల్లో తండ్లాట పెరుగుతున్నది. గతాన్ని తలుచుకుని వలపోయడం మాత్రమేగాక అందలిమధురానుభూతుల్ని చిత్రించుకోవడం ద్వారా నూతనోత్తేజం లభిస్తుంది. తెలంగాణాకథకులు ఈ దిశగా ఆలోచిస్తే ఇక్కడికథ సంస్కృతిపరంగా మరింత పరిపుష్ట మౌతుంది.

నిప్పును ముట్టుకుంటే కాలడం ఎంతసహజమో తెలంగాణాకథను చదివితే ఒకప్రగాఢమైన అనుభూతికి, అలజడికి, ఆవేశానికి, ఆత్మపరిశీలనకు లోనుకావడం అంతేసహజం. దీనికి ప్రథమకారణం ఇక్కడికథల స్థానికతాస్పృహ, పీడితుడిదుఃఖాన్ని, రైతుసేద్యాన్ని, కార్మికుడిస్వేదాన్ని, కులవృత్తి విధ్వంసాన్ని, కళాకారుడి దైన్యాన్ని, కరువును–వలసను, ప్రపంచీకరణ ఫలితంగా ఒక గ్రామజీవన విచ్ఛిన్నాన్ని వెరసి ఒక జీవితకాలంలో ఇమడనంతటి కష్టనష్టాల్ని తెలంగాణాకథలు గలవందేళ్ళుగా ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నాయి. కన్నతల్లి ఉన్నఊరు స్వర్గంకంటే మిన్నయని భావించి నప్పుడు ఆ ఇద్దరి స్థితిగతుల్ని వాస్తవికంగా చూపించే రచనచేయడం కంటే రచయితకు బాధ్యతాయుత ప్రత్యామ్నాయం లేదు. తెలంగాణా కథలు ఈ బాధ్యతలనుంచే పుట్టుకొస్తున్న అనుభవసారాలు. కనుక తెలంగాణా సామాజికచరిత్రలో వీటిస్థానం విలువైంది. విశ్వసనీయ మైంది. ఇదే ఇక్కడి కథల ప్రత్యేకత.

ఆధారాలు : పుస్తకాలు:

1. ఉత్తర తెలంగాణ కథాసాహిత్యం – డా. బి.వి.ఎన్. స్వామి, పీహెచ్.డీ. పరిశోధనా గ్రంథం, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు. 2006.
2. గడ్డి పూలు – సం. తాండ్ర జనార్ధన్ రెడ్డి కల్వకుర్తి 1964.
3. తెలుగు కథాత్మ – సంగిశెట్టి శ్రీనివాస్ రంగినేని ట్రస్టు, సిరిసిల్ల 2007.
4. తెలంగాణ తెలుగుకథ – సం: డా. పంతంగి వెంకటేశ్వర్లు కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్లు 2011.
5. తెలంగాణ విముక్తిపోరాట కథలు – జనసాహితీ సమాఖ్య హైదరాబాదు, 1982
6. సమ్మె, సింగరేణి కథలు – కార్మిక శ్రమజీవి ప్రచురణలు, హైదరాబాదు, 2009

వ్యాసాలు :

1. తెలంగాణ పోరాటం తెలుగుకథ, నవల – కాత్యాయనీ విద్మహే
2. తెలంగాణ సోయి – ప్రత్యేక సాహిత్య సంచిక 2003
3. ఉద్యమంతో పురుడు పోసుకున్న తెలంగాణ కథ – అల్లం రాజయ్య విపుల మాసపత్రిక, ఆగష్టు 2009

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 హైదరాబాద్ అక్టోబర్ : 2025

మూస ఆలోచనల ధ్వంస కేంద్రం 'విముక్త' కథలు

డా. జె. నీరజ, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ప్రభుత్వ సిటీకళాశాల, హైదరాబాద్. ఫోన్ : 98483 70018



తెలుగు సాహిత్యచరిత్రలో సంచలనాత్మక, ఆలోచనాత్మక సందర్భాలు అరుదు. అలాంటి సందర్భాలలో ఒకటి స్త్రీవాద సాహిత్య ఆవిర్భావం. స్త్రీవాద సిద్ధాంతం సామాన్యులకి కూడా అర్థం కావటానికి సాహిత్య ప్రక్రియలకు మించిన సాధనం లేదని గుర్తించిన తొలితరం రచయితలలో ఓల్గా ఒకరు. స్త్రీలకు సంబంధించిన అనేక అంశాలపై ఉద్యమ స్ఫూర్తితో కవిత్వం, కథ, నవల, నాటిక, బాలే, విమర్శ లాంటి ప్రక్రియలలో తమ వ్యక్తిగత అనుభవాల్ని, అనుభూతుల్ని, దుఃఖాన్నీ ప్రకటించటమే కాక, కౌటుంబిక, సామాజిక జీవనంలో తమ ఆలోచన, ఆచరణల భాగస్వామ్యాన్నీ గుర్తించిన రచయిత్రులలో ఓల్గా కృషి అసామాన్యం. సమకాలీనులతో పాటు తరువాతి తరాల సృజనకారులకు కూడా స్ఫూర్తినందించారు. కొడవటిగంటి కుటుంబరావు, చలం రచనల ప్రభావం, మార్క్సిస్టు భావజాల నేపథ్యంలో 'ఓల్గా' స్త్రీవాదదృక్పథంతో చేసిన రచనలు విమర్శా వ్యాసాలు, చర్చలు, నృత్య రూపకాలు, సినిమాలు అన్నీ స్త్రీవాద తాత్త్విక సిద్ధాంతానికి బలమైన పునాదులుగా నిలిచాయి.

'కేవలం ఆర్థిక స్వాతంత్ర్యంతోనే మహిళలకు స్వేచ్ఛ వచ్చినట్టు కాదు. చట్టసభల్లో మహిళలు విధాన నిర్ణయకర్తలు అయినపుడే అది సాధ్యపడుతుంది' అని స్పష్టంగా చెప్తారు ఓల్గా. ఒకనాడు, స్త్రీలు విద్యావంతులు, ఉన్నత విద్యావంతులైతే చాలు అనుకున్న దశనుండి, తరువాత వారు ఆర్థిక స్వేచ్ఛ సాధిస్తే చాలు అనుకునేవారు. కానీ కేవలం విద్య, ఉద్యోగ/ సంపాదనల వల్ల స్వతంత్రం రాదు. స్త్రీలు సామాజికంగా, రాజకీయంగా చైతన్యవంతులైనప్పుడే, కుటుంబ నిర్ణయాలలో వారికీ భాగస్వామ్యం ఉన్నప్పుడు మాత్రమే వారి స్వేచ్ఛకు అర్థం ఏర్పడుతుంది. ఓల్గా మాటల్లో, రచనల్లో సరిగ్గా ఈ భావజాలమే వ్యక్తమవుతుంది. విద్యార్థి ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నా, విప్లవ ఉద్యమాల్లోని లింగ వివక్షపై స్పందించినా, స్త్రీవాద రచయితగా, మహిళా హక్కుల కోసం పోరాడిన కార్యకర్తగా కేవలం మాట్లాడటం, రాయటమే కాదు అదే తన జీవన విధానంగా ఆచరిస్తున్న రచయిత్రి ఓల్గా. కావ్యాలలో, ప్రబంధాలలో వర్ణనీయవస్తువులుగా మాత్రమే పరిమితమైన స్త్రీల శరీరావయవాలను గురించి, స్త్రీవాద కోణంలో ఓల్గా రాసిన **'రాజకీయ కథలు'** మొదటిసారిగా సామాజిక, రాజకీయ అవగాహనను ఆవిష్కరించి ఆలోచింపజేశాయి. అంతేకాక స్త్రీలకు తమ తోటి స్త్రీలతో, పురుషులతో, సమాజంతో వుండే సంబంధాల గురించి ఈ కథలు మాట్లాడతాయి. **'స్త్రీలు పురుషుల దృష్టిలో లైంగిక సుఖాన్నిచ్చే వస్తువులై తమకసలు ఆ అనుభూతులే లేవని నటించాల్సిన స్థితి అలా నటించేవరకూ ఆమెపై నిరంతరం జరిగే 'మోరల్ పోలీసింగ్', ఇవన్నీ వాళ్ళను అయోమయానికి గురి చేస్తాయి. ఈ నటన వాళ్ళను కుంగదీస్తుంటుంది. మొత్తానికి తమ శరీరాలని ద్వేషించడమో లేక గందరగోళపడటమో చేసి తమకు తామే పరాయి వాళ్ళవుతారు. అప్పుడు ఆ స్త్రీలను కంట్రోల్ చెయ్యడం సమాజానికి సులభమవుతుంది. అదొక కుట్ర'** అని విశ్లేషిస్తారు ఓల్గా. ఈ రచనల ప్రభావంతో అనేకమంది స్త్రీ, పురుష రచయితలు తమ రచనల్లో స్త్రీల జీవితాలను, స్త్రీ పురుష సంబంధాలను, రాజకీయ సామాజిక ఆర్థిక చట్రంలో స్త్రీల స్థానాన్ని స్త్రీవాద దృక్పథంతో చూసి రచనలు చేస్తున్నారు.

ఓల్గా రచించిన **'విముక్త'** కథల సంపుటి 2015 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందింది. కన్నడ, తమిళ, హిందీ, ఇంగ్లీషు, మరాఠీ, నేపాలీ భాషల్లోకి అనువాదమై, ఆయా భాషల్లోనూ కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారాన్ని పొందిన రచనగా విముక్త సంచలనం సృష్టించింది. ఓల్గా విముక్తకు పూర్వం రాసిన రచనలకు 'విముక్త' కథలకు మధ్య వ్యత్యాసం ఉంది. విముక్తకు పూర్వం తన స్త్రీవాద సిద్ధాంతాలకు వాదనలకు అనుగుణమైన ఇతివృత్తాన్ని అల్లుకుని అందుకు అవసరమైన పాత్రలను సృష్టించుకుని, తను చెప్పదలుచుకున్న విషయాలను చెప్పారు, చర్చించారు. 'విముక్త' కథలు మాత్రం అలాంటివి కాదు. భరతజాతి జీవనంలో ఇంకిపోయిన ప్రసిద్ధ పురాణ ఇతిహాసాలను ఇతివృత్తంగా ఎంచుకున్నారు. దేవతల స్థాయిలో పూజనీయులైన సీత, రేణుక మొదలైన పాత్రలను తన స్త్రీవాద వాదనలను వినిపించడానికి, కొత్త ఆలోచన

దృక్పథాన్ని అందించటానికి వాడు కున్నారు. పురాణాలను విమర్శించ కుండా, కించపరచకుండా ఆయా పురాణ పాత్రల ద్వారా స్త్రీవాద తాత్వికతను చర్చించారు రచయిత్రి.

ఈ సంపుటిలో మొత్తం ఐదు కథ లున్నాయి. అవి వరుసగా సమాగమం, మృణ్మయనాదం, సైకత కుంభం, విముక్త, బంధితుడు. ఒక జగత్ప్రసిద్ధ ఐతిహాసాన్ని పునర్వ్యాఖ్యానం చేస్తున్నట్లుగా, రామాయణంలోని సీత పాత్రను మరో ఐదు ఐతిహాసిక పాత్రలను తీసుకుని, వివిధ సందర్భాలలో ఆయా పాత్రలతో తనకి గల అనుబంధాన్ని, తాను వారిని ప్రాథమికంగా అర్థం చేసుకున్న తీరును తిరిగి పరిణత మనసుతో వారిని కలుసుకున్నప్పుడు ఎలా పునర్మూల్యాంకనం చేసుకున్నదీ ఈ కథలు వివరిస్తాయి. ఈ సంపుటి పీఠికా కర్త ప్రముఖ విమర్శకులు సీతారాం **'ఈ కథలు ఒక ex-tended reality ని మన ముందు పెడుతున్నాయి. సందర్భం ఎంత పాతదో, అంతే కొత్తది'** అంటూ విముక్త కథేతివృత్తాల ప్రాసంగికతను చూపుతారు. ఈ కథలలో ప్రస్తావించిన సందర్భాలన్నీ ప్రతి సామాజిక వ్యవస్థలో వ్యక్తుల జీవితాలలో నిత్యనూతనమైనవవి. ఆ పాత్రలు ఆయా సామాజిక సందర్భాలననుసరించి వ్యక్తిత్వం సంతరించు కుంటాయి. పాత్రలు పాతవే. అన్వయం సమకాలీనానికి వర్తిస్తుంది.

ఈ అయిదు కథల్లో ప్రధాన పాత్ర సీత – అహల్యను, శూర్పణఖను, రేణుకను, ఊర్మిళను కలిసినప్పుడు జీవితం, భర్త, పిల్లలు, మాతృత్వం, వ్యక్తిత్వం, అధికారం వంటి అనేక విషయాలపై వారి అనుభవాల నేపథ్యంలో తన అవగాహనను అంచనా వేసుకునే ప్రయత్నం చేస్తుంది. కొన్ని విషయాలపై మొదట వారితో, వారి వ్యక్తిత్వంతో విభేదించిన సీత తరువాత తన జీవితంలోని కీలకమైన మలుపులు చోటుచేసుకున్నప్పుడు వారు చెప్పిన జీవిత సత్యాలు, వారి అనుభవ జ్ఞానం గుర్తు చేసుకుంటుంది. వారు వ్యక్తీకరించిన అభిప్రాయాలను తన అనుభవాల నేపథ్యంలో నుండి అప్పుడు అర్థం చేసుకుంటుంది. సమకాలీన స్త్రీవాద కోణంలో నుండి పురాణాలలోని ఆయా పాత్రల ఆలోచనలను, అభిప్రాయాలను ప్రకటించారు రచయిత్రి. ఆమె లక్ష్యం కూడా అదే. ఈ పుస్తకం 'నా మాట'లో రచయిత్రి ఇలా అంటారు 'ఈ కథలు వర్తమాన సమాజంలో స్త్రీల వేదనలకు ప్రాతినిధ్యం వహించే కథలు కూడా. ఇవ్వాల్టి సమాజంలో అనేక ఆంక్షలకూ, అవమానాలకూ, హింసలకూ గురై వాటినధిగమించి లేస్తున్న స్త్రీలు కొందరైతే, వాటిలోనే కూరుకుపోయి వాటిని దాటలేక, దాటాలని తెలియక, నానా యాతనలు పడుతున్న స్త్రీలెందరో–తమను హింసించే భర్తల నుండి విముక్తం కావాలనే స్పృహ లేకుండా వారిని ద్వేషిస్తూనే, అసహ్యించుకుంటూనే వారిని గట్టిగా పట్టుకునే స్త్రీలు–ద్వేషంతో తమను తాము హింసించుకోవడం అలవాటైన స్త్రీలు–ఆ స్త్రీల కోసం ఈ కథలలోకి – స్త్రీ మనో అంతర్లోకాల్లోకి ప్రయాణిద్దాం.

'సమాగమం' కథలో స్త్రీల బాహ్యసౌందర్యంపై సమాజం విధించే అణచివేతలు, వారి శరీరాలను అంగప్రత్యంగాలుగా మాత్రమే చూడడంలో లీనమైన పురుషాధిపత్య దృష్టికోణాన్ని రచయిత్రి శూర్పణఖ పాత్ర ద్వారా శక్తివంతంగా ప్రశ్నిస్తారు. ఇందులో పాత్రలు రెండు. సీత–శూర్పణఖ. తరతరాలుగా ఏర్పడిన దృష్టికోణం చేత సీత, శూర్పణఖను శ్రీరాముడిపై మోజుపడిన వనితగా, అందుకు లక్ష్మణుని చేతిలో ముక్కూ చెవులు కోల్పోయి అవమానపడిన రాక్షస జాతికి చెందిన స్త్రీగా గుర్తిస్తుంది. తాను చేసిన తప్పుకు శూర్పణఖ తగిన శిక్ష అనుభవించిందని, ఆ అవమానం భరించలేక, లోకానికి తన అందవికారమైన రూపం చూపలేక అజ్ఞాతంలో ఉన్నదని అనుకుంటుంది సీత. లంకనుండి, రావణచెర నుండి విముక్తి పొంది, అగ్నిప్రవేశం చేసి తన పాతివ్రత్యాన్ని నిరూపించుకుని రాముడితో కలసి అయోధ్యలో పట్టమహిషిగా గౌరవం పొందుతుంది. కానీ పాలకుడిగా రాముడి నిర్ణయానుసారం గర్భవతిగా వాల్మీకి ఆశ్రమం చేరిన సీత అక్కడే లవకుశులకు జన్మనిస్తుంది. లవకుశులు అయోధ్యకి కూడా వెళ్లివస్తారు. తాము విన్న రాముడి కథని తల్లితో చెప్తారు.

ఒకరోజు ఆశ్రమం వద్ద పిల్లల రాక కోసం ఎదురుచూస్తున్న సీత, వారు ఆలస్యం చేయడంతో ఆందోళన చెందుతుంది. ఆలస్యంగా వచ్చిన వారు అడవిలో **"ముక్కు, చెవులు కోసిన కురూపి"** ని చూసామని, ఆమె ఒక అందమైన తోట పెంచుతోందని చెబుతారు. ఆ కురూపి శూర్పణఖ అని సీతకు అర్థమవుతుంది. పూర్వం రామలక్ష్మణులు ఆమెను అవమానించిన సంఘటన గుర్తుకు వస్తుంది. సీత మరుసటి రోజు పిల్లలతో కలిసి శూర్పణఖను కలుస్తుంది. కురూపిగా మారిన శూర్పణఖ ఇప్పుడు అంతఃసౌందర్యంతో, ఆత్మస్థైర్యంతో కళాత్మకమైన జీవితం గడుపుతోంది. దుస్సంఘటనల నుంచి బయటపడి, సౌందర్యానికి అసలైన అర్థం తెలుసుకున్నానని అంటుంది. ప్రేమతో, శ్రమతో సృష్టించగల చేతుల గొప్పతనాన్ని గుర్తించానని, ప్రకృతిలో అందవికారమైనది అనేది లేదని చెప్తుంది. అన్ని వస్తువులలోని అందాన్ని గుర్తించే దృష్టిని పొందిన శూర్పణఖను చూసి సీత ఆశ్చర్యపోతుంది. శూర్పణఖను అర్థం చేసుకుని, ఆమెతో

కలిసి అడవిలో ఉండాలని సీత నిర్ణయించుకుంటుంది. లవకుశులకు తోట దారి మర్చిపోవద్దని చెప్తుంది. శూర్పణఖతో స్నేహం, సౌందర్యం పట్ల కొత్త దృష్టిని ఆమెలో కలిగిస్తుంది.

ఈ కథలో అవమానం నుంచి ఎదురైన దుఃఖాన్ని శక్తిగా మలచుకొని, ప్రకృతితో మమేకమై సౌందర్యాన్ని కొత్తగా నిర్వచించగలిగిన శూర్పణఖ, నిజమైన స్త్రీ శక్తికి ప్రతీకగా నిలుస్తుంది. ఆమె జీవన తత్వం తను మిగతా ప్రపంచానికి ఎలా కనిపిస్తుందో కాదని, తనలోని శ్రమ, ప్రేమ, కళతో ప్రకృతిని హత్తుకుని జీవించడంలోనే అసలైన సౌందర్యముందని నిరూపిస్తుంది. వర్తమానంలో అనేక విధాలుగా శారీరక, మానసిక దాడులకు గురవుతున్న మహిళలు ఆత్మ స్థైర్యంతో నిలబడి శూర్పణఖకు ఆధునిక ప్రపంచంలో ప్రతిరూపాలుగా కనిపిస్తారు. యాసిడ్ దాడి బాధిత మహిళలు స్థాపించిన Sheroes Hangout Café లాంటివి ఎన్నో మన చుట్టూ ఉదాహరణలుగా ఉన్నాయి.

'మృణ్మయ నాదం' కథలో అహల్య పాత్ర ద్వారా రచయిత్రి స్త్రీ సౌశీల్యాన్ని పునర్వ్యాఖ్యానం చేస్తారు. వివాహానంతరం రాముని నోట అహల్య సౌందర్యం, ఆమె కోల్పోయిన సౌశీల్యం గురించి వింటూ సీత ఆసక్తి కలుగుతుంది. కానీ రాముడు ప్రేమతో ఎక్కువగా ఆలోచించవద్దని ఆజ్ఞాపిస్తాడు. అహల్య గురించి సామంత రాణుల ప్రశంసలు విన్న తర్వాత ఆమె గౌతమ మహర్షి భార్యగా, అపురూప సౌందర్యంతో కూడిన సౌశీల్యం కలిగి ఉన్నా ఇంద్రుడి మాయోపాయం వల్ల శాపగ్రస్తై శిలగా మారినట్లు తెలుసుకుంటుంది సీత. అయితే రాముడు అహల్యకి సౌశీల్యం లేదని చెప్పడాన్ని అర్థం చేసుకోలేకపోతుంది.

వనవాసంలో రాముడితో ఉన్నప్పుడే సీత అనుకోకుండా అహల్యను కలుసుకుంటుంది. అహల్య తనకు జరిగిన అన్యాయాన్ని, సత్యాసత్యాన్ని నిర్ణయించగల శక్తి ఎవరికి లేదని, తనపై తనకే మాత్రమే అధికారం ఉందని, ఎప్పుడూ అధికారానికి అంగీకరించకూడదని సీతకు సూచిస్తుంది. రావణసంహారం తర్వాత రాముడు తనను అగ్నిప్రవేశానికి చేయమన్నప్పుడు అహల్య మాటలు సీతకు గుర్తు చేస్తాయి. సీత అగ్ని పరీక్ష చేయటం ద్వారా రాముడిని లోకపు విమర్శల నుంచి రక్షించాలనుకుంటుంది. గర్భవతిగా ఉన్నప్పుడు సీత మరోసారి అహల్యను కలుసుకుంటుంది. అహల్య మాటల లోతు సీతకు అర్థమవుతుంది. అహల్య స్త్రీ సౌశీల్యం అనేది బాహ్య నియమాల గుణం కాకుండా, తనను తాను గుర్తించే ఆత్మబోధనే నిజమైన సౌశీల్యం అని చెప్పడం సీత ఆత్మగౌరవాన్ని, బాహ్య ప్రమాణాలపై విమర్శనా దృష్టిని పెంపొందించడంలో ప్రధానకారణం. చివరకు సీత తాను విశ్వంతో ఏకమై, భూమిపుత్రికగా మారుతుందనేది ఈ కథ ప్రధాన సారాంశం.

'సైకత కుంభం' కథలో రేణుకాదేవి పాత్ర ద్వారా స్త్రీ పాతివ్రత్యాన్ని కొత్త దృష్టితో విశ్లేషిస్తారు రచయిత్రి. వనవాసంలో ఉన్న సీత రేణుకను కలుసుకుని, ఆమె శిల్పాలలో సౌందర్యం కంటే బలం, హుందాతనాన్ని గమనించి ఆశ్చర్యపడుతుంది. పాతివ్రత్యం ఒక ఇసుక కుండలా – సాధనతో తయారైన, కానీ భంగానికి లోనయ్యే నాజూకైనదని రేణుక వివరిస్తుంది. పితృవాక్య పరిపాలన కూడా ఆర్య సంస్కృతిలో భాగమేనని, తండ్రి చెప్పింది న్యాయమా కాదా అని ఆలోచించకుండా గుడ్డిగా పాటించడమే ధర్మమంటూ తన కొడుకు అదే చేశాడని అంటుంది రేణుకాదేవి. జీవితం కత్తి అంచున వేలాడుతుందని అంటుంది. పాతివ్రత్యం, మాతృత్వం, ఏకాగ్రత అన్నీ పరస్పరంగా ముడిపడి ఉన్నాయని చెబుతుంది. చివరికి, లవకుశులు తండ్రిని కలవనున్న సందర్భంలో తన స్త్రీత్వాన్ని, పాతివ్రత్యాన్ని మరోసారి నిరూపించుకోవాల్సిన అవసరం వచ్చినప్పుడు, సీతకు రేణుక మాటల్లోని అంతరార్థం బోధపడుతుంది.

'విముక్త' కథలో ఊర్మిళ పాత్ర ద్వారా రచయిత్రి ఆత్మశోధన, బంధనాల విముక్తి, స్త్రీ అంతర్గత బలం గురించి లోతుగా అధ్యయనం చేస్తారు. అధికారాన్ని విడనాడితేనే విముక్తి సాధ్యం, అదే వ్యక్తిత్వ వికాసానికి మార్గమన్న విశ్లేషణ వ్యక్తమవుతుంది. ఊర్మిళ గురించిన ప్రస్తావన వాల్మీకి రామాయణంలో వివాహ సందర్భంలో మాత్రమే కనిపిస్తుందని, అలా వాల్మీకి వదిలేసిన ఊర్మిళకు తెలుగునాట స్త్రీలు రామాయణ పాటలు అల్లుకున్నారని అంటారు **'ఊర్మిళాదేవి నిద్ర – ఒక ఆలోచన'** వ్యాసంలో డా.వేల్చేరు నారాయణరావు. వాల్మీక రామాయణంలో కేవలం ఊర్మిళ ప్రస్తావన ఉన్నదని, భర్త లక్ష్మణుడు అన్న వెంట వనవాసానికి వెళ్ళిన వనవాసానంతరం అయోధ్యకు వచ్చిన సీతకు పద్నాలుగేళ్ళ పాటు ఊర్మిళ తనను తాను ఏకాంత మందిరంలో బంధించుకుని జీవించిందన్న విషయం తీవ్ర ఆవేదనకు గురిచేస్తుంది. లక్ష్మణుడు తనకు చెప్పకుండా అన్న వెంట వనవాసానికి వెళ్తే తనలో కలిగిన కోపాన్ని నిశ్శబ్దంగా, నిర్లిప్తంగా ఒక 'సత్యాగ్రహం'గా మార్చుకుని తన జీవితాన్ని ఒక అంతర్ముఖ యాత్రగా మలుచుకుంటుంది. ఏకాంత జీవనం, తనలో ఒక గొప్ప ఆత్మసాక్షాత్కారానికి దారితీసిందని చెప్తుంది. తన చుట్టూ ఉన్న

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 (52) హైదరాబాద్ అక్టోబర్ : 2025

సంబంధాలలోని 'అధికారం' అనే భావనను విశ్లేషిస్తూ, అది స్వేచ్ఛను, ప్రేమను నిర్బంధించగలదని, అన్ని బాధలకు, విరహాలకు, దుఃఖాలకు మూలం అదే అని గ్రహించానని అంటుంది. **'ఎవరిపై అధికారం చూపకూడదు, ఎవరి అధికారానికి లోనుకాకూడదు'** అనే భావనను జీవిత సిద్ధాంతంగా ఆహ్వానించడంతో, ఆమెకు నిజమైన శాంతి, ఆనందం, ప్రేమ లభించాయని చెప్పింది. **'అధికార చట్రాలలో పడి ఎలా నలుగుతున్నారో గదా, విముక్తం అయ్యే దారి తెలియక'** అంటుంది అక్కతో. **'ప్రతీ పరీక్షా నిన్ను రాముడి నుంచి విముక్తం చెయ్యడానికే. నిన్ను నీకు దక్కించడానికే. యుద్ధం చెయ్యి. తపస్సు చెయ్యి. లోపలికి చూడు నీవనే యథార్థం కనపడేదాకా చూడు'** అంటూ అక్కని కూడా భవిష్యత్తు కోసం సంసిద్ధం చేస్తుంది. మనం విముక్తం కావాలంటే మనం ఎలా బంధింపబడి ఉన్నామనే స్పృహ ఉండాలి. అప్పుడే బంధనాల నుండి విముక్తి దొరుకుతుందనే సత్యం సీతకు స్ఫురిస్తుంది.

'బంధితుడు' కథలో శ్రీరాముడి కోణం నుండి రచయిత్రి సామాజిక ధర్మబాధ్యతల మధ్య పురుషుడి అంతర్గత సంఘర్షణను, బాధను, అణచివేతను హృద్యంగా చిత్రిస్తుంది. బాల్యంనుండే తనపై మోపబడ్డ **'ధర్మ పరిరక్షణ'** అనే బాధ్యత రాముడిని ఒక వ్యక్తిగా కాక, ఒక ప్రతీకగా మారుస్తుంది. తన భావాలు, వ్యక్తిత్వం, దుఃఖాన్ని కూడా వ్యక్తీకరించలేని స్థితికి తీసుకెళుతుంది. అధికార బంధనాల వల్ల తన స్వంత తమ్ముడిని కూడా స్నేహితుడిలా చూడలేకపోయిన రాముడు, సీత దూరమైనప్పుడు బాధపడే స్వేచ్ఛలేక, తన బాధను అణచివేయాల్సి వస్తుంది.

వనవాసంలో గడిపిన కాలమే తనకు జీవనానుభూతిని ఇచ్చిన పర్వదశగా గుర్తుచేసుకుంటూ, ఆ కాలాన్ని ప్రసాదించిన కైకేయికి ఋణపడి ఉన్నానని భావిస్తాడు. తాను ఒక రాజుగా నిలబడ్డా, ఒక భర్తగా, మనిషిగా తన బాధను నెత్తిన వేసుకునే స్వేచ్ఛ కోల్పోయిన వాడినని, తాను **'పురుషోత్తముడు'** అయినంత మాత్రాన తన భావోద్వేగాలకు అవకాశం లభించలేదని బాధపడతాడు. ఈ కథలో రాముడు ధర్మ పరిరక్షణ బాధ్యత వల్ల మానవ సంబంధాలు కోల్పోయిన, రాజ్యాధికారం వల్ల తన వ్యక్తిత్వాన్నే నలిపేసుకున్న, ఒక విధంగా స్వేచ్ఛ కోల్పోయిన బంధితుడిగా చూపబడతాడు. ధర్మపరిరక్షణే అతనికి బంధనంగా మారింది.

సామాజిక ఒత్తిళ్లు మహిళలకన్నా పురుషుల మీద ఎక్కువగా ఉండటం గణాంకాలు చూపిస్తున్నాయి; ఉదాహరణకు ఆత్మహత్యలు పురుషుల్లో నాలుగింతలు ఎక్కువగా కనిపిస్తాయి, ముఖ్యంగా రైతులలో ఈ తీవ్రత ఎక్కువ. స్త్రీపురుషులిద్దరూ సమాజంలో బందీలుగా ఉన్నా, వారికి ఎదురయ్యే ఒత్తిళ్లు, బాధ్యతలు వేర్వేరు రూపాల్లో ఉంటాయి. స్త్రీలపై కుటుంబ, సంప్రదాయ భారం, ఆత్మగౌరవానికి సంబంధించిన ఒత్తిళ్లు ఎక్కువగా ఉండగా, పురుషులు సామాజిక బాధ్యతలు, ఆర్థిక భారం, అధికార ముట్టడిల వల్ల బాధపడు తుంటారు. ఈ భిన్నమైన ఒత్తిళ్లు వారి జీవన విధానాన్ని, ఆత్మహత్యలకు కూడా దారితీస్తున్నాయి. స్త్రీలకు ఎదురయ్యే వ్యవస్థాగత అసమానతలను గురించి చర్చిస్తూ, పురుషుల సమస్యల పట్ల సహానుభూతి కలిగి ఉండటం అవసరమే అని స్త్రీవాదం చాలా స్పష్టంగా మాట్లాడుతూనే ఉంది.

ఇటువంటి బంధనాల వెనుక నగరాల అభివృద్ధి, ఆర్యధర్మ పరిరక్షణ వంటి నినాదాలు ఉండగా, మరోవైపు నాగరికత పేరుతో కార్పొరేట్ శక్తుల గుప్పెట్లోని రాజ్యాలు ఆదివాసీలకు చెందిన అడవులను ఆక్రమిస్తున్న తీరును, యురేనియం తవ్వకాల పేరిట నల్లమలలో చోటు చేసుకున్న ఆధునిక శూర్పణఖలపై దాడుల నేపథ్యాన్ని రచయిత్రి గాఢంగా సూచిస్తారు. రాజ్యాల అభివృద్ధి పేరు చెప్పి కోట్లాది మంది ఆదివాసీలను నిర్వాసితులుగా మార్చే ఈ ధోరణిని ఆమె విమర్శించి, ఆధునిక సమాజంలోని **'అరణ్యపుత్రుల'** స్థితిని గురించి చర్చకు పెడుతుంది.

'విముక్త' కథల్లో రచయిత్రి విషయ తీవ్రత గల సామాజికాంశాలను సున్నితంగా, కవితాత్మక శైలి ద్వారా చిత్రిస్తుంది. ఈ విధంగా, 'విముక్త' కథలు కఠిన వాస్తవాలను సరళమైన శైలిలో, భాషతో అందిస్తూ, పాఠకుల మనసులో భావాల తుఫాన్ సృష్టిస్తుంది. ప్రాచుర్యం పొందిన పురాణ ఇతిహాస పాత్రల ఆలోచనలను, నిర్ణయాలను భిన్నకోణాలలో ఎలా దర్శించాలో విముక్త కథలు ఈ తరానికి శిక్షణ ఇస్తాయి.

ఆధార గ్రంథాలు :

1. విముక్త కథల సంపుటి : ఓల్గా
2. ఊర్మిళాదేవి నిద్ర : ఒక ఆలోచన: డా.వెల్చేరు నారాయణ రావు, eemata అంతర్జాల పత్రిక వ్యాసం (జనవరి 2012)
3. కథాశిల్పం : వల్లంపాటి వెంకట సుబ్బయ్య (1996) విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, విజయవాడ.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 (53) హైదరాబాద్ అక్టోబర్ : 2025

సాహితీ గగనంలో వెలిగే ధ్రువతార – ఆచార్య ఎస్వీ రామారావు

ధూళిపాళ అరుణ, సాహితీవేత్త ఫోన్ : 87123 42323

జీవితం క్షణభంగురం. యవ్వనం బుద్బుద ప్రాయమనే సత్యం అందరికీ తెలిసిందే. అయినా ఊహల్లో బతుకుతూ లేనిపోని ఆశలకై వెంపర్లాడుతూ కాలాన్ని వ్యర్థంగా గడిపేవారు కొందరైతే, ఊపిరి ఉన్నంతకాలం ప్రజోపయోగకర కార్యాలలో తలమునకలవుతూ దీక్షాబద్ధులై నిరంతరం సమయాన్ని సద్వినియోగ పరచుకునేవారు కొందరు. అట్టివారిలో రెండవ తరహాకు చెందినవారు ఆచార్య ఎస్వీ రామారావు గారు.

"విమర్శ అనేది సాహిత్య ప్రకాశానికి, కావ్య ప్రకాశానికి దోహదం చేస్తుంది. కావ్యం లోకాన్ని ప్రతిబింబిస్తుంది. అందువల్ల కవి ఒక అధిష్ఠానాన్ని సంపాదించి, ఒక వ్యాసుని వలె సమవీక్షణంతో చూడాలి. కేవలం రంధ్రాన్వేషణ చేస్తూ తప్పులు వెదకకుండా సమదృష్టితో వివేచన చేయడం సాహిత్య విమర్శ యొక్క అసలైన తత్త్వం" అని విమర్శ రూపురేఖలను వివరించడమే కాక దాన్ని అంతటి నిబద్ధతతో నిరూపించిన ఆచరణశీలి ఎస్వీ రామారావు గారు.

"సాహిత్యం ప్రగతిశీలం. కాలానుగుణంగా పరిణామం చెందుతూ ఉంటుంది. ప్రాచీనమైనా, ఆధునికమైనా సాహిత్యం ప్రజాశ్రేయస్సును కాంక్షించేదిగా ఉండాలి. విమర్శకుడు కావ్యప్రకాశాన్ని విస్తరింప జేస్తాడు. సాహిత్యాన్ని సమదృష్టితో చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. అందుకే నాది సమదృష్టి" అని చెప్పుకున్నారు రామారావు గారు. అది కేవలం ఆయన సాహిత్యంలోనే కాదు. వ్యక్తిగతంగా కూడా అందరినీ సమదృష్టితో చూసే గొప్ప సుగుణం ఆయనది.

"తెలుగు సాహిత్య విమర్శ– అవతరణ వికాసాలు" సిద్ధాంత గ్రంథం ద్వారా విమర్శకు ఉండాల్సిన తీరుతెన్నులు పూర్తిగా వివరించి తరువాతి తరాలకు మార్గనిర్దేశం చేశారు. నిరంతర పఠనాసక్తి, పరిశోధనా జిజ్ఞాస, అవిరళ కృషి, నిశిత పరిశీలన, ప్రామాణిక నిరూపణ వంటి విషయాలలో తమ ప్రత్యేకతను ప్రదర్శించే సలక్షణులైన ఆచార్య ఎస్వీ రామారావు గారు **"తెలంగాణ వాఙ్మయ కోశం"** వెలువడడం కోసం చేసిన శ్రమ వర్ణింపశక్యం కానిది. తెలుగు సాహిత్య చరిత్ర, తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం మొదలైన గ్రంథాలతో పాటు ఎన్నో పీఠికలు, వ్యాఖ్యానాలు, విభిన్న అంశాలపై వ్యాసాలు, సాహిత్య చరిత్రలతో పాటు సాంస్కృతిక చరిత్రలు, మోనోగ్రాఫులు, కథలు, కవిత్వాలను రచించి బహు గ్రంథాలను వెలువరించారు.

ఎవరూ ఆలోచించడానికి కూడా సాహసం చేయనటువంటి విమర్శనా రంగాన్ని ఎంచుకొని, లోతైన పరిశోధన చేసి, అమూల్యమైన గ్రంథాలను అందించి తెలుగు సాహిత్యానికి విశేషమైన సేవలనందించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన రామారావు గారు

తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు నిరుపమానం. విమర్శనా రంగంలో సాహిత్య అకాడెమీలు, విశ్వవిద్యాలయాలు చేయవలసిన పనులను ఒక్క చేతి మీదుగా నిర్వహించి తెలుగు సాహిత్యరంగంలో కీర్తి శిఖరాలను అధిరోహించారు.

అటువంటి సాహితీ పిపాసి, గొప్ప విమర్శకులు, మహోన్నత వ్యక్తి గత నెల (సెప్టెంబర్) 17వ తేదీన సాహితీ లోకాన్ని శోకసంద్రంలో ముంచి అనంత వాయువుల్లో లీనమయ్యారు. ఆయన చేసిన సేవలు నిరుపమానం, అనితరసాధ్యం. తెలుగు వారి హృదయపేటికల యందు ఆయన స్థానం సుస్థిరం.

జయన్తి తే సుకృతినో రస సిద్ధాః కవీశ్వరాః
నాస్తి తేషాం యశః కాయే జరా మరణజం భయం!!

అన్నట్టు తెలుగు సాహిత్యంలో సుగృహీత నామధేయులైన రామారావు గారు తాము చేసిన పనుల వల్ల యశఃకాయులైనారు. అప్పుడప్పుడు వయసురీత్యా అనారోగ్యం దేహాన్ని కుంగదీసినా అవేవీ ఆయనలోని దృఢసంకల్పాన్ని చెక్కు చెదరనీయలేదు. ఈ మధ్యనే ఆయన ఎనభై అయిదవ జన్మదినోత్సవ సందర్భంగా ఆయన రచించిన సమగ్ర సాహిత్యమంతా **'విమర్శనారామం'** పేరిట వ్యాస సంపుటిగా **'మూసీ' సాహిత్య మాస పత్రిక** ద్వారా వెలువడింది. అనేకులైన కవులు, రచయితలు, ఆయన శిష్యులు ఎంతో ఆదరాభిమానాలతో రాసిన ఈ వ్యాసాలు ఆయన సమున్నతమైన సాహిత్య కృషిని, ఉదార వ్యక్తిత్వాన్ని సవివరంగా తెలుపుతాయి.

'విమర్శనారామం' పుస్తకావిష్కరణ సందర్భంగా ఎస్వీ రామారావు గారు మాట్లాడుతూ **"భగవంతుడు ఆయువు ఇచ్చినంత వరకూ రాయడం ఆపను"** అన్న మాటలు నిజం చేస్తూ ఆఖరు క్షణం వరకు కలాన్ని వదిలిపెట్టలేదు. ఇంకా కొంతకాలం ఆయన జీవించి ఉంటే మరింత సాహిత్యం ఆయన నుండి మనకు లభ్యమయ్యే అదృష్టాన్ని పొంది ఉండేవాళ్ళం. విమర్శనారంగంలో ఆయన చేసిన కృషి తరతరాలకు ఆదర్శం. నిగర్వి, నిరాడంబరుడు, మితభాషి, అయిన ఎస్వీ రామారావు గారు విశిష్ట సాహిత్యమూర్తిగా మన మనస్సులలో శాశ్వతంగా వెలుగుతూనే ఉంటారు.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 హైదరాబాద్ అక్టోబర్ : 2025

చెన్నప్ప చూపు దేశం వైపు

డా. చిటికెన కిరణ్ కుమార్, సాహితీవేత్త, విమర్శకులు. ఫోన్ : 9490841284



నా చూపు దేశం వైపు

ఆచార్య మసన చెన్నప్ప
సెల్ నం : 9885654381.

తెలుగులో ఆధ్యాత్మికత, తాత్త్వికత, సమకాలీనత – మూడింటిని కలిపి కవిత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అర్షకవి కవి ఆచార్య మసన చెన్నప్ప. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వాధ్యక్షులుగా, అరవై రెండు గ్రంథాల రచయితగా, ఉపనిషత్తులను నాలుగువేల ముత్యాల సరాలలో అద్భుతంగా తెనిగించిన అనువాదకుడిగా, ఆయన సాహిత్య ప్రయాణం విస్తారమైనది, వికాసోన్ముఖమైనది. వేదవేదాంగాలు, దర్శనశాస్త్రాలు, భగవద్గీత వంటి తాత్త్విక గ్రంథాలపై ఆయనకు గల అభినివేశం పాండిత్యం, ఈ కవితా సంపుటిలో ప్రతి పంక్తిలోనూ ప్రతిఫలిస్తుంది.

'నా చూపు దేశం వైపు' అన్న ఈ కవితా సంపుటిలో కవి చూపు కేవలం దేశం వైపే కాదు – అది మట్టివైపు, మనిషివైపు, విలువల వైపు, భవిష్యత్తు వైపు పయనిస్తుంది. ఇందులో చిన్నచిన్న వస్తువులను గ్రహించి సహజమైన విషయాలను ప్రేమించడం ద్వారా కవి జీవిత సత్యాలను ఆవిష్కరిస్తారు. చిగురును ప్రేమించి అది పూవవుతుందని ఊహించని అమాయకత్వం, నీటి బొట్టును ప్రేమించి అది సముద్ర మవుతుందని భావించని నిరాడంబరత, మట్టిని ప్రేమించి అది బంగారమవుతుందని తలంచని మనస్తత్వం – ఇవన్నీ కవితలో మానవ హృదయపు నిర్మలతకు ప్రతీకలు.

ప్రపంచీకరణపై కవి ఆలోచన తేటగా, తర్కబద్ధంగా ఉంది. స్వదేశీయ సంప్రదాయాలను తృణీకరించి, విదేశీయ సంస్కృతిని అంధానుకరణం చేయడంపై కవి చెన్నప్ప గారు వ్యంగ్యబాణాలు సంధిస్తారు. స్థానిక మేధావులు తమ మూలాలను మరచి, తమ మాతృసంస్కృతిని నిరాకరించడం కవికి అసహనం కలిగిస్తుంది. **"ఇక్కడి యోగశాస్త్రం మీకు పట్టదు, ఇక్కడి ఆచారాలు మీకు నాన్సెన్స్"** అన్న పంక్తులు సాంప్రదాయ పరిరక్షణ పట్ల కవికున్న ఆవేదనను తెలుపుతాయి.

కవికి **"కవికంటే ముందు మనిషి"** అన్న నమ్మకం ప్రగాఢంగా ఉ ంది. చెన్నప్ప దృష్టిలో కవిత్వం కేవలం సృజనాత్మక అలంకారం కాదు – అది సామాజిక చైతన్యానికి మార్గదర్శకం. **"సహనమే సంస్కృతి"** అన్న కవిత ద్వారా ఆయన మనిషి జీవన గమనం లోని విరామాలను, ఆత్మపరిశీలనను ప్రముఖం చూపిస్తారు. **"మీ చరిత్ర మాకు పాఠాలు"** అన్న కవితలో తెలంగాణ చరిత్రలోని త్యాగమూర్తుల పోరాట పటిమలను స్మరించుతూ కొత్తగా యువతరానికి స్ఫూర్తి నింపుతారు.

"అమృతసిద్ధి" వంటి కవితలలో జీవన తత్త్వాన్ని ప్రశ్నల రూపంలో విప్పి చెబుతారు. కాలాన్ని కేవలం గంటల్లో, నిమిషాల్లో కొలవలేమని, దేశభక్తి అనేది క్షణక్షణమూ మన ఆలోచనల్లో ఉండాలని ఆయన గుర్తు చేస్తారు. చిన్న చిన్న విషయాల్లోనూ ప్రపంచతత్త్వాన్ని అన్వేషించ గలిగే ఆధ్యాత్మిక దృష్టి ఈ కవితా సంపుటి లో స్పష్టంగా కనిపిస్తుంది.

కొన్ని కవితలు స్ఫూర్తిదాయకమై వీర గాథల్లా నిలుస్తాయి– **"కార్గిల్ యుద్ధ విజేత"**లో నిజాయితీ, నిర్భయత్వం, సత్యం, సమరసత వంటి విలువలను జాతీయ భావాలతో మేళవిస్తారు. **"సూర్యోదయాన్ని అడ్డుకోవద్దు"**లో మంచిపనికి అడ్డుగోడలుగా నిలిచే వ్యక్తులపై వ్యంగ్యాస్త్రాలను సంధిస్తారు. చైతన్యశీలురలను నిరుత్సాహపరిచే పరిస్థితులలో కూడా మన పయనం ఆగకూడదని సందేశమిస్తారు. **"అన్నదాతల ప్రాణాలు కాపాడండి"** లో రైతు ఆత్మహత్యల వెనుక ఉన్న సామాజిక, ఆర్థిక కోణాలను స్పృశిస్తూ, మట్టి వాసన కలిగిన ఆవేదనను వ్యక్తపరుస్తారు.

ఆచార్య మసన చెన్నప్ప గారి ఈ కవితాసంపుటి వెనుక నిలిచిన ఆలోచన అంతా ఒక సజీవ దార్శనిక ప్రవాహం. ఆయన కవిత్వం కేవలం భావోద్వేగాల ప్రవాహం కాదు, అది దేశభక్తి, సంస్కృతి, ఆధ్యాత్మికత అనే మూడు ధ్రువాల మధ్య సాగే ఆత్మయాత్ర. కవి మనసులో కలిగిన ప్రతి ఆలోచనలో శిల్పస్పర్శ ఉండాలన్నది ఆయన నమ్మకం. నిజంగా ఇది ఆయన కవిత్వంలో ప్రతీ పంక్తిలోనూ స్పష్ట మవుతుంది. శబ్దానికి ధ్వనినీ, భావానికి మాధుర్యాన్నీ కలిపిన ఆయన కవితలు, పాఠకుని మదిలో నిలిచి ఆలోచింపజేస్తాయి. **'అవును, దేశం ఉంటేనే మనం'** అనే ఆయన అంతరంగ స్వరమే ఈ సంపుటి మొత్తంలో అల్లుకున్న తంతువుగా కనిపిస్తుంది.

ఆచార్య మసన చెన్నప్ప కవిత్వం పాండిత్యపు పీటలమీది నుంచే కాక, హృదయపు లోతులనుంచి ఉబికి వచ్చిన చెలమ. ఆయన పదాలు ఒకసారి మృదువుగా మనస్సును తాకుతాయి, మరికొన్ని సార్లు పదునైన ఆయుధాలుగా మారి హృదయాంతరాలను స్పృశిస్తాయి ఆధ్యాత్మికత, మానవీయత, దేశభక్తి, సాంప్రదాయ విలువలు ు ఇవన్నీ కలిసి ఆయన కవిత్వాన్ని ఒక శాశ్వత భవనంలా నిలబెడతాయి.

ఈ సంపుటిలోని పంక్తులు పాఠకులను ఒక్కసారి మాత్రమే కాదు, పలుమార్లు ఆలోచింపజేస్తాయి. ఈ కవితా సంపుటి సాహిత్యాన్ని స్ఫూర్తిగా, సంప్రదాయాన్ని ఆధారంగా, సమకాలీనతను పునాదిగా చేసుకొని నిర్మించిన చెన్నప్ప కవితా సౌధం.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 హైదరాబాద్ అక్టోబర్ : 2025

బహుజన ఐక్యత వస్తాదు – గౌడ కవితా "ముస్తాదు"

బాలసాని కొమురయ్య, తెరవే ఉపాధ్యక్షులు, పెద్దపల్లి. ఫోన్ : 9912657877

తెలంగాణ పల్లెల్లో కల్లు గురించి పలుకుబళ్ళు కోకొల్లలు. **"మట్టి గుణము తోటి చెట్టు గుణము, చెట్టు గుణము తోటి కల్లు గుణము", "పుట్ట మీది చెట్టు కల్లు పట్టువట్టు", "సప్పసేదు కల్లు చెప్పక తాగు"** లాంటివి అచ్చమైన గ్రామీణ సంస్కృతికి ప్రతీక. అనాదిగా ఆచార సంప్రదాయాలకు, మర్యాదలకు నిలయమైనది తాటికల్లు. ఇంటికి చుట్టమొస్తే కల్లు తెప్పించడం, వనానికి పోవడం తప్పనిసరి. కడుపు నింపడం ఒక ఎత్తైతే, వచ్చిన చుట్టం మనసు నిండడం మరొక ఎత్తు. చుట్టరికానికి, కలకాలం బంధాలను నిలుపుకునేది, బాధలను పంచుకునేది ప్రకృతి ద్రవ్యంతోనే జరుగుతుంది. ఆత్మీయ కుటుంబ వేడుకలు, సామాజిక పండుగలలో కల్లు పాత్ర విడదీయలేనిది.

అందుకే ప్రాచీనకలం నుండి సమాజంలో అన్ని కులాల వారి హృదయాలలో గీతవృత్తిని చేబట్టిన గీతాకారులకు ప్రత్యేక స్థానము ఉంటుంది. ఉత్పత్తి కులాలన్నీ శ్రమ సౌందర్యంతో కూడినవే. అయితే గీతవృత్తి ప్రత్యేకమైనది. ప్రమాదకరమైనది. భూములన్నీ అతికొద్దిమంది దగ్గర కేంద్రీకృతమై ఉన్నాయి. ఉత్పత్తి కులాలకు ప్రత్యామ్నాయ ఉపాధి లేదు. యాభై అడుగుల ఎత్తులోనున్న తాడి చెట్టునెక్కి కల్లును నేలకు దింపడం కష్టంతో కూడుకున్న ప్రక్రియ. అయినా నేటికీ ఎంతోమంది ఉపాధి కొరకు వృత్తి వారసత్వాన్ని కొనసాగిస్తూ సాగుతున్నారు. గీతా కార్మికుల శ్రమ సౌందర్యం గొప్పది. నడుముకు ముస్తాదు చుట్టి, మోకును భుజాన వేసుకొని చేతిలో గుది పట్టుకొని నడుస్తుంటే, రణభూమికి బయలుదేరిన వీరునిలా కనబడతాడు. హైటెక్ యుగంలో కూడా ఇంకా తనది ఆటవిక వేషధారణే. అతని శ్రమ ఉత్పత్తి పూర్తి సామాజికమే. ఈ వృత్తిలో ఉపయోగించే తోలు, కత్తులు, కుండవంటివి ఇతర బహుజన వర్గాల సాయంతో చేస్తూ, అదే సమాజానికి తన శ్రమను బహుమతిగా ఇచ్చే సబ్బండవర్గాల ఆత్మబంధువు గౌడన్న. సాంకేతికత
అ ు ే క ఁ
ఉత్పత్తి కులాలలో ప్రవేశించింది. వారి పనిని సులువు చేసింది. కానీ గీతవృత్తిలో మాత్రము తరతరాలుగా మార్పు లేదు. మండువా దగ్గర కల్లు వంపుతూ కష్టసుఖాలలో తలలో నాలుకలా ఉంటాడు. ప్రతి వృత్తిదారుడు తన వృత్తి యొక్క ప్రాధాన్యతను ఆ వృత్తిలో ఉన్న ఔన్నత్యాన్ని చెప్పడమంటే ఆయా వృత్తుల అస్తిత్వాన్ని కాపాడుకోవడమే అవుతుంది. గౌడ సామాజికవర్గాలలో సాహిత్యం పూర్తిగా ప్రవేశించక పోవడం వలన వారు ఇంకా అగ్రవర్ణాలకు తరతరాలుగా ఊడిగం చేస్తూ అచేతనంగా అమాయకంగా అణగారిన వర్గాలుగా ఉన్నారు. అందుకే గౌడులు సాహిత్య చైతన్యం పొందాలి. బహుజనులతో కలిసి విద్యాగంధంతో అస్తిత్వవాదంతో ముందుకు సాగి రాజ్యాధికారాన్ని పొందాలి. ఆ దిశలో ముందుకు సాగుతున్నతరుణం ఆసన్నమైనది. బహుజనఅస్తిత్వవాద ఉద్యమం 1990 దశకంలో పురుడు పోసుకుంది. **"చిక్కనవుతున్న పాట", " మొగి", "వెంటాడే కలాలు వెనుకబడిన కులాలు",** బిసి అస్తిత్వవాదంపై పలు సంకలనాలు వచ్చాయి. **"ముస్తాదులు కదులుతున్నాయి"** అంటూ కొంపెల్లి వెంకట్ రాసినటువంటి కవిత, **"గౌండ్లోనికి పలుగురాయే కరువై అలిగి అటకెక్కింది"** అని మద్దెల శాంతయ్య రాసిన కవిత, గూడూరి సీతారాం రాసిన **"నారిగాడు బతుకు"** కథలో గౌడ జీవితాన్ని చక్కగా చిత్రీకరించాడు. నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ వృత్తిని చేబట్టి, కలంతో గౌడుల ఉనికిని అక్షరీకరిస్తున్న సిసలైన గీతకారుడు. బానిస జీవనాన్ని మోసిన బహుజన బిడ్డలు నేడు రాజ్యాధికారాన్ని పొందవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి బహుజన బిడ్డ తన అస్తిత్వాన్ని



కాపాడుకుంటూ ముందుకు సాగవలసిన అవసరం ఉంది.

శీలం భద్రయ్య కవిత్వంలో గౌడ అస్తిత్వంతో బాటు బహుజన అస్తిత్వం ఉంది. కల్లుగీత వృత్తి ఔన్నత్యాన్ని కవిత్వంగా మలిచిన **"ముస్తాదు"** తెలంగాణ తొలి గౌడ కవితా సంపుటి. సాహిత్యంలో కథా రచయితగా, విమర్శకుడుగా తనకంటూ గుర్తింపు కలిగిఉన్న కవి. **"లొట్ట పీసు పూలు", "గంగెద్దు"** కథా సంపుటాలు విమర్శకుల ప్రశంసలు పొందినవి.

తెలంగాణ మట్టి పరిమళాన్ని రాసిన కవులు చాలామంది ఉన్నారు. శీలం భద్రయ్య **"ముస్తాదు"** కవిత్వంలో మట్టిపరిమళంతో బాటు చెట్టు మాధుర్యాన్ని అక్షరాల్లో పోదిగాడు. ఇదీ ఆయన ప్రత్యేకత. గౌడన్నకు రక్షణ కవచమైన పనిముట్టు ''ముస్తాదు''. పొట్టిపాదాలతో రాసిన కవితలలో అనంత యథార్ధ దృశ్యాలను చిత్రీకరించాడు.

"నడుముకు ముస్తాదు / మెడలోమోకు / పులి చర్మం ధరించని పరమేశ్వరుడు" కవితలో.. గట్టిగా కాశపోసి, నడుముకు మడ్డి బొంత చుట్టి, దానిపైన కత్తులు పేర్చిన ముస్తాదును చేతిలోకి తీసుకుని, రెండు

చేతులతోటి ఇష్ట దేవతకు, ముస్తాదుకు దండం పెట్టుకుని నడుముకు కట్టుకుంటాడు. నడుము మీదకు ముస్తాదు వచ్చిందంటే అతని రంగం సిద్ధమైనట్టే. భుజాలపైన మోకును తగిలించుకుని, చేతిలో గుజి పట్టుకుంటే అపర పరమేశ్వర రూపమే కనిపిస్తుంది. లయకారుడు హాలహలాన్ని మింగి అమృతాన్ని పంచినట్టు గీతాకారుడు అమృతపు చుక్కధార కోసం కష్టాన్ని మింగి, సురను నేలకు దింపుతాడు. ఈ కవితలో పులిచర్మం ధరించని పరమేశ్వరుడని చక్కని ఉపమానం వాడారు. పురాణసంబంధంగా శివుడు, అతని కుమారుడు కంట్లమయ్యలు గౌడుల కులదేవుళ్ళు. **"వనంలో తాడిచెట్టు / సిగ ముడుచుకున్న అమ్మలా"** ఉందంటాడు. బిడ్డ ఆకలి అమ్మ తీర్చినట్టుగా తల్లి తాడిచెట్టు ఆకలిదప్పికలను తీర్చుతుంది. అలసిన దేహాలకు ఆలంబనగా నిలుస్తుంది. తాడిచెట్టును అమ్మతో పోల్చి ప్రత్యక్ష దైవంగా చెప్పడమనేది అతిశయోక్తి కాదు. **"తాడిచెట్టుతో పాటు/ గౌడు నడుముకు మోకు/ బిడ్డ మెడలో బొడ్డుతాడు"** అంటాడు. తల్లీబిడ్డలది పేగుబంధమైనట్టు, గౌడన్న మోకు మానుకు బంధమల్లు తుంది. తాడి చెట్టుకు గీతన్నకు ఉన్న బంధాన్ని తల్లిబిడ్డల అనురాగంతో పోల్చడం అత్యంత సహజమైనది. గీతన్న చెట్టుపై మెరపెట్టేటప్పుడు తల్లిమీద గారాబం జేసినట్టుగానే తాటిచెట్టుతల్లితో మాట్లాడుతాడు. రాగమెత్తుకొని పాటపాడుతాడు. అమ్మను వేడుకుంటాడు. సాధకబాధకాలను పంచుకుంటాడు. నా తల్లినీవేనని చల్లగా చూడమని పరిపరివిధాల వేడుకుంటాడు. అతని జీవితంలో తల్లీబిడ్డల బంధమే ఇద్దరిదీ.

"నెల గుడ్డు నుంచి/ నెలమాసికం దాకా/ నెయ్యమైనా కయ్యమైనా/ కడుపునిండా కల్లు". మల్లారపు రాజయ్యని మా ఊళ్లో మా నాయనకు ఆప్తబంధువు ఒకాయన ఉండేవాడు. ఆయన మా నాయన దగ్గర వాడిక పట్టుకొని కల్లు తాగేవాడు. తాను కాలం చేసిన తర్వాత మా నాయన పోసిన కల్లయితేనే పిట్టముట్టిందని ఆయన కొడుకులు చెప్పగా విన్నాను. మనిషి కాలంజేసిన పిమ్మట వాళ్ళకు ఇష్టమైన ఆహార పానీయాలు పెట్టడం తరతరాలుగా వస్తున్న ఆచారంలో భాగమే. అలాగే స్నేహానికైనా, తగవుకైనా కల్లుతోనే కథ సుఖాంత మవుతుందని, జననమరణాలకు కల్లే ప్రాధాన్యమంటూ రాసిన ఈ కవిత అక్షర సత్యం.

"కల్లు రేక మీదకు/ వచ్చేంతవరకు/ గౌడ కష్టం ప్రసవవేదనే" అంటాడు కవి. నేను దాదాపుగా పదిహేనేళ్ళు తాళ్ళుగీచాను. తరువాత ఉపాధ్యాయుడిగా కొలువు సాధించాను. తాళ్లలో పరుపుతాడు, పండుతాడు అందునా పండుతాడు అతుకకట్టడం అంటే కష్టంతో కూడుకున్న పని. అత్యంత నేర్పు అవసరమయ్యే పనితనం కలిగిన పని. పండుతాడు కాయకోయడమే ఒక కళా నైపుణ్యంతో కూడినది. కత్తి గాట్లు పడకుండా సున్నితంగా కాయ కోయాలి. ఉట్టువట్టే దాకా నిష్టతో గీయాలి. గెలలను నవజాత శిశువులాగా చూస్తేనే ఉట్టు వట్టుతుంది. శుచి, శుభ్రత చాలా ముఖ్యం. పోద్దాదు గెలని కూడ దానిచుట్టూ ఉన్న గరుకుపాటలను మారుగత్తితో తొలగించేటప్పుడు తగు జాగ్రత్త వహించాలి. లేకపోతే గెల విరిగిపోతుంది. గెల ఉట్టుపట్టేటప్పుడు పుల్లలతో మెల్లగా లొట్టికి అనుకూలంగా కిందికి వంచాలి. నిండుగా ఉట్టు పట్టిన పోద్దాదు గెల ఎంతవంచినా విరగదు. ఇది నా స్వానుభవం. లొట్టిలో గొడుగు నురుసువెట్టి కల్లు కనిపించేదాకా గౌడ కష్టము ప్రసవవేదన లాంటిదే. ఇది గౌడులు మాత్రమే రాయగలిగిన శ్రమసౌందర్యపు అక్షరాలు. కవి కులంలో పుట్టి అనుభవించి రాసిన కవిత్వం కాబట్టి ఆ కమ్మనిదనం, మాధుర్యం కవిత్వంలో గుబాళించింది.

మరొకకవితలో **"తాటివనాలు తత్వ కేంద్రాలు/ మనో చికిత్సాలయాలు / ఆనంద నిలయాలు ఆధునిక దేవాలయాలు"** అనడం సముచితమైన మాటనే. ఎందుకంటే కల్లు మండవా మాయని మానసిక గాయాలకు చికిత్సాలయమవుతుంది. కడుపు నిండా అన్నం పెట్టినా వచ్చిన చుట్టం మది నిండదు. ఇంటి యజమానికి, వచ్చిన చుట్టానికి ఏదో వెలితి బాధపెడుతుంది. అలా మండువాకు, తాటిచెట్టుకిందకు తీసుకెళితే ఆ బంధుత్వంలో మర్యాద నాలుగు కాలాలపాటు నిలుస్తుంది. కల్లుమండవాలో గీతకార్మికులు, కల్లు గీతాకారుడవుతారు. సమన్వయకర్తగా సమస్యల పరిష్కార మార్గమవుతారు. ఇది విధి కాదు. విచిత్రం కాదు. ప్రకృతి మనిషికి ఇచ్చిన వరం. మరొక కవితలో **"తులసీదళం పవిత్రత/ తాటాకు ఎద మీదనే/ రాసిపెట్టి ఉంది"** అంటాడు. ఇది నగ్నసత్యమే. గత చరిత్రకు మూలాధారము తాటియాకే కదా! తాటాకుకు తులసి ఆకుకూ వ్యత్యాసం ఏమీ లేదని చెప్పిన తీరు బాగా నచ్చింది. **"మంగళ వాద్యాలతో కట్టిన మామిడాకు/ పైకప్పునున్న/ తాటాకును చూసి అసూయ పడింది."** కవితకూడా ఇలాంటిదే.

"అతని మోకును చూసి/ ధర్మసూత్రాలు/ ఉపనయన దీక్షను తీసుకున్నాయి" అంటాడు. ఈ కవితలో మోకును ఉపనయనం పుచ్చుకున్న బ్రాహ్మణుల జంధ్యంతో పోల్చాడు.

వేసవిలో తాటి ముంజలు జనులకు ఆరోగ్యప్రదాయిని. **"తాడిచెట్టమ్మ ప్రసాదించిన అమృత రసగుళికలు, దాహార్తిని తీర్చే ఫలపుష్పాలు తాటి ముంజలు"** అంటాడు కవి. మరొక కవితలో **"వజ్ర దేహానికి మడ్డికల్లు"** అంటాడు.

దసరా నాటి పాలపిట్ట కూడా పావనజలం తాగి ప్రకృతిలో పరవశించి రాగాలాపన చేస్తుంది. అలాగే జనమంతా కృత్రిమదారుల వెంట నడవక ప్రకృతితో మమేకమవుతూ సాగాలంటాడు కవి. ఈ విధంగా శీలం భద్రయ్య "ముస్తాదు" కవిత్వంలో గౌడుల శ్రమను, సౌందర్యాన్ని, గౌడుల చైతన్య అవసరాన్ని, బహుజన నేపథ్యంలో చక్కగా పొదిగాడు. అచ్చమైన తెలంగాణ భాషా సౌందర్యం, ప్రకృతి గొప్పదనం అలతి అలతి పదాలలో పొదిగాడు. చక్కని పండుతాళ్ళ కల్లులా మాధుర్యంగా రాసిన "ముస్తాదు" కవిత్వబాటలో మరిన్ని గౌడరచనలు రావాలని ఆశిద్దాం.

డా. కపిలవాయి లింగమూర్తి సాహిత్యానుశీలనం

ఘట్టమరాజు, ఫోన్ : 9964082076

డా. కపిలవాయి లింగమూర్తి గారు తెలుగు సాహిత్యవేత్తల్లో అపురూపమైన సరస్వతీ పుత్రులు. మహబూబ్ నగర్ ఎం.వి.ఎస్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో 23 అక్టోబర్ 2024 లో డా. కపిలవాయి లింగమూర్తి సాహిత్యానుశీలనం అంతర్జాతీయ సదస్సు వైభవంగా నెరవేరింది. ప్రత్యక్ష, పరోక్ష పద్ధతుల్లో సాగిన ఈ సదస్సుకు మొత్తం 135 పరిశోధన పత్రాలు రాగా, పరిశీలనా సమితి సభ్యులు జల్లెడపట్టి 85 పరిశోధనా పత్రికలకు మాత్రం సదస్సులో చర్చకు అవకాశం ఇచ్చారు. పరిశోధన పత్ర పరిశీలనా మహాభాగులు ఉదారచరితులై యువ పరిశోధకుల్ని ప్రోత్సహిస్తూ మొత్తం 85 పరిశోధనా పత్రాల్ని రెండు సంపుటాలుగా ప్రచురించేందుకు సహకరించారు. మొదటి సంపుటంలో 42, రెండవ సంపుటంలో 43 పత్రాలు చోటు చేసుకున్నాయి. ఈ విశాల సాహితీ సదస్సును ఎం.వి.ఎస్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల తెలుగు విభాగాధ్యక్షులైన డా. కె. కృష్ణమూర్తి గారు దీక్షా దత్తచిత్తులై నిర్వహించారు. అంతేకాక ఈ సదస్సు పత్రాల రెండు సంపుటాలకు వీరే ప్రధాన సంపాదక బాధ్యత వహించారు. విలువైన ఈ రెండు సంపుటాలు జూన్ 2025లో వెలుగు చూడటం అభినందించ దగ్గ సంగతి. పుణ్యశ్లోకులు డా. కపిలవాయి లింగమూర్తి గారి సుపుత్రులైన డా. కపిలవాయి అశోక్ బాబు గారు పగలూ రాత్రీ కష్టపడి, ఈ సాహితీ యజ్ఞం సఫలం కావటానికి త్రికరణశుద్ధిగా పాటుపడ్డారు. ఈ సాహిత్య మహాపర్వం ఘన విజయానికి సహకరించిన సాహితీవ్రతులూ, వదాన్య చరితులూ ఎందరో! అందరికీ వందనాలు.

'డా.కపిలవాయి లింగమూర్తి సాహిత్యానుశీలం' మొదటి సంపుటంలో 42 వ్యాసాలున్నాయి. ఈ మహాపండితుని ఎన్నో రచనలు వివిధతకూ, విశిష్టతకూ ఆటపట్టులు. అందువల్ల ఈ సంపుటంలో డా.లింగమూర్తిగారి బహుముఖీన వాఙ్మయానికి సంబంధించిన సాహిత్యిక, భాషావైజ్ఞానిక, సామాజిక, ధార్మిక దృష్టికోణం సంతరించుకొన్న వ్యాసాలు కనపడతాయి. వీటిలో డా. కపిలవాయి లింగమూర్తి గారి సాహిత్య గరిమను పరిశీలించిన వ్యాసాలు కొన్ని అయితే, చారిత్రక సంపదను కీర్తించిన వ్యాసాలు మరికొన్ని, సామాజిక దృక్పథాన్ని, ఆధ్యాత్మిక దృష్టిని అనుశీలించిన వ్యాసాలు ఇంకొన్ని. మొత్తం మీద ఈ సంపుటంలోని వ్యాసాలు డా. కపిలవాయి లింగమూర్తి గారి విరాట్ స్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి కొంత ఉపకరిస్తాయని చెప్పొచ్చు.

'డా. కపిలవాయి లింగమూర్తి సాహిత్యానుశీలనం' మొదటి సంపుటంలో ఆయన బహుముఖీన సాహిత్యాన్ని అవగతం చేసుకొని,





చక్కగా పాఠకులకు బోధపడే వ్యాసాలు పదకొండు వున్నాయి. డా. ఎస్. రఘుగారి **'కపిలవాయి వ్యాసాలు – వైవిధ్యదృష్టి'** డా. కె. కృష్ణమూర్తిగారి **'డా. కపిలవాయి సాహిత్యంలో విశ్వబ్రాహ్మణుల ప్రస్తావన'** డా. మన్నెమోని కృష్ణయ్యగారి **'పామర సంస్కృతం – మాండలిక భాషా విశ్లేషణ'** డా. కసప నరేందర్ గారి **'కపిలవాయి లింగమూర్తి గారి పీఠికలు – పరిశీలన'** వనపట్ల సుబ్బయ్య గారి **'కపిలవాయి సాహిత్యంలో కులవృత్తుల ప్రస్తావన'** డా. వింధ్య వాసినీదేవి గారి **'మహబూబ్ నగర్ జిల్లా విజ్ఞాన సర్వస్వము పాలమూరు వ్యాసాలు'** డా. విరివింటి సురేశ్ బాబు గారి **'శతకాభిప్రాయాల్లో ఆధ్యాత్మికాంశాలు'** నరేశ్ కుమార్ గారి 'కపిలవాయి లింగమూర్తి సాహిత్యంలో సామాజికాంశాల విశ్లేషణ' డా. బైరోజు శ్యాంసుందర్ గారి **'కపిలవాయి లింగమూర్తి వ్యాసాలు: స్థానిక చరిత్రల ప్రస్తావనలు'** డా. వెల్దండి శ్రీధర్ గారి **'డా. కపిలవాయి లింగమూర్తి గారి కథానికలు'** , పొన్నగంటి ప్రభాకర్ గారి **'ప్రాచీన పాలమూరు చరిత్ర – పరిశీలన'** పేర్కొనతగ్గ వ్యాసాలు. ఇవి కాక డా. ఎన్. లక్ష్మీ నరసింహారావు గారి **'ఉమ్మడి పాలమూరు కవి పండిత వంశాలు'** డా. మాలిక్ గారి **'డా. కపిలవాయి చారిత్రక వ్యాసాలు : నాగవంశ ప్రస్థానం – అవలోకనం'** వ్యాసాలు కూడా మెచ్చతగ్గవే.

'డా.కపిలవాయి లింగమూర్తి సాహిత్యానుశీలనం' రెండో సంపుటంలో 43 వ్యాసాలున్నాయి. గ్రంథం కడపట పి. వేద భాస్కర్ బాబు గారి కవిత **'అక్షర నివాళి'**ని ఆస్వాదించగలం రెండో సంపుటంలోని వ్యాసాల్లో గమనించదగ్గ వాటిని పేర్కొనవలసిన అవసరముంది. డా. కొల్లోజు కనూచారి **'కపిలవాయి లింగమూర్తి గారి వ్యాసాల్లో విశ్వకర్మ ప్రస్తావనలు'**, ఎర్రోజు వేంకటేశ్వర్లు గారి **'పామర సంస్కృతం – భాషానుశీలన'**, డా. పెబ్బేటి మల్లికార్జున్ గారి **'కపిలవాయి లింగమూర్తి వ్యాసాలలో పరిశీలన'** డా. వి.

శంకరయ్య గారి **'సాధికార శోధనారత్నాలు– 'స్వర్ణశకలాలు'**, డా. ఎస్. ఇందిర గారి **'డా. కపిలవాయి లింగమూర్తి దుర్గాభర్గాశతకం – జ్ఞానభక్తి మరియు లాక్షణికశోభ'** డా. జి. శ్రీనివాసరావుగారి **'చక్రతీర్థ మహాత్మ్యము'**, నారాయణదాసు మంజులాచారి గారి **'డా. కపిలవాయి పరిష్కరణలు పరిశోధకులకు పట్టుగొమ్మలు –విశ్లేషణ'**, ఈ సంపుటంలో ఏడు వ్యాసాలు గమనార్హమైనవి.

ఈ రెండు సంపుటాల్ని నిశితంగా పరిశీలించిన పిమ్మట కొన్ని విషయాల్ని ప్రస్తావించడం అత్యవసరం. డా. కపిలవాయి లింగమూర్తి సాహిత్యానుశీలనం అంతర్జాతీయ సదస్సులో ఒక్కరోజే 85 పరిశోధన పత్రాలు సమర్పించడం **ఆకలి ఆకాశమంత నోరు సూది బెజ్జమంత** అన్నట్లుంది. ఈ సదస్సు నిర్వాహకులు, ఈ రెండు సంపుటాల సంపాదక వర్గ సభ్యులు అంతర్జాతీయ సదస్సు మాట అటుంచి, ఒక మహా రచయిత రచనలు బేరీజు వేసే సదస్సు నిర్వహించే సందర్భంలో డా. కపిలవాయి లింగమూర్తి గారి రచనలు చదివిన, ఆయనతో సన్నిహిత సంబంధమున్న పండితాగ్రణులతో సంప్రదించి, ఎనిమిదో పదో శీర్షికలు నిర్ధారించి సదస్సు నిర్వహించి వుంటే కీ.శే. కపిలవాయి లింగమూర్తి గారి ఆత్మ శాంతించి వుండేది. దానితో పాటు ఎం.వి.ఎస్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల తెలుగు విభాగం ఘనత కూడా ఇబ్బడి ముబ్బడి అయి వుండేది.

"ఏమి సేయవచ్చు గాలమెవ్వరి నెంత సేయునో" అన్న తాళ్ళపాక అన్నమయ్య మాటతోనే సాంత్వనం పొందాలి మరి.

❖ ❖ ❖ ❖ ❖

వాన వచ్చేస్తుందో...

కోటం చంద్రశేఖర్

ఫోన్ : 94920 43348

నత్తనడకలు వద్దు
పెల్లినడకలు వద్దు
మొన్నటి మురికినీళ్లు
నిన్నటి బురదనీళ్లు పోవాలి
టౌన్ వీడాలి
మోరీలు పొంగి నాళాలు ఉప్పొంగి
పాదచారులు సైకిల్ మోటార్ల యజమానులు కృంగి
ఇక్కడే
చక్కర్లు కొట్టొద్దు అన్నా
వంకర్లు పోవద్దు అన్నా
వినదు
సలహాలు సూచనలు లెక్కించదు
జాగ్రత్తలు హెచ్చరికలు పట్టించుకోదు
మంచి జరగాలన్న తపనతో సత్ప్రవర్తనతో కదిలి
సరైన మార్గంలో బయటకెళ్ళి
అచ్చమైన గ్రామీణ భారతాన్ని చేరాలి కదా

నీరుకి
నిర్దిష్టమైన ఎజెండా లేదు
మళ్లీ
ఎవరి కన్సన్నుల్లో మెలగదు
ఎవరి అదుపులో చేరదు
తీవ్రంగా దుర్మార్గమైందిగా అనిపిస్తుంది కూడా

కొండ ప్రాంతాల్లోనూ
మైదాన ప్రాంతాల్లోనూ
మకాం వేయాల్సింది కానీ
నగరాన్ని పట్టుకుంది
నీరే హింసై ప్రజ్వరిల్లుతోంది
దావానంలా శివార్లను సైతం వ్యాపిస్తుంది
కురవడమే నా వంతు అన్నట్టు

తంబుర మోగినట్టు
తుంపర మొదలెట్టి దబాయిస్తోంది
నీరుతో దిగ్బంధం చేసి యుద్ధక్షేత్రంగా మలుస్తోంది
వానా
సయ్యాటలు ఆపవా
ప్రదర్శనలు అపవా
ము(నీ)ళ్ళను దాటుకొని అంబలాల్లకు
ఇంటికి చేరుకుంటారని
ఎదురుచూపుల్లో
కన్నతల్లులు కట్టుకున్న భార్యలు
వాన గాయపరుస్తుంది
వాన కలవరపరుస్తుంది
పట్నం చెట్టుమీద నీటి పక్షులు
టపటపా రెక్కలార్చితే భయం వెంటాడుతోంది
భూమికి
రూపురేఖలు ఇచ్చే వాన
చెట్టు చేమతో మెరుగులు దిద్దే వాన పద్ధతికి
ప్రగతికి పట్టం కట్టే వాన
మానవ జీవనానికి ముదమును గూర్చే వాన
ఇదేం జరిమానా
అడవుల్ని నరికి కాలుష్యాన్ని పెంచేస్తే
తన మూలాలైన హరితవనాల్ని కబళిస్తే
అణువణువు కాంక్రీటు సౌధాలు నిర్మిస్తే....

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 12 (59) హైదరాబాద్ అక్టోబర్ : 2025

బహుళార్థ సాధక కాంతిరేఖ – కె.వి. రమణాచారి 'హరే శ్రీనివాసా!'

విహారి, హైదరాబాద్. ఫోన్ : 98480 25600

తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల అభ్యుదయానికి చోదకశక్తిగా డా॥ కె.వి.రమణాచారిగారు తెలుగువారికి సుపరిచితులు, గౌరవాస్పదులు. స్వయంగా వారు కవి, పండితులు, పరిశోధకులు, వ్యాసకర్త, విమర్శకులు, అఖండమైన ఏకసంథాగ్రాహి, వక్త, అధ్యయనశీలి, జీవితానుభవశాలి, పరిపాలనాదక్షులు. ఇన్ని విశేషగుణాల సంపత్తి కలిగిన ప్రతిభామూర్తి కనుకనే ఐఏయస్ అధికారిగా వారు నిర్వహించిన అన్ని పదవులకూ వన్నెనీ, వాసినీ సమకూర్చిపెట్టారు.

"ప్రభుత్వ సర్వీసులో మూడున్నర దశాబ్దాలకుపైగా – ప్రాధాన్యత గల ఎన్నో పోస్టుల్లో పనిచేసినా రెండేళ్లపాటు తిరుమల తిరుపతి దేవస్థానంలో చేసిన సేవ కలిగించిన ఆనందం, ఆధ్యాత్మిక అనుభూతి, సంతృప్తి అపారమైనవి. ఎంత అంటే – 'ఈ జీవితానికి ఇది చాలు' అనిపించేటంత" అనేది వారు స్వయంగా చెప్పిన మాట.

తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వారు పనిచేసిన కాలంలోని తమ అనుభవాలనూ, ఎదుర్కొన్న సవాళ్లనూ, వేసిన మునుగీతల్నీ తెలుగు పాఠకులతో పంచుకోవాలనే సదుద్దేశంతో రాసిన పుస్తకం **'హరే శ్రీనివాసా!'** తెలుగుపత్రికల్లో అనన్య సామాన్య ప్రచారం కలిగిన 'స్వాతి' వారపత్రికలో ధారావాహికగా వచ్చింది.

'హరే శ్రీనివాసా!' లో 22 కథనాలు ఉన్నాయి. ప్రతి కథనంలో పాలనాపరంగా తాము చేసిన కృషీ, తమదైన ముద్రని చూపుతూ చేపట్టిన ప్రయోగాలూ, అవరోధాల్నీ అధిగమించటానికి తీసుకున్న నిర్ణయాల్లో ఎదుర్కొన్న కష్టపరంపరనీ – ఇన్నిటినీ ఉత్కంఠభరితంగా పఠితలకు అందించారు డా॥ రమణాచారిగారు. వారి శక్తియుక్తులు టిటిడిని వారి హయాంలో ఇతోధికమైన ఉన్నతపథంలో నడిపించ టానికి ఎంత ఫలప్రదంగా జయప్రదంగా దోహదం చేశాయో, ఈ కథనాల ద్వారా చదువరులు తెలుసుకుని ఆనందిస్తారు. ఈ వివరాల్ని స్థాలీపులాక న్యాయంగా పరామర్శించుకుందాం.

పదవీబాధ్యతలు తీసుకున్న తర్వాత రమణాచారిగారి మొదటి ఆలోచన, ఆవేదన, ఆరాటం – 'స్వామీ–భక్తులే నీ దగ్గరకు రావాలా? నిన్ను చూడాలంటే వాళ్ల దగ్గరకు నువ్వు పోవా? పోలేవా?' అని. ఈ ప్రశ్న నుండి జనించింది – **'రథయాత్ర', 'దళిత గోవిందం'** కార్యప్రణాళిక.

సంకల్పబలంలో చిత్తశుద్ధి గొప్పది కనుక, అడుగడుగున సంభవించిన అవరోధాల్ని ఈ అధికారి మార్గదర్శకత్వం అధిగమింప జేసింది. ఆ కార్యక్రమం నిజంగా నాలుగుదిక్కులకూ చేరిన రథాలతో, దిగ్విజయమైంది. **"అఖండ 'హరినామస్మరణ'కీ అంతే"** అనేదే – ఒక కథనం శీర్షిక కాబట్టి దాని సాధన, సాఫల్య వివరాలు ఇందులో చదువుతాము. అనుకున్నవిధంగా – 'డిశంబరు 20 ఉదయం – కృతయుగ అవతారమైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రమైన సింహాచలానికి ఒక రథం, త్రేతాయుగ అవతార మూర్తి అయిన శ్రీరామచంద్రుడు ఉండే భద్రాచల క్షేత్రానికి మరొక రథం, ద్వాపరయుగ అవతారమూర్తి శ్రీకృష్ణ పరమాత్మ వెలిసిన కృష్ణా జిల్లాలోని మొవ్వ క్షేత్రానికి మరో రథం – అర్చక పాచక పరిచారకాదులు, వేదపండితులు, అన్నమాచార్య సంకీర్తనాకారులు, మంగళవాద్యకారులు, వైద్యులు, భద్రతా సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది, వంటవాళ్లు తదితర సిబ్బందితో ఈ భక్తిచైతన్య యాత్ర తిరుపతిలో కొండకి కాలినడకదారి ప్రారంభమయ్యే అలిపిరిలో శ్రీవారి పాదాల దగ్గర ప్రారంభం' అయింది.



ఆ తర్వాతి వాంఛితార్థం **వైకుంఠం క్యూకాంప్లెక్స్ మొత్తాన్ని ఏసీ చేయించటం**. అందులో – చంటిపిల్లల తల్లుల్నీ, వయోధికుల్నీ, వికలాంగుల్నీ వేరుచేసి త్వరత్వరగా వారికి దర్శనం ఏర్పాటుచేయటం, జిఎంఆర్ వారి ఐచ్ఛిక సహకారంతో దీని సాధన సాధ్యమైంది!

'కల్యాణమస్తు' కార్యక్రమాన్ని అర్థవంతంగా బలోపేతం చేయటం జరిగింది. "దాంపత్య జీవిత పరమార్థాన్ని అర్థంచేసుకున్న జంటలకి శాస్త్రోక్తంగా పెళ్లి జరిపించే బాధ్యత పూర్తిగా టిటిడి వహిస్తుంది. ప్రతి ఒక్క పెళ్లిలో వధువుకు శ్రీవారి పాదాల చెంత ప్రోక్షణ చేసిన, అలమేలు మంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన బంగారు తాళిబొట్టు, మెట్టెలు, వధూవరులకు నూతన వస్త్రాలు, పెళ్లి సామగ్రి, పురోహితుడి సంభావన, పెళ్లి సమయంలో మేళతాళాలు, భోజన ప్రసాదం... అన్నీ దేవస్థానమే ఉచితంగా సమకూరుస్తుంది"

దీనితో సామూహికవివాహాలు ఆచరణాత్మక ఫలితాన్నిచ్చాయి.

డా॥ రమణాచారిగారి మేధోజనితంగా వచ్చిన అపూర్వమైన సంకల్పం, కష్టసాధ్యమైన కార్యక్రమం **శ్రీవేంకటేశ్వర భక్తి ఛానెల్!** తలచుకుంటే దేహం పులకరించే విజయసాధన. ప్రపంచంలోని వీక్షకులందరికీ స్వామి ప్రత్యక్ష ప్రసారాల దర్శనభాగ్యాన్ని అందజేసిన 'నభూతో...' యత్నం, విజయం! ఆ సందర్భంగా ఈ మహనీయుడు క్షణక్షణం తీసుకున్న నిర్ణయాలూ, సమస్యలతో గడిపిన నిద్రలేని రాత్రులు– ఇవన్నీ ఈ అధ్యాయాల్లో చదివి ఉక్కిరిబిక్కిరై, చివరికి ఆనందపారవశ్యంతో 'జయహో రమణాచారిగారూ' అనుకుంటాడు చదువరి! అంతటి మహత్తరమైన ప్రయోగ సాఫల్యంగురించిన వివరాల పఠనానందాన్ని పొందుతాడు చదువరి!

'పుస్తక ప్రసాదం' పథకం డా॥ రమణగారికి – భవిష్యత్తరాల్లో పాదుకొల్పవలసిన మానవీయ విలువలపట్ల గల శ్రద్ధాసక్తుల్ని వెల్లడిస్తుంది. **'ఆ ప్రసాదం నాటే ధార్మిక బీజాలు సుస్థిరమైనవి, శక్తివంతమైనవి'** అనే విశ్వాసంతో ఆ కార్యక్రమాన్ని గడ్డకెక్కించారు.

'అన్నమయ్య 600వ జయంతి' ఉత్సవాల్ని తాళ్లపాకలోనే చరిత్రలో నిలిచిపోయేట్టు 3 రోజులు నిర్వహించటం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహాన్ని నెలకొల్పటం, ఆ తర్వాత **'లక్షగళాల అన్నమయ్య పదార్చన'** – అక్షరాలా చారిత్రాత్మకం!

టిటిడి 'అమృతోత్సవ' నిర్వహణలో 'రోడ్ బ్లాక్స్' వాటిని దాటిన విధానం పఠనీయం. భక్తులకు మెరుగైన వసతుల కల్పనలో భాగంగా చేపట్టి, సాధించిన **'దివ్యభారతి'** ప్రణాళిక మనలోనూ చాలా ఆలోచనల్నీ ఆశ్చర్యాన్నీ కలిగిస్తుంది. ఆ తర్వాతి **'అనంత స్వర్ణమయ పథకం'** – స్వర్ణాధ్యాయమై – కొనసాగాలి!

'వేదవిశ్వవిద్యాలయానికి వేళ్లూనుకున్నది స్వామివారి సేవలో నేను వచ్చి చేరాకనే. ఇప్పుడు మూడుపూవులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది' అని ఆత్మసంతృప్తిని మనతో పంచుకున్నారు రమణ గారు. డా॥ రమణాచారిగారి బదిలీ వృత్తాంతం, వారు **'వెంకటాద్రి దిగి వెంకటాద్రి ఎక్కి'** వీడ్కోలు తీసుకున్న ఘట్టం– వారికీ, ఉద్యోగులకూ, పరిస్థితులకూ, ఆరాధనీయ భావన కలిగిన వారికీ, లక్షలాది ప్రజలకూ ఎంత ఉద్వేగభరితమైందో చదువుతుంటే కళ్లు చెమరుస్తాయి! నిజంగా అంతటి అపూర్వమైన ఆదరాభిమానాల్ని పొందిన డా॥ రమణ గారు పుణ్యులూ, ధన్యులూ!!

* * *

'హరే శ్రీనివాసా' పుస్తకం ఒక ఐఏఎస్ ఉద్యోగి పదవీబాధ్యతల నిర్వహణా, విజయసాధనల గాథాస్రవంతి మాత్రమే కాదు, **అది ఒక వ్యక్తిత్వ వికాస పాఠ్యగ్రంథం.** ఒక వ్యక్తి మనీషిగా, బాధ్యత గల ఉద్యోగిగా, ఉత్తమ మానవతా విలువల పరిరక్షకునిగా, మానవసంబంధాల నిర్వహణాదక్షుడుగా – రెండేళ్లలోనే ఎంతెంత కృషి చేయవచ్చునో, ఎన్నెన్ని విజయాల్ని సాధించవచ్చునో – సంఘటనాత్మక కథనాల్లో చెప్పిన విలువైన గ్రంథరాజం! శ్రీ రావులపాటి సీతారామారావు (రిటైర్డు ఐపిఎస్), సీనియర్ పాత్రికేయులు శ్రీ జి.వల్లీశ్వర్‌గారలు ముందుమాటలు గ్రంథకర్తకి సముచితమైన అభినందనల్ని అందించాయి. పాఠకుల అభినందనలు రచయితకూ, ఎమెస్కోకూ, 'స్వాతి'కీ ఇప్పటికే పుష్కలంగా అందేయి, అందుతున్నాయి. దానికి దాఖలా ఆరునెలల్లో పుస్తకం రెండో ముద్రణనీ పొందటం.

డా॥ రమణాచారిగారు భక్తితో మాత్రమే కాక, ప్రపత్తితో, ధర్మరక్షణ దీక్షతో, భావితరాలకు అభ్యుదయాకాంక్షతో అక్షరీకరించిన అందరికీ విలువైన పుస్తకం **'హరే శ్రీనివాసా!'** కొని, చదివి, భద్రపరచుకొని, అప్పుడప్పుడూ విషయ పునశ్చరణ చేసుకోవలసిన పుస్తకం ఇది!

❖ ❖ ❖ ❖ ❖

మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

శిలాక్షరం

(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.



సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-

సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

స్వ'కృతి'



విజయపథం (ఆచార్య బన్న అయిలయ్య షష్టి పూర్తి అభినందన సంచిక)
ప్రధాన సంపాదకులు : డా. మంథని శంకర్
వెల : 500/-
ప్రతులకు: కె. విజయ, ఇం.నెం. 2-7-126/1, రాజగృహం, విజయపాల్ కాలనీ, హన్మకొండ - 506370. ఫోన్ : 0870 - 2456001



తెలంగాణ ఉద్యమంలో ఎదురైన సవాళ్ళు - సమాధానాలు
డా. వి. శంకర్
వెల : 80/-
ప్రతులకు : శ్రీ సాయి వెంకటరమణ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, చిక్కడపల్లి, హైదరాబాద్.. ఫోన్ : 9676799500
మరియు
స్నేహ బుక్‌లింక్స్, హైదరాబాద్
శ్రీ తిరుమల బుక్ స్టోర్స్, కామారెడ్డి.



బి.ఎస్.రాములు 'చూపు' నవల - ఒక పరిశీలన
రాజు మోరె వెల : 160/-
ప్రతులకు : విశాల సాహిత్య అకాడమీ, 201, సులేఖ గోల్డెన్ టవర్స్, 2-2-186/53/5, రామకృష్ణ నగర్, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013. ఫోన్ : 83319 66987



కామారెడ్డి జిల్లా సమగ్ర స్వరూపం
ప్రధాన సంపాదకులు : ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
సంపాదకులు : డా. జె. చెన్నయ్య
కన్వీనర్ : డా. వి. శంకర్
వెల : 300 /-
ప్రతులకు : తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, ఆబిడ్స్, హైదరాబాద్ - 500 001.
ఫోన్ : 9000273224



బతుకు (దీర్ఘకవిత)
వెల : 90/-
ఆచార్య ఎం. గోనానాయక్
వెల : 150 /-
ప్రతులకు : రచయిత, ఫ్లాట్ నెం. 202, శ్రీసాయి నివాసం, స్ట్రీట్ నెం. 9, కార్తికేయ నగర్, నాచారం, హైదరాబాద్ - 500 076.
ఫోన్ : 98490 93300

చిరునామా

మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,
బతుకమ్మకుంట, బాగ్‌అంబర్‌పేట,
హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com



మా నాయిన సెప్పిన కతలు
ఆచార్య ఎం. గోనానాయక్
వెల : 150 /-
ప్రతులకు : రచయిత, ఫ్లాట్ నెం. 202, శ్రీసాయి నివాసం, స్ట్రీట్ నెం. 9, కార్తికేయ నగర్, నాచారం, హైదరాబాద్ - 500 076.
ఫోన్ : 98490 93300



సుగాలి సంస్కృతి భాషా - సాహిత్యాలు
ఆచార్య ఎం. గోనానాయక్
వెల : 150 /-
ప్రతులకు : రచయిత, ఫ్లాట్ నెం. 202, శ్రీసాయి నివాసం, స్ట్రీట్ నెం. 9, కార్తికేయ నగర్, నాచారం, హైదరాబాద్ - 500 076.
ఫోన్ : 98490 93300



భారతీయ గిరిజన వీరులు
ఆచార్య ఎం. గోనానాయక్
వెల : 300/-
ప్రతులకు : రచయిత, ఫ్లాట్ నెం. 202, శ్రీసాయి నివాసం, స్ట్రీట్ నెం. 9, కార్తికేయ నగర్, నాచారం, హైదరాబాద్ - 500 076.
ఫోన్ : 98490 93300

వెతుక్కుంటున్న...

డా. అట్టెం దత్తయ్య
సహాయాచార్యులు, ఎస్.వి. కళాశాల, ఢిల్లీ విశ్వవిద్యాలయం.
ఫోన్ : 94947 15445

పని కోసం
బతుకును తాకట్టు పెట్టి
పల్లెను విడిచి
ఢిల్లీకి వచ్చిన నాకు
బతుకమ్మ బంగారమైంది

గుంటగుంటకు తిరిగి గునుగుపువ్వు
పొదపొదకు తిరిగి తంగేడుపువ్వు
కోసుకచ్చి గంపలు నింపిన నేను
ప్లాస్టిక్ పూలతో, రంగుల వెలుగుతో
హంగులు పోగొట్టుకుంటున్న నాకు
బతుకమ్మ బంగారమైంది

అక్కాచెల్లెండ్ల ఆత్మీయ ఆలింగనాలు
వదినెమరదండ్ల చిలిపి పలకరింపులు
వరుస గలపని మనిషిలేని ఊరుని విడిచి
పక్క ఇంటివారు కూడా పలకరించని
సంస్కృతిలో భాగమైన నాకు
బతుకమ్మ బంగారమైంది

పచ్చిపులుసు, పాలకూర
పెసరుపప్పు, చక్కర బెల్లం
చేతినిండ పంచుకుని
చెరువు కట్టమీద కడుపునిండ
తినిపించే ఊరును విడిచి
కుల్చా, కచోరి, పరోటాలతో
ఆరోగ్యాలను అరగదీసుకుంటున్న నాకు
బతుకమ్మ బంగారమైంది

కాళ్లుచేతులు కలుపుతూ, ఆడుతూ
స్వరాలు సప్తరాగాలై పాడుతున్నపుడు
తిలకిస్తే పులకింపజేసే ఊరును విడిచి
కంప్యూటర్ లో పాటలు పెట్టుకుని
కదలని కుర్చీలో బంధీనైన నాకు
బతుకమ్మ బంగారమైంది

పూలతో బతుకమ్మను పేర్చిన చేతులు
ఆ జ్ఞాపకాలతో ఈ యేట
కవితను పేర్చుకుంటూ
కాలం గడుపుతున్న
మా 'అమ్మ'కు, 'బతుకమ్మ'కు
దూరమైన బాధతో
భారమైన గుండెతో
చేరువగాలేని బతుకమ్మను
బతుకుదారిలోనే వెతుక్కుంటున్న

సద్దుల బతుకమ్మ సంబురం

పి. సువర్ణ
ఫోన్ : 81793 19902

సద్దుల బతుకమ్మ
ఆడుబిడ్డల అనురాగాల్లో అలంకరించుకుంది
తొమ్మిది రోజులు
గల గల గాజుల సప్పుల్ల కళ కళల్లో పెరిగి పెద్దదైంది
తొమ్మిది రోజులు
ఉయ్యాలో, వలలో అంటూ అమ్మమ్మ, నానమ్మల
పాటల చప్పట్ల మోతలు,
గల్లు గల్లు మంటూ కోలాటాల ఆటల్లో
అమ్మలక్కల ఆటపాటల సవ్వళ్ళు
ఆడుబిడ్డల రాకకై పండుగ నాడే
ముగిసేటి పుట్టింటి ఎదురుచూపులు
అక్కా చెల్లెళ్ళ ముఖాల్లో వెలుగు పూలకై
అన్నదమ్ములు పడే ఆరాటాలు
తీరొక్క పువ్వుకై చెట్టు పుట్టకు వెతుకు లాటలు,
అన్న వెతికి పట్టిన తంగేడు వనం
బతుకమ్మ రూపానికి ప్రారంభం,
గుమ్మడి పువ్వులో కొలువైన రూపం
గౌరీదేవికం నిలువెత్తు ప్రతిబింబం,
బీరపువ్వులోని పసుపుదనం
ఆడపడుచు చిరునవ్వు మాటున్న సౌభాగ్యం,
ముద్దబంతుల పరిమళం
తాకకుంటే ఒదగదు నిండుదనం
సన్నజాజీ, మల్లెలు, రంగురంగుల గోరింటలు,
అమ్మ చేత్తో రంగులను ముద్దాడిన టేకు, గునుగు
కలగలిసి మెరసి సోయగం
వరుస వరుసల్లో మురిసింది బతుకమ్మ
రంగు రంగుల పూలు పుట్టింటి చీరలై ॥
గడప గడపల్లో కొలువైంది గౌరమ్మ
ఇంటిటి మగువకు ఎనలేని సంపదై ॥
ప్రకృతి సంపద తనువు పసిడి హారాలుగా
గంగమ్మ ఒడి చేరు ఘనమైన కానుక
తీరొక్క పువ్వుల తీరైన వేడుక ॥

ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో & సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

**మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.**

7416 106 106
www.ferty9.com

IUI **IVF** **ICSI** **IMSI** **HSG**

ఫర్టీ 9 హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం

మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్

Scanned with OKEN Scanner